సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 16 | సంచిక: 259

SUNDAY Special | ఆదివారం 2-6-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | VIJAYAWADA | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



నేటి నుంచి టి20 ప్రపంచ కప్

ఐసీసీ టి20 ప్రపంచకప్ వేడుకకు రంగం సిద్ధమైంది. నేటినుంచి వెస్టిండీస్, అమెరికా సంయుక్త వేదికలుగా టోర్నమెంట్ జరుగుతుంది. జూన్ 29న ఫైనల్ నిర్వహిస్తారు. తొలిసారి 20 జట్లు ఈ టోర్నీలో బరిలోకి దిగుతున్నాయి. జట్లను 4 గ్రూప్‌లుగా విభజించారు. ఒక్కో గ్రూప్‌లో టాప్-2లో నిలిచిన జట్లు తర్వాతి దశ సూపర్ ఎయిట్‌లో తలపడతాయి. భారత్ తన తొలి మ్యాచ్‌లో బుధవారం ఐర్లాండ్‌ను ఎదుర్కోనుండగా.. వచ్చే ఆదివారం భారత్, పాక్ మధ్య పోరు జరుగుతుంది.

టి20 ప్రపంచకప్ ప్రత్యేక కథనాలు, విశేషాలు నేటి 'ఫన్ డే' సంచికలో...



'ఇండియా'కు 295కి పైగా సీట్లు

ఖర్గే నివాసంలో ఇండియా కూటమి అగ్రనేతలు సమావేశమయ్యారు. కూటమికి 295కుపైగా స్థానాలు కచ్చితంగా వస్తాయని ఖర్గే చెప్పారు.

వివరాలు 6లో ▸



ఏడో విడతలో 62% పోలింగ్

లోక్‌సభ ఎన్నికల్లో చివరిదైన ఏడో దశ పోలింగ్ పూర్తయింది. 62 శాతం పోలింగ్ నమోదైందని సీఈసీ ప్రకటించింది.

వివరాలు 6లో ▸



ముగిసిన ప్రధాని మోదీ ధ్యానం

తమిళనాడులోని కన్యాకుమారిలో గురువారం సాయంత్రం మొదలైన ప్రధాని మోదీ ధ్యానం శనివారం మధ్యాహ్నం ముగిసింది.

వివరాలు 6లో ▸



నేడే అరుణాచల్, సిక్కిం ఫలితాలు

సార్వత్రిక ఎన్నికల ఫలితాలకు 2 రోజుల ముందే అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడికానున్నాయి.

వివరాలు 6లో ▸

వైఎస్సార్‌సీపీదే ఏపీ

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై మెజార్టీ ఎగ్జిట్ పోల్స్ స్పష్టీకరణ

94-104 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని తేల్చి చెప్పిన 'ఆరా' మస్తాన్

- 50% ఓట్లతో 110-120 స్థానాల్లో ఫ్యాన్ ప్రభంజనం సృష్టిస్తుందని చాణక్య పార్థదాస్ వెల్లడి
- వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని తేల్చిన ఆత్మసాక్షి, జన్మత్, ఆపరేషన్ చాణక్య, అగ్నివీర్, పోల్ స్ట్రాటజీ గ్రూప్, రేస్ తదితర సంస్థలు
- లోక్‌సభ స్థానాలపై దేశవ్యాప్తంగా బీజేపీ వాణి విన్పించిన జాతీయ మీడియా సంస్థలు
- వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఫలితాలు ప్రకటించవద్దని స్థానిక సెఫాలజిస్ట్‌లపై టీడీపీ ఒత్తిళ్లు
- ఒత్తిడి తట్టుకోలేక ఫలితాలు మార్చి ప్రకటించిన ఒక సంస్థ

2 లో



సర్వే సంస్థ	వైఎస్సార్‌సీపీ	కూటమి
ఆరా	94-104	71-81
పార్థదాస్ (చాణక్య)	110-120	55-65
సీపీఎస్	97-108	66-78
పోల్ స్ట్రాటజీ గ్రూప్	115-125	50-60
ఫస్ట్ స్టెప్ సొల్యూషన్స్	119	56
ఆత్మసాక్షి	98-116	59-77
రేస్	117-128	48-58
అగ్నివీర్	124-128	46-49
జన్మత్	95-103	67-75
ఆపరేషన్ చాణక్య	95-102	64-68

ఎన్డీఏ హ్యాట్రిక్!

భారీ మెజారిటీ ఖాయం.. ఎగ్జిట్ పోల్స్ అంచనా

- ఎన్డీఏకు 350 నుంచి 400.. 'ఇండియా'కు 200లోపే
- బీజేపీకి మళ్లీ సొంతగానే మెజారిటీ
- కాంగ్రెస్ 40 నుంచి 70కు పరిమితం
- గుజరాత్, మధ్యప్రదేశ్, కర్ణాటకల్లో బీజేపీ క్లీన్‌స్వీప్
- మహారాష్ట్ర, బిహార్, రాజస్తాన్, హరియాణాల్లో కోత

2, 6లో





నేడో, రేపో సీమలోకి 'నైరుతి'!

- ఆపై క్రమంగా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు.. వేగంగా కదులుతున్న రుతుపవనాలు
- కోస్తాంధ్రపై ఉపరితల ఆవర్తనం
- రానున్న 3 రోజులు వానలు
- అక్కడక్కడ భారీ వర్షాలు!

5 లో

బ్యాంకుల నిండా పింఛనుదారులే

- ఈ నెలలో 65.30 లక్షల మందికి రూ.1,939.35 కోట్లు
- అందులో 47.74 లక్షల మందికి డీబీటీ రూపంలో బ్యాంకు ఖాతాల్లో జమ
- మిగిలిన 17.56 లక్షల మందికి ఇంటివద్ద పంపిణీ

14 లో

సీఎం జగన్‌కు ఘనస్వాగతం

విదేశీ పర్యటన ముగించుకొని రాష్ట్రానికి చేరుకున్న ముఖ్యమంత్రి

స్వాగతం పలికిన మంత్రులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

2లో



పోస్టల్ బ్యాలెట్లపై భద్రం

- ఏజెంట్లూ.. అవి అత్యంత కీలకం.. లెక్కింపులో జాగ్రత్తలు తప్పనిసరి
- ఉదయం 6 గంటలలోపే కౌంటింగ్ కేంద్రాలకు రావాలి
- ఆర్వో టేబుల్ మీద లెక్కింపు
- చెల్లుతుందో లేదో నిర్ధారించాకే లెక్కింపు చేపట్టాలి
- 13ఏ డిక్లరేషన్‌పై ఓటరు సంతకం, అటెస్టింగ్ సంతకం తప్పనిసరి
- అనుమానం వస్తే వెంటనే ఆర్వోకి ఫిర్యాదు చేయాలి

3 లో

కర్నూలు నుంచి

'ఏపీఈఆర్‌సీ' కార్యకలాపాలు

- ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ప్రధాన కార్యాలయం ఇప్పటికే ప్రారంభం
- ఏపీఈఆర్‌సీ కొత్త భవనం నుంచి కార్యకలాపాలు కూడా..
- తాజాగా హైదరాబాద్ నుంచి ఫైళ్లు, సామగ్రి తరలింపు పూర్తి

14 లో

క్లుప్తంగా...

సీఎం వైఎస్ జగన్‌కు ఘనస్వాగతం

సాక్షి, అమరావతి/విమానాశ్రయం (గన్నవరం) : కుటుంబ సమేతంగా విదేశీ పర్యటనను పూర్తిచేసుకుని శనివారం రాష్ట్రానికి చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం)లో ఘనస్వాగతం లభించింది. లండన్ నుండి ఆయన తెల్లవారుజామున 5.07 గంటలకు ఇక్కడికి చేరుకున్నారు. విమానాశ్రయంలో సీఎంకు ఎంపీలు వి. విజయసాయిరెడ్డి, నందిగం సురేష్, మంత్రులు జోగి రమేష్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మేరుగ నాగార్జున, కారుమూరి నాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, ఎండీ రుహుల్లా, మొండితోక అరుణ్‌కుమార్, ఎమ్మెల్యేలు వెల్లంపల్లి శ్రీనివాసరావు, కైలే అనిల్‌కుమార్, మల్లాది విష్ణు, ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, టీజే సుధాకర్, కోన రఘుపతి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ముదునూరి ప్రసాదరావు, శిల్పా చక్రపాణిరెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్, వైఎస్సార్‌సీపీ ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థులు సర్నాల తిరుపతిరావు, నల్లగట్ల స్వామిదాసు, షేక్ ఆసిఫ్, నూర్ ఫాతిమా (గుంటూరు ఈస్ట్), సామాజిక న్యాయ సలహాదారులు జూపూడి ప్రభాకరరావు, పార్టీ వైద్య విభాగం రాష్ట్ర నాయకులు డాక్టర్ గోసుల శివభరత్‌రెడ్డి, నార్త్ అమెరికాలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి రత్నాకర్, ఏవియేషన్ సలహాదారులు భరత్‌రెడ్డి, పలువురు పార్టీ ముఖ్య నేతలు స్వాగతం పలికారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోడ్డు మార్గం ద్వారా తాడేపల్లి నివాసానికి బయలుదేరి వెళ్లారు.

కౌంటింగ్ ముందు అల్లర్లు జరగకుండా చర్యలు తీసుకోండి

కలెక్టర్లు, ఎస్పీలకు సీఈవో ముఖేష్‌కుమార్ మీనా ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జూన్ 4న జరిగే కౌంటింగ్‌కు ముందు హింసాత్మక సంఘటనలు జరగకుండా పటిష్టమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. ఈ మేరకు ఆయన శనివారం వారికి లేఖ రాశారు. మే 13న అత్యంత ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం ద్వారా అత్యధిక శాతం పోలింగ్‌ను నమోదు చేయడంలో మీ కృషి అమూల్యమైనదని పేర్కొన్నారు. అదే విధంగా కీలకమైన కౌంటింగ్ ప్రక్రియను కూడా ప్రశాంత వాతావరణంలో పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎగ్జిట్ పోల్స్ విడుదల నేపథ్యంలో సునిశిత ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు, ఘర్షణలు తలెత్తకుండా చూడాలని సూచించారు. కౌంటింగ్ హాళ్ల వద్ద ఎటువంటి ఇబ్బందులు సృష్టించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, గొడవలు జరిగే ప్రాంతాలు, గొడవలు సృష్టించడానికి అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించి నిరంతర నిఘాతో పర్యవేక్షించాలని నిర్దేశించారు. వదంతులు వ్యాప్తి చేయకుండా తక్షణం వేగంగా స్పందించి సంబంధిత రాజకీయ పార్టీలు, మీడియాల ద్వారా ఖండన ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

'కౌంటింగ్' అలజడులకు చంద్రబాబు కుట్ర

మాదిగ లాయర్స్ అసోసియేషన్స్ రాష్ట్ర అధ్యక్షుడు పుసులూరి జీవా



నెహ్రూనగర్: వ్యవస్థలను మేనేజ్ చేసి కౌంటింగ్ రోజున అలజడులు సృష్టించి అధికారం దక్కించుకునేందుకు చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని మాదిగ లాయర్స్ అసోసియేషన్స్ రాష్ట్ర అధ్యక్షుడు పుసులూరి జీవా ధ్వజమెత్తారు. శనివారం గుంటూరులో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మాయలో మాదిగలెవరు పడవద్దని హితవు పలికారు.



ఇదేదో బాగానే ఉంది! ఓడిపోతే విదేశీ కుట్రవల్లేనని అనొచ్చు!

వైఎస్సార్‌సీపీదే ఏపీ

అసెంబ్లీ ఎన్నికలపై మెజార్టీ ఎగ్జిట్ పోల్స్ స్పష్టీకరణ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టిస్తూ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని సింహభాగం మీడియా, సర్వే సంస్థల ఎగ్జిట్ పోల్స్ తేల్చి చెప్పాయి. సంక్షేమాభివృద్ధి పథకాలు.. సుపరిపాలనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన విప్లవాత్మక మార్పులకు జనం జై కొట్టారని స్పష్టం చేశాయి. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి కంటే మహిళలు 12 శాతం అధికంగా వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసి, ఫ్యాన్ ప్రభంజనం సృష్టించడానికి దోహదం చేశారని ఆరా (మస్తాన్), చాణక్య (పార్థదాస్) తేల్చాయి. జాతీయ, రాష్ట్ర మీడియా, సర్వే సంస్థలు, సెఫాలజిస్టులు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్, పోస్ట్ పోల్స్ సర్వేలను క్రోడీకరించి శనివారం ఫలితాలను వెల్లడించాయి. తెలుగు రాష్ట్రాల్లో ఆరా సంస్థ అధినేత మస్తాన్ నిర్వహించే సర్వే, ఎగ్జిట్ పోల్స్‌కు అత్యంత విశ్వసనీయత ఉంది. గతేడాది ఆఖర్లో తెలంగాణలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని.. కామారెడ్డిలో అప్పటి సీఎం కేసీఆర్, ఇప్పటి సీఎం రేవంతరెడ్డిలు ఇద్దరూ ఓడిపోతారని.. బీజేపీ అభ్యర్థి కె.వెంకటరమణారెడ్డి విజయం సాధిస్తారని ఎగ్జిట్ పోల్, పోస్ట్ పోల్ సర్వేలో బల్లగుద్ది చెప్పారు. ఎన్నికల ఫలితాల్లో అదే వెల్లడైంది. రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్, పోస్ట్ పోల్స్ సర్వేను ఆరా మస్తాన్ విస్తృత స్థాయిలో నిర్వహించారు. 49.41 శాతం (మహిళలు 54.76 శాతం, పురుషులు 45.35 శాతం) ఓట్లతో 94 నుంచి 104 శాసనసభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించి, మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని తాము నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్, పోస్ట్ పోల్ సర్వేల్లో వెల్లడైందని ఆరా మస్తాన్ వెల్లడించారు. టీడీపీ నేతృత్వంలోని కూటమి 47.55 శాతం ఓట్లతో 71-81 శాసనసభ స్థానాలకే పరిమితం అవుతుందని తేల్చి చెప్పారు. లోక్‌సభ స్థానాల్లో 13-15 సీట్లలో వైఎస్సార్‌సీపీ, 10-12 స్థానాల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధిస్తుందని వెల్లడించారు. సీఎం జగన్ సంక్షేమాభివృద్ధి పథకాలు.. వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను ఇంటి గుమ్మం వద్దకే ప్రజలకు అందించడం వైఎస్సార్‌సీపీ ఘన విజయానికి దోహదం చేశాయని ఆరా మస్తాన్ స్పష్టం చేశారు. మహిళలు సీఎం జగన్ నాయకత్వానికి బ్రహ్మరథం పట్టడం వల్ల ఫ్యాన్ ప్రభంజనం సృష్టిస్తుందని తేల్చి చెప్పారు. ప్రతిష్టాత్మక చాణక్య సంస్థ అధినేత పార్థదాస్ నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్‌లోనూ అదే వెల్లడైంది. 50 శాతం ఓట్లతో 110-120 శాసనసభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించి, అధికారంలోకి రావడం ఖాయమని తేల్చి చెప్పారు. ఎన్డీఏ కూటమి 55-65 స్థానాలకే పరిమితమవుతుందని స్పష్టం చేశారు. ఆత్మసాక్షి, రేస్, ఆపరేషన్ చాణక్య, పోల్ స్ట్రాటజీ, అగ్నివీర్, పోల్ లాబొరేటరీ, జన్మత్ పోల్, సీపీఎస్ తదితర సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్‌లోనూ వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయమని వెల్లడైంది. కాగా, టైమ్స్ నౌ ఈటీజీ సంస్థ రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లలో వైఎస్సార్‌సీపీ 11 సీట్లలో కూటమి విజయం సాధిస్తుందని స్పష్టం చేసింది. ఏపీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 120కి పైగా అసెంబ్లీ స్థానాలు కైవసం చేసుకుని మరోమారు అధికారం చేపట్టడం ఖాయమని క్యూ మెగా అమేజీ పొలిటికల్ సొల్యూషన్స్ సీఈవో ఖాదర్ ఖాన్ పఠాన్ తెలిపారు. 22 పార్లమెంట్ స్థానాలు పక్కాగా కైవసం చేసుకుంటుందని.. మరో రెండు స్థానాల్లో గట్టి పోటీ ఉందని.. అవి కూడా వచ్చే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆంధ్రప్రదేశ్ ఎగ్జిట్ పోల్ సర్వే 2024 రిపోర్టును ఆయన వెల్లడించారు.

ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో తప్పిన జాతీయ మీడియా లెక్కలు

గతేడాది నవంబర్‌లో ఛత్తీస్‌గఢ్ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్ అంచనాలు పూర్తిగా తప్పాయి. ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఇండియాటుడే-యాక్సిస్ మై ఇండియా, ఎన్డీటీవీ, ఈటీజీ, జన్‌కీ భాత్, పోల్‌స్టార్, టుడేస్ చాణక్య, మ్యాట్రిజ్, సీ ఓటర్, సీఎన్ఎక్స్, దైనిక్ భాస్కర్ తదితర సంస్థలు తేల్చి చెప్పాయి. కానీ ఆ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి, అధికారంలోకి వచ్చింది. జాతీయ మీడియా సంస్థలు రాష్ట్రంలో ప్రజల నాడి పట్టడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నది ఛత్తీస్‌గఢ్ ఎన్నికల ఫలితాలతో నిరూపితమైంది.

లోక్‌సభలో మొత్తం స్థానాలు 543	మెజారిటీ మార్కు 272)		
సర్వే సంస్థ	ఎన్డీఏ	ఇండియా	ఇతరులు
ఇండియాటుడే-మై యాక్సిస్	361-401	131-166	8-20
ఏబీపీ న్యూస్-సీ వోటర్	353-383	152-182	4-12
రిపబ్లిక్ భారత్-మాట్రైజ్	353-368	118-133	43-48
జన్ కీ బాత్	362-392	141-161	10-20
ఇండియాటీవీ-సీఎన్ఎక్స్	371-401	109-139	28-38
న్యూస్ నేషన్	342-378	153-169	21-23
ఇండియా న్యూస్	371	125	47
దైనిక్ భాస్కర్	281-350	145-201	33-49
రిపబ్లిక్ టీవీ-పీ మార్క్	359	154	30
టుడేస్ చాణక్య	385-415	96-118	27-45
టైమ్స్ నౌ-ఈటీజీ	358	152	33
టీవీ9 భారత్ వర్ష్	342	166	35
న్యూస్ 18	355-370	125-140	42-52
పోల్ ఆఫ్ పోల్స్	365	146	32

ఫలితాలు వెల్లడించొద్దంటూ సెఫాలజిస్ట్‌లపై ఒత్తిళ్లు

తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ.. ఏ పార్టీ బలం పుంజుకుంది.. ఏ పార్టీ విజయం సాధిస్తుందన్నది కచ్చితంగా అంచనా వేయగలిగే సెఫాలజిస్టులు పదుల సంఖ్యలో ఉన్నారు. వారు తమ సంస్థల ద్వారా రాష్ట్రంలో ఎగ్జిట్ పోల్స్ నిర్వహించి, శనివారం ఫలితాలను వెల్లడించేందుకు సిద్ధమయ్యారు. ఆ సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్‌లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని వెల్లడైందని తెలుసుకున్న టీడీపీ నేతలు.. వాటిని వెల్లడించవద్దంటూ సెఫాలజిస్ట్‌లపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చారు. ఆ ఒత్తిళ్లకు తలొగ్గిన ఓ సెఫాలజిస్టు ఫలితాలను తారుమారు చేసి వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ 93 స్థానాల్లో, టీడీపీ కూటమి 80 స్థానాల్లో, ఇతరులు రెండు స్థానాల్లో విజయం సాధిస్తారని తాము నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడైతే.. టీడీపీ నేతల ఒత్తిడి తాళలేక వాటిని తారుమారు చేసి చెప్పాల్సి వచ్చిందని వాపోయినట్లు ఆయన సన్నిహితులు వెల్లడించారు. దీన్ని బట్టి చూస్తే కౌంటింగ్ కేంద్రాల్లో అక్రమాలకు పాల్పడైనా సరే దొడ్డిదారిన విజయం సాధించడానికి టీడీపీ కుట్రలు చేస్తోందని మరోసారి నిరూపితమైంది.

బీజేపీ వాణి విన్పించిన జాతీయ మీడియా

దేశ వ్యాప్తంగా పార్లమెంట్ స్థానాల్లో జాతీయ మీడియా బీజేపీ వాణి వినిపించింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ సింహభాగం స్థానాల్లో విజయం సాధిస్తుందని.. మోదీ మూడోసారి ప్రధాని అవుతారని జోస్యం చెప్పాయి. ఇండియా టుడే, ఎన్డీటీవీ, న్యూస్-18 వంటి జాతీయ మీడియా సంస్థలు ఎన్డీఏకే పట్టం కడుతూ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను వెల్లడించాయి. ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ ఎన్డీఏకు 400 లోక్‌సభ స్థానాలు వస్తాయని ధీమా వ్యక్తం చేస్తే.. ఒక ట్రెండు జాతీయ మీడియా సంస్థలు ఎన్డీఏకు 401 స్థానాలు వస్తాయని ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడించడం గమనార్హం.

టీడీపీ ఏజెంట్లను ఘర్షణలకు ప్రేరేపిస్తున్న బాబుపై చర్యలు తీసుకోవాలి

- ఎన్నికల సంఘాన్ని కోరిన వైఎస్సార్‌సీపీ బృందం
- టీడీపీ అధినేతకు ఓటమి భయం పట్టుకుంది
- సజ్జలపై టీడీపీ లీగల్ సెల్ తప్పుడు కేసులు



డిప్యూటీ సీఈవోకు ఫిర్యాదును అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ బృందం

సాక్షి,అమరావతి: కౌంటింగ్ రోజున అల్లర్లు సృష్టించేలా తెలుగుదేశం కౌంటింగ్ ఏజెంట్లను రెచ్చగొడుతున్న చంద్రబాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని వైఎస్సార్‌సీపీ బృందం కోరింది. ఈ మేరకు శనివారం వెలగపూడి సచివాలయంలో డిప్యూటీ సీఈవో విశ్వేశ్వరరావును కలిసి ఫిర్యాదు చేసింది. అనంతరం ఎమ్మెల్యే మల్లాది విష్ణు మీడియాతో మాట్లాడుతూ జూన్ 4న రాష్ట్రవ్యాప్తంగా అరాచకాలు సృష్టించేందుకు టీడీపీ కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. టీడీపీ కౌంటింగ్ ఏజెంట్లకు ట్రెనింగ్ క్యాంపులో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమన్నారు. వైఎస్సార్‌సీపీ కౌంటింగ్ ఏజెంట్లను తరిమికొట్టాలని, కౌంటింగ్ ప్రాంతంలో లేకుండా చేయాలని రెచ్చగొట్టేలా బాబు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబుకు ఎన్నికల నియమావళిపై కనీస అవగాహన లేకపోవడం బాధాకరమన్నారు. టీడీపీ అధినేతకు ఓటమి భయం పట్టుకుందని.. కనుకనే అల్లర్లు సృష్టించి ఈ ఎన్నికల్లో గెలుపొందేందుకు కుట్రలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. విధ్వంసాలు, ఘర్షణలతో ప్రజా తీర్పును మార్చేందుకు ప్రయత్నిస్తే.. చూస్తూ ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. ఎక్కడా దౌర్జన్యకాండ జరగకుండా అన్ని కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, కఠినంగా వ్యవహరించాలని ముందస్తుగా ఎన్నికల సంఘాన్ని కోరినట్లు తెలిపారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయడం దుర్మార్గమైన చర్య అని మల్లాది విష్ణు మండిపడ్డారు. సజ్జల మాటలను తెలుగుదేశం లీగల్ సెల్ పూర్తిగా వక్రీకకరించి, ఆయనపై తప్పుడు కేసు బనాయించిందని నిప్పులు చెరిగారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నదెవరో ఓటర్లకు బాగా తెలుసన్నారు. ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి సైకో అని, గొడ్డలి అని, ఘర్షణలు సృష్టించేలా నోటికొచ్చినట్లు మాట్లాడిన చంద్రబాబు, కూటమి టీడీపీ నేతలపై నేటికీ కనీస చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ఇచ్చిన దాదాపు వందకి పైగా ఫిర్యాదులు ఇప్పటికీ కేంద్ర ఎన్నికల సంఘం వద్ద పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. ముఖ్యంగా కోడ్‌ను పదేపదే ఉల్లంఘిస్తున్న టీడీపీ అధినేత నారా చంద్రబాబుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, 48 గంటల పాటు ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంచాలని కోరినప్పటికీ కేంద్ర ఎన్నికల సంఘం చూసీచూడనట్లు వ్యవహరించిందని ఆయన ఆరోపించారు. సజ్జల రామకృష్ణారెడ్డిపై పెట్టిన తప్పుడు కేసును తక్షణమే విత్ డ్రా చేసుకోవాలని మల్లాది విష్ణు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వెంట మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్‌సెల్ అధ్యక్షుడు నారాయణమూర్తి ఉన్నారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీదే విజయం

- వైఎస్ జగన్ పాలన వైపు మహిళలు, గ్రామీణులు, బలహీన వర్గాల మొగ్గు
- వైఎస్సార్‌సీపీ తన ఓటు శాతాన్ని ఐదేళ్ల తర్వాత కూడా కాపాడుకుంది
- 94 -104 సీట్లు వైఎస్సార్‌సీపీకి.. 71 - 81 సీట్లు టీడీపీ కూటమికి
- వైఎస్సార్‌సీపీకి 13-15 ఎంపీ స్థానాలు.. టీడీపీ కూటమికి 10-12 ఎంపీ స్థానాలు వచ్చే అవకాశం
- తెలంగాణలో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా వచ్చే అవకాశం లేదు
- బీజేపీ 8-9 ఎంపీ స్థానాలు, కాంగ్రెస్ 7-8 ఎంపీ స్థానాలు గెలిచే అవకాశం
- ప్రలోభాలు, ఒత్తిళ్లకు లోనుకాకుండా సర్వే రిపోర్టు ఇచ్చానన్న ఆరా మస్తాన్



సాక్షి, నరసరావుపేట : ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ మరోసారి అధికారంలోకి రానుందని ప్రముఖ ఎన్నికల సర్వే సంస్థ ఆరా స్పష్టం చేసింది. ఆ సంస్థ ఎండీ షేక్ మస్తాన్ శనివారం తన స్వగ్రామం పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం మద్దిరాలలో నిర్వహించిన మీడియా సమావేశంలో 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాల అంచనాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో 49.41 శాతం ఓట్లతో వైఎస్సార్‌సీపీ 94-104 ఎమ్మెల్యే స్థానాలు గెలుపొందే అవకాశం ఉందన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి 47.55 శాతం ఓటు షేర్‌తో 71-81ఎమ్మెల్యే స్థానాలు పొంది ప్రతిపక్ష పాత్ర పోషించే అవకాశం ఉందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ సహా ఇతర పార్టీలకు ఒక్క స్థానం కూడా వచ్చే అవకాశం లేదన్నారు. ఇతరులకు 3 శాతం ఓట్లు పడవచ్చన్నారు. లోక్‌సభ ఫలితాలలో వైఎస్సార్‌సీపీ 13-15 ఎంపీ స్థానాలు, టీడీపీ కూటమి 10-12 స్థానాలు పొందే అవకాశం ఉందన్నారు. ఆరా మస్తాన్ ఇంకా ఏం చెప్పారంటే..

షర్మిలకు కనీసం డిపాజిట్ దక్కదు

కడప ఎంపీగా పోటీ చేసిన పీసీసీ ప్రెసిడెంట్ షర్మిల ఓడిపోవడంతోపాటు కనీసం డిపాజిట్ కూడా దక్కదు. కాంగ్రెస్ పార్టీ ఓట్లు చీల్చడం ద్వారా వైఎస్సార్‌సీపీ 3 ఎంపీ స్థానాలను కోల్పోతుంది. మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి రాజంపేట ఎంపీ స్థానంలో ఓడిపోతున్నారు. బీజేపీ, జనసేనతో పొత్తు వల్ల టీడీపీకి గతంలో కంటే కొంత ఓటు శాతం పెరిగినప్పటికీ అధికారం మాత్రం దక్కడం లేదు.

తెలంగాణలో బీజేపీకే ఎక్కువ ఎంపీలు

తెలంగాణ లోక్‌సభ ఫలితాల్లో బీజేపీకి 8-9 ఎంపీ స్థానాలు, కాంగ్రెస్‌కు 7-8 ఎంపీలు, ఎంఐఎంకు ఒక్క స్థానం దక్కే అవకాశం ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో రెండో స్థానం పొందిన బీఆర్ఎస్‌కు ఒక్క స్థానం కూడా దక్కే అవకాశం లేదు. కాంగ్రెస్‌కు 38.43 శాతం, బీజేపీకి 36.65 శాతం, బీఆర్ఎస్‌కు 18.99 శాతం ఓట్లు నమోదవుతాయి. మా సర్వే ఫలితాలు వంద శాతం నిజం కావాలని కోరుకుంటున్నా. గతంలో మా అంచనా ఫలితాలు నిజమయ్యాయి. ఈసారి కూడా అదే జరగనుంది. పార్టీల ప్రలోభాలు, ఒత్తిళ్లకు లోను కాకుండా వృత్తిని వృత్తిగా భావించి ఫలితాలను వెల్లడించాను. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను మార్చడం కొన్ని చోట్ల మేలు చేసింది. పేదలు-పెత్తందార్ల మధ్య యుద్ధం అన్న జగన్ మాటలు పని చేశాయి. బీజేపీతో పొత్తు వల్ల ఓట్ల పరంగా నష్టపోయినా, పోల్ మేనేజ్‌మెంట్ పరంగా టీడీపీకి ఉపయోగపడింది. 4 శాతం ముస్లిం రిజర్వేషన్ల రద్దు అంశం కూటమికి ఇబ్బందిగా మారింది.

వైఎస్సార్‌సీపీ వైపు మహిళలు, గ్రామీణ ఓటర్లు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలన వైపు మహిళలు, గ్రామీణులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు మొగ్గు చూపినట్టు మా సర్వేలో తేలింది. కరోనా వల్ల కొంత సమయం వృథా అయినా, పాలనలో నూతన విధానాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకు పాలన తేవడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 71 శాతానికి పైగా ఉన్న గ్రామీణ ఓటర్ల అభిమానాన్ని పొందింది. పింఛన్‌దారులు సంతోషంగా ఉన్నారు. మహిళల ఖాతాల్లో ప్రతి రెండు మూడు నెలలకు ఏదో ఓ పథకం ద్వారా ఆర్థిక వెసులుబాటు కలిగించడంతో రాష్ట్రంలో 56 శాతం మహిళలు వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారు. కూటమికి మహిళలు కేవలం 42 శాతం మాత్రమే మద్దతిచ్చారు. పురుషులు కూటమికి 51.56 శాతం, వైఎస్సార్‌సీపీకి 45.53 శాతం ఓటు వేశారు. మహిళలు పురుషుల కన్నా సుమారు 4.7 లక్షల మంది అధికంగా ఓటు వేయడం, అందులోనూ 56 శాతం మంది వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వడంతో మరోసారి అధికారం నిలబెట్టుకుంటోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు వైఎస్సార్‌సీపీకి అండగా నిలవడంతో 2019లో వచ్చిన ఓటు శాతాన్ని వైఎస్ జగన్ నిలుపుకున్నారు.

ఎగ్జిట్ పోల్స్‌లోనూ వైఎస్సార్‌సీపీకి సానుకూలత

- సీఎం జగన్ పాజిటివ్ ప్రచారం ఎన్నికల్లో బాగా పనిచేసింది: సజ్జల
- మహిళా ఓటర్లు మా వైపే నిలబడ్డారని స్పష్టమైంది
- ఐదేళ్లలో సంక్షేమాభివృద్ధి పథకాలతో పెద్దపీట
- 4న కౌంటింగ్‌లో మరింత మెరుగైన ఫలితాలు కనిపిస్తాయి
- సొంతంగా పోటీ చేసే శక్తి లేకనే చంద్రబాబు పొత్తులు
- పోస్టల్ బ్యాలెట్‌పై బాబు ఒత్తిడికి ఈసీ తలొగ్గడం సిగ్గుచేటు
- దీనిపై సుప్రీం కోర్టుకు వెళ్తాం



సాక్షి, అమరావతి: ఎగ్జిట్ పోల్స్‌లో వైఎస్సార్ సీపీ పట్ల పాజిటివ్ ట్రెండ్ స్పష్టంగా కనిపిస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. జూన్ 4న వెల్లడయ్యే వాస్తవ ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయని ధీమా వ్యక్తం చేశారు. మహిళా ఓటర్లు తమవైపే నిలిచారనే విషయం ఎగ్జిట్ పోల్స్‌లో తేలిందన్నారు. శనివారం తాడేపల్లిలో సజ్జల మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో మహిళలను సమాజంలో ఆత్మగౌరవంతో నిలబెట్టారని, సంక్షేమ పథకాలు అందించడం ద్వారా ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించడంతో పాటు కుటుంబాన్ని నడిపించగల శక్తిని అందించారన్నారు. సీఎం జగన్ వల్లే తమకు మేలు జరుగుతుందనే విశ్వాసంతో మహిళలు వారి కుటుంబాలు పోలింగ్‌కు పెద్ద ఎత్తున తరలి వచ్చాయన్నారు. ఐదేళ్లలో తమ కుటుంబాల స్థితిగతుల్లో వచ్చిన మార్పులను గమనించడంతో స్వచ్ఛందంగా ముందుకొచ్చి వైఎస్సార్ సీపీకి ఓట్లు వేశారన్నారు. ఎక్కువ సైలెంట్ ఓటింగ్ జరగడంతో కొన్ని సర్వే సంస్థలకు వైఎస్సార్ సీపీపై క్షేత్ర స్థాయిలో ఉన్న సానుకూలత కనిపించలేదన్నారు.

పాజిటివ్ అజెండా పని చేసింది..

వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం మొత్తం పాజిటివ్ కోణంలో నిర్వహించాం. ప్రజలకు ఏం చేశామో చెప్పి ఓట్లు అడిగాం. చంద్రబాబు మరోసారి అసాధ్యమైన హామీలను గుప్పిస్తూ 2014లో మాదిరిగా మోసం చేసేందుకు వస్తున్నాడని గుర్తు చేశాం. టీడీపీ నేతలు పచ్చి బూతులు మాట్లాడారు. సీఎం జగన్ అంతు చూస్తామని, అధికారంలోకి వచ్చేశామంటూ విర్రవీగారు. సొంతంగా పోటీ చేయలేక కూటమి కట్టారు. మా నాయకుడు మాత్రం పాజిటివ్ అజెండాతో ప్రజలను ఓట్లు అడిగారు. పాజిటివ్ అజెండా పని చేసిందని స్పష్టంగా తెలుస్తోంది.

ఈసీ ఒత్తిడికి తలొగ్గితే ఎలా?

ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. గతంలో చంద్రబాబు ఏపీ సీఈవోపైకి దండయాత్రలా వెళ్లి బెదిరించలేదా? ఆ తర్వాత ఈవీఎంలు మోసం చేశాయంటూ దుష్ప్రచారం నడిపారు. అలాంటి పార్టీకి చెందిన వాళ్లు ఈ రోజు మా గురించి మాట్లాడటం సిగ్గుచేటు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో టీడీపీ గందరగోళం సృష్టించాలని యత్నించింది. ఏ రూల్స్ అవసరం లేకుండా నేరుగా పోస్టల్ బ్యాలెట్లు తీసుకోవాలన్న టీడీపీ ఒత్తిడికి తలొగ్గి ఈసీ ఇచ్చిన ఆదేశాలపై మేం కోర్టుకెళ్లాం. కౌంటింగ్ సమయంలో జాగ్రత్తగా ఉండాలని మా ఏజెంట్లకు చెప్పాం. తిరస్కరించాల్సిన ఓటును చెల్లుబాటయ్యేలా టీడీపీ కుట్రలను అడ్డుకోవాలని చెప్పాం. దీనికే నాపై కేసులు మోపడం హాస్యాస్పదం.

సుప్రీం కోర్టుకు వెళ్తాం..

పోస్టల్ బ్యాలెట్ విషయంలో సుప్రీం కోర్టుకు వెళ్తున్నాం. జూలై 2023లో ఈసీ స్పష్టమైన గైడ్‌లైన్స్ ఇచ్చింది. అందులో పోస్టల్ బ్యాలెట్ చెల్లుబాటు, తిరస్కరణ విషయాలు స్పష్టంగా ఉన్నాయి. పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్‌లో అటెస్టింగ్ ఆఫీసర్ సంతకం, సీలు కచ్చితంగా ఉండాలి. సీల్ లేకుంటే కనీసం హోదా వివరాలైనా రాయాలని ఉంది. పోలింగ్ అయ్యాక అది అవసరం లేదని ఈసీ చెప్పడం అనైతికం. వాళ్లిచ్చిన నిబంధనలను వాళ్లే తుంగలో తొక్కితే ఎలా? చంద్రబాబు ఒత్తిడికి ఈసీ తలొగ్గడం సిగ్గుచేటు.

అందుకే చంద్రబాబు కుట్రలు..

గత ఐదేళ్లలో పౌర సేవలు, సంక్షేమం, విద్య, వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. వీటి ప్రభావం ప్రజలపై ఉండదనుకుంటే అది భ్రమే. ఈ విషయాన్ని చంద్రబాబు గ్రహించారు కాబట్టే ఓట్లు గంపగుత్తగా వైఎస్సార్ సీపీకి వస్తాయనే భయంతో పవన్, బీజేపీతో పొత్తుపెట్టుకున్నారు. లోపాయికారీగా కాంగ్రెస్‌తోనూ కలసి ఎన్నికలకు వెళ్లారు. వైఎస్సార్ సీపీ ఓట్లను చీల్చి లాభపడాలని నానా గడ్డి కరిచి విష ప్రచారం చేశారు. ఆయన ఇన్ని చేసినా మాపట్ల ప్రజల్లో పాజిటివ్ ట్రెండ్ కొనసాగింది. ఇటీవల ఎన్నికల రిగ్గింగ్ మాదిరిగానే ఎగ్జిట్ పోల్స్ కూడా రిగ్గింగ్ జరుగుతున్నట్టుంది. బీజేపీకి ఉత్తరాదిలో సీట్లు బాగా తగ్గుతుండటంతో దక్షిణాదిలో పెరుగుతున్నట్టు చూపించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో ఏపీలో వారికి నచ్చిన లెక్కలేసి చెబుతున్నారు. మాకు అనుకూలంగా వచ్చిన ఎగ్జిట్ పోల్స్‌లో స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. మహిళల ఓటింగ్ పర్సంటేజ్ పెరగడం వైఎస్సార్ సీపీకి కచ్చితంగా అనుకూలించింది. ఐదేళ్లలో మేం ప్రజలకు మంచి చేశాం. టీడీపీకి ఎందుకు అనుకూలంగా సర్వేలు వచ్చాయో వాళ్లు చెప్పగలరా? మరో రెండు రోజులు వారికి నచ్చిన అంకెలు చెప్పుకుంటూ ఆనందం పొందాలంటే పొందొచ్చు.



ప్రధాన నగరాలు, పట్టణాల్లో శనివారం నమోదైన ఉష్ణోగ్రతలు

నగరం/పట్టణం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	44.8	31.7
తిరుపతి	43.0	27.0
నెల్లూరు	42.6	32.0
అనంతపురం	42.6	26.1
కడప	41.8	32.4
కర్నూలు	41.0	31.1
ఒంగోలు	40.0	31.0
ఏలూరు	40.0	28.0
గుంటూరు	38.0	29.0
విశాఖపట్నం	35.2	23.6

పోస్టల్ బ్యాలెట్లపై భద్రం

ఏజెంట్లూ.. అవి అత్యంత కీలకం.. లెక్కింపులో పలు జాగ్రత్తలు తప్పనిసరి



సాక్షి, అమరావతి: పెద్ద ఎత్తున పోలైన పోస్టల్ బ్యాలెట్లు ఈసారి ఎన్నికల ఫలితాల్లో కీలక పాత్ర పోషించనున్నాయి. పోలింగ్ శాతం పెరగడం, పోస్టల్ బ్యాలెట్లు 4.97 లక్షలకు పైగా పోల్ అయిన నేపథ్యంలో జూన్ 4 జరిగే ఓట్ల లెక్కింపుల్లో అత్యంత కీలకం కానున్నాయి. పోస్టల్ బ్యాలెట్ల విషయంలో ఎన్నికల సంఘం చివరి నిమిషంలో నిబంధనలు మార్చినందున లెక్కింపు విషయంలో ఏజెంట్లు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని, సుదీర్ఘంగా సాగే అవకాశం ఉన్నందున ప్రత్యేకంగా ఒక ఏజెంట్ పర్యవేక్షించాలని రాజకీయ పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. నిబంధనలు, లెక్కింపు విధానంపై ఏజెంట్లు ముందస్తు అవగాహన కలిగి ఉండాలని సూచిస్తున్నారు.

చెల్లనివిగా ఎప్పుడు పరిగణిస్తారంటే?

- బ్యాలెట్ పేపరుపై ఓటు ఎవరికి నమోదు కాకపోవడం, ఒకటి కంటే ఎక్కువ మంది అభ్యర్థులకు ఓటు వేసినా తిరస్కరిస్తారు.
- బ్యాలెట్ పేపరు చిరిగినా, గుర్తు పట్టలేనంతగా మారినా, ఓటు ఎవరికి వేశారో తెలిసే విధంగా ఏమైనా గుర్తులు లేదా ఏదైనా రాసి ఉన్నా తిరస్కరిస్తారు.
- నకిలీ బ్యాలెట్ పేపర్లను తిరస్కరిస్తారు.
- ఇలా తిరస్కరించిన ఓట్లన్నీ ఆర్వో పక్కన పెడతారు.
- ప్రతీ దశలో చెల్లని ఓట్లను ఆర్వో విడివిడిగా కట్టలు కట్టి ఉంచాలి
- ఈవీఎం ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత గెలిచిన అభ్యర్థి ఓట్లు తిరస్కరించిన పోస్టల్ బ్యాలెట్లు కంటే తక్కువ ఉంటే వాటిని ఆర్వో తిరిగి పరిశీలిస్తారు.
- తిరస్కరించిన పోస్టల్ బ్యాలెట్లను ఆర్వో, అబ్జర్వర్లు ఒకొక్కటే పరిశీలించి తుది ఫలితాన్ని ప్రకటిస్తారు.

డిక్లరేషన్ 13 ఏ అత్యంత కీలకం

- ఓటరు తన ఓటును కవర్ 'ఏ'లో పొందుపరచి దానికి డిక్లరేషన్ 13 ఏ జత చేసి ఈ రెండింటినీ కవర్ 'బీ'లో ఉంచి బ్యాలెట్ బాక్స్‌లో వేస్తారు.
- బ్యాలెట్ బాక్స్ నుంచి కవర్ బీ తెరవగానే ముందుగా బ్యాలెట్ పేపర్ ఉండే కవర్ 'ఏ' ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవకూడదు.
- కవర్ బీ తెరవగానే అందులో ఫారం 13 సీలో రెండు డాక్యుమెంట్లు తప్పనిసరిగా ఉండాలి. బ్యాలెట్ పేపర్ (ఫారం 13 బీ) ఉండే కవర్ ఏ, ఓటరు ఇచ్చిన డిక్లరేషన్ 13 ఏ ఫారం ఉండాలి
- ఈ రెండూ విడివిడిగా లేకపోతే ఆ ఓటును చెల్లని ఓటుగా పరిగణించి పక్కన పెట్టాలి.
- ఆ తర్వాత 13 ఏ డిక్లరేషన్ సరిగా ఉందా? లేదా? అన్నది పరిశీలించాలి.
- ఈ డిక్లరేషన్ ఫారంపై ఓటరు సంతకంతోపాటు అటెస్టింగ్ ఆఫీసర్ సంతకం, సీల్ ఉందో లేదో పరిశీలించాలి.
- ఒకవేళ అటెస్టింగ్ అధికారి సంతకం ఉండి, సీల్ లేకపోయినా ఆ ఓటును తిరస్కరించవద్దని ఎన్నికల సంఘం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.
- అటెస్టింగ్ అధికారి సంతకంపై అనుమానం ఉంటే ఏజెంట్లు తమ అభ్యంతరాన్ని ఆర్వోకు తెలియచేయాలి.
- ఆర్వో తమ వద్ద ఉన్న అటెస్టింగ్ అధికారి సంతకంతో సరి పోల్చి ఒకే విధంగా ఉంటే ఆమోదిస్తారు. లేకపోతే తిరస్కరిస్తారు.
- ఈ ప్రక్రియ మొత్తం పూర్తయిన తర్వాతే పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు విధానం మొదలవుతుంది.
- తొలుత కవర్ ఏ ఓపెన్ చేసి అందులోని ఫారం 13 బీ బ్యాలెట్ పేపర్‌ను ఓపెన్ చేస్తారు.
- 13 ఏపై ఉన్న బ్యాలెట్ సీరియల్ నెంబర్, 13 బీ మీద ఉన్న బ్యాలెట్ సీరియల్ నెంబర్ సరిపోలాలి.
- ఈ రెండు నెంబర్లలో తేడా ఉంటే ఆ ఓటును చెల్లని ఓటుగా పరిగణించాలి.
- ఏజెంట్లు తమ ఫిర్యాదులు ప్రతీది లిఖిత పూర్వకంగా ఇవ్వాలి

పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ఇలా

- జూన్ 4 ఓట్ల లెక్కింపు తొలుత పోస్టల్ బ్యాలెట్లతోనే మొదలవుతుంది. ఉదయం 8 గంటల కల్లా ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుండటంతో ఏజెంట్లు ఉదయం 6 గంటలలోపే కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలి. కౌటింగ్ కేంద్రంలో మొత్తం 15 టేబుళ్లు ఉంటాయి. ఒకవైపు ఏడు మరో వైపు ఏడు చొప్పున అమర్చి చుట్టూ కంచె వేస్తారు. ఈ రెండు వరుసల మధ్యలో రిటర్నింగ్ ఆఫీసర్ టేబుల్ వద్ద పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం టేబుల్ ఉంటుంది. ఆర్వో పర్యవేక్షణలోనే మొత్తం పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు జరుగుతుంది.
- పోస్టల్ బ్యాలెట్లలో రెండు రకాలుంటాయి. మిలటరీలో సేవలందించే వారు ఎలక్ట్రానిక్ రూపంలో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోగా 85 ఏళ్ల దాటిన వృద్ధులు, దివ్యాంగులు, కోవిడ్ బాధితులు, పోలింగ్ రోజు విధులు నిర్వహించిన ఉద్యోగులు సాధారణ విధానంలో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. ఈ రెండు విధానాల్లోనూ ఓట్ల లెక్కింపు ఒకే రకంగా ఉంటుంది. ఎలక్ట్రానిక్ విధానంలో ఓటు వేసిన వారి క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా వివరాలను తెలుసుకుంటారు.
- పోస్టల్ బ్యాలెట్‌లో రెండు రకాల కవర్లు ఏ, బీతో పాటు మూడు రకాల ఫారమ్స్ 13 ఏ, 13 బీ, 13 సీ ఉంటాయి. తొలుత పోస్టల్ బ్యాలెట్‌ను ఎన్నికల నిబంధనల ప్రకారం ఓటరు వినియోగించుకున్నారా? లేదా? అనేది పరిశీలించి లెక్కింపు అర్హతను నిర్ధారిస్తారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులో ఇదే అత్యంత ప్రధానమైనది. పోస్టల్ బ్యాలెట్ చెల్లుతుందా? లేదా? ఎలాంటి సందర్భాల్లో ఏజెంట్లు అభ్యంతరం చెప్పవచ్చో ఇప్పుడు చూద్దాం..

ఎన్నికల పిటిషన్లు దాఖలు చేసుకోండి

- పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వివాదంపై వైఎస్సార్‌సీపీకి హైకోర్టు సూచన
- పిటిషన్‌ను పరిష్కరిస్తూ ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్ ఫారమ్‌పై అటెస్టింగ్ అధికారి సంతకం ఉండి.. పేరు, హోదా, సీల్ లేకపోయినా కూడా వాటిని ఆమోదించాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ వైఎస్సార్ సీపీ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు పరిష్కరించింది. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల విషయంలో అభ్యంతరాలుంటే వాటిని ప్రస్తావించేందుకు ప్రత్యామ్నాయ వేదికలున్నాయని పేర్కొంది. ఆ ప్రత్యామ్నాయ మార్గాలకు అనుగుణంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వివాదంపై ఎన్నికలు పూర్తయిన తరువాత ఎన్నికల పిటిషన్లు (ఈపీ) దాఖలు చేసుకోవాలని వైఎస్సార్ సీపీకి సూచించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ న్యాపతి విజయ్‌ల ధర్మాసనం శనివారం తీర్పు వెలువరించింది. కేంద్రం ఎన్నికల సంఘం గురువారం జారీ చేసిన ఉత్తర్వులను చట్ట విరుద్ధంగా ప్రకటించి వాటిని రద్దు చేయాలని అభ్యర్థిస్తూ వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ ఉత్తర్వుల అమలును నిలిపివేసి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలంటూ ఓ అనుబంధ పిటిషన్ కూడా దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై శుక్రవారం వాదనలు విన్న జస్టిస్ కిరణ్మయి ధర్మాసనం శనివారం తీర్పు వెలువరించింది. ఎన్నికల ప్రక్రియ మొదలైన తరువాత అందులో న్యాయస్థానాలు జోక్యం చేసుకోరాదన్న కేంద్ర ఎన్నికల సంఘం వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కూడా ఎన్నికల ఫలితాల కిందకే వస్తుందని, ఫలితాలపై అభ్యంతరం ఉంటే ఎన్నికల పిటిషన్ (ఈపీ) దాఖలు చేసుకోవాలే కానీ హైకోర్టును ఆశ్రయించరాదన్న వాదనను ధర్మాసనం పరిగణలోకి తీసుకుంది. మొత్తం 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ నియోజకవర్గాల ఫలితాలను సవాల్ చేస్తూ ఈపీలు దాఖలు చేయడం ఆచరణ సాధ్యం కాదన్న వైఎస్సార్‌సీపీ వాదనతో ధర్మాసనం ఏకీభవించలేదు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే వర్తించేలా ఈ ఆదేశాలు ఇచ్చిందని, ఇది అన్యాయమన్న వాదనను సైతం కోర్టు పరిగణలోకి తీసుకోలేదు.

ఏపీ సీఎంగా రెండోసారీ వైఎస్ జగనే

తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

డిచ్‌పల్లి (నిజామాబాద్ రూరల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి పదవి చేపట్టడం ఖాయమని తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ శివారులోని హోటల్ కృష్ణలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీలోని తన స్నేహితులు, బంధువుల సమాచారం ద్వారా జగన్ మళ్లీ సీఎం అవుతారని, ఎగ్జిట్ పోల్స్ కూడా అవే చెబుతున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను కనివినీ ఎరుగని రీతిలో జరుపుతామని, సోనియా రాక కోసం యావత్ తెలంగాణ ఎదురు చూస్తోందని అన్నారు. నిజామాబాద్ ఎంపీగా కవితను గెలిపిస్తే లిక్కర్ దందాతో ఢిల్లీలో తెలంగాణ పరువు తీసిందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదని, జూన్ 4న ఫలితాల తర్వాత తెలంగాణలో ఆ పార్టీ అడ్రస్ గల్లంతవుతుందని పేర్కొన్నారు.

ఖోఖోలో పిడుగులు

ఒడిశాలోని జాతీయ అకాడమీకి అర్హత ● జిల్లా నుంచి మొదటిసారి ఘనత



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): క్రీడా ప్రతిభను పేదరికం ఆపలేకపోయింది. తల్లిదండ్రులు క్రీడా రంగానికి చెందిన వారు కాకపోయినా ఈ చిన్నారులు దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మక ఖోఖో జాతీయ అకాడమీకి ఎంపికయ్యారు. నగరంలోని బాలసదన్‌లో ఉంటూ ఖోఖోలో రాణిస్తూ జిల్లాకు గర్వకారణమయ్యారు.

అత్యుత్తమ ప్రతిభ

నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సమ్మర్ కోచింగ్ క్యాంపునకు రెండో తరగతి చదువుతున్న సమయంలో భవానీ హాజరయ్యారు. తల్లిదండ్రులు సులోచన, రామప్పాచారి కూలీలే. చిన్నారిలోని ప్రతిభను గుర్తించిన ఖోఖో కోచ్ సుకుమార్ క్రీడలో మెళకువలు నేర్పారు. ప్రస్తుతం భవానీ ఎనిమిదో తరగతి చదువుతోంది. రెండు జాతీయస్థాయి పోటీలు, ఏడు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని అబ్బురపర్చారు. ఆర్థికంగా సతమతమవుతుండటంతో బాలసదన్ ఆశ్రమంలో చేర్పించి చదువుల్లో రాణించేలా చేశారు.

జాతీయ, రాష్ట్ర పోటీల్లో సత్తా

ఏడో తరగతి చదువుతున్న సమయంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో ఖోఖో నేర్చుకునేందుకు రమ్య హాజరయ్యారు. ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అత్యంత శ్రద్ధతో క్రీడా మెళకువలు నేర్చుకొని మూడు నేషనల్స్, రాష్ట్రస్థాయిలో 17 పోటీల్లో పాల్గొంది. ఛత్తీస్‌ఘఢ్‌లో నిర్వహించిన ఆలిండియా చాంపియన్‌షిప్‌లో, మహారాష్ట్రలో నిర్వహించిన అండర్ – 17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ప్రతిభను చూపారు. తమిళనాడులో నిర్వహించిన ఖేలో ఇండియా సౌత్‌జోన్ పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించారు.

పట్టుదలకు నిదర్శనం

ఈ చిన్నారులు ఆర్థికంగా వెనుకబడినా క్రీడపై ఉన్న ఆసక్తి వారిని జాతీయ స్థాయిలో రాణించేలా చేసింది. ఒడిశాలోని ప్రతిష్టాత్మకమైన నేషనల్ ఖోఖో అకాడమీలో ప్రవేశం లభించింది. అంతర్జాతీయ ఖోఖో పోటీల్లో పాల్గొనాలనేదే వీరి లక్ష్యం. ఖోఖో అసోసియేషన్ నేతలు గిరిప్రసాద్, గురుప్రసాద్, విజయ్‌కుమార్ వీరికి క్రీడా, విద్యాపరమైన సౌకర్యాలను కల్పించారు. ఐసీడీఎస్ బాలసదన్ నిర్వాహకులు ఎంతో ప్రోత్సహించారు. క్రీడా ప్రావీణ్యం వీరిని జిల్లా నుంచి మొదటిసారిగా జాతీయ అకాడమీకి ఎంపికయ్యేలా చేసింది.

– సుకుమార్, ఖోఖో కోచ్

ప్రతిభను గుర్తిస్తాం

జిల్లా క్రీడాప్రాధికార సంస్థలో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాల్లో పాల్గొనే చిన్నారుల ప్రతిభను గుర్తిస్తాం. ఆర్థికంగా వెనుకబడిన వారే శిక్షణ శిబిరాలకు హాజరవుతారు. వీరిని గుర్తించి తగిన ప్రోత్సాహాన్ని అందిస్తాం. క్రీడల్లో ప్రతిభ ఉన్న వారిని ప్రోత్సహిస్తాం. జాతీయ స్థాయిలో వీరు రాణించడం గర్వకారణం.

– యతిరాజ్, డీఎస్డీఓ

సాగుకు శుభారంభం

- డెల్టా కాలువలకు నీటి విడుదల
- జిల్లాలో 1.68 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ పనులు
- నీటి విడుదల రోజునే భారీ వర్షం
- 12.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు



గోదావరి డెల్టాలో ఖరీఫ్ సాగుకు చేలల్లో దమ్ములు (ఫైల్)

సాక్షి, అమలాపురం: ముందస్తు ఖరీఫ్ సాగుకు అన్నీ శుభ శకునాలే.. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు అనుకున్న దానికన్నా ముందే వస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. రుతుపవనాల రాకను స్వాగతిస్తూ మండుటెండల నుంచి ఉపశమనం కలిగిస్తూ జిల్లా వ్యాప్తంగా శనివారం భారీ వర్షం కురిసింది. సాగునీటి పారుదల శాఖ అధికారులు గోదావరి డెల్టా కాలువలకు నీటిని విడుదల చేశారు. వ్యవసాయ శాఖ ఖరీఫ్‌కు అవసరమైన ఎరువులు, విత్తనాలను సిద్ధం చేసింది. ఇవన్నీ ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు శుభపరిణామాలే అని ఆయకట్టు రైతులు అంటున్నారు.

జిల్లాలో ఖరీఫ్ వరి సాగు మొత్తం డెల్టా కాలువపైనే ఆధారపడి ఉంది. తూర్పు, మధ్య డెల్టాలో కలిపి మొత్తం 1,68,780 ఎకరాల్లో సాగు చేయనున్నారు. తూర్పు డెల్టా పరిధిలో రామచంద్రపురం నియోజకవర్గం (కాజులూరు మినహా), మండపేట నియోజకవర్గంతోపాటు ముమ్మిడివరం నియోజకవర్గం పరిధి తాళ్లరేవు, కొత్తపేట నియోజకవర్గ పరిధి ఆలమూరు మండలాల్లో సాగు జరుగుతుండగా, మధ్య డెల్టా పరిధిలో మిగిలిన జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వరి సాగుకు సిద్ధమయ్యారు. గతంలో డెల్టాలో వరి చేలకు జూన్ 10 లేదా 15వ తేదీల్లో సాగునీరు విడుదల చేసేవారు. ఇది శివారు చేలకు చేరే సరికి జూన్ నెల పూర్తయ్యేది. ఇలా ఖరీఫ్ ఆలస్యం కావడంతో అక్టోబర్, నవంబర్ నెలల్లో తుపానుల బారిన పడి పంట నష్టపోతున్నట్లు గుర్తించిన రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందస్తు సాగుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా గత రెండేళ్లుగా జూన్ 1న పంట కాలువలకు సాగునీరు విడుదల చేస్తోంది. ముందస్తు సాగు చేసిన ప్రాంతాల్లో ఖరీఫ్ పంట వర్షాల బారిన పడినా పెద్దగా నష్టం జరగడం లేదు.

విత్తనాలు.. ఎరువులు

జిల్లాలో ఖరీఫ్ సాగుకు ఎంటీయూ 7,029 రకం విత్తనాలు సుమారు 73 శాతం వినియోగిస్తుండగా, మిగిలిన 27 శాతం ఎంటీయూ 1,318, ఎంటీయూ 1,064 తదితర రకాలను వాడుతున్నారు. మొత్తం 33,750 క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా, ఇప్పటికి సుమారు 23 వేల క్వింటాళ్ల విత్తనాలు రైతుల వద్ద, 7,250 క్వింటాళ్లు ప్రైవేట్ డీలర్ల వద్ద, 900 క్వింటాళ్ల విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. 3,500 క్వింటాళ్ల విత్తనాలకు ఏపీ సీడ్స్‌కు ఇండెంట్ పెట్టారు. ఈ ఖరీఫ్‌కు 43,493 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా, దిగుమతి చేసేందుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ప్రైవేట్ డీలర్ల వద్ద, మార్క్‌ఫెడ్ వద్ద 37,950 మెట్రిక్ టన్నుల ఎరువులు ఉన్నాయి. ఆ మొత్తంలో యూరియా 13,250 మెట్రిక్ టన్నులు, డీఏపీ 2,900 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 2,100 మెట్రిక్ టన్నులు, ప్రతి రైతు భరోసా కేంద్రం (ఆర్‌బీకే) పరిధిలో 20 మెట్రిక్ టన్నుల ఎరువులు దిగుమతికి చర్యలు తీసుకోనున్నారు.

సాఫీగా సాగేందుకు 'ఉపాధి'

ఉపాధి హామీ పథకంలో పంట కాలువలు, బోదెల్లో పూడికతీత పనులు అధికంగా చేపట్టారు. తూర్పు, మధ్య డెల్టాల పరిధిలో ప్రధాన పంట కాలువలతోపాటు, ఛానళ్లు, పంట బోదెలలో పూడికతీత పనులు చేశారు. పంట కాలువ వెంబడి మట్టి తొలగింపు, జంగిల్ క్లియరెన్స్ చేయడం వంటి పనులు చేస్తున్నారు. ప్రధాన పంట కాలువలకు అనుసంధానంగా ఉన్న డైరెక్టర్ పైప్ (డీపీ)ల వద్ద పూడిక తొలగింపు వల్ల ఆయకట్టు రైతులకు అధికంగా మేలు జరగనుంది. పంట కాలువలపై 828 పనులు చేపట్టగా, పంట బోదెలపై 415 పనులు చేశారు.

ముందస్తు సాగుతో మేలు

ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు సాగుకు అనువుగా డెల్టా కాలువలకు నీరు విడుదల చేసింది. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. సాగు ఆలస్యం కావడంతో అక్టోబర్ 15 నుంచి నవంబర్ నెలాఖరు మధ్య ఏర్పడుతున్న తుపానులు, భారీ వర్షాలతో పంట కోల్పోవడం డెల్టా రైతులకు ఆనవాయితీగా మారింది. ముందస్తు సాగు చేపట్టిన తరువాత జిల్లాలో ఖరీఫ్ నష్టాలు చాలా వరకూ తగ్గాయి.

– జిన్నూరి వెంకటేశ్వరరావు, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా స్థానం సభ్యుడు, నంగవరం, ఉప్పలగుప్తం మండలం

నైరుతికి ముందుగానే వర్షం

నైరుతి రుతుపవనాలు మరో మూడు, నాలుగు రోజుల్లో రాష్ట్రంలోకి వస్తాయని వాతావరణ శాఖ చెప్పింది. వాటికి స్వాగతం పలుకుతున్నట్టుగా జిల్లాలో శనివారం ఉదయం పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. జిల్లాలో ఉదయం 8 గంటల వరకూ 12.7 మిల్లీ మీటర్ల వర్షం కురవగా, అత్యధికంగా కె.గంగవరం మండలం 35.2 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా ఆత్రేయపురం 1.6 మిల్లీ మీటర్ల వర్షం పడింది. ఐ.పోలవరం 27.6, ముమ్మిడివరం, ఉప్పలగుప్తం 25.4, కాట్రేనికోన 23.4, అల్లవరం 19.8, కపిలేశ్వరపురం 19.4, రామచంద్రపురం 18.2, అమలాపురం 15.2, అయినవిల్లి 11.4, అంబాజీపేట 10.2, రాజోలు 8.8, సఖినేటిపల్లి 8.6, పి.గన్నవరం 8.4, మామిడికుదురు 7.2, మలికిపురం 4.8, రాయవరం 3.4, కొత్తపేట 3.2, మండపేట 2 మి.మీటర్ల చొప్పున వర్షం కురిసింది. గడిచిన నాలుగు రోజులుగా 40 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదు కావడం, వేడి గాలులతో ఉక్కిరిబిక్కిరి అయిన జనం వర్షంతో సేద తీరారు. మరోవైపు వర్షం ఖరీఫ్ సాగుకు ఊతం ఇవ్వనుంది. వాతావరణం చల్లబడితే రైతులు నారుమడులు వేసుకునేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

వామ్మో.. డెమో

బేజారవుతున్న ప్రయాణికులు ■ సిటీ రైలును తిప్పుతున్న రైల్వే శాఖ

మరుగుదొడ్లు, నీటిసౌకర్యం లేక ఇక్కట్లు ■ సాధారణ బోగీలతో నడపాలని డిమాండ్



రాజంపేట : ముంబయి–చెన్నై ప్రధాన రైల్వే మార్గంలో నడిచే డెమో రైలులో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 07284/07285 నంబరుతో నంద్యాల–కడప మధ్య నడుస్తున్న డెమో ప్యాసింజర్ రైలును రేణిగుంటకు పొడిగించారు. నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన వారు తిరుమలకు వేలాది మంది రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఉదయం పూట వెళ్లడం, సాయంత్రం తిరిగి రావడంతో అన్ని వర్గాల ప్రజల నుంచి డెమోకు ఆదరణ పెరిగింది. పైగా టికెట్ ధర తక్కువ కావడంతో ప్రధానంగా గ్రామీణ ప్రయాణికులు అధికంగా ఆధార పడుతున్నారు.

8 గంటల ప్రయాణంలో నరకం

నంద్యాలలో 5.30కు బయలుదేరి రేణిగుంటకు 12.30 గంటలకు చేరుకుంటుంది. అక్కడి నుంచి 1.45 గంటలకు బయలుదేరి రాత్రి 9.30కి నంద్యాలకు చేరుకుంటుంది. దాదాపు 8 గంటలకు పైగా డెమోలో ప్రయాణం కొనసాగుతుంది. నంద్యాల, వైఎస్సార్, అన్నమయ్య జిల్లా వాసులు ఈ రైలును ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులకు మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు.

స్టేషన్ సిబ్బంది, ప్రయాణికుల మధ్య వాగ్వాదం

మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేని పరిస్థితులలో తమ అవసరాలు తీర్చుకునేందుకు రైలు ఆగగానే స్టేషన్‌లో ఉన్న మరుగుదొడ్లకు, నీటి అవసరాలకు పరుగులు తీస్తున్నారు. కొన్నిచోట్ల స్టేషన్‌మాస్టర్ గదుల్లో మరుగుదొడ్లకు వెళుతున్నారు. దీంతో ప్రయాణికులు, స్టేషన్‌సిబ్బంది మధ్య వాగ్వాదం చోటుచేసుకుంటోంది.

రైలు ఆగితే స్టేషన్‌లోకి పరుగులు

ఇటీవల రాజంపేట, రైల్వేకోడూరు స్టేషన్‌లో ఇటువంటి పరిస్థితులు నెలకొన్నాయి. రైల్వేకోడూరు నార్త్ ప్రాంతానికి చెందిన స్టేషన్‌మాస్టర్.. అవసరాలు తీర్చుకునేందుకు మహిళలు రావడంతో వారిపై ఆగ్రహించారు. ప్రయాణికులు అంతా ఒక్కటయ్యారు. తిరగబడ్డారు, రైలును కదలినివ్వబోమన్నారు. ఈ విధంగా డెమో ప్రయాణంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రైల్వేశాఖ వీటిని పరిగణనలోకి తీసుకెళ్లలేదు. స్టేషన్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లలేదు.

సిటీ టైప్ రైళ్లను తిప్పుతున్న రైల్వేశాఖ

నంద్యాల–రేణిగుంట మధ్య సిటీటైపు రైళ్లను రైల్వేశాఖ తిప్పడంపై ప్రయాణికులు పెదవి విరిస్తున్నారు. చెన్నై, సికింద్రాబాద్, ముంబాయి తదితర మహానగరాలలో డెమో, మోమో రైళ్లు నడపడం వల్ల నిత్యం పరుగులు పెట్టే ప్రయాణికులకు ఉపయోగకరం. నీటిసౌకర్యం, మరుగుదొడ్లు లేకపోవడం వల్ల గంటల తరబడి వృద్ధులు, పిల్లలు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.

సాధారణ బోగీలతో రైలు నడిపించాలి

డెమో రైలును కాకుండా సాధారణ బోగీలతో నడిపించాలని నంద్యాల, వైఎస్సార్, అన్నమయ్య జిల్లా వాసులు డిమాండ్ చేస్తున్నారు. డెమో రైలులో ప్రయాణం ఇబ్బందికరంగా ఉందని వారు వాపోతున్నారు. అయితే యాత్రికులకు డెమో లాంటి రైళ్లలో ప్రయాణం బరువు. జనరల్‌బోగీలతో నంద్యాల–రేణిగుంట రైలును నడిపించే అంశాన్ని రైల్వేశాఖ పరిశీలించాలని కోరుతున్నారు.

మామండూరులో గంటల తరబడి

డెమో రైలు నంద్యాల నుంచి బాగానే వచ్చినప్పటికి మామండూరు రైల్వేస్టేషన్‌లో గంటల తరబడి ఒక్కొక్కసారి నిలిపివేస్తారు. రైలును తీసుకొనేందుకు రేణిగుంటలో లైను లేక నిలిపివేయాల్సి వస్తోందని రైల్వే అధికారులు అంటున్నారు. ఇక్కడే ప్రయాణికులు బేజారవతున్నారు. ముందుగానే డెమోలో కనీస సౌకర్యాలు లేకపోవడం, పైగా ఆలస్యంగా నడవడం లాంటివి వేధిస్తున్నాయి.

జనరల్ బోగీలు వేయాలి

డెమో రైలు స్థానంలో ఐసీఎఫ్ జనరల్ బోగీలు వేయాలి. అప్పుడు ప్రయాణికులకు అనువుగా ఉంటుంది. మహానగరాలలో వేసే విధంగా డెమో, మోమో రైళ్లను ఈ ప్రాంతంలో నడిపిస్తే యాత్రికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికై నా రైల్వేశాఖ డెమోలో ప్రయాణికుల పరిస్థితిని గమనించి వారి అవసరాలకు అనుగుణంగా బోగీలను వేయాలి. కనీస సౌకర్యాల కల్పించే దిశగా రైల్వేశాఖ నిర్ణయం తీసుకోవాలి.

–షేక్ మహమ్మద్‌అలీ, మాజీ ఏజీపీ, నందలూరు

మరుగుదొడ్లు లేకుంటే ఎలా

నంద్యాల నుంచి రేణిగుంట మధ్య నడిచే డెమో రైలులో కనీస సౌకర్యాలు లేవు. మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేదు. ప్రయాణికులు తమ అవసరాల రీత్యా అనేక ఇబ్బందులు పడుతున్నారు. గంటల తరబడి ప్రయాణంలో నరకం చూస్తున్నారు. స్టేషన్‌లలో ఆగితే అవసరాల కోసం పరుగులు తీస్తున్నారు. ఇది విచారకరం. రైల్వేశాఖ ఇప్పటికైనా జనరల్ బోగీలతోనే నంద్యాల–రేణిగంట రైలును నడిపించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. సిటీ అయితే డెమో లాంటి రైళ్లు అవసరం.

–అలీఖాన్, ఉపాధ్యాయ సంఘం నేత, నందలూరు

ధరణీనాయక గోవిందా..

- కిక్కిరిసిన వాడపల్లి ఆలయం
- ఒక్కరోజే రూ.33.28 లక్షల ఆదాయం

ఆత్రేయపురం: దినకర తేజా గోవిందా.. ధరణీనాయక గోవిందా.. నామస్మరణ కోనసీమ తిరుపతి వాడపల్లి క్షేత్రంలో మార్మోగింది.. అశేష భక్తజనం ఆ స్వామిని కొలుస్తూ తన్మయత్వం చెందింది.. వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఉదయం స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అర్చకులు అలంకరించారు. అనంతనం దర్శన భాగ్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గౌతమీ గోదావరి నదిలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని, మొక్కులు సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో వేంచేసి ఉన్న క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. ఏడు వారాల నోము ఆచరిస్తున్న భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. దేవదాయ ధర్మదాయ శాఖ ఉప కమిషనర్ ఎం.విజయరాజు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ ఏర్పాట్లను డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. ఈఓ భూపతిరాజు మాట్లాడుతూ స్వామివారి ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ ప్రసాదం విక్రయం, ఆన్‌లైన్ సేవల ద్వారా సుమారు రూ.33,28,574 ఆదాయం సమకూరిందన్నారు. ఆలయం వద్ద ఏర్పాటైన అన్నసమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.



ఇదిగో త్వరగా వచ్చుచున్నాను.
వానివాని క్రియచొప్పున ప్రతివానికిచ్చుటకు
నేను సిద్ధపరచిన జీతము నాయొద్ద ఉన్నది.
– క్రైస్తవ ధర్మం

విజయం సరే... విలువలు?

జనతంత్రం



వర్ధెల్లి మురళి

ఈ నేల మీద భగవంతుడి ప్రస్థానమే రాజ్యం. సుప్రసిద్ధ జర్మన్ తత్త్వవేత్త హెగెల్ చేసిన సూత్రీకరణ ఇది. హెగెల్ నుంచి స్ఫూర్తి పొందిన వారిలో కార్ల్ మార్క్స్ వంటి తత్త్వవేత్తలే కాదు, మన ప్రధాని మోదీ వంటి వారు కూడా ఉన్నారు. ఇది నిన్న మొన్ననే నిగ్గుతేలినటువంటి ఒక నగ్నసత్యం. హెగెల్ సూత్రీకరణను మోదీ మరింత విప్లవీకరించారు.

ఒక ప్రత్యేక కార్యం కోసం దేవుడు పంపగా వచ్చిన దూతను తానని ఈమధ్యనే ఒక ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు. ఆ దేవుని తరపున ఈ భూమ్మీద తన ప్రస్థానమే రాజ్యమని ఆయన భావన కావచ్చు. ఇందుకోసం ఆయన ఫ్రాన్స్ చక్రవర్తి పద్నాలుగో లూయీని అరువు తెచ్చుకున్నారు. 'ఐయామ్ ది స్టేట్' (నేనే రాజ్యం) అనే కొటేషన్‌తో పద్నాలుగో లూయీ చరిత్రలో నిలబడిపోయిన సంగతి తెలిసిందే.

హెగెల్ గతితర్కాన్ని, లూయీ నిరంకుశత్వాన్ని గ్రైండర్‌లో వేయగా వచ్చిన సింథసిస్‌నే మోదీ తనే దేవదూత కార్యంగా ప్రకటించారనుకోవాలి. తాను పొలిటికల్ సైన్స్‌తో ఎమ్మే చదివానని ఏదో సందర్భంలో ఆయనే చెప్పుకున్నారు. కనుక థామస్ హాబ్స్ తత్త్వధారను కూడా ఆయన అనివార్యంగా చదివుండాలి. హాబ్స్ ప్రతిపాదించిన సంపూర్ణ సార్వభౌమాధికార ప్రతిపాదన మోదీ మనసును రంజింపజేసి ఉండవచ్చు.

"నేను అందరిలానే పుట్టానని అమ్మ చనిపోయేంతవరకు అనుకునేవాడిని. కానీ, ఆ తర్వాత అర్థమైంది నాకు. దేవుడు ఏదో ప్రత్యేక కార్యం కోసం నన్ను పంపించాడు. నా ద్వారా ఆయన అమలు చేయానుకుంటున్న పథకం సమగ్ర స్వరూపం నాక్కూడా తెలియదు. ఆయన ఆదేశిస్తాడు, నేను అమలు చేస్తాన"ని ప్రధానమంత్రి ఆ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. బహుశా దేవుడు ఆశిస్తున్న సమగ్ర పథకాన్ని అమలు చేయాలంటే పార్లమెంట్‌లో బీజేపీకి మూడింట రెండొంతుల మెజారిటీ ఉండాలేమో! అంతవరకే దేవుడు చెప్పి ఉంటాడు. అందుకోసమే ఈ ఎన్నికల్లో 'అబ్ కీ బార్... చార్ సౌ పార్' అనే నినాదాన్ని మోదీ ఎత్తుకున్నారు. ఆ నినాదం కేవలం దైవ సంకల్పం!

అధికారంలోకి రావడానికి సాధారణ మెజారిటీ (272) చాలు. మరి 'చార్ సౌ పార్' కోసం ఎందుకింత ధ్యాస. ఎందుకిన్ని ధ్యానాలు, ఎందుకిన్ని దండాలు? ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్టుగా రాజ్యాంగాన్ని మార్చడానికేనా? రాజ్యాంగంలోని సెక్యులర్, సోషలిస్టు పదాలను ఎత్తివేయడానికా? బలహీన వర్గాల అభ్యున్నతిని కాంక్షించిన రాజ్యాంగ ఆదేశాలను తుంగలో తొక్కడానికా? రిజర్వేషన్లు ఎత్తివేయడానికా?... అవి ప్రతిపక్షాలు కాబట్టి ఉద్దేశపూర్వకంగా ఇటువంటి ఆరోపణలు చేస్తాయని కూడా అనుకోవచ్చు.

భారీ మెజారిటీ ఉంటే ప్రభుత్వం మరింత బలంగా ఉండవచ్చన్నది బీజేపీ నేతల తలపోత కావచ్చు. ఇప్పటికే పట్టుబిగించిన ప్రజాస్వామ్య వ్యవస్థలపై మరింత బిగువుగా పెత్తనం కొనసాగించవచ్చు. ప్రతిపక్షాలను నలిపేయవచ్చు. రాష్ట్ర ప్రభుత్వాలను స్థానిక సంస్థల స్థాయికి దిగజార్చి కేంద్ర సార్వభౌమాధికారాన్ని పటిష్ఠం చేయవచ్చు. ఏమో... దేవుడు ఆదేశిస్తే పార్లమెంటరీ వ్యవస్థ కొమ్మలు నరికి అధ్యక్ష పాలనను అంటుకట్టవచ్చు. ఈ రకమైన బృహత్కార్యాలను అమలు చేయాలంటే ఎన్డీఏ కూటమికి ఆ మాత్రం మెజారిటీ అవసరమవుతుంది.

కానీ, ఎన్డీఏ 400 మార్కును దాటే అవకాశం కనిపించడం లేదు. ఎగ్జిట్ పోల్స్ లెక్కల ప్రకారం గతంలో ఉన్న బలాన్నే యథాతథంగా కాపాడుకునే అవకాశం కనిపిస్తున్నది. ఇది మూడింట రెండొంతుల మెజారిటీకి ఓ రెండడుగుల దూరం. జాతీయ మీడియా పూర్తిగా బీజేపీకి అనుకూలంగా ఎగ్జిట్ పోల్ ఫలితాలను ఇచ్చిందన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ప్రచార ఘట్టంలో ఎన్డీఏ నాయకత్వంలో కనిపించిన అసహనం, ప్రతిపక్షాలపై వారు అవధులు దాటి చేసిన ఆరోపణలు, మైనారిటీ మతాన్ని టార్గెట్‌గా చేసుకొని సాగించిన అనైతిక ప్రచారం వగైరాలు మారుతున్న రాజకీయ వాతావరణానికి సంకేతాలుగా చాలామంది భావించారు.


ప్రతిపక్షాలను నిందించడం కోసం మహాత్మాగాంధీ పేరును మోదీ వాడుకున్న తీరు దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. 'గాంధీ సినిమా (1982) వచ్చేవరకూ ఆయన గురించి ప్రపంచంలో పెద్దగా తెలియదు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఆయన్ను ప్రమోట్ చేయలేదు. మార్టిన్ లూథర్ కింగ్, నెల్సన్ మండేలా కంటే గాంధీ ఏం తక్కువ? వాళ్లకొచ్చినంత పేరు గాంధీకి రాలేదంటే అప్పటి ప్రభుత్వాలే కారణమ'ని ఆయన ఏబీపీ ఇంటర్వ్యూలో ఆక్షేపించారు.

ప్రతిపక్షాల మీద ప్రధాని విచక్షణా రహితంగా చేసిన దాడుల్లో భాగంగానే దీన్ని పరిగణించాలేమో! ఎందుకంటే గాంధీకి దేశదేశాల్లో ఉన్న ప్రాచుర్యం గురించి ప్రధానికి తెలియదనుకోవడం నమ్మశక్యంగా లేదు. గాంధీ మరణాన్ని ఆ రోజుల్లోనే సకల దేశాల్లోని వార్తా పత్రికలు బ్యానర్ వార్తగా ప్రకటించాయి. మోదీ ఉదాహరించిన మార్టిన్ లూథర్ కింగ్, నెల్సన్ మండేలాలే స్వయంగా తాము గాంధీ నుంచి స్ఫూర్తి పొందామని పలుమార్లు ప్రకటించారు. గాంధీ ప్రవచించిన అహింసాయుత ఆందోళనా పద్ధతులనే మార్టిన్ లూథర్ కింగ్ అమెరికాలో ఆచరణలో పెట్టారు.

గాంధీ పుట్టిన భారతదేశాన్ని సందర్శించాలన్న ఆకాంక్షను కూడా ఆ రోజుల్లో కింగ్ వెల్లడించారు. పండిత్ నెహ్రూ ఆహ్వానంపై 1956లో ఆయన ఇండియాలో దిగిన వెంటనే చెప్పిన మాట ఎన్నటికీ మరపునకు రాదు. 'నేను విదేశాలకు పర్యాటకునిగా వెళ్తుంటాను. కానీ, ఈ దేశానికి ఒక యాత్రికునిగా వచ్చాన'న్నారు. అన్యాయానికి, వివక్షకు గురయ్యే సకల దేశాల ప్రజానీకానికి సత్యాగ్రహమనే దివ్యాస్త్రాన్ని ప్రసాదించిన మహాత్మాగాంధీ పుట్టిన దేశం ఆనాటి మహోన్నతుల దృష్టిలో ఒక యాత్రాస్థలమే. నల్ల సూర్యుడు మండేలా కూడా తన స్ఫూర్తిప్రదాతగా గాంధీని పేర్కొన్నారు. 'గాంధీ ఆఫ్ సౌతాఫ్రికా'గా తనను పరిగణించడాన్ని గర్వంగా భావించారు.

రిచర్డ్ అటెన్‌బరో తీసిన సినిమా చూసేవరకూ ప్రపంచానికి గాంధీ తెలియదన్న మోదీ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గాంధీపై ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ లాంటి సుప్రసిద్ధ శాస్త్రవేత్తలు, విజ్ఞానులు, దేశాధినేతలు చేసిన వ్యాఖ్యానాలను వారు ఉటంకిస్తున్నారు. 'ఇటువంటి వ్యక్తి (గాంధీ) ఒకరు ఈ నేల మీద రక్తమాంసాలతో నడయాడాడంటే భవిష్యత్తు తరాలు నమ్మకపోవచ్చ'ని ఐన్‌స్టీన్ చెప్పిన మాటలు మనకు సుపరిచితమైనవే. ప్రపంచంలోనే ఆల్‌టైమ్ అగ్రశ్రేణి నవలాకారుడు, రష్యన్ రచయిత లియో టాల్‌స్టాయ్ – గాంధీల మధ్యనున్న స్నేహబంధం, నడిచిన ఉత్తర ప్రత్యుత్తరాల గురించి కూడా ప్రపంచానికి తెలుసు.

వివి లెనిన్, విన్‌స్టన్ చర్చిల్, ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్, మార్టిన్ లూథర్‌కింగ్, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, అడాల్ఫ్ హిట్లర్, మావో జెడాంగ్, నెల్సన్ మండేలా, పండిత్ నెహ్రూ, మదర్ థెరిసా, మార్గరెట్ థాచర్ తదితర శక్తిమంతమైన, ప్రభావవంతమైన వ్యక్తులు ఇరవయ్యో శతాబ్దాన్ని శాసించారు. వీరందరిలోకి అత్యంత శక్తిమంతుడిగా మహాత్మాగాంధీ గుర్తింపు పొందడమే కాకుండా ఈ జాబితాలోని పలువురి అభిమానాన్ని, గౌరవాన్ని కూడా ఆయన చూరగొన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇరవయ్యో శతాబ్దం – గాంధీ శతాబ్దం!



అటువంటి గాంధీ మహాత్ముడిని సరిగ్గా ప్రమోట్ చేయలేకపోయారని ప్రధాని వాపోవడం ఒక ప్రకృతి వైచిత్రి. కార్పొరేట్ శక్తులన్నీ కలిసి ప్రమోట్ చేసి గద్దెనెక్కించడానికి ఆయనేమన్నా గుజరాత్ మోడలా? గాంధీ పుట్టింది గుజరాతే. కానీ ఆయన భారతీయ ఆత్మకు ప్రతీక. భారతీయ సహజీవనానికి ప్రతీక. భారతీయ సంస్కృతికి, భారతీయ సమైక్యతకు ప్రతీక. పల్లె స్వరాజ్యాన్ని ప్రేమించినవాడు. ఈశ్వరుడూ – అల్లా ఒకరేనని భజనలు చేసినవాడు. విద్వేషాన్ని ప్రేమతో జయించినవాడాయన. ఆయనే ఒక మూర్తీభవించిన భారతీయత. ఆయనను ప్రభుత్వాలు ప్రమోట్ చేయడమేమిటి? ఇన్నేళ్ల తర్వాత ఈ విషయంలో ప్రధాని వ్యాకులత చెందడం ప్రజలకు అసహజంగా అనిపించింది.

మోదీజీ తీసిన 'గాంధీ బాణం' ఎన్నికల కోసమేనన్నది అందరికీ అర్థమవుతూనే ఉన్నది. ఈసారి ఎన్నికల ప్రచారంలో ఆయన ఊహించని కొత్త పుంతలు తొక్కారు. ఫైవ్ ట్రిలియన్ ఎకానమీ ఊసే లేదు. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌పై చర్చే లేదు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల హామీని అటకపై నుంచి మళ్లీ కిందికి దించలేదు. విదేశాల నుంచి బ్లాక్ మనీని తీసుకొస్తానన్న పదేళ్ల కిందటి హామీని పొరపాటున కూడా మళ్లీ ప్రస్తావించలేదు. రైతులకు గిట్టుబాటు ధరలపై స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేస్తామని పదేళ్ల కింద ఇచ్చిన హామీకి చెదలు పట్టాయి. కీలకమైన ప్రజా సమస్యల ప్రస్తావనకు సమయం సరిపోలేదు.

గాంధీ మహాత్ముడిని సరిగ్గా ప్రమోట్ చేయలేకపోయారని ప్రధాని వాపోవడం ఒక ప్రకృతి వైచిత్రి. కార్పొరేట్ శక్తులన్నీ కలిసి ప్రమోట్ చేసి గద్దెనెక్కించడానికి ఆయనేమన్నా గుజరాత్ మోడలా? గాంధీ పుట్టింది గుజరాతే. కానీ ఆయన భారతీయ ఆత్మకు ప్రతీక. భారతీయ సహజీవనానికి ప్రతీక. భారతీయ సంస్కృతికి, భారతీయ సమైక్యతకు ప్రతీక. పల్లె స్వరాజ్యాన్ని ప్రేమించినవాడు. ఈశ్వరుడూ – అల్లా ఒకరేనని భజనలు చేసినవాడు. విద్వేషాన్ని ప్రేమతో జయించినవాడాయన. ఆయనే ఒక మూర్తీభవించిన భారతీయత. ఆయనను ప్రభుత్వాలు ప్రమోట్ చేయడమేమిటి? ఇన్నేళ్ల తర్వాత ఈ విషయంలో ప్రధాని వ్యాకులత చెందడం ప్రజలకు అసహజంగా అనిపించింది.

మోదీజీ తీసిన గాంధీ బాణం ఎన్నికల కోసమేనన్నది అందరికీ అర్థమవుతూనే ఉన్నది. ఈసారి ఎన్నికల ప్రచారంలో ఆయన ఊహించని కొత్త పుంతలు తొక్కారు. ఫైవ్ ట్రిలియన్ ఎకానమీ ఊసే లేదు. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌పై చర్చే లేదు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల హామీని అటకపై నుంచి మళ్లీ కిందికి దించలేదు. విదేశాల నుంచి బ్లాక్ మనీని తీసుకొస్తానన్న పదేళ్ల కిందటి హామీని పొరపాటున కూడా మళ్లీ ప్రస్తావించలేదు. రైతులకు గిట్టుబాటు ధరలపై స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేస్తామని పదేళ్ల కింద ఇచ్చిన హామీకి చెదలు పట్టాయి. కీలకమైన ప్రజాసమస్యల ప్రస్తావనకు సమయం సరిపోలేదు.

జనజీవన స్రవంతి నుంచి ముస్లిం మతస్థులను వేరు చేసే ప్రయత్నం ఎన్నికల ప్రచారంలో బీజేపీ నేతలు ముమ్మరంగా చేశారు. ఈ విధ్వంసకర ధోరణికి సాక్షాత్తు ప్రధానే నాయకత్వం వహించారు. ప్రతిపక్షాలను 'ముజ్రా' డ్యాన్సర్లుగా అభివర్ణించారు. బీజేపీ గెలవకపోతే బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను ముస్లింలు లాగేసుకుంటారని రెచ్చగొట్టారు. ప్రతిపక్షాలు గెలిస్తే హిందువుల మంగళ సూత్రాలు లాక్కొని ముస్లింలకు పంచుతారని దారుణమైన ఆరోపణలు చేశారు. సమాజాన్ని విభజించే విత్తన బంతులను యథేచ్ఛగా వెదజల్లారు. ఈ పని చేసినందుకు యావత్తు భారతదేశం చింతించవలసిన రోజు రావచ్చు. ఇదంతా చేసింది 'చార్ సౌ పార్' కోసమేనా?

ఒకవేళ ఎన్డీఏ కూటమి 400 సీట్ల మార్కు దాటినా, అందుకు కారణం ఈ విద్వేష ప్రచారం కాబోదు. ప్రత్యామ్నాయ కూటమి సమర్థతపై జనానికి నమ్మకం కుదరకపోవడం కావచ్చు. ఈసారి కూడా గెలిస్తే నెహ్రూ తర్వాత వరసగా మూడు ఎన్నికల్లో గెలిచిన ప్రధానిగా ఆయన రికార్డును మోదీ సమం చేస్తారు. కానీ, జనంలో నాటిన విద్వేష బీజాలు ఎటువంటి పరిణామాలకు దారితీస్తాయన్నదే బుద్ధిజీవుల మెదళ్లను తొలుస్తున్న ప్రశ్న.

vardhelli1959@gmail.com

విభజన... అసమాన అంతరాలు పెంచడానికా?

సందర్భం



జూలకంటి రంగారెడ్డి

రాష్ట్ర విభజన జరిగి జూన్ 2 నాటికి పదేళ్లు గడిచాయి. పాలకుల వైఫల్యం వల్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతాల మధ్య ఏర్పడిన అసమాన అభివృద్ధి విధానాలు విభజన తర్వాత కూడా కొనసాగుతున్నాయి. దశాబ్దాలుగా జరిగిన పోరాటాలు, ఉద్యమాలు, అమరవీరుల త్యాగాల నెత్తుటి మరకలను పాలకులు తమ తిరోగమన విధానాలతో తుడిపేస్తున్నారు. ఈ పదేళ్ల కేంద్ర ప్రభుత్వ పోకడ భారత రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తికి గండి కొట్టేలా వెళ్లింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విడదీసిన తర్వాత ఏర్పడే రెండు తెలుగు రాష్ట్రాలకు పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ నెరవేర్చకుండా తన పబ్బం గడుపుకోవడం మీదనే కేంద్రం దృష్టి సారించింది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి చివరికి ఎగ్గొట్టారు. తెలంగాణకు స్పెషల్ ప్యాకేజీ ప్రకటిస్తామని మొండిచేయి చూపించారు.

ఇక, విభజన చట్టంలో పేర్కొన్న హామీలను కూడా పాక్షికంగానే అమలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని పూర్తి కావడానికి కేంద్ర ప్రభుత్వం సహకరించకుండా ప్రేక్షక పాత్ర వహించింది. ఒక్క మాటలో చెప్పాలంటే రెండు రాష్ట్రాలను ఏర్పాటు చేశారు కానీ కేంద్ర ప్రభుత్వం చేయాల్సిన పనులు, నిర్వహించాల్సిన బాధ్యతలను నిర్వహించలేదు. పదేళ్లపాటు చేతులు దులుపుకునే ప్రయత్నమే జరిగింది. కృష్ణా, గోదావరీ నదీజలాల వ్యవహారంలో ఎటూ తేల్చకపోగా, కేంద్రమే స్వయంగా గొడవలు పెడుతోంది. విద్యుత్ బకాయిల చెల్లింపులు, ఉద్యోగుల విభజన లాంటి ముఖ్యమైన అంశాలను కూడా తేల్చలేదు. ద్రవ్యలోటు పూడ్చే విధంగా ఆర్థికంగా ఆదుకోవాల్సిన కేంద్రం అసలు తాను ఇవ్వాల్సిన నిధులను కూడా ఇవ్వడం లేదు. సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించకపోగా, సాగునీటి రంగానికి ఉపయోగపడే విధంగా ఎలాంటి నిధులు ఇవ్వడం లేదు. రెండు తెలుగు రాష్ట్రాలను ఉపయోగించుకోవడమే తప్ప ఎనిమిది కోట్ల తెలుగు ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదు.


మలివిడత ఉద్యమంలో పాల్గొన్న వారెవరూ నాటి టీఆర్ఎస్ (నేటి బీఆర్ఎస్) పార్టీ అధికారంలో వుండగా ప్రాతినిధ్యంలోకి రాలేదు. చివరికి తెలంగాణ ఉద్యమాన్ని కేసీఆర్ కుటుంబ కృషిగానే మలిచే ప్రయత్నం చేశారు. దీని ఫలితమే టీఆర్ఎస్ గడిచిన 10 ఏళ్ల పాలన ఏకఛత్రాధిపత్యంగా సాగడానికి కారణమైంది. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం భూమి కోసం, దోపిడి, పీడనకు వ్యతిరేకంగా జరిగింది. కానీ, తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రజాస్వామ్యాన్నీ, స్వేచ్ఛనూ, ప్రశ్నించే గొంతులనూ అణచివేస్తూ కేసీఆర్ నయా నిజాంలా వ్యవహరించారు.

పార్లమెంటులో విభజన చట్టంపై చర్చ జరుగుతున్న సందర్భంలో ప్రతిపక్షం (బీజేపీ) నుండి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ విభజన హామీగా రెండు రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కల్పించాలన్నారు. పోలవరం, ప్రాణహిత, చేవెళ్ళ ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించి పూర్తి చేయాలన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వారు మంత్రిగా, ఉపరాష్ట్రపతిగా ప్రధాన బాధ్యతలు చేపట్టి తను డిమాండ్ చేసిన ప్రత్యేక హోదాలు ఈ 10 ఏండ్లలో పట్టించుకోకుండా గాలికొదిలేశారు.

రెండు రాష్ట్రాల మధ్య ఇప్పటికీ నీటి యుద్ధం కొనసాగుతూనే వుంది. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీకి నీటిని క్రమబద్ధీకరించటం, రివర్ బోర్డు ఏర్పాటు, ద్రవ్యలోటు పూడ్చడం, ఉద్యోగులను సొంత రాష్ట్రాలకు పంపడం, ఆంధ్రలో కలిపిన ఏడు తెలంగాణ గ్రామాల ఉమ్మడి సమస్యలు వంటివి పరిష్కారం కాలేదు. తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ, ఎన్‌టీపీసీలో మిగిలివున్న 3 వేల మెగా వాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వంటి ముఖ్యమైన హామీలు అమలు జరుగలేదు. 9, 10 షెడ్యూల్‌లో వున్న 91 ప్రభుత్వరంగ సంస్థలు, కార్పొరేషన్లలో 71 సంస్థలను విభజించినట్లు ప్రకటించి, నేటికీ ఉమ్మడిగానే కొనసాగిస్తున్నారు.

రాష్ట్రం ఏర్పడక ముందు పాలకుల విధానాల వల్ల ప్రాంతాలు, ప్రజల మధ్య ఏర్పడిన ఆర్థిక, సామాజిక అంతరాలు యథావిధిగా కొనసాగుతున్నాయి. ప్రజలకు దీర్ఘకాలిక అభివృద్ధికి ఉపకరించే భూమి, ఉపాధి, నీటి వనరులు, ఉద్యోగాలు, వేతనాలు వంటి అంశాలను పట్టించుకోలేదు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దం గడిచినా ప్రజల జీవితాల్లో అభివృద్ధి భూమిక ఏర్పడ లేదు. భూములు పంచుతామన్న పాలకులు ఉన్న భూములను బినామీ పేర్లతో ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ బ్రోకర్లుగా మారారు. వ్యవసాయానికి ప్రోత్సాహం లేక చిన్న, మధ్యతరగతి రైతులు వ్యవసాయాన్ని వదులుకొని కార్పొరేట్ సంస్థల వద్ద అతితక్కువ వేతనాలకు వాచ్‌మెన్లుగా, గార్డెన్లలో పనిచేసే కూలీలుగా మారినారు.



తెలంగాణ ఏర్పడితే ఈ పరిస్థితులు వస్తాయని ప్రజలు భావించలేదు. ఉద్యోగాలు వస్తాయనీ, ఉపాధి సౌకర్యాలు మెరుగుపడుతాయనీ, అన్ని ప్రాంతాలు సమాన అభివృద్ధి అయితే స్థానికంగా ఉపాధి పొందుతామనీ భావించారు. కానీ, వారి ఆశలు అడియాసలయ్యాయి. ప్రాంతాల మధ్య, ప్రజల మధ్య తీవ్రమైన అంతరాలు పెరుగుతూనే వున్నాయి. ఇది సామాజిక దోపిడి, వివక్షకు దారితీసింది. దీని ఫలితమే బీఆర్ఎస్ పార్టీని అసెంబ్లీ ఎన్నికల్లో గద్దెదించి, ప్రత్యామ్నాయంగా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టంగట్టారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజారంజక పాలన కొనసాగించవలసిన అవసరం వున్నది. రాష్ట్రంలో, దేశంలో అస్తిత్వ రాజకీయాల ప్రభావం పెరుగుతున్నది. ప్రజల ప్రధాన సమస్యలైన భూమి, కూలి, ఉద్యోగ సమస్యలను తీర్చాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు సమర్థవంతంగా అమలు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

తెలంగాణ ఇచ్చిన పార్టీగా ఏ ప్రయోజనాల కొరకైతే రాష్ట్రం ఏర్పడిందో ఆ లక్ష్యాన్ని నెరవేర్చాలి. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, వివిధ వర్గాల ప్రజల మధ్య అంతరాలు తగ్గించే విధంగా ప్రతిపక్షాలను పరిగణలోకి తీసుకొని తెలంగాణ అభివృద్ధికి తగిన సూచనలు, సలహాలు తీసుకొని పరిపాలన సాగించాలి. రాష్ట్రాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి వైపు నడిపించాల్సిన బాధ్యత అధికార పార్టీపై వుంది. రెండు రాష్ట్రాల ప్రజలు ఆశించినట్టు ఇప్పటి నుంచైనా అధికారంలోకి వచ్చే, వచ్చిన పార్టీల ప్రభుత్వాలు, కేంద్రంలో ఏర్పడే కొత్త ప్రభుత్వం కలిసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షలను నెరవేర్చేందుకు చిత్తశుద్ధి కనబరచాలి.

వ్యాసకర్త మాజీ శాసన సభ్యులు

(నేడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం)

మమతా బెనర్జీ (ప.బెం. సీఎం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

మోదీజీ మాటల్లో ఓటమి భయం స్పష్టంగా కనిపిస్తోంది. భయం బయటికే స్పష్టంగా కనిపిస్తోందీ అంటే అర్థం... లోపల ఆయన ఓటమి ఊహనే తట్టుకోలేకపోతున్నారని!

చివరి విడత పోలింగ్‌కు ముందు మోదీజీ మాటల్లో భయం మరింత ఎక్కువగా కనిపించింది. గురువారం సాయంత్రం కన్యాకుమారిలో ఆయన ప్రారంభించిన 'మౌన ముద్ర' కూడా ఆ మాటల్లో భాగమే.

నిన్న చివరి విడతగా బిహార్, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్, ఒడిశా, పంజాబ్, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, చండీగఢ్‌లలో పోలింగ్ ముగిసింది. చండీగఢ్, ఉత్తర ప్రదేశ్ మినహా మిగతా రాష్ట్రాలన్నీ మోదీజీలో భయం పుట్టించేవే. ముఖ్యంగా ఒడిశా, పశ్చిమ బెంగాల్. మరీ ముఖ్యంగా నవీన్ పట్నాయక్, మమతా బెనర్జీ! మేమిద్దరం అంటే ఉండే భయం ఆయన మాటల్లో స్పష్టంగా కనిపించింది.

మాటలా అవి! అహంకారం, అతి తెలివి. ఆ అహంకారానికి, అతి తెలివికి అబద్ధాలు కూడా తోడై. ఓటమి భయాన్ని ఆయన ఎంతగా కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నా అది బట్టబయలు అవుతూనే ఉంది.

కాక్‌ద్వీప్ ర్యాలీలో పెద్ద అబద్ధమే ఆడేశారు మోదీజీ! ఎంత పెద్ద అబద్ధం అంటే... "బెంగాల్‌కి ఇవ్వవలసినవన్నీ ఇచ్చేశాం" అనేశారు!!

నిజానికి – దేనికీ ఒక్క పైసా కూడా ఇవ్వలేదు ఆయన. అబద్ధాన్ని అబద్ధం అని చెప్పకపోతే అదేమీ పశ్చిమ బెంగాల్‌లో నిజమైపోదు. మోదీజీ సంగతి ఇక్కడ తెలియంది ఎవరికి?

2021 అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ చేతిలో బీజేపీ ఘోరంగా దెబ్బతిన్నప్పటి నుండీ పశ్చిమ బెంగాల్‌కు నిధులు ఇవ్వటమే మానేశారు మోదీజీ.

ఒడిశాలోని మయూర్‌భంజ్ ర్యాలీలో మొన్న మోదీజీ మాటలు విన్నప్పుడైతే... ఇలాంటి ఒక ప్రధాని దేశానికి అవసరమా అనిపించింది. ఆయన అహంకారం పీక్స్‌కి వెళ్లి కూర్చుంది! ఇరవై



ఐదేళ్లుగా ఒడిశా సీఎంగా ఉన్న నవీన్ పట్నాయక్ ఆరోగ్యంపై మోదీజీ బహిరంగంగా అనుమానాలు వ్యక్తం చేశారంటే అహంకారం కాక మరేమిటి?

ఒడిశాలో కనుక బీజేపీ అధికారంలోకి వస్తే... పట్నాయక్ ఆరోగ్యం హఠాత్తుగా ఎందుకు క్షీణించిందీ దర్యాప్తు చేయించటం కోసం స్పెషల్ కమిటీని వేయిస్తారట మోదీజీ! అనవలసిన మాటేనా ఇది? నిజంగా ఎవరికైనా ఆరోగ్యం బాగుండకపోతే ఆందోళన వ్యక్తం చేస్తామా, అనుమానాలను వ్యక్తం చేస్తామా? అదీ మోదీజీ సంస్కారం.

పట్నాయక్‌లోని ఔన్నత్యం ఏమిటంటే... ఒక వేళ ఆయన నేడు ప్రధాని అయి ఉన్నా కూడా... ఇదే నిరాడంబరమైన తెల్లటి వస్త్రధారణలో, నెమ్మదైన నవ్వుతో ఈ దేశాన్ని నడిపిస్తూ ఉండేవారు. ఎంత ఎన్నికల ప్రచారం అయినా ఇన్ని మాటలైతే ఉండేవి కాదు.

ఇప్పుడైతే మోదీజీ మాటకు ఆయన ఒక సరైన గట్టి మాటనే జవాబుగా ఇచ్చారు. "కమిటీ వేయించాలని అనుకుంటే కనుక... నా ఆరోగ్యంపై వదంతులు పుట్టించినవారిపై వేయించండి" అన్నారు. నవ్వుతూ, స్థిమితంగా అన్నారు. ఆ మాట చాలదా? మోదీజీ మరో మాట మాట్లాడేందుకు లేకుండా.

మాటల్లోనే కాదు, చేష్టల్లోనూ 'విలక్షణమైన' వ్యక్తి మోదీజీ. 2019 ఎన్నికల తర్వాత కేదార్‌నాథ్‌కి వెళ్లారు. అక్కడ ఏకాంతవాసం ఉన్నారు. ఈ ఎన్నికలకు కన్యాకుమారిలో మెడిటేషన్.

ప్రపంచానికి దూరంగా నాలుగు రోజులు ఎక్కడికైనా వెళ్లి రావాలని ఎవరికైనా అనిపించటం సహజమే. కానీ వెనకే బృందం ఎందుకు? టీవీలలో ప్రదర్శన ఎందుకు?

నిజానికి నేను కూడా జూన్ 1 చివరి విడత పోలింగ్ అయ్యాక కన్యాకుమారి వెళ్లాలనే ప్లాన్ చేసుకున్నాను.

ఇప్పుడు మోదీజీ వెళ్లి అక్కడ కూర్చుని వచ్చారు కనుక, నేను మరేదైనా స్వచ్ఛమైన గాలి దొరికే ప్రదేశాన్ని వెతుక్కోవాలి!

జీర్ణచేలోపాఖ్యానం

జ్యోతిర్మయం

ఒక జమీందారు గారుండేవారు. ఆయనకు కవులన్నా, కవిత్వమన్నా చాలా అభిమానం.

ఒకసారి ఆయన తన ఆస్థానంలో ఒక పెద్ద కవి సమ్మేళనం నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి కూడా ఎందరో కవులు వచ్చి ఆ సభలో తమ కవిత్వం వినిపించారు.

సభకు వచ్చిన కవులలో జీర్ణచేలుడు అనే కవి ఉన్నాడు. ఆయన మహాకవియే కాక మహా భక్తుడు కూడా. కానీ నిరుపేద, నిరాడంబరుడు. పేరుకు తగ్గట్టుగా, బాగా చిరుగు పట్టిపోయిన పాతపంచె కట్టుకొని సభకు వచ్చాడు. ఆయన కవిత్వం మాత్రం సభలో అందర్నీ ముగ్ధుల్ని చేసింది.

"మహాకవీ! మీ కవితా ప్రతిభ అమోఘం. ఇది మీకెలా అబ్బింది?" అని ప్రశ్నించారు జమీందారు.

"ప్రభూ, అది ఈశ్వర కటాక్షం. నేను దేన్ని చూసినా నాకు దేవుడే స్ఫురిస్తాడు. నా కవిత్వమంతా ఆయన చెప్పించే కవిత్వం అని మాత్రమే నాకు తెలుసు!"

"ఈ చిరుగుల పంచెలో కూడా ఈశ్వరుడే కనిపిస్తాడేమో, సభలలో కూడా దీన్నే ధరిస్తున్నారు?" అన్నాడు పక్కనే ఉన్న అహంకారి దివాను.

"అయ్యో కాకేమిటి? ఈ పంచెకు శ్రీహరి లక్షణాలు చాలా ఉన్నాయి!" అని, జీర్ణచేలుడు ఒక శ్లోకం చెప్పాడు.

'ఆది మధ్యాంత రహితం,/ దశాహీనం, పురాతనం,/ అద్వితీయం, అహం వందే!/ మద్ వస్త్ర సదృశం హరిం!' అంటే 'నా వస్త్రంతో సమానుడైన హరికి నేను నమస్కరిస్తున్నాను. ఆయనకూ ఆది, మధ్య, అంతాలు లేవు. బాగా చిరిగిన ఈ పంచెకూ మొదలూ, తుదీ కనిపించవు! ఆ శ్రీహరికీ బాల్య కౌమారాది దశలు లేవు. నా పంచె కూడా దశా హీనమే(దశా అంటే వస్త్రపుటంచు). నా పంచె అంచులు చిరిగి చాలా కాలమైంది. శ్రీహరి ఆది దేవుడు కనుక పురాతనుడు. నా పంచె కూడా అతి పురాతనమైందే. హరి అద్వితీయుడు, రెండవ సాటి దైవం లేనివాడు. నాకు ఈ పంచె కూడా అద్వితీయమే, ఇది తప్ప మరొక పంచె నాకు లేదు!' అన్నాడు.

అందరూ ఆయన చమత్కారానికి నవ్వారు. జమీందారు ఆయనను చక్కగా సత్కరించి, తగుమాత్రం ధనమూ, తగినన్ని నూతన వస్త్రాలూ ఇచ్చి పంపారు.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం. తిథి: బ.ఏకాదశి రా.1.22 వరకు, తదుపరి ద్వాదశి. నక్షత్రం: రేవతి రా.12.49 వరకు, తదుపరి అశ్వని. వర్జ్యం: ప.1.38 నుండి 3.07 వరకు. దుర్ముహూర్తం: సా.4.45 నుండి 5.37 వరకు. అమృతఘడియలు: రా.10.40 నుండి 12.10 వరకు; సూర్యోదయం: 5.28 ; సూర్యాస్తమయం: 6.27 ; రాహుకాలం: సా.4.30 నుండి 6.00 వరకు ; యమగండం : ప.12.00 నుండి 1.30 వరకు

క్లుప్తంగా...

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ, గుంటూరు డివిజన్‌లలో జరుగుతున్న పలు ట్రాఫిక్ నిర్వహణ పనుల కారణంగా ఆయా మార్గంలో నడిచే రైళ్లను పూర్తిగా రద్దు చేయడంతో పాటు మరి కొన్ని రైళ్లను దారి మళ్లించి నడపనున్నట్లు రైల్వే విజయవాడ డివిజన్ పీఆర్‌వో నుస్రత్ మండ్రూప్కర్ శనివారం ప్రకటించారు. ఆదివారం నుంచి జూలై 14 వరకు విజయవాడ–గుంటూరు (07464), గుంటూరు–విజయవాడ (07465, 07976), అలాగే ఆదివారం నుంచి 30 వరకు రాజమండ్రి–విజయవాడ (07767/07459), జూలై 7 నుంచి 14 వరకు హుబ్లీ–విజయవాడ (17329/17330) రైళ్లు పూర్తిగా రద్దు చేశారు. అదేవిధంగా ఆదివారం నుంచి జూలై 14 వరకు చెన్నై సెంట్రల్–విజయవాడ (12077), చెన్నై సెంట్రల్–ఎస్‌విడి కత్రా (16031), చెన్నై సెంట్రల్–లక్నో (16093) రైళ్లు వయా తెనాలి, దుగ్గిరాల, కృష్ణా కెనాల్ జంక్షన్‌ల మీదుగా దారి మళ్లించి నడపనున్నారు.

హెచ్‌పీసీఎల్ సీఎండీ జోషికి ఏయూ డాక్టరేట్



ఏయూ క్యాంపస్ (విశాఖ జిల్లా): హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్) సీఎండీ పుష్పకుమార్ జోషికి ఏయూ డాక్టరేట్ లభించింది. ఏయూ హ్యూమన్ రిసోర్సెస్ విభాగం నుంచి అక్షయపథ్ ఏ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇనీషియేటివ్ త్రూ ఎమోషనల్ అండ్ సోషల్ ఇంటెలిజెన్స్ కాంపిటెన్సిస్, ఏ కేస్ స్టడీ ఇన్ హెచ్‌పీసీఎల్' అంశంపై జరిపిన పరిశోధనకు ఈ డాక్టరేట్ లభించింది. శనివారం ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను స్వీకరించారు. ఏయూ ఏర్పాటు చేసిన స్టార్టప్, ఇంక్యుబేషన్ కేంద్రంతో అనుసంధానమవుతామని, ఏయూ అభివృద్ధిలో భాగమవుతామని పుష్పకుమార్ జోషి తెలిపారు.

గోదావరి డెల్టా కాలువలకు నీరు విడుదల

ధవళేశ్వరం: ఖరీఫ్ సాగుకు సంబంధించి గోదావరి డెల్టా కాలువలకు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత నీరు విడుదల చేశారు. ధవళేశ్వరంలోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద శనివారం ఉదయం తొలుత గోదావరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి గేట్ల స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ఖరీఫ్ సాగును త్వరగా ప్రారంభించడం ద్వారా ప్రకృతి విపత్తులు, వరదలు, తుపానుల బారిన పడకుండా పంటను పూర్తి చేసుకోవడానికి వీలుంటుందని కలెక్టర్ అన్నారు. గోదావరి డెల్టాకు రెండేళ్లుగా సకాలంలో నీరు విడుదల చేస్తున్నామన్నారు. తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలకు 2,500 క్యూసెక్కులను, సముద్రంలోకి 3,197 క్యూసెక్కులను విడుదల చేశారు.

ఎండ తీవ్రతకు పేలిన ఐరన్ ఓర్ పైపులైన్

చింతపల్లి రూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఎండ తీవ్రత కారణంగా అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలంలోని బలపం పంచాయతీ దిగజనబ వద్ద ఐరన్ ఓర్ పాసేజ్ పైపులైన్ పేలిపోయిందని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల బాగా కాలిన పైపులైన్ అర్ధ రాత్రి 12గంటల సమయంలో పేలిపోయిందని ఆయన పేర్కొన్నారు. ఈ పైప్‌లైన్ ద్వారా సుమారు 267 కిలోమీటర్ల పొడవునా ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల మధ్య ఐరన్ ఓర్ పాసేజ్ అవుతుందని వివరించారు. రాత్రి సమయంలో పైప్‌లైన్ పేలడం వల్ల ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదన్నారు. ఘటనాస్థలానికి సమీపంలో ఉన్న పంట భూమిలోకి ఐరన్ ఓర్ ప్రవహించిందని తెలిపారు. వెంటనే పైపులైన్‌కు సంబంధించిన కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి మరమ్మతులు చేయించినట్లు చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ముగ్గురు వన్యప్రాణుల వేటగాళ్లు అరెస్టు



అడ్డతీగల (అల్లూరి సీతారామరాజు జిల్లా): అడ్డతీగల అటవీ రేంజ్ పరిధిలోని కోట అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడే ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సబ్ డీఎఫ్‌వో బి.శ్రీరామారావు తెలిపారు. శనివారం తెల్లవారుజామున కోట అటవీ ప్రాంతంలో అటవీ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అదే ప్రాంతానికి చెందిన మడకం పోతురాజు, సారపు లక్ష్మణరావు, కడబాల మంగిరెడ్డి బైక్‌పై నాటు తుపాకీతో ఎదురుపడ్డారు. వారిని సిబ్బంది ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పలేదు. వెంటనే తనిఖీ చేయగా నాటు తుపాకీతోపాటు బుల్లెట్లు, టార్చిలైట్, కత్తులు, ఇతర సామగ్రి లభ్యమయ్యాయి. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా వన్యప్రాణులను వేటాడేందుకు సంచరిస్తున్నట్లు తేలింది. బైక్‌తోపాటు మెటీరియల్‌ను సీజ్ చేసి నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. అటవీ రేంజి అధికారి షేక్ షెహన్ షా పాల్గొన్నారు.

నేడో, రేపో సీమలోకి 'నైరుతి'!

ఆపై క్రమంగా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు.. / వేగంగా కదులుతున్న రుతుపవనాలు



సాక్షి, విశాఖపట్నం/సాక్షి, అమరావతి: నైరుతి రుతుపవనాలు శరవేగంగా కదులుతున్నాయి. ఇప్పటికే కేరళ, కర్ణాటక, తమిళనాడుల్లోని కొన్ని ప్రాంతాల్లో ముందుకు సాగుతున్నాయి. నేడో రేపో రాయలసీమలోకి ప్రవేశించనున్నాయి. ఆపై క్రమంగా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు విస్తరిస్తాయి. అనంతపురం, శ్రీసత్యసాయి, నెల్లూరు, కడప, ఒంగోలు మీదుగా పయనిస్తాయి. అనంతరం దక్షిణ కోస్తాంధ్ర, ఉత్తర కోస్తాంధ్రల్లోకి ప్రవేశించే అవకాశాలున్నాయి. మరోవైపు కోస్తాంధ్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ఆవరించి ఉంది. దీని ప్రభావంతో ప్రస్తుతం రాష్ట్రంలో చెప్పుకోదగిన స్థాయిలో వర్షాలు కురుస్తున్నాయి. రానున్న నాలుగు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు, మరికొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయి. ఆదివారం అల్లూరి సీతారామరాజు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. సోమవారం పార్వతీపురం మన్యం, అల్లూరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, శ్రీసత్యసాయి, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి జల్లులు కురుస్తాయని తెలిపింది. మంగళవారం అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసేందుకు ఆస్కారం ఉందని వివరించింది. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. బుధవారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, శ్రీ సత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిస్తాయని తెలిపింది. శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, వైఎస్సార్ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. కాగా రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్నందున వడగాడ్పుల ప్రభావం చాలా వరకు తగ్గింది.

రాజంపేటలో 32.5 మిల్లీమీటర్ల వర్షం

ఇదిలావుండగా శనివారం సాయంత్రానికి అన్నమయ్య జిల్లా రాజంపేటలో 32.5 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. అనంతపురం జిల్లా గుంతకల్లులో 30.5, చిత్తూరు జిల్లా గుడుపల్లెలో 24.2, చిత్తూరులో 21, తవణంపల్లెలో 18.7, విశాఖ జిల్లా భీమునిపట్నంలో 18.2, అల్లూరి జిల్లా కొయ్యూరులో 17.7, కాకినాడ జిల్లా తొండంగిలో 15.2 మిల్లీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

జపాన్‌కు చేరిన 'ఐఎన్‌ఎస్ శివాలిక్'



ఐఎన్‌ఎస్ శివాలిక్‌ను సందర్శిస్తున్న జపాన్ నేవీ అధికారులు

సింధియా (విశాఖ జిల్లా): దక్షిణ చైనా సముద్రం, పసిఫిక్ మహాసముద్రంలోని యూఎస్ పసిఫిక్ ఫ్లీట్ (రింపాక్) విన్యాసాల్లో పాల్గొనేందుకు భారత నౌకాదళ నౌక ఐఎన్‌ఎస్ శివాలిక్ సింగపూర్ పర్యటన అనంతరం జపాన్‌లోని యోకోసుకాకు బయలుదేరింది. ఈ పర్యటన జపాన్, అమెరికా వంటి దేశాలతో నౌకాదళాల పరస్పర చర్యల స్థాయిని మెరుగుపరచడమే లక్ష్యంగా నిర్దేశించబడిందని నేవీ వర్గాలు తెలిపారు. సింగపూర్ పర్యటన సందర్భంగా నౌక బేస్ కమాండర్‌తో కాల్ చేయడం, చాంగి నావల్ బేస్, క్రాంజీ వార్ మెమోరియల్‌లో పుష్పగుచ్ఛం ఉంచడం, సింగపూర్‌లోని భారత హైకమిషనర్‌తో కాల్ చేయడం, ఐఎఫ్‌సీ సందర్శన, బోర్డులో ఉన్న 80 మంది పాఠశాల విద్యార్థులతో సంభాషణ వంటి కార్యకలాపాలు చేపట్టారు.

వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు

- ఆకాశగంగ, జపాలి తీర్థంలో ప్రత్యేక పూజలు
- ఆంజనేయస్వామి వారికి టీటీడీ తరఫున పట్టువస్త్రాల సమర్పణ

తిరుమల: హనుమజ్జయంతి వేడుకలు తిరుమలలో శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆకాశగంగలో శ్రీఅంజనాదేవి, శ్రీబాలాంజనేయస్వామివారికి, జపాలి తీర్థంలోని శ్రీ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. లోక క్షేమం కోసం మల్లెలతో సహస్రనామార్చన నిర్వహించారు. స్వామివారికి శ్రీవారి ఆలయం తరఫున టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఐదు రోజుల పాటు బాలాంజనేయస్వామికి ఐదు రోజుల పాటు అభిషేకం నిర్వహించనున్నారు. అదేవిధంగా నాదనీరాజనం వేదిక, ఆకాశగంగ, జపాలి ప్రాంతాల్లో ధార్మికోపన్యాసాలు, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జపాలి శ్రీ ఆంజనేయస్వామివారి ఆలయంలో మొదటి సారిగా మాల్ పూరి ప్రసాదాన్ని విక్రయిస్తున్నట్లు హథీరాంజీ మఠం పరిపాలన అధికారి శ్రీ రమేష్ తెలిపారు. అలాగే శ్రీవారి ఆలయానికి ఎదురుగానున్న శ్రీ బేడి ఆంజనేయ స్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. మొదటి ఘాట్‌రోడ్డులోని ఏడవమైలు వద్ద ఉన్న శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి నిలువెత్తు విగ్రహానికి మధ్యాహ్నం ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమాల్లో హథీరాంజీ మఠం మహంతు ఓం ప్రకాష్ దాస్‌జీ, వైఖానస ఆగమసలహాదారు మోహనరంగాచార్యులు, పారుపత్తేదారు తులసీ ప్రసాద్, డిప్యూటీ ఈవోలు లోకనాథం, సెల్వం పాల్గొన్నారు. కాగా, ఆదివారం ధర్మగిరి వేద పాఠశాలలో సంపూర్ణ సుందరకాండ అఖండ పారాయణం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది.



జపాలి శ్రీఆంజనేయ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

వీరాంజనేయుడిని దర్శించుకున్న శ్రీస్వాత్మానందేంద్ర

నగరంపాలెం: పాతగుంటూరులోని విశాఖ శ్రీ శారదాపీఠం పరిధిలోని శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న హనుమజ్జయంతి ఉత్సవాలు శనివారం ఐదో రోజు వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం విశాఖ శ్రీశారదాపీఠం ఉత్తరాధికారి శ్రీస్వాత్మానందేంద్ర సరస్వతి పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. శివకేశవ రూపమైన శ్రీవీరాంజనేయ స్వామిని దర్శించుకోవడం పూర్వజన్మ పుణ్యమని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కొప్పురావూరి బాబూరావు, కార్యదర్శి కాసుల సాంబశివరావు పాల్గొన్నారు.



స్వామి వారికి హారతిస్తున్న విశాఖ శ్రీశారదాపీఠం ఉత్తరాధికారి శ్రీస్వాత్మానందేంద్ర సరస్వతి

సీఎంఆర్ ఎకో కర్మాగారం కార్మికులకు అస్వస్థత

ప్రమాదకరమైన రసాయనాలు కలిసిన గాలి పీల్చడమే కారణం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులు

ఏర్పేడు(తిరుపతి జిల్లా): ఏర్పేడు మండలం చింతలపాలెం పరిధిలోని సీఎంఆర్ ఎకో అల్యూమినియం కర్మాగారంలో శనివారం ప్రమాదకరమైన రసాయనాల వాసన పీల్చి 36మందికి పైగా కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. బాధితులు తెలిపిన మేరకు వివరాలు.. సీఎంఆర్ ఎకో అల్యూమినియం కర్మాగారంలో ఇనుము, ఇతర వ్యర్థాలను రసాయనాల సహాయంతో కరిగించి అల్యూమినియం ముద్దలను తయారుచేస్తారు. యథావిధిగా కార్మికులు శనివారం పని చేస్తుండగా, ఒక్కసారిగా చెడు రసాయనాల వాసన వచ్చింది. ఆ గాలిని కార్మికులు పీల్చడంతో అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే కర్మాగారం యాజమాన్యం 108 అంబులెన్స్‌లు, పలు ప్రైవేట్ వాహనాల్లో రేణిగుంటలోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కార్మికులు కోలుకున్నట్లు వైద్యులు చెప్పారు. ప్రస్తుతం 28మంది కార్మికులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయంపై కర్మాగారం హెచ్‌ఆర్ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా... రసాయనాల వాసన పీల్చడంతోనే కార్మికులు అస్వస్థతకు గురయ్యారని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, కార్మికులకు అస్వస్థత గురించి తెలిసి అక్కడికి వెళ్లిన తహసీల్దారు ఉదయ్‌భాస్కర్‌రాజు, పలువురు విలేకరులను సీఎంఆర్ ఎకో అల్యూమినియం కర్మాగారం లోపలికి అనుమతించలేదు. కర్మాగారంలో ఎలాంటి ప్రమాదం జరగలేదని తహసీల్దారుకు చెప్పడంతో ఆయన వెళ్లిపోయారు.

దేవస్థానం, అటవీ శాఖ మధ్య సరిహద్దు చిచ్చు!

శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న టోల్‌గేట్, డార్మెటరీలు తమ శాఖ పరిధిలోవి అంటున్న అటవీశాఖ

హద్దుల ఏర్పాటు కోసం వాటి సమీపంలో గుంతల తవ్వకాలు • పోలీస్‌స్టేషన్ చేరిన పంచాయితీ

శ్రీశైలం: శ్రీశైల దేవస్థానం, అటవీ శాఖ మధ్య సరిహద్దు చిచ్చు రేగింది. గతేడాది దేవస్థానం వారు ఎక్కడ ఏ పనులు చేపట్టినా అటవీ శాఖ వారు తమ పరిధి అని గొడవ పడుతుండటంతో ఈ సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టడానికి ఉన్నత స్థాయి కమిటీ సమావేశం జరిగింది. అప్పుడు విజయవాడలో జరిగిన సమావేశంలో దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రెవెన్యూ, దేవదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ కరికాల వలవన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి, ఆ శాఖ కమిషనర్ సత్యనారాయణ, అటవీ శాఖ సీసీఎఫ్ మధుసూదన్‌రెడ్డి తదితరులు సరిహద్దులను నిర్ణయిస్తూ ప్లాన్ రూపొందించారు. అందులో అధికారులందరూ సంతకాలు చేశారు. శ్రీశైలానికి సంబంధించి 4,900 ఎకరాలు స్థలం ఉందని, అందులో 900 ఎకరాల డ్యామ్ నిర్మాణ సమయంలో మునిగిపోయి ఉందని గుర్తించారు. దీనితో పాటు ఎవరి హద్దులో వారు ఉండాలని, గొడవలకు పోవొద్దని నిర్ణయించినట్లు ప్రకటించారు. అయితే అటవీ శాఖలో ఉన్న అధికారులు మరో ప్రాంతానికి బదిలీ కావడంతో కొత్తగా శ్రీశైలానికి బదిలీపై వచ్చిన ఎఫ్‌డీ, డీఎఫ్‌వో స్థానిక రేంజ్ ఆఫీసర్ ఉన్నత అధికారులను తప్పుదారి పట్టించారని ఆరోపణలున్నాయి. దీంతో కొత్తగా వచ్చిన ఎఫ్‌డీ, డీఎఫ్‌వోలు దేవస్థానానికి 100 ఎకరాలు మాత్రమే ఉందన్న కొత్త వాదన తెరపైకి తెచ్చారు. దీంతో దేవస్థానం–అటవీ శాఖ మధ్య విభేదాలు తలెత్తాయి. కాగా దేవస్థానం పరిధిలో 50 ఏళ్లుగా నిర్వహిస్తున్న టోల్‌గేట్ అటవీ శాఖ పరిధిలో ఉందంటూ శుక్రవారం మధ్యాహ్నం రోడ్డు మధ్యలో గుంతలు తవ్వడం ప్రారంభించారు. అలాగే దేవస్థానం నిర్వహిస్తున్న డార్మెటరీ కూడా అటవీ శాఖ కిందికే వస్తుందని, అక్కడా తవ్వకాలు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఈవో పెద్దిరాజు, రెవెన్యూ ఏఈవో మల్లికార్జున రెడ్డి, పర్యవేక్షకులు శివప్రసాద్, దేవస్థానం సీఎస్‌వో అయ్యన్న, సంబంధిత సిబ్బందిని పంపించి ఎఫ్‌ఆర్‌వో నరసింహులు చేస్తున్న పనిని తాత్కాలికంగా నిలుపుదల చేయించారు. శనివారం మధ్యాహ్నం తిరిగి టోల్‌గేట్ దాటాక పిల్లర్ల నిర్మాణానికి అటవీ శాఖ వారు గుంతలు తవ్వుతున్నారు.. అని తెలుసుకుని రెవెన్యూ అధికారులు, సీఎస్‌వో సిబ్బంది అక్కడికి చేరుకుని భక్తులకు ఇబ్బంది కలిగించేలా దేవస్థానం ఆస్తులను ధ్వంసం చేస్తూ గుంతలు తవ్వడంపై అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ నరసింహులును ప్రశ్నిస్తూ, స్థానిక సీఐకి సమాచారం అందించారు.



పొక్లెయిన్‌తో టోల్‌గేట్ సమీపంలో గుంతలు తవ్వుతున్న అటవీ శాఖ

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..

ప్రస్తుతం క్షేత్ర పరిధిలో నిర్మించిన డార్మెటరీ, దేవస్థానం టోల్‌గేట్ అటవీ శాఖ పరిధిలోకి వస్తుందని, అందుకే ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాల మేరకు టోల్‌గేట్, నందీశ్వర డార్మెటరీల వద్ద సరిహద్దు నిర్మాణాల కోసం గుంతలను తవ్వి పిల్లర్లను ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నామని ఎఫ్‌ఆర్‌వో నరసింహులు అన్నారు. డీఎఫ్‌వో సూచనల మేరకు నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు సమర్పిస్తామని, అనంతరం దేవస్థానంపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేస్తామని చెప్పారు.

15 రోజుల్లో నిర్ణయించుకోండి..

సరిహద్దుల సమస్య ప్రభుత్వంలోని దేవదాయ–అటవీ శాఖకు సంబంధించి రెండు ప్రభుత్వ విభాగాలకు సంబంధించింది కాబట్టి 15 రోజుల్లోగా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని సీఐ ప్రసాదరావు.. దేవస్థానం సహాయ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఏఈవోలకు సూచించారు. దేవస్థానం వారికి నోటీసులు జారీ చేశామని ఎఫ్‌ఆర్‌వో చెబుతుండగా, తమకు నోటీసులు అందలేదని దేవస్థానం అధికారులు సీఐకు తెలిపారు. ప్రస్తుతానికి ఎలక్షన్ కోడ్ ఉన్నందున అటు దేవస్థానం, ఇటు అటవీ శాఖ సంయమనం పాటించి ఒక నిర్ణయానికి రావాల్సిందిగా ఇరువర్గాలకు సూచించారు. లేకుంటే దేవస్థానం, అటవీ శాఖ నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా

తప్పిన పెనుప్రమాదం



బోల్తా పడిన ట్రావెల్స్ బస్సు

చిలకలూరిపేట టౌన్: డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా శనివారం ఉదయం ఓ ప్రైవేట్ బస్సు బోల్తా పడిన ఘటన పల్నాడు జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... హైదరాబాద్ నుంచి కందుకూరుకు 40 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు శనివారం ఉదయం 7 గంటల సమయంలో పల్నాడు జిల్లా, లింగంగుంట్ల గ్రామ పరిధిలోని ఓ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని, బోల్తా పడింది. దీంతో బస్సులో ప్రయాణికులకు కొద్దిసేపటి వరకు ఏం జరిగిందో అర్థం కాలేదు. విషయం తెలిసి రక్షించాలంటూ కేకలు వేశారు. స్థానికులు వచ్చి ప్రయాణికులను బస్సు నుంచి బయటకు తీశారు. 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని స్వల్పంగా గాయపడ్డవారికి అక్కడికక్కడే ప్రాథమిక చికిత్స అందించారు. 11 మందిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కొద్దిపాటి గాయాలతో ప్రయాణికులు బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

'అసైన్డ్'పై తప్పుడు కథనాలు

ఆ రెండు పత్రికలు అబద్ధాల్ని ప్రచురించాయి • విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం: జిల్లాలో అసైన్డ్ భూముల వ్యవహారంపై ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నాయని జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున అన్నారు. నిజానిజాలు తెలుసుకోకుండా.. ప్రజల్ని తప్పుదారి పట్టించేలా ఆ కథనాలున్నాయని ఆయన తీవ్రంగా ఖండించారు. ఆనందపురం మండలం రామవరం గ్రామంలోని సర్వే నం.164–3లో 1.53 ఎకరాలు, సర్వే నం.169–2లో 0.87 ఎకరాల్ని జీఓ నం.596 ప్రకారం ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ ఇచ్చినట్లు కథనాలు వచ్చాయన్నారు. అయితే, 1977 రెవెన్యూ చట్టానికి లోబడే ప్రొసీడింగ్స్ మంజూరు చేశామని స్పష్టంచేశారు. అక్కిరెడ్డి బంగారయ్యకి సంబంధించి సర్వే నంబర్ 169–2లోని 0.87 ఎకరాలకు ఎలాంటి ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్ జారీచేయలేదన్నారు. అదేవిధంగా.. 2020లో భీమునిపట్నం మండలం అన్నవరం, భోగాపురం మండలం ముడసర్లోవ గ్రామాల్లో జరిగిన ల్యాండ్ పూలింగ్ విషయంలో ఈనాడు రాసిన కథనంపై కలెక్టర్ మండిపడ్డారు. వాస్తవానికి.. అన్నవరం గ్రామంలోని సెటిల్మెంట్ ఫెయిర్ అడంగల్, భీమునిపట్నం మండలం అన్నవరం గ్రామంలోని సర్వే నం.1/101.పరిధిలోని భూమి వర్గీకరణ, మొత్తం విస్తీర్ణం 199.28 ఎకరాలు గయాలుగా నమోదైందన్నారు. ఇందులో తాము అనుభవిస్తున్నట్లుగా సదరు రైతులు ఆధారాలతో తమకెలాంటి ఫిర్యాదులూ చేయలేదన్నారు. హక్కు పత్రాలు ఏమైనా ఉంటే సమర్పించాలని పలుమార్లు రైతుల్ని కోరినా ఇవ్వలేదన్నారు. నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా పట్టణ ప్రాంతంలో పేదలందరికీ ఇళ్ల స్థలాలిచ్చేందుకు ఆనందపురం, పద్మనాభం మండలాల్లో పూలింగ్ జరిపినప్పుడు హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే చేపట్టామని కలెక్టర్ స్పష్టంచేశారు. గ్రామసభలు సైతం నిర్వహించామని.. ఇందులో భాగంగానే 2019 నవంబర్ 28న ఎంజాయ్‌మెంట్ సర్వేచేసి రైతుల సమ్మతితోనే భూ సమీకరణ చేసుకునేందుకు అదే నెల 30న ఫారం–1 నోటీసులు సైతం జారీచేసినట్లు ఆయన వివరించారు. ఈ సమయంలో ఎలాంటి అభ్యంతరాలు రాలేదనీ, దానికనుగుణంగా.. సమీకరణ చేపట్టామన్నారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా తుదిదశలో ఉందని.. ఎవరైనా రైతులు మిగిలి ఉంటే.. తగిన డీ-పట్టాలతో అధీకృత అధికారిని సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఒక్క రైతుకీ న్యాయం చేసేలా వ్యవహరించామే తప్ప.. ఈనాడు, ఆంధ్రజ్యోతిలో ప్రచురించినట్లుగా ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావివ్వలేదని కలెక్టర్ డా.మల్లికార్జున స్పష్టంచేశారు.



తెలంగాణ

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు సర్వం సిద్ధం

- ఉదయం 9.30 గంటలకు అమరవీరుల స్థూపం వద్ద సీఎం నివాళులు
- సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై ముగింపు వేడుకలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఈ వేడుకలకు సంబంధించిన షెడ్యూల్, ఇతర వివరాలను రాష్ట్ర సమాచారశాఖ కమిషనర్ హనుమంతరావు శనివారం వెల్లడించారు. ఆదివారం ఉదయం 9.30 గంటలకు గన్‌పార్క్ వద్ద మొదలై.. రాత్రి 9 గంటలకు ట్యాంక్‌బండ్‌పై ముగుస్తాయని తెలిపారు. ఉదయం 9.30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్క్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్దకు చేరుకుని, నివాళులర్పిస్తారు. ఆ తర్వాత పరేడ్ గ్రౌండ్స్‌కు చేరుకుని, 10.00 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం సాయుధ బలగాల కవాతు, గౌరవ వందనాలుంటాయి. 10.35కి 'జయ జయహే తెలంగాణ' రాష్ట్ర గీతాన్ని సీఎం ఆవిష్కరిస్తారు. 10.38కి సోనియా గాంధీ హాజరైతే ఆమె తొలుత ప్రసంగిస్తారు. తర్వాత సీఎం రేవంత్ ప్రసంగం ఉంటుంది. సోనియా రాకుంటే నేరుగా సీఎం ప్రసంగిస్తారు. 11.08 గంటలకు పోలీసు, ఉత్తమ కాంటింజెంట్ల అవార్డుల ప్రదానం జరుగుతుంది. అలాగే సాయంత్రం 6.50 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి ట్యాంక్‌బండ్‌కు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లను సందర్శిస్తారు. 7.20కి కార్నివాల్ మొదలవుతుంది. 8.30కి ఫ్లాగ్ వాక్.. జయ జయహే తెలంగాణ గేయం 13.5 నిమిషాల పూర్తి వెర్షన్‌ను విడుదల చేస్తారు. 8.44 గంటలకు గేయ రచయిత అందెశ్రీ , సంగీత దర్శకుడు కీరవాణికి సన్మానం, అనంతరం 9.00 గంటలకు ట్యాంక్‌బండ్‌పై కార్యక్రమాన్ని ముగిస్తారు. ఈ సందర్భంగా ట్యాంక్‌బండ్‌ను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఏర్పాట్లను మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు తదితరులు పరిశీలించారు.

భారీ మెజార్టీతో ఎన్డీఏ హ్యాట్రిక్

ఎగ్జిట్ పోల్స్ అంచనా

- ఎన్డీఏకు 350 నుంచి 400
- ఇండియా కూటమికి 200లోపే
- కాంగ్రెస్ 40 నుంచి 70కు పరిమితం



న్యూఢిల్లీ: కేంద్రంలో పాలక ఎన్డీఏ కూటమిదే మళ్లీ అధికారమని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ పేర్కొన్నాయి. భారీ మెజారిటీతో కూటమి హ్యాట్రిక్ కొట్టడం, నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ప్రధాని కావడం ఖాయమని అభిప్రాయపడ్డాయి. శనివారం సాయంత్రం సార్వత్రిక ఎన్నికల తుది విడత పోలింగ్ ముగుస్తూనే ఎగ్జిట్ పోల్స్ వెల్లువెత్తాయి. గుజరాత్, మధ్యప్రదేశ్‌ల్లో మరోసారి బీజేపీ క్లీన్‌స్వీప్ చేస్తుందని వాటిలో చాలావరకు పేర్కొన్నాయి. కర్ణాటకలో కూడా బీజేపీ హవాయే కొనసాగుతుందని, పశ్చిమబెంగాల్లో మరింతగా చొచ్చుకుపోతుందని వెల్లడించడం విశేషం. బిహార్, రాజస్తాన్, హరియాణాల్లో మాత్రం ఎన్డీఏకు సీట్లు కాస్త తగ్గుతాయని అంచనా వేశాయి. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. విపక్షాల అవకాశవాద రాజకీయాలను జనం పూర్తిగా తిరస్కరించారన్నారు. వాస్తవ ఫలితాల్లో తమకు ఎగ్జిట్ పోల్స్ అంచనాలను మించి వస్తాయని ధీమా వెలిబుచ్చారు. కాంగ్రెస్ మాత్రం ఎగ్జిట్ పోల్స్‌ను మోదీ ప్రభావితం చేశారని ఆరోపించింది. వాస్తవ ఫలితాలు చాలా భిన్నంగా రాను న్నాయని విశ్వాసం వెలిబుచ్చింది. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెలువడ్డ నేపథ్యంలో ఇప్పుడిక అందరి కళ్లూ జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు జరిగాక రాబోయే అసలు ఫలితాలపైనే కేంద్రీకృతమయ్యాయి.

ఏ సర్వే ఏం చెప్పింది...?

ఇండియాటుడే–మై యాక్సిస్ ఎగ్జిట్ పోల్ ఎన్డీఏకు 361 నుంచి 401 స్థానాలిచ్చింది. ఇండియా కూటమికి 131 నుంచి గరిష్ఠంగా 166 రావచ్చని తెలిపింది. ఎన్డీఏకు 368 దాకా వస్తాయని రిపబ్లిక్ భారత్–మార్టైజ్ సర్వే పేర్కొంది. ఇండియా కూటమికి 133, ఇతరులకు 48 రావచ్చని తెలిపింది. ఎన్డీఏకు 392 దాకా, ఇండియాకు 161, ఇతరులకు 20 దాకా రావచ్చని జన్ కీ బాత్ అభిప్రాయపడింది. ఎన్డీఏకు బీజేపీ లక్ష్యంగా పెట్టుకున్న మేరకు 401 స్థానాలు దక్కుతాయని ఇండియా టీవీ–సీఎన్ఎక్స్ అంచనా వేయడం విశేషం. ఇండియా కూటమికి 139, ఇతరులకు 38 స్థానాలు రావచ్చని తెలిపింది. టుడేస్ చాణక్య కూడా కూడా ఎన్డీఏకు 385 నుంచి ఏకంగా 415 సీట్లిచ్చింది! ఇండియా కూటమి 96 నుంచి 118 మధ్య సాధిస్తుందని పేర్కొంది. న్యూస్ నేషన్ ఎన్డీఏకు 378, ఇండియా కూటమికి 169 స్థానాలిచ్చింది. దైనిక్ భాస్కర్ ఎన్డీఏ కూటమికి 350 దాకా, ఇండియా కూటమికి గరిష్ఠంగా 201, ఇతరులకు 49 సీట్లిచ్చింది. రిపబ్లిక్ టీవీ సర్వేలో ఎన్డీఏకు 359, ఇండియాకు 154, ఇతరులకు 30 స్థానాలొచ్చాయి. ఏబీపీ న్యూస్–సీ ఓటర్ ఎన్డీఏకు 353–383, ఇండియాకు 152 నుంచి 182 సీట్లిచ్చింది. ఎన్డీఏకు 371, ఇండియాకు 125 రావచ్చని ఇండియా న్యూస్ పేర్కొంది. టైమ్స్ నౌ–ఈటీజీ సర్వే ఎన్డీఏకు 358, ఇండియా కూటమికి 152 స్థానాలిచ్చింది.

2019లో ఏం జరిగింది?

2019 లోక్‌సభ ఎన్నికల్లో కూడా మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ ఎన్డీఏ గెలుస్తుందనే జోస్యం చెప్పాయి. మొత్తం 13 ఎగ్జిట్ పోల్స్ సగటును చూస్తే ఎన్డీఏకు 306, యూపీఏకు 120 సీట్లొస్తాయని పేర్కొన్నాయి. చివరికి ఎన్డీఏకు 353 స్థానాలు రాగా యూపీఏ కేవలం 93 సీట్లతో సరిపెట్టుకుంది. బీజేపీకి సొంతంగానే 303 స్థానాలు రాగా కాంగ్రెస్ కేవలం 53 సీట్లు నెగ్గింది.

రాష్ట్రాల్లో ఇలా...

కేంద్రంలో అధికార సాధనకు అత్యంత కీలక రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌పై బీజేపీ మరోసారి పట్టు నిలుపుకుంటోందని సర్వేలన్నీ తెలిపాయి. బీజేపీకి యూపీలో ఏకంగా 67 సీట్ల దాకా రావచ్చని ఇండియాటుడే వెల్లడించింది. సమాజ్‌వాదీ, కాంగ్రెస్ సింగిల్ డిజిట్లకే పరిమితమవుతాయని తెలిపింది. కర్నాటకలో ఈసారి కూడా బీజేపీకి 23, భాగస్వామి జేడీ(యూ)కు 3 సీట్లు వస్తాయని తెలిపింది. ఇక పశ్చిమబెంగాల్లోనైతే పాలక తృణమూల్ కాంగ్రెస్‌ను తోసిరాజని 23 నుంచి 27 స్థానాలతో బీజేపీ తొలిసారిగా రాష్ట్రంలో అతి పెద్ద పార్టీగా అవతరించనుందని ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి. ఇండియాటుడే అయితే బెంగాల్లో బీజేపీకి 30 పైచిలుకు, తృణమూల్‌కు 11 నుంచి 12 స్థానాలివ్వడం విశేషం. కీలకమైన మహారాష్ట్రలో ఎన్డీఏ కూటమికి సీట్లు 2019తో పోలిస్తే కాస్త తగ్గి 30 నుంచి 32 దాకా రావచ్చని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. సర్వత్రా ఆసక్తి నెలకొన్న ఒడిశాలోనైతే 21 సీట్లకు గాను ఎన్డీఏకు ఏకంగా 18 నుంచి 20 వస్తాయని, అధికార బిజూ జనతాదళ్ ఒకట్రెండు సీట్లకు మించబోదని ఇండియాటుడే పేర్కొనడం విశేషం. దక్షిణాదిన కేరళలోనూ తొలిసారి కమలవికాసం ఖాయమని ఎగ్జిట్ పోల్స్ పేర్కొన్నాయి. అక్కడ బీజేపీకి 3 సీట్ల దాకా ఖాయమని పేర్కొన్నాయి. లెఫ్ట్ ఫ్రంట్ కుదేలవుతుందని, కాంగ్రెస్‌కే మెజారిటీ సీట్లు వస్తాయని తెలిపాయి. రాజస్తాన్, బిహార్లలో ఎన్డీఏకు ఐదారు స్థానాలు తగ్గి ఆ మేరకు ఇండియా కూటమికి పెరగవచ్చని పేర్కొన్నాయి. ఏపీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడమే గాక మెజారిటీ లోక్‌సభ స్థానాలూ నెగ్గుతుందని కొన్ని ఎగ్జిట్ పోల్స్, ఎన్డీఏ కూటమిదే విజయమని మరి కొన్ని పేర్కొన్నాయి. తెలంగాణలో బీజేపీకే ఎక్కువ లోక్‌సభ స్థానాలొస్తాయని తెలిపాయి.



శనివారం కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్ వద్ద ప్రధాని మోదీ

ముగిసిన ప్రధాని మోదీ ధ్యానం

సాక్షి, చెన్నై: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధ్యానం విరమించారు. తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారిలో వివేకానంద రాక్ మెమోరియల్ ధ్యాన మండపంలో గురువారం సాయంత్రం మొదలైన మోదీ ధ్యానం శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకు ముగిసింది. ఆయన దాదాపు 45 గంటలపాటు ధ్యానంలో నిమగ్నమయ్యారు. రెండు రోజులపాటు కేవలం ద్రవాహారం తీసుకున్నారు. ధ్యానం ముగిసిన తర్వాత మోదీ రాక్ మెమోరియల్ నుంచి పడవలో అక్కడికి సమీపంలోని తమిళ కవి తిరువళ్లువర్ విగ్రహం కాంప్లెక్స్ వద్దకు చేరుకున్నారు. తిరువళ్లువర్ విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తీరానికి చేరుకున్న మోదీ హెలికాప్టర్‌లో తిరువనంతపురం బయలుదేరివెళ్లారు. అక్కడి నుంచి ఢిల్లీకి చేరుకున్నారు.

మరోసారి ఎన్డీఏకే పట్టం

'ఎక్స్'లో ప్రధానమంత్రి మోదీ

న్యూఢిల్లీ: కేంద్రంలో మరోసారి ఎన్డీఏ ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టబోతున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. అవకాశవాద 'ఇండియా' కూటమిని ప్రజలు నమ్మలేదని పేర్కొన్నారు. విపక్ష కూటమి తిరోగమన రాజకీయాలను జనం తిరస్కరించారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆఖరి విడత పోలింగ్ పూర్తయిన నేపథ్యంలో ప్రధాని మోదీ శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. తమ ప్రభుత్వ ట్రాక్ రికార్డును ప్రజలు చూశారని, తమకు మళ్లీ అధికారం అప్పగించబోతున్నారని వెల్లడించారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకొచ్చామని తెలిపారు. తమ ప్రభుత్వం అమలు చేసిన సంస్కరణలతో మన దేశం ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారిందన్నారు. మన ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రజల క్రియాశీల భాగస్వామ్యమే మూలస్తంభమని ఉద్ఘాటించారు. ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నవారికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు తోడ్పడిన భద్రతా దళాలకు సైతం ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు.

ఇండియా కూటమికి 295 సీట్లకు పైనే

- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధీమా
- ఖర్గే నివాసంలో 'ఇండియా' కూటమి నేతల భేటీ



సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమికి 295కుపైగా స్థానాలు కచ్చితంగా లభిస్తాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధీమా వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయాలు తెలుసున్న తర్వాతే ఈ సంఖ్య చెబుతున్నామని వెల్లడించారు. తమది ప్రజల సర్వే అని, బీజేపీది ప్రభుత్వ సర్వే అని చెప్పారు. శనివారం ఢిల్లీలో ఖర్గే నివాసంలో ఇండియా కూటమి పార్టీల అగ్రనేతలు సమావేశమయ్యారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫలితాల సరళి, ఆ తర్వాత అనుసరించాల్సిన వ్యూహాలపై రెండున్నర గంటలపాటు విస్తృతంగా చర్చించారు. ఈ భేటీలో మల్లికార్జున ఖర్గేతోపాటు కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా, కె.సి.వేణుగోపాల్ పాల్గొన్నారు. ఎన్సీపీ(ఎస్పీ) అధినేత శరద్ పవార్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ ముఖ్య నాయకుడు తేజస్వీ యాదవ్, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు అరవింద్ కేజ్రీవాల్, భగవంత్ మాన్, రాఘవ్ చద్దా, జేఎంఎం నాయకులు చంపయ్ సోరెన్, కల్పనా సోరెన్, డీఎంకే నేత టి.ఆర్.బాలు, జమ్మూకశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ అగ్రనేత ఫరూక్ అబ్దుల్లా, సీపీఐ నాయకుడు డి.రాజా, సీపీఐ(ఎంఎల్) నేత దీపాంకర్ భట్టాచార్య తదితరులు హాజరయ్యారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తమిళనాడు సీఎం స్టాలిన్, పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ హాజరు కాలేదు. సమావేశం అనంతరం ఖర్గే మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ఫలితాలపై ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు బీజేపీ కుట్ర పన్నిందని విమర్శించారు. ఫలితాల పేరిట బీజేపీ మీడియా మిత్రులు తప్పుడు అంకెలను ప్రదర్శిస్తున్నారని చెప్పారు. ఈ ఎన్నికల్లో బీజేపీ గెలిచే అవకాశాలు ఎంతమాత్రం లేవని స్పష్టం చేశారు. ఈ నెల 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొత్తం పూర్తయ్యేదాకా కౌంటింగ్ హాళ్ల నుంచి బయటకు వెళ్లొద్దంటూ తమ పార్టీ కార్యకర్తలను ఆదేశించామని ఖర్గే తెలిపారు. ఇండియా కూటమిలో తామంతా ఐక్యంగా ఉన్నామని, తమను విభజించే ప్రయత్నం చేయవద్దని మీడియాను కోరారు.

బీజేపీ 220 సీట్లకే పరిమితం: కేజ్రీవాల్

ఈ ఎన్నికల్లో ఇండియా కూటమికి 295కుపైగా, బీజేపీకి 220 సీట్లు వస్తాయని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు మొత్తం 235 స్థానాలు వచ్చే అవకాశం ఉందన్నారు. కేంద్రంలో బలమైన ప్రభుత్వ ఏర్పాటు దిశగా తమ కూటమి ముందుకు సాగుతోందని తెలిపారు.

మళ్లీ వాయిదా పడిన బోయింగ్ రోదసీ యాత్ర

కేప్ కనావెరల్: భారత సంతతికి చెందిన అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్ రోదసీ యాత్ర మరోసారి ఆగింది. బోయింగ్‌కు చెందిన స్టార్‌లైనర్ క్యాప్సూల్‌లో రోదసీలోకి వ్యోమగాములు వెళ్లేందుకు ఉద్దేశించిన ప్రయోగం శనివారం చివరినిమిషంలో వాయిదాపడింది. అమెరికాలోని కేప్ కనావెరల్ స్పేస్ ఫోర్స్ స్టేషన్ నుంచి నింగిలోకి దూసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్న అట్లాస్ 5 రాకెట్ కౌంట్‌డౌన్‌ను ఇంకా మూడు నిమిషాల 50 సెకన్లు ఉండగా కంప్యూటర్ ఆపేసింది. ప్రయోగం ఆపేయడానికి కారణాలు ఇంకా వెల్లడికాలేదు. మరో వ్యోమగామి బుచ్ విల్మోర్‌తో కలిసి సునీత అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)కు వెళ్లాల్సి ఉంది. ఆదివారంలోగా మరోసారి ప్రయోగానికి ప్రయత్నిస్తామని యునైటెడ్ లాంచ్ అలయన్స్ ఇంజనీర్ డిలియన్ రైస్ చెప్పారు. ప్రయోగం ఆగిపోవడంతో క్యాప్సూల్‌లోని సునీత, విల్మోర్‌లను టెక్నీషియన్లు సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.



ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రదేశంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్.. హిమాచల్‌ప్రదేశ్‌లోని తషిగంగ్ వద్ద బారులు తీరిన ఓటర్లు

ఏడో విడతలో 62 శాతం పోలింగ్

- 57 స్థానాలకు ముగిసిన ఓటింగ్
- బెంగాల్‌లో హింసాత్మక ఘటనలు
- చివరి విడతతో ముగిసిన సార్వత్రిక ఎన్నికలు

న్యూఢిల్లీ/కోల్‌కతా/దుమ్కా: ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య పండగగా పేరొందిన భారత సార్వత్రిక ఎన్నికల పర్వం శనివారంతో ముగిసింది. లోక్‌సభ ఎన్నికల్లో చివరిదైన ఏడో దశ పోలింగ్ శనివారం పూర్తయింది. శనివారం రాత్రి 11.50 గంటలకు అందిన సమాచారం మేరకు 62 శాతం పోలింగ్ నమోదైందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. నిర్ణీత పోలింగ్ సమయం ముగిసేలోపు క్యూ లైన్లలో నిల్చున్న వారిని ఓటింగ్‌కు అనుమతించారు. దీంతో పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశముంది. ఏడో దశలో చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతం సహా ఏడు రాష్ట్రాల్లోని 57 స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. మూడోసారి అధికారం చేపట్టాలని ఉవ్విళ్లూరుతున్న ప్రధాని మోదీ పోటీచేసిన వారణాసి నియోజకవర్గంలోనూ శనివారం పోలింగ్ నిర్వహించారు. పశ్చిమబెంగాల్‌లో అత్యధికంగా 73.47 శాతం పోలింగ్ నమోదైంది. తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ దక్షిణ కోల్‌కతాలోని భవానీపూర్ ప్రాంతంలోని మిత్ర ఇన్‌స్టిట్యూట్ స్కూల్ బూత్‌లో ఓటేశారు.

బేరామరీలో బాహాబాహీ

పశ్చిమబెంగాల్‌లో పలు చోట్ల ఘర్షణలు జరిగాయి. బసీర్‌హాట్ లోక్‌సభ నియోజకవర్గంలోని సందేశ్‌ఖాలీ పరిధిలోని బేరామరీలో అధికార తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు ఘర్షణకు దిగారు. భాంగర్‌లో టీఎంసీ, ఐఎస్ఎఫ్ మద్దతుదారులు ఒకరిపై ఒకరు నాటుబాంబులతో దాడిచేసుకున్నారు. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో పోలీసులు రంగంలోకి దిగి బాష్పవాయుగోళాలు ప్రయోగించారు. లాఠీచార్జ్ చేశారు. తర్వాత కొన్ని నాటుబాంబులను స్వాధీనం చేసుకున్నారు. బెంగాల్ నుంచి మధ్యాహ్నం రెండుగంటల్లోపు 1,900 ఫిర్యాదులు వచ్చాయని ఈసీ తెలిపింది. ఈవీఎంలు మొరాయించడం, బూత్‌లోకి రాకుండా ఓటర్లు, పోలింగ్ ఏజెంట్లను ప్రత్యర్థి పార్టీల కార్యకర్తలు అడ్డుకోవడం వంటి ఘటనలు జరిగాయని టీఎంసీ, బీజేపీ తదితర పార్టీలు ఫిర్యాదుచేశాయి.

రాష్ట్రం	పోలింగ్ శాతం
పంజాబ్	59.92
ఉత్తరప్రదేశ్	55.59
పశ్చిమబెంగాల్	73.47
బిహార్	51.92
ఒడిశా	70.67
హిమాచల్ ప్రదేశ్	69.87
జార్ఖండ్	70.66
చండీగఢ్	67.90

కుటుంబాన్ని మించిన కర్తవ్యం

80 ఏళ్ల తల్లి మరణం ఓవైపు, తప్పక ఓటేయాల్సిన బాధ్యత మరోవైపు ఉన్నా తొలుత ఓటేసి కన్నతల్లికన్నా భరతమాతకు ఎక్కువ గౌరవం ఇచ్చారు ఒక వ్యక్తి. బిహార్‌లోని జెహనాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో దేవ్‌కులీ గ్రామంలో మిథిలేశ్ యాదవ్ తల్లి శనివారం కన్నుమూశారు. 'చనిపోయిన అమ్మ ఎలాగూ తిరిగిరాదు. అంత్యక్రియల్ని కొద్దిసేపు ఆపొచ్చు. కానీ పోలింగ్‌ను ఆపలేం. ఎన్నికలు మళ్లీ ఐదేళ్లదాకా రావు. అందుకే ఓటేశాక అంతిమయాత్ర చేపట్టాలని మా కుటుంబం మొత్తం నిర్ణయించుకున్నాం' అని మిథిలేశ్ చెప్పారు. ఓటేశాక వెంటనే ఆమె అంత్యక్రియలు నిర్వహించారు.

దక్షిణాఫ్రికాలో వచ్చేది సంకీర్ణమే!

మెజారిటీ మార్కు దాటలేకపోయిన ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ

జోహన్నెస్‌బర్గ్: వర్ణవివక్షపై పోరు తర్వాత నెల్సన్ మండేలా నేతృత్వంలో దక్షిణాఫ్రికాలో అధికారం చేపట్టి 30 ఏళ్లపాటు పాలించిన ది ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్(ఏఎన్‌సీ) పార్టీ తొలిసారిగా తక్కువ ఓట్లతో సరిపెట్టుకుంది. ఇటీవల ముగిసిన పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పోలైన ఓట్లలో ఇప్పటిదాకా 99.80 శాతం ఓట్లు లెక్కించారు. శనివారం అనధికారికంగా వెల్లడైన గణాంకాల ప్రకారం ఏఎన్‌సీకి 40 శాతానికిపైగా మాత్రమే ఓట్లు పడ్డాయి. తీవ్ర పేదరికం, అసమానతలకు నెలవైన దేశంలో గొప్ప మార్పు మొదలైందని విపక్షాలు ఆనందం వ్యక్తంచేశాయి. మిగతా పార్టీలకు ఇంతకంటే తక్కువ ఓట్లు పడ్డాయి. దీంతో ఏఎన్‌సీ ఇప్పటికీ అతిపెద్ద పార్టీగా ఉన్నప్పటికీ మెజారిటీ మార్కు(50 శాతానికి మించి ఓట్లు) దాటని కారణంగా మళ్లీ అధికారాన్ని కైవసం చేసుకోవాలంటే ఇతర పార్టీలతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాల్సిన పరిస్థితి తలెత్తింది. విపక్ష డెమొక్రటిక్ అలయన్స్(డీఏ)కు 21.72 శాతం, మాజీ దేశాధ్యక్షుడు జాకబ్ జూమా నేతృత్వంలోని అమ్‌కోంటో వీ సిజ్వే(ఎంకే) పార్టీకి 14 శాతం ఓట్లు పడ్డాయి.

నేడే అరుణాచల్, సిక్కిం అసెంబ్లీ ఫలితాలు

ఈటానగర్/గ్యాంగ్‌టక్: సార్వత్రిక ఎన్నికల ఫలితాలకు రెండు రోజుల ముందే అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడికానున్నాయి. ఆదివారం ఉదయం ఆరు గంటల కల్లా ఓట్ల లెక్కింపు మొదలయ్యేలా కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తిచేసింది. 60 స్థానాలున్న అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీలో ఇప్పటికే 10 చోట్ల బీజేపీ ఏకగ్రీవంగా గెలిచింది. మిగిలిన 50 స్థానాలకు ఓట్ల లెక్కింపు జరగనుంది. దీంతో ఈవీఎంలలో నిక్షిప్తమైన 133 మంది అభ్యర్థుల భవితవ్యం నేటితో తేలనుంది. తక్కువ స్థానాలు కావడంతో ఆదివారం మధ్యాహ్నంకల్లా తుది ఫలితాలు వెల్లడికానున్నాయని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్(సీఈఓ) పవన్‌కుమార్ సైన్ శనివారం చెప్పారు.

అరుణాచల్ ప్రదేశ్: 2019లో బలాబలాలు	
బీజేపీ	41
జేడీ(యూ)	7
ఎన్‌పీపీ	5
కాంగ్రెస్	4
పీపీఏ	1
స్వతంత్రులు	2

సిక్కింలోనూ..

సిక్కింలోని 32 అసెంబ్లీ స్థానాలకు ఆదివారం ఉదయం ఓట్ల లెక్కింపు మొదలుకానుంది. మరోసారి అధికారం చేపట్టాలని అధికార సిక్కిం క్రాంతికారి మోర్చా(ఎస్‌కేఎం) ఉవ్విళ్లూరుతుండగా ఎలాగైనా విజయం సాధించాలని సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్(ఎస్‌డీఎఫ్), బీజేపీ, కాంగ్రెస్, సిటిజెన్ యాక్షన్ పార్టీ–సిక్కిం ఆశపడుతున్నాయి. ఈసారి ఏప్రిల్ 19న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 80 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 146 మంది అభ్యర్థులు ఈసారి పోటీపడ్డారు.

2019లో బలాబలాలు	
సిక్కిం క్రాంతికారి మోర్చా	17
సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్	15

మెక్సికో పీఠంపై తొలిసారి మహిళ!

నేడే కీలక అధ్యక్ష ఎన్నికలు

- ప్రధాన అభ్యర్థులిద్దరూ మహిళలే


మెక్సికో. లాటిన్ అమెరికాలో రెండో అతి పెద్ద దేశం. పురుషాధిపత్య భావజాలానికి పెట్టింది పేరు. మహిళలపై హింస, హత్య, యాసిడ్ దాడులు నిత్యకృత్యం. మెక్సికోలో ఇదే అతి పెద్ద సమస్య కూడా. అలాంటి దేశంలో తొలిసారి ఓ మహిళ అధ్యక్ష పదవి చేపట్టనున్నారు! ఆదివారం జరిగే ఎన్నికల్లో అధ్యక్ష పదవితో పాటు 128 మంది సెనేటర్, 500 మంది కాంగ్రెస్ ప్రతినిధులతో పాటు దాదాపు 20 వేల స్థానిక సంస్థల స్థానాలకు కూడా ఎన్నికలు జరగనున్నాయి. ఈసారి పాలక, ప్రధాన సంకీర్ణాలు రెండింటి నుంచీ మహిళలే బరిలో ఉండటం విశేషం. పాలక 'మోరెనా' సంకీర్ణం తరఫున పోటీ చేస్తున్న క్లాడియా షేన్‌బామ్ గెలుపు ఖాయమేనని పరిశీలకులు చెబుతున్నారు. నేషనల్ యాక్షన్ పార్టీ సారథ్యంలోని విపక్ష కూటమి అభ్యర్థి సోచిల్ గాల్వెజ్‌పై ఆమె కనీసం 20 పాయింట్ల ఆధిక్యంలో ఉన్నట్టు అన్ని సర్వేల్లోనూ తేలింది. మహిళలపై మితిమీరిన హింసకు పెట్టింది పేరైన ఆ దేశంలో వారికి రాజకీయ ప్రాతినిధ్యం కూడా నానాటికీ బాగా పెరుగుతుండటం విశేషం. దిగువ సభ (కాంగ్రెస్)లో అన్ని పార్టీలూ మహిళలకు కనీసం 50 శాతం టికెట్లివ్వడాన్ని ఇప్పటికే తప్పనిసరి చేశారు. ఫలితంగా కాంగ్రెస్‌లో సగం మంది సభ్యులు మహిళలే ఉన్నారు. మెక్సికో జనాభా 13 కోట్లు కాగా దాదాపు 10 కోట్ల మంది ఓటర్లున్నారు. ఆదివారం పోలింగ్ ముగిశాక రాత్రికల్లా ఫలితాలు వెలవడే అవకాశముంది.

సోచిల్ గాల్వెజ్



61 ఏళ్ల గాల్వెజ్ సెనేట్ సభ్యురాలు. పారిశ్రామికవేత్త. ఎన్‌ఏపీ, పీఆర్ఐ, పీఏఎన్, ఆర్‌పీడీ సహా పలు పార్టీలతో కూడిన విపక్ష కూటమి తరఫున బరిలో ఉన్నారు. లోపెజ్ ప్రవేశపెట్టిన పెన్షన్ పథకం వంటివాటిని తాను కూడా కొనసాగిస్తానని చెబుతూ పలు వర్గాలను ఆకట్టుకున్నారు. దాంతోపాటు మధ్య, దిగువ తరగతి ప్రజల కోసం సార్వత్రిక సామాజిక రక్షణ వ్యవస్థ తెస్తానంటున్నారు. పోలీస్ వ్యవస్థను పటిష్టపరిచి నేరాలపై ఉక్కుపాదం మోపుతానని చెబుతున్నారు.

క్లాడియా షేన్‌బామ్



ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త. 2007లో నోబెల్ గ్రహీత. మెక్సికో సిటీ మాజీ మేయర్. గెలిస్తే తొలి అధ్యక్షురాలిగానే గాక యూదు మూలాలున్న తొలి వ్యక్తిగా కూడా రికార్డు సృష్టించే అవకాశముంది. అధ్యక్షుడు ఆంద్రెజ్ మాన్యుయెల్ లోపెజ్ అబ్రేడర్‌కున్న విశేషమైన జనాదరణ ఉన్నా రెండోసారి పదవి చేపట్టేందుకు మెక్సికో రాజ్యాంగ ప్రకారం అనుమతించని కారణంగా పాలక సంకీర్ణ అభ్యర్థిగా షేన్‌బామ్ బరిలో దిగారు. కనీస వేతనాలను రెట్టింపు చేయడం, సంక్షేమ కార్యక్రమాలకు నిధుల పెంపు, రైతులకు సబ్సిడీ, వర్సిటీ విద్యార్థులకు ప్రోత్సాహకాలు, నిరుద్యోగులకు భృతి వంటివి నేరుగా నగదు రూపంలో చెల్లించడం, సీనియర్ సిటిజన్లకు సార్వత్రిక పెన్షన్ సదుపాయం వంటివాటితో లోపెజ్ తన ఆరేళ్ల పదవీకాలంలో అందరి మన్ననలు పొందారు. ఇదంతా 61 ఏళ్ల షేన్‌బామ్‌కు బాగా కలిసి రానుంది. డ్రగ్ మాఫియా, వ్యవస్థీకృత నేరాలు మెక్సికో ఎదుర్కొంటున్న సమస్యల్లో ముఖ్యమైనవి. వీటి కట్టడికి లోపెజ్ పెద్దగా ప్రయత్నాలు చేయలేదన్న ఆరోపణలున్నాయి. తాను వాటిపైనా ప్రధానంగా దృష్టి సారిస్తానని ఆమె చెబుతున్నారు. లోపెజ్ సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే ఆయన ప్రభావానికి అతీతంగా పాలిస్తానంటున్నారు.

జార్జ్ అల్వారెజ్ మైనేజ్



రాజకీయాలకు కొత్త ముఖం. స్మాల్ సిటిజన్ మూవ్‌మెంట్ పార్టీ తరఫున బరిలో ఉన్నారు. నేరాలపై ఉక్కుపాదం మోపుతానని హామీ ఇచ్చారు. డ్రగ్స్‌ను నిర్మూలించడం అసాధ్యమని, వాటిని బాగా కట్టడి చేస్తానని చెబుతున్నారు. 38 ఏళ్ల మైనేజ్ ప్రతిపాదించిన పలు ఆర్థిక సంస్కరణలపై ప్రజల నుంచి మంచి స్పందన రావడం విశేషం. ఈసారి గెలవకపోయినా ముస్ముందు మెక్సికో రాజకీయాల్లో ఆయన ప్రబల శక్తిగా ఎదగడం ఖాయమంటున్నారు.

కేజ్రీవాల్ పిటిషన్‌పై తీర్పు 5కు వాయిదా

నేడు మళ్లీ తీహార్ జైలుకు కేజ్రీవాల్

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు ఊరట దక్కలేదు. అనారోగ్యంతో బాధపడుతున్న తనకు ఈ కేసులో మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు తీర్పును ఈ నెల 5వ తేదీకి రిజర్వ్ చేసింది. దీంతో కేజ్రీవాల్ ఆదివారం తీహార్ జైలులో లొంగిపోవాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడింది.

'అగ్నిపథ్'లో వివక్షను అడ్డుకోండి

రాష్ట్రపతి ముర్ముకు రాహుల్ లేఖ

న్యూఢిల్లీ: అగ్నిపథ్ పథకం అమలులో జోక్యం చేసుకుని అమర జవాన్ల కుటుంబాలకు జరుగుతున్న అన్యాయాన్ని అడ్డుకోవాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయమే అయినప్పటికీ జాతి భద్రతపై ప్రభావం కలిగించే ఈ అంశంపై సాయుధ బలగాల సుప్రీం కమాండర్‌గా ప్రత్యేక పరిస్థితుల్లో జోక్యం చేసుకోవచ్చన్నారు. ఈ మేరకు శనివారం రాహుల్ ఒక లేఖ రాశారు. దేశం కోసం జీవితాలనే త్యాగం చేస్తున్న అగ్నివీర్‌లకు మిగతా సైనికుల మాదిరిగానే ప్రయోజనాలను వర్తింపజేయాలని కోరారు.

సెన్సార్ల లోపం వల్లే ఎక్కువ ఉష్ణోగ్రతలు

నాగ్‌పూర్, ముంగేష్‌పుర్‌లో ఉష్ణోగ్రతలపై వాతావరణ శాఖ వివరణ

న్యూఢిల్లీ: మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో మే 30వ తేదీన నమోదైన 56, వాయవ్య ఢిల్లీలోని ముంగేష్‌పుర్‌లో మే 29వ తేదీన నమోదైన 52.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు తప్పు అని భారత వాతావరణ శాఖ శనివారం స్పష్టంచేసింది. మే 29న ముంగేష్‌పుర్‌లో వాస్తవ గరిష్ఠ ఉష్ణోగ్రత 45.2 ఉంటే సెన్సార్ దానిని 52.9 డిగ్రీల సెల్సియస్‌గా చూపించింది. ముంగేష్‌పుర్, నాగ్‌పూర్ స్టేషన్లలో ఉష్ణోగ్రతను లెక్కగట్టే సెన్సార్‌లలో లోపాలు తలెత్తడం వల్లే అసాధారణంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణ శాఖ వివరణ ఇచ్చింది. '' ఈ రెండు ఆటోమేటిక్ వెదర్ స్టేషన్(ఏడబ్ల్యూఎస్)లో బిగించిన సెన్సార్‌లను త్వరలోనే పరిశీలిస్తాం. ఢిల్లీలోని ఇతర ఆటోమేటిక్, మాన్యువల్ అబ్జర్వేటరీల్లో నమోదైన ఉష్ణోగ్రతలతో పోలిస్తే ముంగేష్‌పుర్ ఏడబ్ల్యూఎస్‌లో అసాధారణ ఉష్ణోగ్రత నమోదైంది. అక్కడికి ఇప్పటికే నిపుణుల బృందాన్ని పంపించాం. ముంగేష్‌పుర్‌లో స్టాండర్డ్ ఇన్‌స్టుమెంట్ నమోదుచేసిన దానికంటే ఈ సెన్సార్ మూడు డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను ఎక్కువ చూపించింది. లోపాలున్న సెన్సార్‌ను త్వరలోనే మార్చేస్తాం'' అని భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర చెప్పారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
ఆదివారం । 2 । జూన్ । 2024


శనివారం సాయంత్రం బెంగళూరులో పలుచోట్ల వర్షం కురిసింది. గాలివానకు యశవంతపురలో కూలిపోయిన ఓ చెట్టు

గట్టెక్కించని గ్యారంటీలు?

- లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అత్తెసరు ఫలితాలే
- కోడై కూసిన ఎగ్జిట్ పోల్స్
- భారీగా పుంజుకొన్న బీజేపీ



సాక్షి, బెంగళూరు: దేశంలో అందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఎగ్జిట్ పోల్స్ విడుదల కాగా, కన్నడనాట అనూహ్య ఫలితాలు వచ్చేలా కనిపిస్తోంది. మొత్తం 28 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు కర్ణాటకలో జరిగాయి. దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ ఏం చెప్పాయంటే.. బీజేపీ అత్యధిక లోక్‌సభ స్థానాలను గెలుస్తోందని.

కాంగ్రెస్‌కు 3 నుంచి 7 వరకు

- అధికార కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ రేసులో వెనుకంజ వేసే అవకాశం ఉంది. హస్తం పార్టీ 3 నుంచి 7 స్థానాలను మాత్రమే గెలవవచ్చని ఎగ్జిట్ పోల్స్ పేర్కొన్నాయి.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హవా మరోసారి ప్రభావం చూపనున్నట్లు తెలుస్తోంది. బీజేపీ-జేడీఎస్ మైత్రి కూటమి సుమారు 20 నుంచి 24 స్థానాలను చేజిక్కించుకుంటుందని ఎగ్జిట్ పోల్స్ చాటుతున్నాయి.
- ప్రచారంలో వివిధ దఫాల్లో ప్రధాని మోదీ సుడిగాలి పర్యటనలు చేసి ప్రచార సభల్లో పాల్గొన్నారు. తోడుగా కేంద్ర మంత్రులు, రాష్ట్ర నాయకులు రోడ్ షోలు, సభలు విస్తృతంగా నిర్వహించారు.


గ్యారంటీలు ఏమయ్యాయి?

ఈ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి షాక్ ఇచ్చాయి. మహిళలకు ఉచిత బస్సులు, నెలకు రూ.2 వేలు, అన్నభాగ్య, ఉచిత కరెంటు పథకాలతో ఓట్లు మొత్తం కొట్టేద్దామని ఆశలు పెంచుకున్నారు. కానీ ఈ ఫలితాలు నిరాశలో ముంచివేశాయి. కాకపోతే గత ఎన్నికల్లో కంటే ఎక్కువగా కనీసం 7 సీట్ల వరకూ గెలవవచ్చని చెప్పడం పార్టీకి ఊరటనిస్తోంది. అయినా కూడా 4వ తేదీ అసలైన ఫలితాలపై ఆశలు పెట్టుకున్నారు.

ఇండియా టుడే ఎ.పోల్స్
బీజేపీ 18-22
కాంగ్రెస్ 04-08
జేడీఎస్ 02-03

టీవీ 9
బీజేపీ 18
కాంగ్రెస్ 08
జేడీఎస్ 02

పోల్ హబ్
బీజేపీ 21-24
కాంగ్రెస్ 03-07
జేడీఎస్ 01-02
ఇతరులు

ఆజ్‌తక్..
బీజేపీ 20-22
కాంగ్రెస్ 03-05
జేడీఎస్ 02-03

ఇండియా టీవీ
బీజేపీ 18-22
కాంగ్రెస్ 04-08
జేడీఎస్ 01-03

జన్‌కీ బాత్
బీజేపీ 18-22
కాంగ్రెస్ 04-08
జేడీఎస్ 01-03

సీఎన్ఎన్
బీజేపీ 23-26
కాంగ్రెస్ 3-7
జేడీఎస్ 00

న్యూస్ 18
బీజేపీ 21-24
కాంగ్రెస్ 03-07
జేడీఎస్ 01-02


పనిచేయని కాంగ్రెస్ మ్యాజిక్?


గ్యారంటీలు పొంది, బీజేపీకి ఓటు వేసిన మహిళలు

కోర్టుకు హాజరైన సీఎం, డీసీఎం

- పరువు నష్టం కేసులో బెయిలు

శివాజీనగర: గత శాసనసభ ఎన్నికల ప్రచారంలో అసత్య ఆరోపణలు చేశారని బీజేపీ దాఖలు చేసిన పరువు నష్టం కేసులో సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీ.కే.శివకుమార్‌కు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. అప్పటి బీజేపీ ప్రభుత్వం వివిధ ఉద్యోగాలకు రేటు ఫిక్స్ చేసిందని, కాంట్రాక్టుల్లో 40 శాతం కమీషన్ వసూలు చేస్తోందని కాంగ్రెర్ పార్టీ వివిధ పత్రికలు, టీవీల్లో ప్రకటనలు ఇచ్చింది. దీనిపై బీజేపీ నాయకులు పరువు నష్టం కేసు దాఖలు చేశారు. శనివారం నగరంలో ప్రజా ప్రతినిధుల కోర్టులో జరిగిన వాయిదాకు సీఎం, డీసీఎంలు హాజరయ్యారు. జడ్జి కే.ఎన్.శివకుమార్ విచారణ జరిపి ఇద్దరికీ బెయిల్ మంజూరు చేశారు. రాహుల్‌గాంధీ విచారణకు రావడం కుదరలేదని, మినహాయింపు ఇవ్వాలని రాహుల్ తరఫు న్యాయవాది విన్నవించారు. వాదనలు ఆలకించిన జడ్జి.. రాహుల్ బెయిలు తీర్పును ఆ తరువాత ప్రకటిస్తామని తెలిపారు. సీఎం, డీసీఎంల రాకతో కోర్టు పరిసరాల్లో సందడి నెలకొంది.


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం డీకేశి

బీజేపీ అవినీతిని రుజువు చేస్తాం: డీకే

శివాజీనగర: దేశంలోనే కర్ణాటక బీజేపీ అత్యంత అవినీతి పార్టీ, ఆ అవినీతిని బయటపెట్టి తమ శక్తి ఏమిటోనని చూపిస్తానని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అన్నారు. కోర్టు ఆవరణలో విలేకరులతో మాట్లాడిన ఆయన, అసెంబ్లీ ఎన్నికల సమయంలో తాము ఇచ్చిన ప్రకటనలపై బీజేపీవారు కేసు వేశారన్నారు. ఆ ఆరోపణల్ని రుజువు చేస్తామన్నారు. బీజేపీలో సీఎం పదవికి రూ. 2,500 కోట్లు ముట్టజెప్పాలని ఆ పార్టీ నేత బసవనగౌడ పాటిల్ యత్నాల్ ఆరోపించారని, దీనికేమంటారని అన్నారు. వాల్మీకి అభివృద్ధి మండలి నుంచి వెళ్లిన నిధులను మళ్లీ వెనక్కి రప్పిస్తామన్నారు.

టోల్ ఆపరేటర్‌పై దూసుకెళ్లిన క్యాంటర్: అక్కడికక్కడే మృతి

దొడ్డబళ్లాపురం: రుసుము చెల్లించకుండా వెళ్లిపోతున్న క్యాంటర్‌ను అడ్డుకోబోయిన టోల్ ఆపరేటర్ అదే క్యాంటర్ ఢీకొని మృతి చెందిన సంఘటన నెలమంగల నవయుగ టోల్ వద్ద చోటుచేసుకుంది. నాగరాజు (25) మృతి చెందిన టోల్ ఆపరేటర్. శుక్రవారం అర్ధరాత్రి ఒక క్యాంటర్ టోల్ కట్టకుండా వెళ్లిపోతుండడంతో దాన్ని ఆపే ప్రయత్నం చేసాడు. అయితే క్యాంటర్ డ్రైవర్ నాగరాజును ఢీకొని దూసుకెళ్లాడు. దీంతో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. నెలమంగల ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పరారైన క్యాంటర్ డ్రైవర్‌ను హుబ్లీలో పోలీసులు పట్టుకున్నారు.

సీఎం, మంత్రి దిగిపోవాలి

- వాల్మీకి మండలి ఘటనపై బీజేపీ డిమాండ్

శివాజీనగర: ముఖ్యమంత్రి సిద్దరామయ్యే ఆర్థిక మంత్రిగా ఉన్నారు. ఆయన కనుసన్నల్లోనే కోట్లాది రూపాయల అక్రమాలు జరిగినా కూడా ఆయనకు తెలియలేదు. కాబట్టి తక్షణమే సీఎం, సదరు మంత్రి రాజీనామా చేయాలని బీజేపీ పక్ష నేత ఆర్.అశోక్ డిమాండ్ చేశారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహర్షి వాల్మీకి ఎస్టీ అభివృద్ధి మండలి అధికారి పీ.చంద్రశేఖర్ ఆత్మహత్య చేసుకున్నారు. మంత్రి బీ.నాగేంద్రను రాజీనామా చేయమని సీఎం అడగడం లేదు. ప్రభుత్వంలో సొమ్మును ఎవరు ఎలాగైనా బదిలీ చేయవచ్చనేది దీని అర్థం. ఈ సొమ్ములో సోనియా గాంధీకి కూడా వాటా అందిందనేది నాకు అనుమానంగా ఉంది అని ఆరోపించారు. హైదరాబాద్‌లోని జూబిలీ హిల్స్ బ్యాంక్‌కు, 9 ఐటీ కంపెనీలకు ఆ సొమ్ము బదిలీ అయింది. ఇక్కడ ఎవరు ముఖ్యమంత్రి అనేది అర్థం కావటం లేదు అని ధ్వజమెత్తారు.

రాహుల్‌గాంధీకి వాటా ఉందేమో: సదానంద

వాల్మీకి మండలి సొమ్ము రాహుల్ గాంధీకి పంపి ఉంటారు, అందుకే సిద్దరామయ్య సీబీఐ తనిఖీకి వెనుకంజ వేస్తున్నారని మాజీ సీఎం డీ.వీ.సదానందగౌడ ఆరోపించారు. బీజేపీ ఆఫీసులో ఆయన మాట్లాడుతూ సిట్ విచారణ సబబు కాదు, రాష్ట్ర ప్రభుత్వం ఏం చెబితే సిట్ అదే చేస్తుందన్నారు. వాస్తవాలు బయటికి రావాలంటే సీబీఐ తనిఖీ చేపట్టాలని డిమాండ్ చేశారు. సీఎం సిద్దరామయ్యకు మంత్రి నాగేంద్రను సస్పెండ్ చేసే ధైర్యం లేదని, అవినీతికి మద్దతుగా ఉన్నారని ఆరోపించారు.

సీబీఐ విచారణకు డిమాండ్

వాల్మీకి అభివృద్ధి మండలి అక్రమ నగదు బదిలీపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ లేఖ రాశారు. గతంలో ఎంతో మంది నిజాయతీ అధికారులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. వాల్మీకి మండలిలో రూ.88.62 కోట్ల నగదు బదిలీ లావాదేవీలు అక్రమమని సదరు బ్యాంక్ సీబీఐకి ఫిర్యాదు చేసిందని తెలిపారు. కేసు తీవ్రత వల్ల సీబీఐ చేత తనిఖీ చేపట్టాలని డిమాండ్ చేశారు.

న్యూస్‌రీల్

బోనులో చిక్కిన చిరుత



మైసూరు: మైసూరు జిల్లా నంజనగూడు తాలూకా రాంపుర గ్రామ ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న చిరుత ఎట్టకేలకు బోనులో చిక్కింది. గత కొన్ని రోజులుగా చిరుత గ్రామంలో గొర్రెలు, పశువులను బలి తీసుకుంటోంది. దీంతో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు అటవీ అధికారులు గ్రామంలో బోనులు ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి ఆహారం వెతుక్కుంటు వచ్చిన చిరుత రైతు గణేశ్ పొలంలో ఏర్పాటు చేసిన బోనులో చిక్కింది. దీంతో గ్రామ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

రేపే ఎమ్మెల్సీ ఎన్నికలు

దొడ్డబళ్లాపురం: ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం జరగనున్నాయి. ప్రముఖ రాజకీయ పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ ఏర్పడింది. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరగనుంది. మొత్తం ఆరు స్థానాలకుగాను 78 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. లోక్‌సభ ఎన్నికలకు మల్లే జేడీఎస్, బీజేపీ పార్టీలు ఈ ఎన్నికల్లోనూ పొత్తు కుదుర్చుకున్నాయి. కాంగ్రెస్ ఆరు స్థానాల్లో, జేడీఎస్ 2 స్థానాల్లో, బీజేపీ నాలుగు స్థానాల్లో అభ్యర్థులను పోటీలో దింపాయి.

పెన్‌డ్రైవ్ కేసులో నవీన్, చేతన్‌లు జైలుకు

బనశంకరి: హాసన్‌లో ఎంపీ ప్రజ్వల్‌కు చెందిన అశ్లీల పెన్‌డ్రైవ్‌ల పంపకం చేపట్టారనే కేసులో శనివారం హాసన్ రెండో అదనపు సివిల్ జేఎంఎఫ్‌సీ కోర్టు నవీన్‌గౌడ, చేతన్‌గౌడలకు 14 రోజులు జుడీషియల్ కస్టడీకి ఆదేశించారు. ఇరువురి కస్టడీ ముగియడంతో సిట్ అధికారులు కోర్టులో హాజరుపరిచారు. పెన్‌డ్రైవ్‌లను వీరే తయారు చేసి వ్యాప్తి చేశారని జేడీఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. కాగా నిందితులను జిల్లా జైలుకు తరలించారు.

జేడీఎస్ ఎమ్మెల్యే విచారణ

అరకలగూడు జేడీఎస్ ఎమ్మెల్యే ఏ.మంజును సిట్ అధికారులు శనివారం హాసన్‌లో విచారణ చేపట్టారు. ఎమ్మెల్యే మంజుకు పెన్‌డ్రైవ్ ఇచ్చినట్లు నవీన్‌గౌడ ఫేస్‌బుక్‌లో పోస్ట్‌పెట్టాడు. నవీన్‌గౌడ విచారణలో ఇచ్చిన సమాచారం ఆధారంగా ఏ.మంజును విచారణకు పిలిచారు. ఏఎస్పీ తమ్మయ్య విచారించారు.

ఆలయంలో అర్చకుల బాహాబాహీ



మైసూరు: భగవంతునికి, భక్తులకు మధ్య సంధానకర్తలుగా ఉండవలసిన అర్చకులు కోపావేశంతో తలపడ్డారు. ఈ ఘటన చామరాజనగర జిల్లాలోని ప్రసిద్ధ యాత్రస్థలం కొళ్లేగాల తాలూకా చిక్కల్లూరు సిద్దప్పాజీ దేవరగుడ్డలో జరిగింది. ఈ ఘర్షణలో అర్చకులు శంకరప్ప (65), శివకుమార్ స్వామి (40), నంజుండస్వామి (32) గాయపడి ఆస్పత్రిలో చేరారు. దీక్ష పొందేందుకు వందలాది మంది భక్తులు దేవస్థానానికి విచ్చేశారు. వారికి ఎవరు దీక్షలు ఇవ్వాలనే విషయమై అర్చకుల మధ్య వాగ్వాదం జరిగి కొట్టుకున్నారు. ఈ దాడిలో త్రిశూలం, కట్టెలు ఆయుధాలుగా మారాయి. ఒక వ్యక్తికి తొడ ఎముకకు గాయమవ్వగా, ఇద్దరికి తలకు గాయాలయ్యాయి. కొళ్లేగాల గ్రామీణ పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు. అర్చకుల తీరుపై అందరూ విస్మయం చెందారు.

బైక్ దొంగల పట్టివేత

బనశంకరి: దురలవాట్లకు లోనై సులభంగా డబ్బు సంపాదించడం కోసం బెంగళూరులో విలువైన బైకులను చోరీకి పాల్పడి తమిళనాడులో విక్రయిస్తున్న నలుగురు దొంగలను శనివారం పరప్పన అగ్రహార పోలీసులు అరెస్ట్‌చేశారు. హోసూరు నివాసి రవిచంద్ర, తిరుపత్తూరు మోహన్‌కుమార్, నాగనాథపుర గోవిందరాజు, గోవిందహట్టి పాళ్య అమృత్‌కుమార్‌లు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి రూ.45 లక్షల విలువచేసే 31 ద్విచక్రవాహనాలు, 10 గ్రాములు బంగారం చైన్, కారును సీజ్ చేశారు. బైక్‌లను చోరీ చేసి అమ్ముకుని వచ్చిన డబ్బుతో జల్సాలు చేసేవారు.

విత్తన ధరలను తగ్గించాలి

మైసూరు: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విత్తన ధరలను తక్షణమే తగ్గించాలని శనివారం బీజేపీ రైతు మోర్చా నేతలు ధర్నా చేశారు. కాడా భవనంలో వ్యవసాయ శాఖ సబ్‌డైరెక్టర్ ఆఫీసు ఎదుటకు చేరి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మోర్చా మైసూరు గ్రామీణ జిల్లాధ్యక్షుడు ఎల్ఆర్ మహదేవస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు పంటల సాగుకు సిద్ధమవుతున్నారని, విత్తనాల ధరలను 60 శాతం మేర తగ్గించాలని డిమాండ్ చేశారు. సామాన్య రైతులు కొనలేని రీతిలో విత్తనాల ధరలు ఉన్నాయని ఆరోపించారు.

విషాదం, కన్నీరు.. అనారోగ్యం


కవితను ఆస్పత్రికి తీసుకెళ్తున్న దృశ్యం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కవిత

- చంద్రశేఖర్ భార్య ఆస్పత్రిలో చేరిక

శివమొగ్గ: అవినీతిని నిరసిస్తూ ఆత్మహత్య చేసుకున్న వాల్మీకి అభివృద్ధి పాలక మండలి అధికారి చంద్రశేఖర్ భార్య కవిత శనివారం అస్వస్థతకు గురయ్యారు. ఆమెను స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వాంతులు అవుతూ నీరసంగా ఉండడంతో కవితాను ఆటోలో ఆమె కుమారుడు ఆస్పత్రికి తరలించాడు. చంద్రశేఖర్ ఆకస్మిక మరణంతో ఆమె తీవ్ర ఆవేదనలో ఉండిపోయింది. పదే పదే భర్తను తలుచుకుంటూ విలపిస్తోంది. సరిగ్గా భోజనం చేయలేదని, దీంతో అనారోగ్యం బారిన పడ్డారని కుటుంబ సభ్యులు తెలిపారు.

పరామర్శల వెల్లువ

మరోవైపు అధికారి ఆత్మహత్య నేపథ్యంలో పలువురు ముఖ్య నేతలు, నాయకులు చంద్రశేఖర్ ఇంటికి వచ్చి తమ సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇప్పటివరకు మృతుని కుటుంబానికి ఎలాంటి పరిహారం అందించలేదు. ఎంతో మంది నేతలు ఇంటికి వచ్చి తమ సంతాపాన్ని తెలిపి రిక్త హస్తాలతో తిరిగి వెళుతున్నారు. మాజీ మంత్రి కేఎస్ ఈశ్వరప్ప మూడు లక్షల రూపాయలను ఆర్థిక సాయంగా మృతుని కుటుంబానికి అందించారు.

బస్సులో మహిళల సిగపట్లు

శివమొగ్గ: రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంలో గొడవలు నిత్యకృత్యమయ్యాయి. జిల్లాలోని సాగర కేఎస్ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం రాత్రి బస్సులో సీటు కోసం ఇద్దరు మహిళలు కొట్టుకున్నారు. సాగర నుంచి శివమొగ్గ వైపు వెళుతున్న బస్సులో మహిళల మధ్య గొడవ జరిగింది. డ్రైవర్, కండక్టర్‌తో సహా ప్రయాణికులు సైతం ఆ మహిళలను బుజ్జగించినా వారు వినలేదు. దీంతో బస్సును డ్రైవర్ పట్టణ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లాడు. గొడవ పడిన ఇద్దరు మహిళలను పోలీసు స్టేషన్‌లో అప్పగించి బస్సు అక్కడి నుంచి వెళ్లిపోయింది. గొడవ పడిన ఆ మహిళలకు పోలీసులు మందలించి పంపించారు.

వాల్మీకి మండలి ఎండీ, లెక్కాధికారి అరెస్టు

- నిధుల స్కాంలో సిట్ ప్రత్యేక దర్యాప్తు



శివాజీనగర: వాల్మీకి అభివృద్ధి మండలిలో కోట్లాది రూపాయల అవినీతి కేసులో సిట్ అధికారులు ముమ్మరం చేశారు. ఆ మండలి మేనేజింగ్ డైరెక్టర్ పద్మనాభ, మండలి లెక్కాధికారి పరశురామ్‌లను అరెస్ట్ చేసి తీవ్ర విచారణ చేపట్టారు. ఈ సంస్థలో రూ. 85 కోట్ల అక్రమాలు జరిగాయంటూ లేఖ రాసి అధికారి చంద్రశేఖర్ వారంరోజుల కిందట ఆత్మహత్య చేసుకోవడం తెలిసిందే. దీంతో పెద్ద రభస చెలరేగింది. అరెస్టయిన పద్మనాభ విచారణలో సదరు శాఖ మంత్రి పేరు చెబితే వివాదం మరింత తీవ్రరూపం దాల్చనుంది. ఈ స్కాంలో మంత్రి బి.నాగేంద్ర రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. తమ బ్యాంకులో ఈ మండలి నిధుల దుర్వినియోగంపై యూనియన్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ సీబీఐ ప్రాంతీయ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. గతంలో బెళగావికి చెందిన కాంట్రాక్టర్ సంతోష్ పాటిల్ ఉడుపిలో లాడ్జిలో ఆత్మహత్య చేసుకున్నారు. అప్పటి బీజేపీ మంత్రి కే.ఎస్.ఈశ్వరప్ప బిల్లుల మంజూరుకు కమీషన్లు డిమాండ్ చేశారని సెల్‌ఫోన్‌లో మెసేజ్ పెట్టారు. దీంతో మంత్రి రాజీనామా చేశారు. ఇదే మాదిరిగా ప్రస్తుత మంత్రి తప్పుకోవాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు.

ఎవరినీ కాపాడం: సీఎం

శివాజీనగర: వాల్మీకి అభివృద్ధి మండలిలో జరిగిన అక్రమ నగదు బదిలీ కేసులో ఎవరినీ కాపాడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య చెప్పారు. బెంగళూరులోని సిటీ సివిల్ కోర్టు ఆవరణలో విలేకరులతో మాట్లాడిన ఆయన, తప్పు చేసినట్లు తేలితే ఎవరి మీదైనా చర్యలు ఉంటాయన్నారు. ఈ కేసు దర్యాప్తునకు సిట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీవారు నమోదు చేసిన ప్రైవేట్ కేసు విచారణ కోసం కోర్టుకు హాజరైనట్లు చెప్పారు.


శనివారం బెంగళూరు ఆశ్రమ కూడలిలో వర్షం

మళ్లీ వర్ష హేల


వర్షంలో మహిళల అవస్థలు



- నగరంలో పలుచోట్ల వాన

దొడ్డబళ్లాపురం: మొదట్లో వర్షాలు వచ్చి మళ్లీ కొన్ని రోజులుగా ఎండలు, వేడిమితో అల్లాడుతున్న సిలికాన్ సిటీ ప్రజలకు శనివారంనాడు చిరుజల్లులు సాంత్వననిచ్చాయి. కార్పొరేషన్, టౌన్‌హాల్, కేఆర్ మార్కెట్, మల్లేశ్వరం, యశవంతపుర తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. హఠాత్తుగా వర్షం కురవడంతో వాహనదారులు కాస్త ఇబ్బంది పడ్డా వాతావరణం చల్లగా మారినందుకు ఆనందపడ్డారు.

8 జిల్లాలకు తీవ్ర వర్షసూచన

ఆదివారం నుండి రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశిస్తున్న నేపథ్యంలో 8 జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. బెంగళూరు గ్రామీణ, బెంగళూరు, రామనగర, శివమొగ్గ, తుమకూరు, ఉడుపి, దక్షిణ కన్నడ, ఉత్తర కన్నడ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఆదివారం నుంచి 5 రోజులపాటు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖ తెలిపింది.

సీతారాములకు తొలి రథోత్సవం


కనువిందుగా తేరు సంబరం


మూలవిరాట్టులకు అలంకారం

బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్లి నియోజకవర్గంలోని హోంగసంద్రలో వెలసిన సీతా రామ, ఆంజనేయ దేవస్థానం బ్రహ్మరథోత్సవం శనివారం నేత్రపర్వంగా జరిగింది. సుమారు 200 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ దేవాలయంలో మొదటిసారిగా ఇప్పుడే రథోత్సవాన్ని నిర్వహించడం విశేషం. బొమ్మనహళ్ళి ఎమ్మెల్యే ఎం. సతీష్‌రెడ్డి దంపతులు స్వామివార్లకు పూజలు చేశారు. తరువాత వివిధ పూజలు, హోమాల తరువాత ఉత్సవ మూర్తులను కొత్తగా ఏర్పాటుచేసిన తేరులో ఆసీనుల్ని చేసి భక్తజనులు రామనామం జపిస్తూ లాగారు. ఆలయం నుంచి హోంగసంద్ర వీధుల గుండా రథం సాగింది. శ్రీనివాస్‌రెడ్డి, నాగభూషన్ రెడ్డి, బాబురెడ్డి, గోపి, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

నాకేమీ తెలియదు, మొబైల్ పోయింది

- విచారణలో ఎంపీ ప్రజ్వల్ మొండి

బనశంకరి: అత్యాచారం, లైంగిక వీడియోల కేసులో అరెస్టైన హాసన్ జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను సిట్ అధికారులు బెంగళూరులో విచారణ చేపట్టారు. ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వకుండా నిరాకరిస్తున్నట్లు సిట్ వర్గాలు తెలిపాయి. ఇది రాజకీయకుట్ర, అనవసరంగా తనకు ఈ కేసులో ఇరికించారు. మీ పని మీరు చేయండి, నేనేమీ చెప్పను అని మొండికేసినట్లు తెలిసింది. ప్రశ్నలను తమ న్యాయవాదిని అడగాలని చెప్పిన ప్రజ్వల్ శుక్రవారం విచారణలో ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. తన మొబైల్‌ఫోన్ ఏడాది కిందట చోరీ అయ్యిందని, మీరు అడుగుతున్న మొబైల్‌ఫోన్ తన వద్ద లేదని సిట్ అధికారులకు చెప్పారు. అశ్లీల వీడియోలలో ఉన్నది మీరే కదా అని చూపించగా, ఆ వీడియోల్లో ఉన్నది నేను కాదని, వారందరూ తనకు పరిచయం అంతే, నేను ఎవరిపై అత్యాచారానికి పాల్పడలేదని ప్రజ్వల్ చెప్పినట్లు సమాచారం. దీంతో విచారణను ఎలా సాగించాలని సిట్ అధికారులు తలపట్టుకున్నారు.

నేడో రేపో ఘటనాస్థలికి

శుక్రవారం రాత్రి 9 గంటల వరకు విచారించి భోజనం అందజేశారు. శనివారం కూడా విచారణ కొనసాగించారు. ఆదివారం లేదా సోమవారం హాసన్, హొళెనరసిపురలోని ఇళ్లకు ప్రజ్వల్‌ను తీసుకెళ్లి సంఘటనలు ఎలా జరిగాయో మహజరు పరిచే అవకాశముంది.

ముందస్తు బెయిలు కోసం తల్లి అర్జీ

ప్రజ్వల్ కేసులో ఓ బాధిత మహిళను అపహరించారనే కేసులో ముందస్తు బెయిల్ కోసం ఆయన తల్లి భవానీ రేవణ్ణ శనివారం హైకోర్టును ఆశ్రయించారు. విచారణకు హాజరు కావాలని సిట్ గతంలో నోటీసులు జారీచేసినా ఆమె హాజరు కాలేదు. దీంతో పరారీలో ఉన్నారని భవానీ కోసం సిట్ గాలిస్తోంది. ముందస్తు బెయిల్‌కోసం భవానీ ప్రజాప్రతినిధుల కోర్టును ఆశ్రయించగా అర్జీని తిరస్కరించింది. అరెస్ట్ చేస్తారనే భయంతో భవానీ హైకోర్టును ఆశ్రయించారు. సోమవారం పిటిషన్ విచారణ కు వచ్చే అవకాశం ఉంది. బెంగళూరులో భవాని నివాసానికి ముగ్గురు మహిళా న్యాయవాదులు వెళ్లారు. వారు ఆమె తరఫున సిట్ అధికారులతో చర్చించారు. విచారణకు హాజరవుతారని, అరెస్టు కోసం ఒత్తిడి చేయరాదని సిట్‌ను కోరారు.


సిట్ అదుపులో ఎంపీ ప్రజ్వల్

క్లుప్తంగా

గురుకులాల్లోనే ఉపాధ్యాయులు బస చేయాలి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: జిల్లాలోని గురుకుల, మొరార్జీ దేశాయి పాఠశాలల్లో విధు లు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు అక్కడే నివాసం ఉండాలని కర్ణాటక రక్షణ వేదిక డిమాండ్ చేసింది. శనివారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి అధ్యక్షుడు ఖలీల్‌పాషా మాట్లాడారు. 2023–24వ విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించేవారు విద్యార్థులతో పాటు ఉండకుండా ఇతర చోట్ల నివాసం ఉన్నారన్నారు. గురుకులంలోనే ఉపాధ్యాయులు నివాసం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

పైఅంతస్తు నుంచి పడి సెక్యూరిటీ గార్డు మృతి



బసయ్య(ఫైల్)

రాయచూరు రూరల్: విధులు నిర్వహిస్తూ నిద్రమత్తులో అక్కమహాదేవి కళాశాల పైనుంచి పడి సెక్యూరిటీ గార్డు దుర్మరణం చెందిన ఘటన శుక్రవారం రాత్రి జిల్లాలోని సింధనూరులో జరిగింది. మృతుడిని కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న బసయ్య(45)గా పోలీసులు గుర్తించారు. అర్ధరాత్రి కాలకృత్యాలు తీర్చుకోడానికి మేల్కొన్న బసయ్య నిద్రలో పైఅంతస్తు నుంచి కిందకు దిగుతుండగా కాంపౌండ్ గోడ లేకపోవడంతో అదుపు తప్పి కింద పడి మరణించాడు. శనివారం పోలీసులు మృతదేహాన్ని స్వాధీనపరచుకుని శవ పరీక్ష కోసం ఆస్పత్రికి తరలించారు.

ఎమ్మెల్సీ రేసులో ఆ ఇద్దరు

రాయచూరు రూరల్: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో మంత్రి ఎన్ఎస్ బోసురాజు విధాన పరిషత్ సభ్యుడి పదవీ కాలం జూన్ 17వ తేదీతో ముగియనుండడంతో ఖాళీ కానున్న స్థానాలకు జూన్ 13న జరిగే విధాన పరిషత్ ఎన్నికల్లో బోసురాజ్‌ను విధాన పరిషత్ సభ్యుడిగా మరోసారి ఎన్నుకోవడానికి రంగం సిద్ధమైనట్లు తెలిసింది. కార్యాధ్యక్షుడు వసంత్ కుమార్ కూడా జిల్లా నుంచి ఎమ్మెల్సీ పదవికి ఎంపికవుతున్నట్లు సమాచారం. ఏఐసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎస్ బోసురాజుకు 2023లో అమాత్య పదవిని కేటాయించిన సంగతి విదితమే.

చిన్నారులకు అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న అధికారి

రాయచూరు రూరల్: జిల్లాలో బుధవారం నుంచి పూర్తి స్థాయిలో పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. 2024–25వ విద్యా సంవత్సరానికి సంబంధించి దేవదుర్గ తాలూకాలో విద్యాశాఖాధికారి సుఖదేవ్ విశేషంగా ప్రారంభించారు. దేవదుర్గ తాలూకాలో గ్రామీణ ప్రాంతాల నుంచి బండి కట్టి పిల్లలు బడికి తరలిరావాలంటూ ఎద్దులబండిపై ప్రచారం చేశారు. పాఠశాల విద్యార్థులతో పొలం పనులు వదిలి పాఠశాలకు రావాలని అట్టలు చేతబూని ప్రచారం చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారికి అందాల్సిన పుస్తకాలు, యూనిఫాం, ఇతర సౌకర్యాలు ఒనగూర్చారు. నీలగల్ ఆదర్శ పాఠశాలలో ఒకటో తరగతిలో చేరిన చిన్నారులకు అక్షరాభాస్యం చేశారు.

దౌర్జన్యంగా భూముల కబ్జా



మాట్లాడుతున్న మోహన్

రాయచూరు రూరల్: బళ్లారిలోని బండిహట్టిలో సర్వే నంబర్– 715లో 44 మంది రైతులకు ప్రభుత్వం పంపిణీ చేసిన 135 ఎకరాల భూములను దౌర్జన్యంగా ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి నారా ప్రతాపరెడ్డి ఆక్రమించారని బాధితుడు మోహన్ ఆరోపించారు. శనివారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2005లో మొత్తం భూములను కొనుగోలు చేసినట్లు నకిలీ రికార్డులు తయారు చేసుకొన్నారన్నారు. కృష్ణశాస్త్రి పేరు మీద ఉన్న భూములను తన పేరు మీద చేసుకొని పేదలు, దళిత, కురుబ రైతులపై అక్రమంగా కేసులు బనాయించడం, బెదిరించడం వంటివి చేస్తున్నారన్నారు. ఇలాంటి వ్యక్తి పట్టభద్రుల సమస్యలపై పరిషత్ కార్యకలాపాల్లో ప్రసంగిస్తారా? అని ప్రశ్నించారు.

భక్తిశ్రద్ధలతో హనుమ జయంతి

- ఆలయాల్లో ప్రత్యేక హోమ పూజలు
- స్వామివార్లకు విశేష అలంకరణలు



అభయ వరదాంజనేయ స్వామికి అలంకరణ



అభయాంజనేయ స్వామి ఆలయంలో పవమాన హోమ పూజలు



మిల్లర్‌పేట్ ఆంజనేయ స్వామికి వెండి పూలతో అలంకరణ



కురిహట్టి ఆంజనేయ స్వామి విశేష అలంకరణ

బళ్లారిఅర్బన్: హనుమాన్ జయంతి వేడుకల సందర్భంగా నగరంలోని వివిధ శ్రీరామ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణ పూజలను నిర్వహించారు. శనివారం నగరంలోని అనంతపురం రోడ్డు అభయ వరదాంజనేయ స్వామి దేవస్థానంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, స్వామి వారికి విశేష అలంకరణ, మహామంగళారతి, భక్తులకు అన్నదానం, హనుమాన్ వ్రత పూజలతో పాటు ఆలయ వార్షికోత్సవ వేడుకలను కూడా కలిపి జరుపుకున్నట్లు దేవస్థాన అర్చకులు ధనుంజయ తెలిపారు. బాలాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక అలంకరణ పూజలు, హనుమాన్ జన్మదిన పూజలను బాలానంద స్వామి నేతృత్వంలో నిర్వహించారు. మిల్లర్‌పేట్ ఆంజనేయ స్వామి ఆలయంలో వెండి ఆభరణాల పూలతో అలంకరణ, హనుమాన్ జన్మదిన పూజలను నిర్వహించారు. ఎస్ఆర్‌పీ కాలనీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో, హనుమాన్ నగర్ ఆంజనేయ స్వామి ఆలయంలో, కోట ఆంజనేయ స్వామి ఆలయంలో, పటేల్‌నగర్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వెలసిన ఆంజనేయ స్వామికి అలంకరణ పూజలు, కాకర్లతోట ఆంజనేయ స్వామి ఆలయంలో, హవంబావి కోదండ రామ ఆలయంలో, వివిధ శ్రీరామ, ఆంజనేయ స్వామి ఆలయాల్లో జయంతి పూజలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ కామేశ్వర రావు ప్రమాణం

సాక్షి బెంగళూరు: కర్ణాటక రాష్ట్ర హైకోర్టు నూతన న్యాయమూర్తిగా జస్టిస్ వెల్లూరు కామేశ్వర రావు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లాట్ కామేశ్వర రావు చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నీలయ్ విపిన్ చంద్ర అజారియా తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు ఘన వీడ్కోలు



విజయపుర (బెంగళూరు గ్రామీణ): విజయపుర వద్దనున్న నారాయణపుర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ రిటైరయ్యారు. ఈ సందర్భంగా ఆ దంపతులను ఉపాధ్యాయులు, అభివృద్ధి సమితి సభ్యులు సన్మానం చేసి వీడ్కోలు పలికారు.

పకడ్బందీగా ఓట్ల లెక్కింపు



మాట్లాడుతున్న తుషార్ గిరినాథ్

బనశంకరి: లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి గొడవలు లేకుండా, గట్టి భద్రతను కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ ఆదేశించారు. కౌంటింగ్ గురించి శనివారం పాలికె ఆఫీసులో పోలీసు అధికారులతో సమావేశం జరిపారు. 4వ తేదీ మంగళవారం ఓట్ల లెక్కింపు జరుగుతుందని, అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. బెంగళూరు నగరంలో మూడు కౌంటింగ్ కేంద్రాలు ఉండగా, అంతటా సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీ వ్యవస్థను కల్పించాలని తెలిపారు. మీడియా సెంటర్‌లో అన్ని సౌలభ్యాలూ ఉండాలన్నారు. అధికారులు సెల్వమణి, వినోత్ ప్రియా, స్నేహల్, దయానంద్ పాల్గొన్నారు.

బెంగళూరులో ఇక్కడే లెక్కింపు

- బెంగళూరు కేంద్ర లోకసభ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు
- వసంతనగర మౌంట్‌కార్మెల్ కాలేజీ
- బెంగళూరు ఉత్తర స్థానం ఓట్ల లెక్కింపు
- సెయింట్ జోసెఫ్ కాలేజీ, మల్య రోడ్డు,
- బెంగళూరు దక్షిణ
- జయనగర 9వ బ్లాక్, ఎస్ఎస్ఎంఆర్‌వీ కాలేజీ

బంగారు ఆభరణాల చోరీ

హుబ్లీ: బెంగళూరు నుంచి గుజరాత్‌లోని వడోదరకు రైల్లో ప్రయాణిస్తున్న మహిళ బ్యాగ్‌లో బంగారు అభరణాలతో పాటు నగదుతో సహా మొత్తం రూ.1.83 లక్షల విలువ చేసే వస్తువులు చోరీకి గురైన ఘటన శనివారం వెలుగు చూసింది. గుజరాత్ మిజల్ వాడి షిఫ్ అఫ్రిన్‌కు చెందిన బ్యాగ్‌లోని బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. రైల్లో ఆమె పడుకొని ఉన్న సమయంలో బ్యాగ్‌లోని వస్తువులు చోరీకి గురైనట్లు ఆమె హుబ్లీ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు



మాట్లాడుతున్న జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్

రాయచూరు రూరల్: రాయచూరు లోక్‌సభ స్థానానికి ఈ నెల 4న చేపట్టే కౌంటింగ్ కోసం ఏర్పాట్లకు సర్వం సిద్ధం చేశామని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాయచూరు, యాదగిరి జిల్లాల్లోని ఎనిమిది నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపునకు 159 మంది సూపర్‌వైజర్లు, 159 మంది సహాయకులు, 168 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. రాయచూరు, రాయచూరు గ్రామీణ, మాన్వి, లింగసూగూరు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును ఎస్ఆర్‌పీఎస్ కళాశాలలో, దేవదుర్గ, యాదగిరి, సురపుర, శహాపుర నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును ఎల్‌వీడీ కళాశాలలో చేపడతారన్నారు.

రేపటి పరిషత్ ఓటింగ్‌కు సర్వం సిద్ధం

జిల్లాలో ఈ నెల 3న జరగనున్న కళ్యాణ కర్ణాటక పట్టభద్రుల నియోజకవర్గం ఈశాన్య ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్‌కు ఏర్పాట్లను సర్వం సిద్ధం చేశామని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 20,317 మంది ఓటర్లున్నారన్నారు. 30 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో అదనపు జిల్లాధికారి అశోక్, అదనపు ఎస్పీ శివకుమార్‌లున్నారు.

మంత్రికి మద్దతుగా భారీ ర్యాలీ



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు, ఎమ్మెల్యే

సాక్షి,బళ్లారి: వాల్మీకి అభివృద్ధి మండలిలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని, కోట్లాది రూపాయల నిధులు పక్కదారి పట్టాయని, దీని వెనుక మంత్రి నాగేంద్ర ప్రమేయం ఉందని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు ఆయన్ను రాజీనామా చేయాలని ఒత్తిడి చేసిన నేపథ్యంలో శనివారం బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి నాగేంద్రకు మద్దతుగా నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా నగరంలోని కనక దుర్గమ్మ ఆలయం వద్ద నాగేంద్ర అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 101 టెంకాయలు కొట్టారు. అనంతరం కనక దుర్గమ్మ ఆలయం వద్ద నుంచి రాయల్ సర్కిల్ వరకు వేలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు మౌన ప్రదర్శన చేశారు. వాల్మీకి మండలిలో చేటు చేసుకున్న అవినీతి, అక్రమాల ఆరోపణలకు నాగేంద్రకు సంబంధం లేదన్నారు. బుడా అధ్యక్షుడు జే.ఎస్.ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు ముండ్రిగి నాగరాజు, మేయర్ శ్వేత, ఉపమేయర్ జానకమ్మ, కార్పొరేటర్ వివేక్, బోయపాటి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు గొర్రెల వ్యాపారుల దుర్మరణం



ప్రమాదంలో నుజ్జయిన గూడ్స్ వాహనం



లారీని వెనుక నుంచి ఢీకొన్న గూడ్స్ వాహనం

- లారీని ఢీకొన్న గూడ్స్ వ్యాన్

సాక్షి, బళ్లారి: ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి గొర్రెలను తరలిస్తున్న గూడ్స్ వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే గొర్రెల యజమానులు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. చిత్రదుర్గం జిల్లా చెళ్లకెరె తాలూకా శివలింగప్ప (65), హులికుంటె గ్రామానికి చెందిన రమేష్ (55) మృతులు. శనివారం తెల్లవారుజామున హులికుంటె గ్రామం నుంచి హిరియూరుకు గొర్రెలను గూడ్స్ వ్యాన్‌లో తరలిస్తున్నారు. డ్రైవర్ ముందు వెళుతున్న లారీని ఢీకొట్టడంతో అది బోల్తా పడింది. ప్రమాదంలో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న గొర్రెల వ్యాపారులు మృతి చెందారని స్థానికులు తెలిపారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు తగిలాయి. అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు.

నన్ను గెలిపిస్తే సమస్యలపై స్పందిస్తా



మాట్లాడుతున్న నారా ప్రతాప్‌రెడ్డి

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకలోని ఈశాన్య పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి జూన్ 3న జరగనున్న ఎన్నికల్లో తనను ఈ ప్రాంతం నుంచి ఎమ్మెల్సీగా గెలిపిస్తే సమస్యలపై స్పందిస్తానని స్వతంత్ర అభ్యర్థి నారా ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. 2018లో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ పాటిల్, ఓడిన బీజేపీ అభ్యర్థి అమర్‌నాథ్ పాటిల్ ఆరేళ్ల పాటు ఎక్కడున్నారని ప్రశ్నించారు. ఆరేళ్ల పాటు కానరాని బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులకు ఓటు వేయరాదన్నారు. పట్టభద్రుల సమస్యలపై విధాన పరిషత్ కార్యకలాపాల్లో ఏనాడూ ప్రసంగించ లేదన్నారు. బీజేపీ అభ్యర్థి ఇంతవరకు ప్రతిపక్ష నేతగా విఫలమయ్యారని ఆరోపించారు. బండిహట్టి భూముల విషయంపై కోర్టులో కేసు నడుస్తోందన్నారు. గతంలో ఎన్నికల సమయంలో ఈ విషయంపై దుష్ప్రచారం చేశారన్నారు.

ప్రతిఒక్కరూ ఓటు వేయాలి

హొసపేటె: కర్ణాటక ఈశాన్య గ్రాడ్యుయేట్ నియోజకవర్గానికి జూన్ 3న జరిగే ఎన్నికల్లో పట్టభద్ర ఓటర్లు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాలని జిల్లా రిటర్నింగ్ అధికారి ఎంఎస్ దివాకర్ తెలిపారు. కర్ణాటక విధాన పరిషత్ ఈశాన్య గ్రాడ్యుయేట్ నియోజకవర్గం ఎన్నికలు–2024 నేపథ్యంలో శనివారం జిల్లా పరిపాలన భవన్‌లోని ఆడిటోరియంలో జరిగిన జిల్లా స్థాయి స్వీప్ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. విజయనగర జిల్లాలోని పట్టభద్ర ఓటర్లందరూ ఈ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలన్నారు. స్వీప్ యాక్టివిటీస్, ప్రోగ్రామ్స్ ప్రాముఖ్యత తెలుసుకుని ఓటింగ్ వేసి ఓటింగ్ శాతాన్ని పెంచాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జూన్ 3న జరిగే ఎన్నికల్లో పట్టభద్రుల ఓటర్లందరూ తప్పనిసరిగా పాల్గొని నైతికంగా ఓటు వేయాలని కోరారు. జిల్లా స్వీప్ కమిటీ అధ్యక్షులు, జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు మాట్లాడుతూ ఓటింగ్ ప్రక్రియలో ఎన్నికల సంఘం సూచించిన అంశాలను పాటించాలన్నారు. ఓటింగ్ కోసం పోలింగ్ స్టేషన్‌లో అందించిన పర్పుల్ కలర్ పెన్ను తప్పనిసరిగా వినియోగించాలి. క్రమ సంఖ్య–1 నుంచి 19 వరకు ప్రాధాన్యత ఓటింగ్ అనుమతిస్తారని ఓటింగ్‌లో ఒకే నెంబర్‌ని ఇద్దరు అభ్యర్థులకు ఇస్తే, 1వ నెంబర్‌ను ప్రాధాన్యతగా ఉపయోగించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యాశాఖ ఉపసంచాలకులు యువరాజ నాయక, క్షేత్ర విద్యాశాఖాధికారులు, బీఆర్‌పీ, సీఆర్‌పీ అధికారులు పాల్గొన్నారు.

బావిలో పూడిక తీస్తూ నీట మునిగి మృతి

కెలమంగలం: బావిలో పూడిక తీస్తూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఉద్దనపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు ... సూళగిరి తాలూకా ఏనుసోణ సమీపంలోని ఉల్లట్టి గ్రామానికి బాలమురుగన్ (48) విద్యుత్ శాఖలో పనిచేస్తున్నాడు. శుక్రవారం అదే ప్రాంతానికి చెందిన రైతు మారప్ప బావిలో పూడిక తీస్తుండగా నీటిలో మునిగి మృతి చెందాడు. ఉద్దనపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పట్టభద్రుల గోడు పట్టని సర్కార్

రాయచూరు రూరల్: ఈశాన్య పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో పట్టభద్రుల సమస్యలపై సర్కార్‌లో స్పందన లేదని, దీనికి తోడు ఆరేళ్ల పాటు కాంగ్రెస్ అభ్యర్థి కనిపించకుండా పోయారని బీజేపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్సీ అమర్‌నాథ్ పాటిల్ ఆరోపించారు. శనివారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2018లో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి పట్టభద్రుల సమస్యలపై పరిషత్ కార్యకలాపాల్లో ప్రసంగించిన సందర్భాలు లేవన్నారు. గతంలో గెలిచిన తాను ఈ ప్రాంత సమస్యలపై విధాన పరిషత్‌లో గళమెత్తానన్నారు. ఆర్టికల్–371(జె) ద్వారా విద్య, ఉద్యోగ రంగాల్లో కళ్యాణ కర్ణాటక ప్రాంత పట్టభద్రులకు మేలు జరుగుతుందన్నారు.

సుశ్రావ్యంగా సాయి గీతాలాపన



సంగీత కచేరి నిర్వహిస్తున్న తమిళనాడు సత్యసాయి యూత్

ప్రశాంతి నిలయం: సత్యసాయిని స్మరిస్తూ సాయి యూత్ నిర్వహించిన సంగీత కచేరి భక్తులను అలరించింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన తమిళనాడుకు చెందిన సత్యసాయి యూత్ సభ్యులు శనివారం సాయంత్రం సత్యసాయి సన్నిధిలో సుస్వరాలతో సంగీత కచేరి నిర్వహించారు. సాయి కుల్వంత్ మందిరంలో భక్తులు తన్మయులయ్యారు.

మొబైల్ డెంటల్ క్లినిక్

కర్ణాటకలో ఉత్తర కన్నడ జిల్లాల్లో ప్రజలకు దంతపరమైన వైద్య సేవలు ఉచితంగా అందించే లక్ష్యంతో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన మొబైల్ డెంటల్ క్లినిక్ ను ప్రారంభించారు. సాయికుల్వంత్ సభా మందిరంలో పూజలు నిర్వహించిన పిమ్మట ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు ఆ వాహనాన్ని ప్రారంభించారు. అక్కడి ప్రజలకు దంత వైద్య సేవలు అందిస్తుందని తెలిపారు.

కోలారు వార్తలు...

పాడి రైతులు లబ్ధి పొందాలి



గుడ్‌లైఫ్ పాల ప్యాకెట్లను అందిస్తున్న దృశ్యం

మాలూరు: రైతుల అనుకూలం కోసం కోముల్ అనేక సౌకర్యాలను అందిస్తోందని, పాడి రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కే వై నంజేగౌడ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రపంచ పాల దినోత్సవాన్ని పురస్కరించుకుని కోముల్ ఆధ్వర్యంలో రోగులకు, పిల్లల తల్లులకు ఉచితంగా గుడ్ లైఫ్ పాలను పంపిణీ చేసి మాట్లాడారు. దివంగత ఎంవీ కృష్ణప్ప జయంతిని ప్రపంచ పాల దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. పాడిని ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడు ఎంవీ కృష్ణప్ప అన్నారు. ప్రతినిత్యం మన పాలను ప్రపంచ వ్యాప్తంగా 100 కోట్ల మందికి పైగా వినియోగిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ప్రతి 15 రోజులకోమారు పాడి రైతులకు పాల డబ్బులు, ప్రోత్సాహధనాన్ని బట్వాడా చేస్తున్నామన్నారు.

నివృత్త అధికారికి ఘనంగా వీడ్కోలు



అధికారిని సన్మానిస్తున్న దృశ్యం

కోలారు: వ్యవసాయ శాఖ డైరెక్టర్‌గా విధులు నిర్వహించిన నివృత్తి పొందిన శ్రీనివాస్‌ను శనివారం జిల్లాలో గత జిల్లా జాయింట్ డైరెక్టర్ రూపాదేవి, శాఖ అధికారులు మహేష్‌బాబు, కెఎస్ మంజునాథ్, నాగేష్‌గౌడ, శ్రీనివాసగౌడ తదితరులు ఘనంగా సన్మానించి గౌరవించారు. మూలతః కోలారు తాలూకా బెళ్లూరు గ్రామానికి చెందిన శ్రీనివాస్ ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్నత శిఖరాలకు చేరారని కొనియాడారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి నివృత్తి సాధారణం అయినా విధి నిర్వహణ సమయంలో నిర్వహించిన ఉత్తమ సేవలు నివృత్తి అనంతరం ఎంతో ఆత్మసంతృప్తిని కలిగిస్తాయన్నారు. అధికారి శ్రీనివాస్ వ్యవసాయ శాఖలో అధికారిగా ఉండి రైతులకు అందించిన సేవలు అపారమన్నారు. 33 సంవత్సరాల తన సేవా అవధిలో ఎన్నో ఉన్నత స్థానాలను అలంకరించారన్నారు.

పెండింగ్ కేసులను పరిష్కరించుకోవాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి గణపతి గురుసిద్ద బాదామి

కేజీఎఫ్: కోర్టుల్లో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను, వ్యాజ్యాలను ప్రజలు పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయ సేవల ప్రాధికార, 3వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి గణపతి గురుసిద్ద బాదామి తెలిపారు. శనివారం నగరంలోని కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన మెగా లోక్ అదాలత్ పూర్వ సిద్ధతా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత లోక్‌అదాలత్‌లో జిల్లాలోనే అతి ఎక్కువగా 7298 కేసులకు గాను 2980 కేసులను పరిష్కరించారన్నారు. ఈసారి నిర్వహించే మెగా లోక్‌అదాలత్‌లో మరిన్ని ఎక్కువ కేసులను పరిష్కరిస్తామన్నారు. లోక్ అదాలత్‌లో వివిధ రకాల కేసులను పరిష్కరించుకునేందుకు ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీని ద్వారా డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. వచ్చే నెల 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. మెగా లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రాజగోపాలగౌడ, న్యాయమూర్తి ముజఫర్ ఏ మాంజరి, రహీం అలీ మౌలాసాబ్, నదాఫ్, వినోద్ కుమార్ తదితరులు ఉన్నారు.

4, 5 తేదీల్లో మద్యం దుకాణాలు బంద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అక్రంపాషా

కోలారు: ఈ నెల 4న జరిగే కౌంటింగ్ సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లాధికారి అక్రంపాషా తెలిపారు. శనివారం నగరంలోని తన కార్యాలయ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతియుత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహించడానికి గాను కౌంటింగ్ రోజున ఉదయం 6 గంటల నుంచి 5వ తేదీ సాయంత్రం వరకు జిల్లా వ్యాప్తంగా మద్యపానం, మద్యం రవాణాను పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రం చుట్టూ 200 మీటర్ల వరకు 144 సెక్షన్‌ను విధించామన్నారు. ఆదేశాలను ఉల్లంఘించి మద్యం దుకాణాలు తెరిస్తే మద్యం దుకాణాల లైసెన్సుల రద్దుతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా ఎస్పీ ఎం.నారాయణ మాట్లాడుతూ కౌంటింగ్ అనంతరం విజయోత్సవ వేడుకలను నిర్వహించడానికి అనుమతి నిరాకరించామన్నారు. కౌంటింగ్ రోజున ముందు జాగ్రత్తగా గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. భద్రత కోసం 354 మంది పోలీసులను, నాలుగు కేఎస్ఆర్‌పీ ప్లాటూన్లు, 110 మంది హోం గార్డులు నియమించినట్లు తెలిపారు. పాస్‌లు కలిగి ఉన్న వారికి మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. డిప్యూటీ కలెక్టర్ శంకర్ వణిక్యాల్ పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంజునాథ్

కోలారు: ఉపాధ్యాయ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ పడుతున్న డీటీ శ్రీనివాస్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ తెలిపారు. ఆయన శుక్రవారం నగరంలోని వివిధ పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయులతో ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. రాష్ట్రంలో 2013లో సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 6వ వేతన కమిషన్‌ను అమలు చేశారన్నారు. ఇచ్చిన మాట మీద నిలబడే ప్రభుత్వం కాంగ్రెస్ అన్నారు. ఆగ్నేయ పరిషత్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎం ఎల్ అనిల్‌కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సీసంద్ర గోపాలగౌడ, మైలాందహళ్లి మురళి పాల్గొన్నారు.

క్లుప్తంగా

సిలిండర్ లీకై అగ్ని ప్రమాదం



మైసూరు: గ్యాస్ సిలిండర్ లీక్ కావడంతో అగ్ని ప్రమాదం జరిగి ఇంటిలోని వస్తువులు కాలి బూడిదైన ఘటన మైసూరు జిల్లా సాలిగ్రామ తాలూకా ముంజనహళ్ళి గ్రామంలో చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన శారదమ్మ, ఈరన్ననాయక దంపతులు ప్రాణాలతో బయటపడ్డారు. సిలిండర్ నుంచి గ్యాస్ లీక్ అవుతుండటంతో గ్యాస్ ఏజెన్సీ వారికి ఫోన్ చేయాలని భావిస్తుండగా ఒక్కసారిగా మంటలు వచ్చాయి. ఇంటిలోని వస్తువులు, బట్టలు, ఫర్నీచర్ మొత్తం కాలి బూడిదైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపే ఇంటిలోనే వస్తువులు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ. 10 లక్షలు నష్టం జరిగిందని బాధితులు వాపోయారు.

బ్యాంకుల ఖాతాల వివరాలు బహిరంగ పరచాలి

మైసూరు: రాష్ట్రంలో ఉన్న అన్ని కార్పోరేషన్లకు, మండళ్లకు చెందిన బ్యాంకుల ఖాతాల పూర్తి వివరాలను ప్రభుత్వం వెంటనే బహిరంగ పరచాలని బీజేపీ వెనుకబడిన వర్గాల మోర్చ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఆర్.రఘు కౌటిల్య డిమాండ్ చేశారు. శనివారం మైసూరు నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు కోసం మతాలకు అనుకూలంగా పథకాలను ప్రవేశపడుతోందని, కార్పొరేషన్లు, మండళ్లకు చెందిన నగదును తీసుకుని పథకాలను ఖర్చు పెడుతోందని ఆరోపించారు. దీని వల్ల వెనుకబడిన వర్గాలకు మాత్రం నిధులు అందడం లేదన్నారు. వెంటనే ఆయా వాటికి సంబంధించిన ఖాతాలను బహిరంగ పరచాలన్నారు.

బాయిలర్ రిపేరీ చేస్తుండగా..


ఉదయ్(ఫైల్)

యశవంతపుర: బాయిలర్ రిపేరీ చేస్తుండగా దాని వేడి తీవ్రతకు ఓ యువకుడు మృతి చెందిన ఘటన చిక్కమగళూరు పట్టణానికి సమీపంలోని విద్యా కాఫీ క్యూరింగ్‌లో జరిగింది. బాయిలర్ రిపేరీ చేయడానికి వచ్చిన మడికేరి కుశాలనగర్‌కు చెందిన ఉదయ్ (27) అక్కడికక్కడే మృతి చెందాడు. బాయిలర్ రిపేరీ చేస్తుండగా ఒక్కసారిగా 340 డిగ్రీల వేడి బయటకు వచ్చింది. దీంతో ఉదయ్ దేహం కాలిపోయింది. విషయం తెలుసుకున్న ఉదయ్ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

రెండు కుటుంబాల ఆస్తి గొడవ

భూ వివాదానికి సంబంధించి రెండు కుటుంబాలు కొట్టుకున్న ఘటన బెళగావి తాలూకా కాకతి గ్రామంలో జరిగింది. కర్రలు, రాడ్లతో కొట్టుకోవడంతో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. రెండు కుటుంబాల మధ్య భూ వివాదం ఉంది. శనివారం అనిల్ పక్క భూమిలో దుక్కి చేస్తుండగా మాటల యుద్ధం ప్రారంభమయిన రాడ్లు, కర్రలతో కొట్టుకునే స్థాయికి చేరుకుందని పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన అనిల్ అనే వ్యక్తి రౌడీలను పిలిపించి దాడి చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



శివమొగ్గ: బాల కార్మికుల విముక్తే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని జిల్లా అధికారి గురుదత్ హెగ్డే అన్నారు. శనివారం నగరంలోని కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి టాస్క్ ఫోర్సు ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై సమావేశం నిర్వహించారు. అనేక చోట్ల బాలలతో పనులు చేయిస్తున్నారని, అలాంటి వారిని గుర్తించి విముక్తి కల్పించి కేసులు నమోదు చేయాలన్నారు.

ఆర్థికసాయం అందజేత


శారదకు ఆర్థిక సాయం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

శివాజీనగర: నగరంలోని శివాజీనగర తెలుగు ఉన్నత పాఠశాల విద్యార్థిని శారద పదో తరగతిలో 480 మార్కులు సాధించి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులవటంతో స్థానిక రాజషి నాల్వడి కృష్ణరాజ వడియార్ ఫౌండేషన్ ఆ విద్యార్థినికి ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.బీ.రవీంద్ర మాట్లాడుతూ...ఎంఆర్‌ఎస్ పాళ్యకు చెందిన రాము పేదలు కావటం, ఆయన కుమార్తెను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో వడియార్ ఫౌండేషన్ రూ.5 వేలు చెక్కును అందజేసిందన్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు పీ.వెంకటేశ్, కార్యదక్షుడు ఎం.ఎస్.చక్రవర్తి, కోశాధికారి అనితా ఎం.బీ, కార్యదర్శి వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

ట్రెక్కింగ్‌కు స్వర్గధామం కుందాద్రి హిల్స్

- జలపాతాలు, కొండలతో కమనీయ దృశ్యాలు
- ప్రకృతి ఇక్కడే కొలువుదీరిందా అన్న అనుభూతి

బనశంకరి: కర్ణాటకలోని కుందాద్రిహిల్స్ అద్భుతమైన పర్యాటక ప్రాంతం. పశ్చిమ కనుమల్లో దాగిన రత్నం. ట్రెక్కింగ్ ప్రియులకు కుందాద్రి హిల్స్ స్వర్గధామంగా మారింది. సముద్ర మట్టానికి 826 మీటర్ల ఎత్తులో ఉండే కుంద్రాద్రిహిల్స్ కర్ణాటక పర్యాటక ప్రాంతాల్లో ఒకటి. మరో విధంగా చెప్పాలంటే ఇది పశ్చిమ కనుమల్లో దాగిన పర్యాటక రత్నం. శివమొగ్గ జిల్లా అగుంబె సమీపంలో గల కుందాద్రి హిల్స్ ప్రకృతి సోయగాలు, మనోహరమైన దృశ్యాలను కలిగి ఉంది. ఒక్కసారి ఇక్కడ పర్యటిస్తే జీవితాంతం గుర్తిండిపోయే జ్ఞాపకాలను సొంతం చేసుకుంటారు. ఇది వీకెండ్‌లో కూడా వెళ్లే పర్యాటక ప్రదేశం. అలాంటి కుందాద్రి హిల్స్ రెండు విషయాలకు ప్రసిద్ధి. 17వ శతాబ్దానికి చెందిన జైన దేవాలయం ఒకటైతే. రెండోది ఇది సాహస ప్రియులు ట్రెక్కింగ్ చేసేందుకు అనువైన ప్రదేశం. ఈ రెండు కారణాలతో పర్యాటకులు ఇక్కడికి పెద్ద ఎత్తున తరలివస్తారు. జైన దేవస్థానం 23వ తీర్థంకరుడైన పార్శ్వనాథ్‌కు అంకితం చేసింది. ఈ ఆలయాన్ని సందర్శించడానికి జైన భక్తులు అధికంగా విచ్చేస్తారు. ఇక్కడ అనేక రాతి విగ్రహాలు కూడా


కుందాద్రిహిల్స్ వ్యూపాయింట్


పురాతన జైన ఆలయం

పర్యాటకులు ఆకట్టుకుంటాయి.

ట్రెక్కింగ్ పాయింట్...

కుందాద్రి హిల్స్ సాహస ప్రియులకు కూడా మంచి ట్రెక్కింగ్ పాయింట్. ఇక్కడ వీకెండ్స్‌లో ట్రెక్కింగ్ చేయడానికి చాలామంది ఔత్సాహికులు విచ్చేస్తారు. కుందాద్రి హిల్స్ చేరుకోవడానికి దాదాపు 3 గంటల సమయం పడుతుంది. 7 కిలోమీటర్లు మేర అటవీ మార్గంలో కఠినమైన భూభాగాలల్లో సుదీర్ఘ ప్రయాణం చేయాలి. అడుగడుగునా ఆకర్షణీయమైన ప్రకృతి అందాలను ఆస్వాదించవచ్చు. కొన్ని కఠినమైన, ఇరుకైన మార్గాలు ఉండటంతో కాస్త జాగ్రత్తగా వెళ్లాలి. కష్టం కాకపోయినప్పటికీ ఆ మార్గం ఎంతో ఉత్కంఠభరితంగా, ఆహ్లాదకరంగా మారుతుంది. ఇక్కడ ట్రెక్కింగ్ చేయడం మంచి అనుభూతి కలిగిస్తుంది. ఒకవేళ మీరు నడవలేక పోతే కొండపైకి బైక్‌ను కూడా తీసుకెళ్లవచ్చు.

అద్భుత ప్రదేశం...

సాహసం, ఆధ్యాత్మికత, ప్రకృతి అందాల కలబోతతో కూడిన కుందాద్రి హిల్స్ ఎలాంటి పర్యాటకులైనా తప్పక నచ్చుతుంది. అందులో ఎలాంటి సందేహంలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ ప్రదేశం కర్ణాటక పర్యాటక రంగానికి సంబంధించిన నిజమైన సారాంశాన్ని కలిగి ఉంది.

కుందాద్రిహిల్స్ ఎలా వెళ్లాలంటే...

బెంగళూరు నుంచి తీర్థహళ్లికి నేరుగా బస్సు సౌలభ్యం ఉంది. అక్కడ నుంచి కుందాద్రిహిల్స్ చేరుకోవచ్చు. శివమొగ్గకు రైలు సౌకర్యం ఉండగా అక్కడ నుంచి కుందాద్రిహిల్స్‌కు బస్సులు, ట్యాక్సీలలో వెళ్లాలి.


హిల్స్‌పై ట్రెక్కర్ల సందడి


దుమికే జలపాతం వద్ద పర్యాటకుల ఆనందం


ఓ నీటి కొలను వద్ద ప్రకృతి రమణీయ దృశ్యాన్ని ఆస్వాదిస్తున్న పర్యాటకులు

రైతు ఆత్మహత్యాయత్నం

యశవంతపుర: కోర్టు తీర్పుపై తీవ్ర మనస్థాపం చెందిన ఓ రైతు విషం తీసుకుని ఆత్మహత్యకు యత్నించిన ఘటన చిక్కమగళూరు జిల్లా కడూరు పట్టణంలో జరిగింది. శుక్రవారం కడూరు తాలూకా కారేహళ్లి గ్రామానికి చెందిన మల్లికార్జున (50) భూ వివాదం కేసుపై కడూరు సివిల్ కోర్టులో ఉంది. కేసు తీర్పు రైతుకు వ్యతిరేకంగా వచ్చింది. దీంతో తీవ్ర మనస్థాపానికి చెందిన మల్లికార్జున విషం తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హాసనకు తరలించారు.

మహిళ మృతి.. తల్లిదండ్రులు అరెస్ట్

బాగలకోట జిల్లా రబకవి–బనహట్టి తాలూకా మహాలింగపురలో ఓ యువతి మృతికి సంబంధించి పోలీసులు ఆమె తల్లిదండ్రులను అరెస్ట్ చేశారు. కూతురుకి అబార్షన్ చేయడానికి ప్రోత్సహించారనే ఆరోపణలతో మృతురాలి తండ్రి సంజయగౌలి, తల్లి సంగీతను పోలీసులు అరెస్ట్ చేశారు.

హెబ్బాల పీఎస్ వద్ద ట్రాక్టర్ బోల్తా



కృష్ణరాజపురం: నగరంలోని హెబ్బాల పోలీస్ స్టేషన్‌కు అతి సమీపంలో మట్టి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ వేగానికి అదుపుతప్పి బోల్తాపడింది. అయితే ఎవరికి గాయాలు కాలేదు. రోడ్డు మధ్యలో ట్రాక్టర్ పడిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. హెబ్బాల ట్రాఫిక్ పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ట్రాక్టర్‌ను తొలగించారు.

వైభవంగా హనుమజ్జయంతి


ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ

గౌరిబిదనూరు: హనుమాన్ జయంతి పురస్కరించుకుని శనివారం నగరంలోని నగరంలోని బీహెచ్ రోడ్డులో వున్న శనిమహాత్ముని ఆలయ ఆవరణంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాలూకాలోని నదీగట్టు ఆంజనేయ స్వామి, మైదలోడు శివాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

గొప్ప దార్శనికుడు బసవేశ్వరుడు

గౌరిబిదనూరు: 12వ శతాబ్దంలో ధార్మిక, సాంఘిక విప్లవాలకు నాంది పలికిన విశ్వగురువు బసవేశ్వరుడు సమాజంలో పెరిగిన జాతి వివక్షతను రూపు మాపడానికి ఎంతో కృషి చేశారని జిల్లా కదళీ మహిళా వేదిక అధ్యక్షురాలు డాక్టర్ శైలజా సప్తగిరి తెలిపారు. నగరంలోని స్టెల్లా కాన్వెంటు సభా భవనంలో జిల్లా కదళీ మహిళా వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి జరిగిన బసవ జయంతి కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. బసవేశ్వరుడు సమాజంలోని అన్యాయాలు, అసమానత, లింగ వివక్షత, మూఢనమ్మకాలు, అంటరానితనంపై పోరాటం చేశారని, ఆనాడే అనుభవ మంటపాన్ని స్థాపించి ప్రజా పరిపాలనకు నాంది పలికారన్నారు. ఈ సందర్భంగా సంగీత పాఠశాలకు చెందిన గీత హెగ్డెను సన్మానించారు. కార్యక్రమంలో తాలూకా అధ్యక్షురాలు సువర్ణమ్మ, గుడిబండ తాలూకా అధ్యక్షురాలు చంద్రకళ, జిల్లా కోశాధికారి మంజుల, భారతీ గౌరీశ్, లక్ష్మి, మంజుల, శారదా, లలిత తదితరులుపాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వేదిక మహిళలు

మహత్తరమైనది రక్తదానం

బనశంకరి: అన్నిదానాల్లో కెల్లా రక్తదానం మహత్తరమైనదని శ్రీకృష్ణ విద్యాసంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఎం.రుక్మాంగదనాయుడు తెలిపారు. శనివారం బనశంకరి మూడోస్టేజ్ ఐటీఐ లేఔట్‌లోని శ్రీకృష్ణ డిగ్రీ కాలేజీలో ఎన్ఎస్ఎస్, స్వామివివేకానంద స్వయం ప్రేరణ రక్తనిధి బెంగళూరు సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని విద్యాసంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఎం.రుక్మాంగదనాయుడు ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం చేస్తే శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యకరంగా ఉంటారని ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఆపదలో ఉన్నవారికి రక్తదానం ఇస్తే వారి జీవితాల్లో వెలుగులు నింపిన వారవుతారని అన్నారు. అనంతరం స్వామివివేకానంద స్వయంప్రేరిత రక్తనిధి సామాజిక కార్యకర్త ఈశ్వర్ మాట్లాడుతూ ... రక్తదానం చేస్తే 48 గంటల్లోగా మళ్లీ రక్తం ఉత్పత్తి అవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా 150 మందికి పైగా విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థ డైరెక్టర్, ప్రొఫెసర్ మనోహర్, ప్రొఫెసర్ వేణుగోపాల్, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉషాకుమారి తదితరులు పాల్గొన్నారు.


దాతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న దృశ్యం

ఖాళీ బిందెలతో నిరసన



మైసూరు: తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపిన ఘటన జిల్లాలోని పిరియాపట్టణ తాలూకా చప్పరదహళ్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఉదయం చప్పరదహళ్లి గ్రామానికి చెందిన మహిళలు ఖాళీ బిందెలతో స్థానిక పంచాయతీ కార్యాలయం చేరుకుని అక్కడే బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రెండు వారాలుగా తాగునీటి సరఫరా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా తమ వీధిలో రోడ్లు, మురుగు కాల్వలు కూడా లేవన్నారు. ఎన్నికల సమయంలో వచ్చి హామీ ఇచ్చి వెళ్తారని, ఆ తరువాత కనిపించరని మండిపడ్డారు.

కోటి లీటర్ల పాల సేకరణే లక్ష్యం



మైసూరు: కేఎంఎఫ్ (కర్ణాటక పాల సమాఖ్య) శుక్రవారం రికార్డు స్థాయిలో అత్యధికంగా మొత్తం 96,26,000 లీటర్ల పాలను సేకరించినట్లు, రానున్న రోజుల్లో కోటి లీటర్ల పాల సేకరణే తమ లక్ష్యమని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంకే జగదీశ్ తెలిపారు. ప్రపంచ పాల దినోత్సవం సందర్భంగా శనివారం నగరంలో మైసూరు జిల్లా పాల ఒక్కూట సంఘం ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్ మాట్లాడుతూ... ఒక మనిషికి కావాల్సిన అన్ని పోషకాంశాలు ఒక్క పాలలోనే లభిస్తాయని, అధికంగా పాలను తాగేవారు శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఈసారి వేసవి సందర్భంగా వినియోగదారుల నుంచి డిమాండ్ పెరిగిందని, అందుకు అనుగుణంగా పాలు, పెరుగు, ఇతర పాల ఉత్పత్తులను అందిస్తున్నట్లు తెలిపారు.

లోక్‌సభ ఎన్నికల్లో డీకే సురేశ్ రూ.500 కోట్లు ఖర్చు పెట్టారు

- మాజీ మంత్రి యోగేశ్వర్

దొడ్డబళ్లాపురం: ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బెంగళూరు గ్రామీణ పార్లమెంటు నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన డీకే సురేశ్ ఎన్నికల్లో రూ.500 కోట్లు వ్యయం చేశారని, మాజీ మంత్రి సీపీ యోగేశ్వర్ ఆరోపించారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన ఎన్నికల్లో బీజేపీ జనబలంతో వస్తే కాంగ్రెస్ ధనబలంతో వచ్చిందన్నారు. డీకే బ్రదర్స్ సమస్యలు సృష్టించి మళ్లీ వాటిని వారే పరిష్కరించారన్నారు. డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావాలనే ఆశతో ఉన్నారని, అందుకే లోక్‌సభ ఎన్నికల్లో డబ్బులను నీళ్లలా ఖర్చుపెట్టారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో డీకే సురేశ్ ఓటమిపాలైతే డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కాలేడన్నారు. అయితే ఊహకందని ఫలితాలు రావడం ఖాయమన్నారు. ఎన్నికలకు ముందు రోజు కాంగ్రెస్ వారు మహిళల అకౌంట్‌లలోకి రూ.2 వేలు జమ చేసారన్నారు. అందుకే కాంగ్రెస్ వారు తాము మహిళాశక్తితో గెలుస్తామని చెప్పుకుంటున్నారన్నారు. బీజేపీ, జేడీఎస్ రెండు పార్టీలు కలవడం వల్ల తమ అభ్యర్థులకు బలం చేకూరిందన్నారు.

పెట్టుబడుల పేరుతో లక్షల వంచన

హోసూరు: ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నా ప్రజల్లో చైతన్యం రావడం లేదు. ఓ యువకుడు ఇలాగే లక్షలు పోగొట్టుకున్నాడు. హోసూరు సమీపంలోని తొరపల్లి అగ్రహారం గ్రామానికి చెందిన దేవేంద్రన్ (39) బాధితుడు. కొద్ది రోజుల క్రితం అతని సెల్‌ఫోన్‌కు ఒక మెసేజ్ వచ్చింది. అందులో తాము చెప్పిన చోట పెట్టుబడి పెడితే అధిక ఆదాయం పొందవచ్చని ఉంది. దేవేంద్రన్ ఆశపడి వారిని సంప్రదించాడు. వారి మాటలను నమ్మిన దేవేంద్రన్ వారు పంపిన లింక్ ఆధారంగా విడతల వారీగా రూ. 6.57 లక్షలు వారిచ్చిన ఖాతాలకు పంపాడు. అనంతరం అక్కడి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి క్రిష్ణగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

హోసూరు వార్తలు..

హోసూరులో జోరువాన


రోడ్డుపై నిలిచిన వాన నీరు

హోసూరు: క్రిష్ణగిరి జిల్లావ్యాప్తంగా శనివారం సాయంత్రం భారీ వాన కురిసింది. హోసూరు ప్రాంతంలో వర్షానికి హోసూరు– బెంగళూరు హైవేలో జూజువాడి చెక్‌పోస్టు వద్ద గంటల తరబడి ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. రహదారులు జలమయమయ్యాయి. కాలువల నుంచి వాన నీటితో కలిసి మురికినీరు రోడ్డుపై ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. జోరువానలకు పలు గ్రామాల్లో బీన్స్, బీర, క్యాబేజి పంటపొలాలు దెబ్బతిన్నాయి. అయినప్పటికీ కరువు కాలంలో వర్షాలు తిరిగి రావడంపై రైతుల్లో సంతోషం నెలకొంది.

జవాన్ భార్య ఆత్మహత్య

క్రిష్ణగిరి: ఆస్తిలో వాటా ఇవ్వకపోవడంతో మహిళ ఆత్మహత్య చేసుకుంది, ఈ ఘటన కావేరిపట్టణం పరిధిలో చోటుచేసుకొంది. వివరాల మేరకు కావేరిపట్టణం సమీపంలోని జవాన్‌దొడ్డి గ్రామానికి చెందిన సైనికుడు గోవిందరాజ్ భార్య మైథిలి (28), వీరికి గత ఆరేళ్ల క్రితం పెళ్లి జరిగి ఇద్దరు పిల్లలున్నారు. గోవిందరాజ్ తండ్రి మైథిలి కుటుంబానికి సక్రమంగా ఆస్తి పంచివ్వలేదు. భర్త కూడా తండ్రికే మద్దతిచ్చాడు. దీంతో విరక్తి చెందిన ఆమె పురుగుల మందు తాగింది, గమనించిన స్థానికులు చికిత్స కోసం బెంగళూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయింది. బంధువులు శనివారం మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చి ధర్నా చేశారు. మైథిలి ఆత్మహత్యకు కారకులైన వారిపై చట్టరీత్యా చర్యలు చేపట్టాలని నినాదాలు చేశారు. కావేరిపట్టణం పోలీసులు చేరుకొని ఆందోళనకారులతో చర్చించారు. ఈ ఘటన జవాన్‌దొడ్డి గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది.

ఆస్పత్రి నిర్మాణ పనుల పరిశీలన

హోసూరు: హోసూరు సమీపంలో వంద కోట్లతో జరుగుతున్న జిల్లా ప్రధాన ఆస్పత్రి నిర్మాణ పనులను వైద్యాధికారులు పరిశీలించారు. జిల్లా కేంద్రం క్రిష్ణగిరిలో జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రిని నిర్వహిస్తుండేవారు. కొద్ది సంవత్సరాల క్రితం క్రిష్ణగిరి సమీపంలోని బోలుపల్లి వద్ద ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిని ఏర్పాటు చేయడంతో జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రిని హోసూరుకు మార్చారు. ప్రస్తుతం హోసూరులో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రికి సరైన స్థలం లేకపోవడంతో రాయకోట రోడ్డులోని సుమారు రూ. వంద కోట్లతో నిర్మిస్తున్నారు. ఈ పనులను వైద్యాధికారి ధర్మన్, హోసూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారిణి జ్ఞానమీనాక్షి తదితరులు పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు.


పనుల పరిశీలనకు వచ్చిన అధికారులు

పరిసరాలు, పర్యావరణాన్ని కాపాడుకోవాలి

బనశంకరి: పరిసరాలు, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ పిలుపునిచ్చారు. ప్రపంచ పరిసర దినోత్సవం సందర్భంగా శనివారం ఎంఎస్.రామయ్య మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన హసిరు ఆకర్షిక (వైబ్రెంట్) బెంగళూరు కోసం యువకులు అనే ఆల్టర్‌నేటివ్–2024 కార్యక్రమాన్ని తుషార్ ప్రారంభించి మాట్లాడారు. పరిసరాలు రక్షణ మనందరి కర్తవ్యమని, వాటి రక్షణలో జాగృతం కావాలన్నారు. భవిష్యత్ తరాలు ఆరోగ్యకరమైన జీవితం సాగించాలంటే ఉత్తమ పరిసరాలు నిర్మించడం ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల ముందు మొక్కలు నాటాలని, వర్షపు నీటి సేకరణ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్లాస్టిక్ బదులుగా బట్ట బ్యాగులను వాడాలన్నారు. అనంతరం అటవీశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్.మంజునాథ్ ప్రసాద్ మాట్లాడుతూ... నగరంలో రోజురోజుకు జనాభా పెరుగుతోందని, దీంతో పరిసరాలపై అధిక ప్రభావం పడుతోందన్నారు. బెంగళూరు నగరం హసిరు, ఆకర్షణ బెంగళూరుగా తీర్చిదిద్దడంలో యువతతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో జలమండలి అధ్యక్షుడు రామ్‌ప్రసాద్ మనోహర్, అటవీ పరిసర ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ ప్రత్యేక కమిషనర్ ప్రీతిగెహ్లాట్, బెంగళూరు ఉత్తర ట్రాఫిక్ డీసీపీ సిరిగౌడ, రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ప్రతాప్‌లింగయ్య, కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శి బాలచంద్ర, గోకుల విద్యా ఫౌండేషన్ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసమూర్తి, విమోవే ఫౌండేషన్ సంస్థాపకుడు వినయషిండే, ప్రియా వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తుషార్ తదితరులు

పిల్లల పోషణలో తల్లిదండ్రుల బాధ్యత ముఖ్యం

గౌరిబిదనూరు: పిల్లల పోషణలో తల్లిదండ్రుల బాధ్యత ఎంతో ముఖ్యమని, వారి సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలని తీర్థ విద్యాసంస్థ అధ్యక్షుడు డాక్టర్ కేవీ ప్రకాశ్ తెలిపారు. శనివారం తీర్థ పాఠశాలలో అంతర్జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం (పేరెంట్స్ డే) కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పిల్లల్లో ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత, త్యాగ మనోభావం పెంపొందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో శోభ, అభిజ్ఞ, ఆరాధ్య, సంధ్య, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

కారు ప్రమాదంలో క్రిష్ణగిరివాసి దుర్మరణం

పరిగి: పుట్టపర్తి జిల్లా పరిగి మండలంలోని ధనాపురం క్రాస్ సమీపంలో 544ఈఈ జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకున్న ప్రమాదంలో తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... తమిళనాడులోని క్రిష్ణగిరికి చెందిన రామకృష్ణ, సెల్వరాజ్, తమిళ్ మణి, రాజశేఖర్ (58) నలుగురూ మడకశిర ప్రాంతంలో రాళ్ల క్వారీల పనులకు హిటాచీ వ్యాపార లావాదేవీలపై చర్చించేందుకు శనివారం వచ్చారు. మధ్యాహ్నం భోజనానికని టీఎన్ 29 బీహెచ్ 3456 నంబర్ సఫారీ కారులో హిందూపురానికి బయలుదేరారు. పరిగి మండలం ధనాపురం క్రాస్ దాటగానే జాతీయ రహదారిపై పల్లపు ప్రదేశంలో వేగంతో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఓ ద్విచక్ర వాహనదారుడిని తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. వాహనం డోర్లు తెరుచుకోవడంతో డ్రైవింగ్ చేస్తున్న రామకృష్ణ, పక్కనే కూర్చొన్న రాజశేఖర్ ఎగిరి బయటకు వచ్చిపడ్డారు. తీవ్రంగా గాయపడిన రాజశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన ముగ్గురినీ స్థానికులు వెంటనే హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



రాజశేఖర్ మృతదేహం వద్ద రోదిస్తున్న స్నేహితుడు, ప్రమాదంలో దెబ్బతిన్న వాహనం

ప్రజలు సీఎం వైఎస్ జగన్‌కే మళ్లీ పట్టం కట్టారు

- ఎగ్జిట్ పోల్స్ అన్నీ వైఎస్సార్‌సీపీ వైపే
- మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు



సాక్షి, అమరావతి: ప్రజలు వైఎస్సార్ సీపీకే ఓట్లేసి, మళ్లీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే పట్టం కడుతూ ఎన్నికల రోజే తీర్పు ఇచ్చారని, ఆ తీర్పును ప్రకటించటం ఇక లాంఛనమేనని మాజీ మంత్రి వైఎస్సార్‌సీపీ నేత రావెల కిషోర్ బాబు చెప్పారు. ఆయన శనివారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. అన్ని ఎగ్జిట్ పోల్స్ వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని చెబుతున్నాయని చెప్పారు. ఓటమిని టీడీపీ జీర్ణించుకోలేకపోతోందని, అందుకే సర్వే సంస్థలను వైఎస్సార్‌సీపీ మేనేజ్ చేసిందని, ఎగ్జిట్‌పోల్స్‌ను బహిష్కరిస్తున్నాం అని అంటోందని అన్నారు. రెండు రోజుల కోసం సర్వే సంస్థలను మేనేజ్ చేయాల్సిన అవసరం వైఎస్సార్‌సీపీకి ఏముందని ప్రశ్నించారు. ప్రజా తీర్పు అంటే టీడీపీకి భయమెందుకని అన్నారు. డెబ్బై శాతం ప్రజలు వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టారని, వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ఐదేళ్ల సుపరిపాలన, సంక్షేమం, అభివృద్ధికి ప్రజలు తిరిగి పట్టం కట్టబోతున్నారన్నారు. వైఎస్ జగన్ మళ్లీ సీఎం కాకుండా ఎవ్వరూ అడ్డుకోలేరని చెప్పారు. ప్రజాతీర్పును టీడీపీ గౌరవించాలని అన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో అల్లర్లకు, పోస్టల్ బ్యాలెట్లో అక్రమాలకు టీడీపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల కమిషన్‌ను ప్రభావితం చేస్తోందన్నారు. ఎన్నికల కమిషన్ టీడీపీకి అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చినా వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమన్నారు. పోస్టల్ బ్యాలెట్‌పై దేశంలో ఎక్కడా లేని నిబంధనను ఏపీలో తేవాలని కుట్ర చేశారని, దానిపై న్యాయ పోరాటం చేస్తున్నామని చెప్పారు.

పిన్నెల్లి బెయిల్ రద్దు చేయాలంటూ సుప్రీంలో పిటిషన్

సాక్షి, న్యూఢిల్లీ: మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్ రద్దు చేయాలని నంబూరి శేష గిరిరావు అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశాడు. వివిధ అంశాలను పరిశీలించకుండానే హైకోర్టు బెయిల్ ఇచ్చిందని పిటిషన్‌లో ఆరోపించాడు. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తులు జస్టిస్ అరవింద్‌కుమార్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన వెకేషన్ బెంచ్ సోమవారం విచారించనుంది.

పిల్లల దత్తతకు డిమాండ్

దత్తత ఇవ్వాలని రాష్ట్రంలో 1,018 దరఖాస్తులు పెండింగ్

- 14 శిశు గృహాల్లో ఉన్నది 110 మంది పిల్లలే
- నిబంధనలకు లోబడి ఆచి తూచి అర్హుల ఎంపిక
- 2020 నుంచి 2024 వరకు 325 మంది పిల్లలు దత్తత



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో శిశువుల (పిల్లల) దత్తతకు డిమాండ్ పెరుగుతోంది. సంతాన భాగ్యంలేని వేలాది మంది దంపతులు అనాథ బిడ్డలను పెంచుకొనేందుకు పోటీ పడుతున్నారు. తమకు శిశువులను దత్తత ఇస్తే వారిని బాధ్యతగా పెంచి ప్రయోజకులను చేస్తామని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ ఏజెన్సీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పర్యవేక్షణలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దత్తత ప్రక్రియను నిర్వహిస్తుంది. సమీకృత బాలల సంరక్షణ పథకం(ఐసీపీఎస్)లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లోని 14 ప్రత్యేక దత్తత ఏజెన్సీలు (శిశు గృహాలు) ఉన్నాయి. వాటి పరిధిలో 110 మంది పిల్లలు (శిశువులు) ఉన్నారు. కాగా, శిశువుల దత్తత కోసం ఏకంగా 1,018 మంది దంపతులు చేసుకున్న దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దత్తత నిబంధనలకు లోబడి అధికారులు అర్హులైన దంపతులను ఆచి తూచి ఎంపిక చేస్తారు. 2020 నుంచి 2024 వరకు మొత్తం 325 మంది పిల్లలను దత్తత ఇవ్వగా వారిలో 186 ఆడ శిశువులు ఉండటం గమనార్హం.

నిర్లక్ష్యానికి గురైన బిడ్డలకు వరం దత్తత..

కుటుంబ నేపథ్యంలో వదిలివేసిన, నిరాశ్రయమైన, నిర్లక్ష్యానికి గురైన పిల్లల సంరక్షణ, రక్షణకు దత్తత అనేది గొప్ప వరం. అటువంటి పిల్లలకు ప్రేమతో కూడిన కుటుంబ వాతావరణం లభిస్తుంది. అనాథ పిల్లలను దత్తత ద్వారా కుటుంబాల్లోకి తిరిగి చేర్చడమే ముఖ్య ఉద్దేశం. దత్తత అనేది కుటుంబాల కోసం పిల్లలను ఇవ్వడం కాదు.. పిల్లల కోసం కుటుంబాలను అందించడమే ప్రధానంగా ఉంటుంది. అనాథలైన బిడ్డలకు వసతి, విద్య, వారి ప్రతిభా సామర్థ్యాలు పెంపొందించడంతోపాటు వారికి ప్రేమ, వాత్సల్యం అందించేందుకు దోహదం చేస్తుంది. పిల్లల సరైన అభివృద్ధికి అవసరమైన భావోద్వేగ, శారీరక, మానసిక భద్రతను అందిస్తుంది. పిల్లలు సామాజిక దుర్వినియోగానికి గురికాకుండా నివారిస్తుంది.

జాతీయ స్థాయిలో ప్రత్యేక ఏజెన్సీ

దత్తతకు సంబంధించిన అన్ని విషయాలను పర్యవేక్షించడానికి కేంద్ర ప్రభుత్వం 1990 జూలై 3న జాతీయ స్థాయిలో 'సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ ఏజెన్సీ (సీఏఆర్ఏ)' ఏర్పాటు చేసింది. రాష్ట్ర స్థాయిలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. సీఏఆర్ఏ 2011 ఫిబ్రవరిలో 'చైల్డ్ అడాప్షన్ రిసోర్స్ ఇన్ఫర్మేషన్ - గైడెన్స్ సిస్టమ్ (కేరింగ్స్)' పేరుతో ప్రత్యేకంగా అధికారికంగా https://cara.wcd.gov.in అనే వెబ్‌సైట్ ప్రారంభించింది. ఈ వెబ్‌సైట్ ద్వారా దత్తతకు ఆన్‌లైన్ దరఖాస్తులు, గైడ్‌లైన్స్ వంటి అనేక అంశాలను పారదర్శకంగా పర్యవేక్షిస్తుంది. దత్తత ప్రక్రియ సులభతరం చేయడంతోపాటు వాటిలో కీలకపాత్ర పోషించే ఏజెన్సీల జవాబుదారీతనాన్ని పెంచుతుంది. కేంద్ర, రాష్ట్ర స్థాయిలో దత్తతకు ముందు తర్వాత కూడా ఆన్‌లైన్ పర్యవేక్షణ చేస్తుంది.

దత్తతకు వయస్సు, అర్హతలు ఇవే..

దరఖాస్తు (రిజిస్ట్రేషన్) నాటికి దత్తతకు వెళ్లే పిల్లలు, దత్తత తీసుకునే తల్లిదండ్రుల వయస్సు అర్హతను నిర్దేశించారు.

పిల్లల వయస్సు	దత్తత తల్లిదండ్రుల్లో ఒకరి వయస్సు
2 సంవత్సరాల వరకు	40 ఏళ్లు
2 నుంచి 4 సంవత్సరాల వరకు	45 ఏళ్లు
4 నుంచి 8 సంవత్సరాల వరకు	50 ఏళ్లు
8 నుంచి 18 సంవత్సరాల వరకు	55 ఏళ్లు

2020-21 నుండి 2023-24 వరకు దత్తతకు ఇచ్చిన పిల్లలు

ఏడాది	పిల్లలు
2020-21	83
2021-22	81
2022-23	90
2023-24	71
మొత్తం	325

మ్యూల్ సిమ్‌కార్డుల ముఠాగుట్టు రట్టు

- ఏడుగురి అరెస్ట్.. 998 సిమ్‌కార్డుల స్వాధీనం
- సైబర్ మోసంలో రూ.30,37,000 పోగొట్టుకున్న వ్యక్తికి ఊరట



నిందితులతో పోలీసులు

భవానీపురం (విజయవాడపశ్చిమ): సైబర్ నేరగాళ్లకు మ్యూల్ సిమ్‌కార్డులు సరఫరా చేస్తున్న ముఠాగుట్టును విజయవాడ సైబర్ పోలీసులు రట్టుచేశారు. ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశారు. నిందితుడి బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.కోటిని స్తంభింపజేశారు. సైబర్ మోసంతో సీనియర్ సిటిజన్ పోగొట్టుకున్న రూ.30,37,627 ఆయనకు ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ కేసు వివరాలను ఎన్టీఆర్ జిల్లా సీపీ పీహెచ్‌డీ రామకృష్ణ తెలిపారు. గతనెల 24వ తేదీన విజయవాడ సూర్యారావుపేటకు చెందిన సీనియర్ సిటిజన్ తాను సైబర్ నేరానికి గురైనట్లు విజయవాడ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనకు వాట్సాప్ ద్వారా వీడియో కాల్ చేసి ముంబై సైబర్ క్రైమ్ డీసీపీగా పరిచయం చేసుకున్న వ్యక్తి.. తన పేరుమీద ముంబయిలో రెండు సిమ్‌కార్డులు, రెండు బ్యాంక్ ఖాతాలు ఉన్నాయని, ముంబయిలో పలు కేసుల్లో నిందితుడైన రాజ్ కుంద్రా నిత్యం తనతో ఫోన్‌లో మాట్లాడుతున్నాడని చెప్పాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనపై ముంబయిలో కేసు నమోదు అయిందంటూ ఎఫ్ఐఆర్, అరెస్ట్ వారెంట్ పత్రాలను వాట్సాప్‌లో పంపించాడని తెలిపారు. అతడి బెదిరింపులకు భయపడిన తాను అతడు చెప్పిన ఖాతాకు రూ.30,37,627 జమచేసినట్లు తెలిపారు. అయినా ఇంకా డబ్బు కావాలని డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

విశాఖలో తీసుకున్న సిమ్‌కార్డుల వినియోగం

ఈ ఫిర్యాదుపై సైబర్ క్రైమ్ ఏసీపీ ఎస్.డి.తేజేశ్వరరావు పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ కోమాకుల శివాజి దర్యాప్తు చేపట్టారు. నిందితులు ఉపయోగించిన సిమ్ కార్డులు విశాఖపట్నంలో తీసుకున్నట్లు గుర్తించి ఎస్ఐ ఆర్.ఎస్.సీహెచ్.మూర్తి ఆధ్వర్యంలో ఒక బృందం విశాఖపట్నంలో దర్యాప్తు చేసింది. సిమ్‌కార్డులు అమ్మే ఎగ్జిక్యూటివ్‌లు.. వినియోగదారుల బొటనవేలి ముద్రలను ఉపయోగించి మరో మ్యూల్ సిమ్‌కార్డు తీసుకుని యాక్టివేట్ చేసి సంఘవ్యతిరేక శక్తులకు అమ్ముకుంటున్నట్లు గుర్తించారు. సైబర్ నేరస్తులకు మ్యూల్ సిమ్ కార్డులు విక్రయిస్తున్న ఏడుగురిని అరెస్టుచేసి వారి వద్ద నుంచి 998 సిమ్‌కార్డులు, బయోమెట్రిక్ మెషిన్, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నానికి చెందిన రేపాక రాంజీ, నంబాల నితిన్, బండి నారాయణమూర్తి అలియాస్ రవి, విజయనగరం జిల్లా సాలూరుకు చెందిన తేలు ప్రణయ్‌కుమార్, నంద రూపేష్, కాగితాల సింహాద్రి, నిడమర్రు ఎండీఎల్ సూరయ్యగూడేనికి చెందిన పందిరి సత్యనారాయణలను అరెస్టు చేశారు. బాధితుడు డబ్బు జమచేసిన బ్యాంకు ఖాతాను గుర్తించి 1930 పోర్టల్ ద్వారా బ్యాంకు అధికారులను సంప్రదించి ఆ ఖాతాలో ఉన్న రూ.1,21,73,156.98ని నిలుపుదల చేశారు. బాధితుడు పోగొట్టుకున్న రూ.30,37,627ను కోర్టు ద్వారా అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నేరస్తులు కాంబోడియా నుంచి ఈ మోసానికి పాల్పడినట్లు ప్రాథమికంగా తెలుస్తోందని సీపీ తెలిపారు.దోషుల్ని అరెస్టు చేస్తామని పేర్కొన్నారు.

ఉద్యమాన్ని అవమానిస్తూ ఉత్సవాలా?

- మీ వికృత పోకడలకు నిరసనగా దశాబ్ది ఉత్సవాలకు బీఆర్ఎస్ దూరం
- సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ లేఖ

సాక్షి, హైదరాబాద్: ''తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవం ఒక ఉద్విగ్న, ఉత్తేజకరమైన సందర్భమే. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని తిరోగమన దిశగా తీసుకువెళ్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉత్సవాల్లో కేసీఆర్ పాల్గొనడం సమంజసం కాదని బీఆర్ఎస్ సహా ఉద్యమకారులు, తెలంగాణవాదులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని అవమానిస్తున్న మీ వికృత పోకడలను నిరసిస్తూ ప్రభుత్వం నిర్వహించే దశాబ్ది ఉత్సవాల్లో బీఆర్ఎస్ పార్టీ పాల్గొనడం లేదు..'' అని భారత్ రాష్ట్ర సమితి అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానిస్తూ సీఎం రేవంత్ రెడ్డి రాసిన లేఖకు ప్రతిగా కేసీఆర్ శనివారం సీఎం రేవంత్‌కు బహిరంగ లేఖ రాశారు. ''రాష్ట్ర అవతరణ ఉత్సవాల నిర్వహణపై మీ (కాంగ్రెస్) ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌ను ఆహ్వానించక పోవడం అప్రజాస్వామిక వైఖరికి నిదర్శనం. తెలంగాణ పోరాటంలో అన్నీ తానై నిలిచిన బీఆర్ఎస్‌ను కావాలని విస్మరించి మీ సంకుచితత్వాన్ని మరో సారి నిరూపించుకున్నారు. నన్ను దశాబ్ది ఉత్సవా లకు ఆహ్వానించిన తీరు.. నోటితో మాట్లాడుతూ నొసటితో వెక్కిరించినట్లుగా ఉంది. తెలంగాణ సాధన కోసం ప్రాణాన్ని పణంగా పెట్టి ఆమరణ నిరాహార దీక్షతో ఉద్యమాన్ని విజయ తీరానికి చేర్చిన నన్ను ఆహ్వానించిన తీరు ఎంతో అవమానకరంగా ఉంది. అని లేఖలో ఆయన విమర్శించారు.

చంద్రబాబును తక్షణమే అరెస్టు చేయాలి

తాడేపల్లి పోలీసులకు హైకోర్టు న్యాయవాది వెంకటరెడ్డి ఫిర్యాదు

- కౌంటింగ్ ఏజెంట్లను రెచ్చగొట్టేలా చంద్రబాబు వ్యాఖ్యలు చేశారు
- అధికారులను బెదిరించి కౌంటింగ్ నిలిచిపోయేలా చేయాలని చెప్పారు
- వైఎస్సార్‌సీపీ ఏజెంట్లకు అభద్రతాభావం కల్పించి, బయటకెళ్లేలా చేయాలన్నారు
- పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వెంకటరెడ్డి
- ఆధారాలను ఇచ్చినట్లు వెల్లడి

సాక్షి, అమరావతి: టీడీపీ కౌంటింగ్ ఏజెంట్ల సమావేశంలో అనుచిత వ్యాఖ్యలు చేసిన చంద్రబాబుపై తక్షణమే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని హైకోర్టు న్యాయవాది చిట్టెం వెంకటరెడ్డి తాడేపల్లి పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. మే 30, 31 తేదీల్లో టీడీపీ కౌంటింగ్ ఏజెంట్ల సమావేశంలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు వారిని రెచ్చగొట్టేలా ఉన్నాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. బాబు వ్యాఖ్యల వల్ల ప్రజల మధ్య విద్వేషాలు ఏర్పడి, ఘర్షణలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. పోస్టల్ ఓట్ల లెక్కింపు సందర్భంలో అగ్రెసివ్‌గా వెళ్లాలంటూ ఏజెంట్లకు చెప్పారన్నారు. కౌంటింగ్‌కు అడుగడుగునా ఆటంకాలు కల్పించి, ఆ ప్రక్రియను ఆపేందుకు ఎన్ని అవకాశాలు ఉన్నాయో అన్నీ చేయాలని, ప్రతి దానికీ తగాదా పెట్టుకోవాలంటూ రెచ్చగొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కౌంటింగ్‌కు సంబంధించి అన్ని విషయాల్లో ఎన్నికల కమిషన్ మద్దతు టీడీపీకి ఉందని, ఎన్నికల అధికారులు ఎన్డీఏ కంట్రోల్‌లో ఉన్నారని, ఎవ్వరికీ భయపడాల్సిన అవసరం లేదని కూడా టీడీపీ ఏజెంట్లకు చెప్పారన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని కౌంటింగ్‌లో అధికారులపై కూడా ఒత్తిడి తెచ్చి, బెదిరించి, వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు విసుగు చెందేలా చేయాలని, వారు అభద్రతాభావంతో కౌంటింగ్ నుంచి వెళ్లిపోయేలా చేయాలని చెప్పారన్నారు. ఎన్నికల ప్రచారం మొదలు చివరి వరకు ప్రతి సభలోనూ చంద్రబాబు ప్రజలను, టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌పై వ్యక్తిగతంగా కూడా అటాక్ చేశారని చెప్పారు. వీటన్నింటిపై ఆధారాలతో సహా తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెంకటరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు కూడా ఇదే అంశంపై సీఈవోకు ఫిర్యాదు చేశారని తెలిపారు. అంతే కాకుండా కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా మెయిల్ ద్వారా కూడా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

సహకార సంఘాల ఎన్నికలకు ప్రతిపాదనలు

జిల్లా సహకార అధికారి రమాదేవి

సాక్షి, హైదరాబాద్: సహకార సంఘాల ఎన్నికల కోసం రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీకి ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా సహకార అధికారి డి.రమాదేవి శనివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. హైదరాబాద్ జిల్లాలో 2 బలహీన వర్గాల సహకార సంఘాలు, 3 పొదుపు పరపతి సహకార సంఘాలు, 2 కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులు, 1 మత్స్య సహకార సంఘం, 2 గృహ నిర్మాణ సహకార సంఘాలు, 2 ఫ్లాట్ ఓనర్ సహకార సంఘాలు.. మొత్తం 12 సహకార సంఘాలకు తెలంగాణ రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ జూన్ 6 నుంచి 28 మధ్యలో ఎన్నికలు నిర్వహిస్తుందని తెలిపారు. జిల్లాలో ఎన్నికల కాలపరి మితి ముగియబోయే ఇతర సహకార సంఘాలు, సంబంధిత రిజిస్ట్రార్లు వారి సంఘాల ఎన్నికల ప్రతిపాదనలను తెలంగాణ రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీకి సమర్పించాలని రమాదేవి పేర్కొన్నారు.

గ్రూప్-1 పరీక్షలు నెలరోజులు వాయిదా వేయాలి: కృష్ణయ్య

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): గ్రూప్-1 పరీక్షలు ప్రభుత్వం నెల రోజులపాటు వాయిదా వేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నిరుద్యోగ సంఘాల నాయకులు, గ్రూప్-1 అభ్యర్థులతో కలసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 9న గ్రూప్-1, హెచ్ఏఎల్, ఐబీ పరీక్షలు ఉన్నాయి కాబట్టి గ్రూప్-1 వాయిదా వే యాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వంపై ఇప్పటికే నిరుద్యోగుల్లో వ్యతిరేకత మొదలైందని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ఉద్యోగాలు పెంచి నోటిఫికేషన్లు ఇస్తామని ఎన్నికల్లో చెప్పి అధికారంలోకి వచ్చారని అందుకు తగ్గట్టుగా గ్రూప్-1 ఉద్యోగాలు పెంచి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలన్నారు.

వడదెబ్బతో తొమ్మిది మంది మృతి

సాక్షి నెట్‌వర్క్: విపరీతమైన ఎండల దెబ్బకు శనివారం రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు. ఖమ్మం జిల్లా రఘునాథ పాలెం మండలంలోని పాపటపల్లికి చెందిన పోతనబోయిన గురవయ్య(65), పుప్పాల రామయ్య(90), కూసుమంచికి చెందిన బొమ్మ దశరథ(70), తల్లాడ మండలం మంగాపురంలో గాదె వెంకటేశ్వర్లు(58), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం కొమ్ముగూడెంకు చెందిన సోయం రాముడు(56), సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెంకి చెందిన బిక్కినేటి ఉపేంద్ర(52), కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్షకుర్తి గ్రామానికి చెందిన చిందం అన్నవ్వ(86), నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం గుడివాడ గ్రామానికి చెందిన ఆలకుంట్ల శాంతమ్మ(79), మాడుగులపల్లి మండలం గజలాపురం గ్రామానికి చెందిన మద్దిరాల వెంకట్‌రెడ్డి (60) వడ దెబ్బ బారిన పడి మృతి చెందారు.

ఆ పిల్లల రోదన తీరేదెప్పుడు?

అటు కన్న పేగు.. ఇటు పెంచిన ప్రేమకు దూరం

- అనాథల్లా శిశు విహార్‌లో 13 మంది చిన్నారులు
- చుట్టూ కొత్తవారు కావడంతో గుక్కపెట్టి ఏడుపులు
- అసలు పేరెంట్స్ ఎవరనేది తేలే వరకూ తప్పని రోదన
- ప్రధాన నిందితులు చిక్కితేనే కేసు కొలిక్కి
- ఢిల్లీ, పుణేల్లో రెండు ప్రత్యేక బృందాల గాలింపు
- త్వరలోనే పెంపుడు తల్లిదండ్రుల అరెస్టు



సాక్షి, హైదరాబాద్: అప్పటివరకు అల్లారుముద్దుగా పెంచుకుంటున్న పసిపిల్లలను ఒక్కసారిగా తమ నుంచి దూరం చేశారని పెంపుడు తల్లిదండ్రుల ఆవేదన ఒకవైపు.. కన్నవాళ్లు, పెంపుడు తల్లిదండ్రులు.. ఎవరూ కనిపించక పిల్లల రోదన మరోవైపు.. వెరసి యూసుఫ్‌గూడలోని శిశు విహార్ వద్ద పరిస్థితి కంట నీరు తెప్పిస్తోంది. పరారీలో ఉన్న ఢిల్లీ, పుణేకు చెందిన ప్రధాన నిందితులు పోలీసులకు చిక్కి, పిల్లల అసలు తల్లిదండ్రులు ఎవరనేది తేలే వరకూ ఈ పసికందుల ఆక్రందన తప్పేలా లేదు.

-సంచలనం సృష్టించిన పిల్లల విక్రయం కేసును ఎలా కొలిక్కి వస్తుందనే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. హైదరాబాద్, విజయవాడకు చెందిన పిల్లల విక్రయం ముఠా ఇప్పటివరకు 60కి పైగా చిన్నారులను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విక్రయించగా.. వీరిలో 13 మంది శిశువులను పోలీసులు రక్షించి, శిశు విహార్‌లో చేర్చిన సంగతి తెలిసిందే. మధ్యవర్తులు ఢిల్లీ, పుణేలకు చెందిన కిరణ్, ప్రీతి, కన్నయ్య నుంచి పిల్లలను తీసుకొచ్చి, పెంపుడు తల్లిదండ్రులకు విక్రయించారు. ఈ పిల్లల అసలు తల్లిదండ్రులు ఎవరు? నిందితులు పేద తల్లిదండ్రుల నుంచి పిల్లల్ని కొనుగోలు చేశారా? లేక అపహరించి, మధ్యవర్తుల ద్వారా విక్రయించారా? అనే అంశాలపై స్పష్టత వస్తేనే కేసు దర్యాప్తు ముందుకెళుతుందని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. దీంతో కిరణ్, ప్రీతి, కన్నయ్యల కోసం నలుగురు సిబ్బంది చొప్పున రెండు ప్రత్యేక బృందాలు ఢిల్లీ, పుణేలలో గాలిస్తున్నాయి.

పేరెంట్స్ ఎవరనేది తేలితేనే..

ఈ చిన్నారుల అసలు తల్లిదండ్రులు ఎవరనేది తేల్చడం పోలీసులకు సవాల్‌గా మారింది. పిల్లల డీఎన్ఏలతో తల్లిదండ్రుల డీఎన్ఏ నమూనాలను సరిపోల్చుతామని, ఒకవేళ పిల్లల డీఎన్ఏతో సరిపోలితే అసలు తల్లిదండ్రులకే అప్పగిస్తామని, ఒకవేళ తేలని పక్షంలో పిల్లల్ని తిరిగి శిశు విహార్‌కే తరలిస్తామని అధికారులు స్పష్టం చేశారు. పిల్లలపై ఇష్టం లేని తల్లిదండ్రులకు బలవంతంగా ఇచ్చేయాలా? లేక పిల్లలంటే ప్రేమ చూపే పెంపుడు తల్లిదండ్రులకు అప్పగించాలా? అనేది తేల్చలేని పరిస్థితి నెలకొంటుందని ఓ అధికారి తెలిపారు.

త్వరలోనే పెంపుడు తల్లిదండ్రుల అరెస్టు..

పిల్లలను అమ్మడం, కొనడం చట్టరీత్యా నేరం. ఇప్పటికే పిల్లలను విక్రయించిన 11 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించిన సంగతి తెలిసిందే. ఇక, పిల్లలను కొనుగోలు చేసిన దంపతులపై కూడా సీఆర్‌పీసీ, జువెనైల్ జస్టిస్ (జేజే) చట్టాల కింద కేసులు నమోదు చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. త్వరలోనే వీరిపై సెక్షన్ 370, 372, 373 ఆర్/డబ్ల్యూ 34 ఐపీసీ, 81, 87, 88 జువెనైల్ జస్టిస్ యాక్ట్-1985 కింద కేసులు నమోదు చేసి, అరెస్టు చేయనున్నట్లు సమాచారం.

వందల కోట్ల గోల్‌మాల్!

గొర్రెల పంపిణీ కుంభకోణంపై ఏసీబీ నిర్ధారణ

- నిందితులు రాంచందర్, కల్యాణ్‌కుమార్‌ను కస్టడీకి తీసుకుని విచారించనున్న దర్యాప్తు సంస్థ



సాక్షి, హైదరాబాద్: గొర్రెల పంపిణీ పథకం కుంభకోణంలో రూ.వందల కోట్లు గోల్‌మాల్ అయినట్టు ఏసీబీ నిర్ధారణకు వచ్చింది. ఓవైపు కీలక ఆధారాలు సేకరిస్తూ.. మరోవైపు వరుస అరెస్టులతో ఏసీబీ అధికారులు ఈ కేసులో వేగం పెంచారు. తాజాగా శుక్రవారం ఏసీబీ అధికారులు తెలంగాణ రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ, తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సంస్థ మాజీ ఎండీ సబావత్ రాంచందర్, అప్పటి పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ దగ్గర ఓఎస్డీగా పనిచేసిన గుండమరాజు కల్యాణ్‌కుమార్‌ను అరెస్టు చేయడంతో ఈ కేసు మరో మలుపు తిరిగింది. ఈ కుంభకోణం వెనక కీలక సూత్రధారులుగా ఈ ఇద్దరు వ్యవహరించినట్టు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులు గొర్రెల పంపిణీ పథకం అమలు వ్యవహారంలోకి తేవడంలో ఈ ఇద్దరు అధికారులది ముఖ్యపాత్ర అని నిర్ధారణ అయ్యింది.

ఇంకా ఎన్ని రూ.కోట్లు మింగారో?

తొలుత రూ.2.10 కోట్ల అవినీతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఏసీబీ అధికారులు.. దర్యాప్తులో ఇప్పటి వరకు లభించిన ఆధారాల ప్రకారం రూ.700 కోట్లకుపైనే అవినీతి జరిగినట్టు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. దర్యాప్తు ముందుకు వెళ్లే కొద్దీ ఇంకా ఎన్ని రూ.కోట్ల అవినీతి బయటికి వస్తుందోనన్న చర్చ జరుగుతోంది. శుక్రవారం అరెస్టయిన సబావత్ రాంచందర్, కల్యాణ్‌కుమార్‌ను జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. వీరిద్దరినీ తిరిగి పోలీసుల అదుపులోకి తీసుకుని విచారిస్తే మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం ఇద్దరు నిందితులను కస్టడీ కోరుతూ పిటిషన్ దాఖలు చేయనున్నట్టు తెలిసింది.

ఆ ఇద్దరి వెనుక ఎవరైనా ఉన్నారా?

కల్యాణ్‌కుమార్, రాంచందర్‌లే ఈ కుంభకోణానికి పాల్పడ్డారా..? వారి వెనుక ఇంకెవరైనా కీలక వ్యక్తులు ఉన్నారా..? అన్న కోణాల్లోనూ ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. కోర్టు అనుమతితో ఇద్దరు నిందితులను కస్టడీకి తీసుకుని విచారిస్తే ఇంకేవైనా కొత్త పేర్లు తెరపైకి వస్తాయా..?అన్నది కొద్ది రోజుల్లో తేలనుంది.

ఆర్టీసీ ఉద్యోగులకు కొత్త వేతనాలు

- 2017 వేతన సవరణ అమలు ప్రారంభం
- 21 శాతం ఫిట్‌మెంట్‌తో బ్యాంకు ఖాతాల్లో జమ
- రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగుల్లో సంబరాలు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ ఉద్యోగులకు కొత్త వేతనాల చెల్లింపు మొదలైంది. 2017 నాటి వేతన సవరణకు సంబంధించి గత మార్చిలో ప్రభుత్వం ఫిట్‌మెంట్ ప్రకటించటంతో, ఆ మేరకు కొత్త వేతనాలను జూన్ 1న చెల్లించారు. మే నెలకు సంబంధించి వేతనాలు తాజాగా ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో నమోదయ్యాయి. 21 శాతం ఫిట్‌మెంట్ ప్రకారం కొత్త వేతనాలు అందుకోవటంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల్లోని ఆర్టీసీ ఉద్యోగుల్లో సంబరాలు నెలకొన్నాయి.

ఏడేళ్ల క్రితం నాటి వేతన పెంపుతో..

2017లో వేతన సవరణ జరగాల్సి ఉండగా, అప్పటి రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి మెరుగ్గా లేకపోవటంతో ప్రభుత్వం ఫిట్‌మెంట్‌ను ప్రకటించలేదు. దీంతో కార్మిక సంఘాలు అప్పట్లో సమ్మెకు పిలుపునిచ్చాయి. వాటితో చర్చించేందుకు నాటి ప్రభుత్వం ఆరుగురు మంత్రులతో కమిటీ ఏర్పాటు చేసింది. వేతన సవరణ చేయకుంటే సమ్మెను ఆపబోమని కార్మిక సంఘాలు తేల్చి చెప్పటంతో, మధ్యే మార్గంగా 16 శాతం ఇంటీరియమ్ రిలీఫ్‌కు కమిటీ ప్రతిపాదించింది. ఆర్థిక పరిస్థితి మెరుగుపడగానే ఫిట్‌మెంట్ ఇవ్వనున్నట్టు పేర్కొంది. దీనికి కార్మిక సంఘాలు సమ్మతించి సమ్మెను విరమించాయి. అప్పటినుంచి ఐఆర్ కొనసాగుతూ వచ్చింది. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి మార్చిలో 21 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించింది. ఇక అప్పటివరకు ఉన్న 82.6 శాతం కరువు భత్యంలోంచి, 2017 వేతన సవరణ గడువు నాటికి ఉన్న 31.1 శాతాన్ని ఉద్యోగుల మూలవేతనంలో చేర్చారు. మిగిలిన కరువు భత్యాన్ని 43.2 శాతానికి న్యూట్రలైజ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమంగా ఆర్టీసీ ఉద్యోగుల హెచ్ఆర్ఏను తగ్గించారు. మొత్తంగా కాస్త సంతృప్తికరంగానే ఉద్యోగుల వేతనాలు పెరిగాయి. ఏడేళ్ల క్రితం నాటి వేతన పెంపు అమలులోకి రావటంతో ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బకాయిలు మాత్రం ఉద్యోగ విరమణ సమయంలో చెల్లిస్తామనటంతో కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రూ. 360 కోట్ల భారం

ఈ వేతన సవరణతో ఆర్టీసీపై సాలీనా రూ. 360 కోట్ల భారం పడనుంది. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందకపోవటంతో, రోజువారీ ఆర్టీసీ ఆదాయం పెంచుకునేందుకు సంస్థ ప్రత్యేక కసరత్తు నిర్వహిస్తోంది. ఇది కొంతవరకు సత్ఫలితాలనిస్తోంది.

యాదాద్రి పవర్ ప్లాంట్‌పై 3 నెలల్లో నివేదిక

విచారణ కమిటీ చైర్మన్ జస్టిస్ నరసింహారెడ్డి

మిర్యాలగూడ: యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులకు టెండర్లు పిలవకుండా బీహెచ్ఈఎల్ కంపెనీకి అప్పగించడంతోపాటు ఛత్తీస్‌గఢ్‌తో వి ద్యుత్ కొనుగోలు ఒప్పంద విషయాలపై విచారణ చేపట్టి 3 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని పవర్ ప్లాంట్ విచారణ కమిటీ చైర్మన్, హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం శివారులో నిర్మిస్తున్న 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన బొగ్గు ఆధారిత పవర్ ప్లాంట్‌ను శనివారం ఆయన సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమాలు జరిగినట్లయితే నివేదికలో పొందుపరుస్తామన్నారు. పనుల కేటాయింపుపై నిర్ణయాలు తీసుకున్న వారికి నోటీసులు ఇచ్చామని, వారి నుంచి వివరణ తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే ఎన్‌జీవోలు, ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించామని వివరించారు. భద్రాద్రి సూపర్ క్రిటికల్ ప్లాంట్‌కు బదులు క్రిటికల్ ప్లాంట్‌గా మార్చేందుకు గత ప్రభుత్వం చూపిన సాంకేతిక కారణాలపై విచారణ చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలులో అక్రమాలు జరిగినట్లు వచ్చిన అభియోగంపై విచారణ జరుపుతున్నామని చె ప్పారు. ఆయన వెంట ప్లాంట్ సీఈ సమ్మయ్య, విజిలెన్స్ డీఎస్పీ రవీందర్ ఉన్నారు.

ప్రాణం తీసిన ఒక్క రూపాయి

- ఇద్దరి మధ్య ఘర్షణలో ప్రాణం కోల్పోయిన ఆటో డ్రైవర్



ప్రేమ్‌సాగర్ (ఫైల్)

ఖిలా వరంగల్: వరంగల్‌లో దారుణం జరిగింది. 'ఆఫ్టాల్ నువ్వు ఒక ఆటోడ్రైవర్‌వు. ఒక్క రూపాయి ఎక్కువ కొట్టే మొగోడివా'..? అంటూ ఇద్దరి మధ్య జరిగిన చిన్న ఘర్షణ చివరికి ఒకరి ప్రాణం తీసింది. శనివారం వరంగల్ క్రిస్టియన్ కాలనీ గాంధీనగర్‌లో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ మిల్స్‌కాలనీ గరీబ్‌నగర్ గొర్రెకుంటకు చెందిన ఇసంపెల్లి ప్రేమ్‌సాగర్ (38) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో ప్రేమ్‌సాగర్ గాంధీనగర్‌లోని 'నబీ రూ.59కే చికెన్ బిర్యానీ'సెంటర్‌కు వెళ్లాడు. ఆదే సమయంలో గాంధీనగర్‌కు చెందిన జన్ను అరవింద్ అక్కడికి చేరుకున్నాడు. ఇద్దరు స్నేహితులే. ఈ క్రమంలో ప్రేమ్‌సాగర్ బిర్యానీ తీసుకుని రూ.59కి బదులు రూ.60 ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. పక్కనే ఉన్న అరవింద్ దీనిపై స్పందించి.. 'ఒక్క రూపాయి ఎక్కువ కొట్టే మొగోడివి అయ్యావా'అంటూ ప్రేమ్‌సాగర్‌ను హేళన చేస్తూ మాట్లాడాడు. దీంతో ప్రేమ్‌సాగర్ ఒక్కసారిగా ఆవేశానికి లోనై 'నేను ఏమైనా అడుక్కు తింటున్నానా.. ఏం మాట్లాడుతున్నావు'అంటూ అరవింద్‌ను నిలదీశాడు. మాటా మాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. తోపులాటలో అరవింద్, బలంగా ప్రేమ్‌సాగర్‌ను నెట్టివేయగా రోడ్డుపై పడిపోయాడు. దీంతో అతని తలకు బలమైన గాయమై చిన్నమెదడు చిట్లి ముక్కు, చెవుల్లోనుంచి రక్తస్రావం కావడంతో స్పృహ కోల్పోయాడు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న ప్రేమ్‌సాగర్ తమ్ముడు విద్యాసాగర్‌తోపాటు అరవింద్ కలసి ఆటోలో ప్రేమ్‌సాగర్‌ను ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 1 గంట సమయంలో ప్రేమ్‌సాగర్ మృతిచెందాడు. వెంటనే అరవింద్ ఎంజీఎం నుంచి నేరుగా మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పోలీసులకు లొంగిపోయాడు. మృతుడి సోదరుడు విద్యాసాగర్ ఫిర్యాదు మేరకు శనివారం అరవింద్‌పై హత్యా నేరం కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
ఆదివారం ॥ 2-6-2024

వైరల్



మహారాణి మలాలా వేంచేస్తున్నారహో!

నోబెల్ బహుమతి గ్రహీత మలాలా యూసఫ్ జాయ్ బ్రిటిష్ టీవీ సిరీస్ 'వి ఆర్ లేడీ పార్ట్స్' రెండో సీజన్‌లో గెస్ట్ రోల్‌లో కనిపించనుంది. మలాలా కౌబాయ్ టోపీ ధరించి గుర్రపు స్వారీ చేస్తున్న ఈ షో ఫస్ట్ లుక్ వైరల్ అయింది. ఈ సిట్‌కామ్‌లో ఒక గాయకుడి కూతురు తన టీచర్‌పై గుడ్లు విసురుతుంది.

'అలా ఎందుకు చేశావు?' అని తల్లి అడుగుతుంది.

'బాలికల విద్య కోసం పోరాటానికి మలాలా ఏంచేసిందో నేనూ అదే చేశాను' అంటుంది బాలిక.

'మలాలా ఎప్పుడూ ఎవరి మీదా గుడ్లు విసరలేదు ' అంటుంది తల్లి. ఇలాంటి సరదా సన్నివేశాలెన్నో సిట్‌కామ్‌లో ఉన్నాయి. 'వి ఆర్ లేడీ పార్ట్స్'లో 'మలాలా మేడ్ మీ డూ ఇట్' అనే పాట కూడా ఉంది. ఈ పాటకు సంబంధించిన ఫాంటసీ సీక్వెన్స్‌లో మలాలా దుపట్టా, కౌబాయ్ హ్యాట్‌తో గుర్రంపై కనిపిస్తుంది. 'మలాలా మేడ్ మీ డూ ఇట్' సాంగ్‌లో అంజనా వాసన్, సారా కమీలా, జూలియట్ మెట మెడ్, లూసీ, ఒమోలు నటించారు. సెట్‌లో వీరి నటన చూసి ప్రశంసాపూర్వకంగా మాట్లాడింది మలాలా. నటిగా కొత్త పాత్ర గురించి అడిగినప్పుడు 'ఒకటి రెండు నిమిషాల క్లిప్ కోసం ఎన్ని టేకులు తీసుకున్నానో గుర్తు లేదు' నవ్వుతూ అంటుంది మలాలా.

అటెన్షన్... లుంగీ ఇన్ లండన్



దక్షిణ భారతంలో లుంగీతో కనిపించడం వింతేమీ కాదు. అయితే లండన్‌లో కనిపిస్తే మాత్రం వింతే. ఆ వింతే ఈ వీడియోను వైరల్ అయ్యేలా చేసింది. వలేరి అనే తమిళియన్ రంగు రంగుల లుంగీలు ధరించి లండన్ వీధుల్లో, పాపుల్లో 'రీల్స్' చేసి అక్కడి ప్రజల రియాక్షన్‌ను రికార్డ్ చేసింది. 'వియరింగ్ లుంగీ ఇన్ లండన్' కాప్షన్‌తో ఆమె పోస్ట్ చేసిన వీడియోలు వైరల్ అయ్యాయి.

మేజర్‌గారి ప్రసంగం మెగా హిట్



ప్రతిష్ఠాత్మక 'మిలిటరీ జెండర్ అడ్వకేట్ అవార్డ్' అందుకోవడంతో వార్తల్లోకి వచ్చిన మేజర్ రాధికాసేన్ తన 'వైరల్ స్పీచ్' ద్వారా మరోసారి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. 'జెండర్-సెన్సిటివ్ పీస్‌కీపింగ్' ప్రాముఖ్యత గురించి తన ప్రసంగంలో నొక్కి చెప్పింది సేన్. 'జెండర్-సెన్సిటివ్ పీస్‌కీపింగ్ అనేది కేవలం మహిళల బాధ్యత మాత్రమే కాదు. అది అందరి బాధ్యత. మహిళల ఆరోగ్యం, విద్య, శిశుసంరక్షణ. లింగసమానత్వం, లైంగిక హింసను ఎదుర్కోవడం లాంటి అంశాలపై కమ్యూనిటీలతో మమేకమయ్యే అవకాశం లభించింది' అంటుంది సేన్. ప్రసంగం అనంతరం ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ రాధికసేన్‌ను నిజమైన నాయకురాలిగా, మోడల్‌గా అభివర్ణించారు.

మానవత్వం పరిమళించిన మంచి మనసులు



'ఎవరికి వారే యమునా తీరే' అంటుంటాం గానీ పక్కన ఉన్న వాళ్లకు కష్టం వచ్చినప్పుడు జాతి, మత, కుల, ప్రాంతీయ లెక్కలు వేసుకోకుండా సహాయపడే సహజ గుణం మనిషిలో ఇంకా మిగిలే ఉంది. తాజా విషయానికి వస్తే... కేరళలోని మలప్పురంకు చెందిన ఒక మహిళ కేఎస్ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తోంది. పెరమంగళం దాటుతుండగా ఆమెకు పురిటి నొప్పులు మొదలయ్యాయి తమ కుటుంబంలోని వ్యక్తికి ఆ పరిస్థితి వస్తే ఎలా స్పందిస్తారో బస్సు సిబ్బంది, ప్రయాణికులు అలాగే స్పందించారు. తగిన ఏర్పాట్లతో వైద్యసిబ్బంది బస్సు దగ్గరికి వాయువేగంతో వచ్చారు. బస్సులోనే ఆమె పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ప్రయాణికులు, బస్సు సిబ్బంది, వైద్యులు, స్థానిక ప్రజల మానవత్వాన్ని చాటే ఈ వీడియో వైరల్ అయింది.

శాల్యూట్ ది టాలెంట్



మీనాక్షి అమ్మవారి రియలిస్టిక్ పోర్ట్రయిట్‌తో 'ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు సాధించింది మధురైకి చెందిన మోనిష కె. చార్‌కోల్, వాటర్ కలర్స్, కలర్ పెన్సిల్స్.. మొదలైన వాటితో అమ్మవారి పోర్ట్రయిట్‌ను చిత్రించింది. 'శాల్యూట్ ది టాలెంట్' కాప్షన్‌తో 'ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్' పోస్ట్ చేసిన మోనిష డ్రాయింగ్ వీడియో వైరల్‌గా మారింది.

కోవిడ్ కల్లోల కాలంలో ఆర్ట్‌పై ఆసక్తి పెంచుకున్న మోనిష క్రమక్రమంగా బొమ్మలు వేయడంలో పట్టుసాధించింది. ఇంటర్‌నెట్‌లో ఆమె బొమ్మలు పాపులర్ కావడమే కాదు ఆర్డర్లు కూడా రావడం మొదలైంది. ఆర్ట్‌కు సంబంధించి వివిధ మాధ్యమాల్లో ప్రయోగాలు చేస్తూ ఆర్టిస్ట్‌గా ప్రపంచవ్యాప్తంగా పేరు తెచ్చుకోవాలనేది మోనిష లక్ష్యం.

బహు భాషిణి

నటిగా సుపరిచితమైన శ్రద్ధా కపూర్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తాజాగా లిప్‌స్టిక్‌కు సంబంధించిన ఒక అడ్వర్‌టైజ్‌మెంట్‌లో బ్రిటిష్, ఫ్రెంచ్, రష్యన్, అమెరికన్ యాక్సెంట్‌లతో మాట్లాడి 'ఔరా' అనిపించింది. శ్రద్ధా నాలుగు విభిన్న భాషలను అలవోకగా మాట్లాడుతున్న ఈ వీడియో వైరల్ అయింది. గతంలో 'కపిల్ శర్మ షో'లో తన భాషా నైపుణ్యాన్ని ప్రదర్శించి 'శభాష్' అనిపించుకుంది శ్రద్ధ.



'శ్రద్ధా కపూర్‌లో మంచి మిమిక్రీ ఆర్టిస్ట్ ఉంది' అంటున్నారు ఆమె అభిమానులు.



అమ్మా... డబ్బులు ఇలా డ్రా చేయాలి

ఈ డిజిటల్ కాలంలో ఏటీయం వినియోగం, యూపీఏ పేమెంట్స్, ఆన్‌లైన్ బ్యాంకింగ్‌ల గురించి అవగాహన లేని పేరెంట్స్‌కు వాటి గురించి తెలియజేయడం అనివార్యం.


పాకిస్థాన్‌లోని ఒక ఏటీయం క్యాబిన్‌లో తల్లీకూతుళ్లు కనిపిస్తారు.

కార్డు ఉపయోగించి డబ్బు ఎలా డ్రా చేయాలి? అని అడుగుతుంది తల్లి.

కార్డును ఇన్‌సర్ట్ చేయడం నుంచి డబ్బు విత్‌డ్రా చేయడం వరకు తల్లికి ఓపికగా చెబుతుంది కూతురు. 'హ్యాపియెస్ట్ మూమెంట్ బీయింగ్ ఏ గర్ల్ ఫ్రమ్ ఏ మిడిల్ క్లాస్ ఫ్యామిలీ' కాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది.

'ప్రపంచ వ్యాప్తంగా ఇలాంటి తల్లిదండ్రులు ఎంతోమంది ఉన్నారు. అలాంటి వారికి డిజిటల్ విషయాలపై అవగాహన కలిగించడం పిల్లల తప్పనిసరి బాధ్యత' అంటూ నెటిజనులు స్పందించారు.

హెల్త్



జీర్ణవ్యవస్థను పీడించే ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్

వ్యాధి నిరోధక వ్యవస్థ బలహీన పడ్డప్పుడు జీర్ణ వ్యవస్థ ప్రధానంగా ఎదుర్కొనే సమస్యల్లో ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్ ఒకటి. ఇది రెండు రకాలు. ఒకటి అల్సరేటివ్ కొలైటిస్, రెండోది క్రోన్స్ డిసీజ్.

ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ అంటే?

జీర్ణాశయాన్ని బాధించే సమస్యలలో ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్ (ఐబీడీ), 'ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్' అనే రెండూ ప్రధానమైనవి. ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్‌లో తిన్న వెంటనే మలవిసర్జనకు వెళ్లాల్సి రావడమనే ఇబ్బంది తప్ప 'ఐబీడీ'లాగా పెద్దగా ఇబ్బంది పెట్టే అంశాలేమీ ఉండవు. 'ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్' అంటే ఏమిటి, దాని లక్షణాలూ, దానిని అదుపులో ఉంచుకోవడం ఎలాగో తెలిపే కథనమిది.

జీర్ణవ్యవస్థలో వచ్చే ఈ సమస్యలోని 'అల్సరేటివ్ కొలైటిస్'లో పెద్దపేగు లోపలి లైనింగ్‌లో ఇన్‌ఫ్లమేషన్ వస్తుంది. అప్పుడు అక్కడ పుండ్లు పడటం, కొన్నిసార్లు ఆ పుండ్ల నుంచి రక్తస్రావం కావచ్చు. ఆ భాగం మినహాయించి మిగతా జీర్ణ వ్యవస్థలో మరెక్కడైనా ఇన్‌ఫ్లమేషన్ రావడాన్ని 'క్రోన్స్ డిసీజ్' అంటారు. అంటే నోరు మొదలుకొని, చిన్నపేగుల వరకు ఎక్కడైనా ఇన్‌ఫ్లమేషన్ రావడం వల్ల ఒక్కోసారి ఆ భాగం సన్నగా మారడం లేదా పుండ్లు పడటం జరగవచ్చు.

కారణాలు: ఈ సమస్యలకు కారణాలు నిర్దిష్టంగా తెలియదు గానీ వ్యాధినిరోధక వ్యవస్థ బలహీనం కావడం వల్ల ఈ సమస్య వస్తుందని నిపుణులు భావిస్తున్నారు. జన్యుపరమైన అంశాలతోనూ, పర్యావరణ కారణాలతోనూ రావచ్చు. పొగతాగడం క్రోన్స్ డిసీజ్‌కు దారితీయవచ్చని అనేక అధ్యయనాల్లో వెల్లడైంది.

అల్సరేటివ్ కొలైటిస్ లక్షణాలు: ● నీళ్లవిరేచనాలు ● కడుపునొప్పి ● జ్వరం ● బరువు తగ్గడం ● తరచూ మలద్వారం నుంచి రక్తం, బంక (మ్యూకస్) పడుతుండటం ● కొన్నిసార్లు మలబద్ధకం ● ఇవిగాక... కీళ్ల నొప్పులు, కీళ్ల వాపు వంటి లక్షణాలు కూడా ఉంటే వ్యాధి తీవ్రంగా ఉందని భావించాలి.

క్రోన్స్ డిసీజ్ లక్షణాలు: ● నీళ్ల విరేచనాలు ● కడుపునొప్పి ● తీవ్రమైన అలసట, నీరసం, నిస్సత్తువ ● బరువు తగ్గడం ● నోటి పొక్కులు ● చర్మసమస్యలు ● కళ్లు ఎర్రబారడం, మండడం ● కొందరిలో మలద్వార సమస్యలైన ఫిస్టులా, మలద్వారం చీరుకుపోవడం, కుచించుకుపోవడం.

నిర్ధారణ పరీక్షలు: ● కొలనోస్కోపీ ● గ్యాస్ట్రో ఇంటస్టినల్ ఎండోస్కోపీ ● రక్తపరీక్షలు, అవసరాన్ని బట్టి సీటీ స్కాన్, ఎమ్మారైలతోపాటు కొన్ని సందర్భాల్లో పెద్ద పేగు బయాప్సీ.

చికిత్స: అల్సరేటివ్ కొలైటిస్‌కు... కొన్ని మందులతో లక్షణాలు తగ్గించడంతోపాటు అవి మళ్లీ రాకుండా చూస్తారు. ఉదాహరణకు నొప్పి తగ్గడానికి వాడే నాన్ స్టెరాయిడల్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డ్రగ్స్ వంటి వాటి వాడకం

● మందులు వాడినప్పటికీ లక్షణాలు తగ్గని కండిషన్‌ను రిఫ్రాక్టరీ అల్సరేటివ్ కొలైటిస్ అంటారు. వ్యాధినిరోధక వ్యవస్థ అతిగా స్పందించడం వల్ల ఇలా జరుగుతుందని గుర్తించినప్పుడు రోగ నిరోధక వ్యవస్థ తాత్కాలికంగా మందగించేందుకు 6-మెర్కాప్టోప్యూరిన్, అజాథియోప్రిన్ వంటి మందులూ, అప్పటికీ గుణం కనిపించకపోతే సైక్లోస్పోరిన్ వంటి మందులు వాడాలని సూచిస్తారు

● **శస్త్రచికిత్స:** సమస్య ఎంతకీ తగ్గకపోతే అప్పుడు శస్త్రచికిత్స చేసి ప్రభావితమైన మేరకు పెద్దపేగు భాగాన్ని తొలగిస్తారు. అవసరమైతే దేహంలో మరెక్కడైనా (సాధారణంగా నడుము దగ్గర) మలద్వారం ఏర్పాటు చేసి, చిన్నపేగు చివరి భాగం అక్కడ తెరుచుకునేలా చూస్తారు.


● అల్సరేటివ్ కోలిటిస్ ● క్రోన్స్ డిసీజ్

క్రోన్స్ డిసీజ్‌కు... ఇందులో జీర్ణవ్యవస్థలోని ఏ భాగమైనా ప్రభావితం అయ్యే అవకాశం ఉంది కాబట్టి... నిర్దిష్టంగా ఏ భాగం ప్రభావితమైందన్న అంశాన్ని బట్టి చికిత్స అందిస్తారు.

ఈ వ్యాధికి చేసే చికిత్సల్లో కొన్ని...

● జీర్ణవ్యవస్థలోని వాపును తగ్గించడానికి 5-అమైనోశాల్సిలేట్స్ (5-ఏఎస్ఏ) అనే మందులూ, వాటితో ఫలితం కనిపించకపోతే అవసరాన్ని బట్టి యాంటీబయాటిక్స్ ఇస్తారు ● వీటితో గుణం కనిపించకపోతే అవసరాన్ని బట్టి పరిమిత కాలం పాటు ప్రెడ్నిసోన్, బ్యూడిసోనైడ్ వంటి స్టెరాయిడ్స్‌ను వైద్యులు సూచించవచ్చు ● లక్షణాల తీవ్రత ఎక్కువగా ఉన్నవారికి ఇమ్యునో మాడ్యులేటర్స్ లేదా బయలాజిక్ రెస్పాన్స్ మాడిఫైయర్స్ అనే మందులను సూచిస్తారు.

ఆహారంతో అదుపు ఇలా...

● పాలు, పాల ఉత్పాదనలైన జున్ను, వెన్న, పెరుగు పుడ్డింగ్స్ ● చాక్లెట్లు, పేస్ట్రీలు, కేకులు ● పల్లీలు ● కృత్రిమరంగులు వాడిన ఆహారాలు ● పుల్లటి పండ్లు, పండ్ల రసాలు ● మసాలాలు ● వేపుళ్లు, ఫాస్ట్‌ఫుడ్, చైనీస్ ఫుడ్స్ ● కెచప్ ● క్యాబేజీ, బ్రాకలీ, క్యాలీఫ్లవర్ ● బీన్స్, కందులు ● వేటమాంసం ● ఆల్కహాల్ కు పూర్తిగా దూరంగా ఉండాలి.

ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్ (ఐబీడీ)తో పాటు ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ (ఐబీఎస్) అనే మరో సమస్యా ఉంది. తినగానే విరేచనానికి వెళ్లడం, కొందరిలో మలబద్ధకంతో బాధించే ఈ ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ (ఐబీఎస్)లో తినగానే వెంటనే మలవిసర్జనకు వెళ్లాల్సిరావడమనే ఇబ్బంది తప్ప పెద్దగా సమస్యలు బాధించకపోవచ్చు. ఐబీఎస్ (ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్), ఐబీడీ (ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్) రెండూ వేర్వేరనీ, అందులో ఐబీడీ తీవ్రమైనదని గుర్తించాలి.

(ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ (ఐబీఎస్) వివరాలు పక్కనే...)



డా॥ కావ్య దెందుకూరి
కన్సల్టెంట్ హెపటాలజిస్ట్ & గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్

తినీ తినగానే వెంటనే టాయ్‌లెట్‌కు పరుగెత్తాలనిపించడం లేదా బయట ఎక్కడైనా తినాల్సి వస్తే అలా తినడానికి ముందే మరుగుదొడ్డి ఎక్కడుందో వెతుక్కోవాల్సి రావడం 'ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్' (ఐబీఎస్)లో ప్రధాన సమస్య. అందుకే ఈ సమస్య ఉన్నవారు బయట లంచ్ చేయడానికీ, ఎవరి ఇంటికైనా అతిథిగా హాజరయ్యేందుకూ, విహార యాత్రలకు వెళ్లడానికీ వెనకాడుతుంటారు. అయితే మరికొందరిది దీనికి పూర్తిగా భిన్నమైన పరిస్థితి. వాళ్లను మలబద్ధకం వేధిస్తుంటుంది.

ఈ అంశం ఆధారంగా 'ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్'లో నాలుగు రకాలుంటాయి.

ఐబీఎస్ రకాలు: ● **ఐబీఎస్ - డయేరియా (ఐబీఎస్-డీ):** నీళ్లవిరేచనాలతో కడుపులో ఇబ్బంది.

● **ఐబీఎస్ - కాన్‌స్టిపేషన్ (ఐబీఎస్-సీ):** మలబద్ధకంతో పాటు కడుపులో ఇబ్బంది.

● **ఐబీఎస్ - మిక్స్‌డ్ (ఐబీఎస్ - ఎమ్):** కొన్నిసార్లు నీళ్లవిరేచనాలూ, మరికొన్నిసార్లు మలబద్ధకం... ఈ రెండు ఇబ్బందులూ మార్చి మార్చి వస్తుండడం.

● **ఐబీఎస్ - అన్-ఐడెంటిఫైడ్ (ఐబీఎస్-యూ):** లక్షణాలు స్థిరంగా ఉండక మారుతుంటాయి.

కారణాలు: నిర్దిష్టమైన కారణాలు లేవు. అయితే, జీర్ణాశయానికీ, మెదడుకు మధ్య ఏర్పడే కమ్యూనికేషన్ లోపాలే ఈ సమస్యకు ముఖ్య కారణాలుగా భావిస్తుంటారు. దాంతోపాటు పేగుల కదలికలలో లోపాలు, జీర్ణాశయపు నరాల్లో అతి చురుకుదనం, జీర్ణాశయం (గట్) బ్యాక్టీరియాలో మార్పుల వల్ల వచ్చే తేడాలు, కొందరిలో తీవ్రమైన ఇన్ఫెక్షన్ల తర్వాత, మరికొందరిలో కొన్ని రకాల ఆహారాలు సరిపడకపోవడం, బాల్యంలో తీవ్రమైన ఒత్తిడులు ఎదుర్కోవడం వంటివి.

లక్షణాలు: ● విరేచనానికి వెళ్లగానే కడుపులోని ఇబ్బంది తొలగిపోవడం ● మలవిసర్జనలో విరేచనం అయ్యాక కూడా ఇంకా ఏదో మిగిలి ఉన్న ఫీలింగ్ ● కడుపులో గ్యాస్, కడుపు ఉబ్బరం ● మలంలో బంక.

నిర్ధారణ: లక్షణాలను బట్టి నిర్ధారణ చేస్తారు. కొన్ని సందర్భాల్లో కొన్ని రక్తపరీక్షలు, మల పరీక్షతో పాటు జీర్ణాశయంలో బ్యాక్టీరియా పెరుగుతోందేమో తెలుసుకోవడం కోసం 'హైడ్రోజన్ బ్రెత్ టెస్ట్' అనే పరీక్ష.

చికిత్స: ● పీచు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలతో పాటు 'లో-ఫోడ్‌మ్యాప్' ఆహారం.

లో-ఫోడ్‌మ్యాప్ ఆహారం అంటే... 'ఫర్మెంటబుల్ ఆలిగోశాకరైడ్స్, డై శాకరైడ్స్, మోనోశాకరైడ్స్ అండ్ పాలీయాల్స్' అనే రకాల ఆహార పదార్థాల మొదటి అక్షరాలను (ఇంగ్లిష్‌లోని) చేర్చడం ద్వారా 'ఫోడ్‌మ్యాప్' అనే మాటను రూపొందించారు. ఆహారాల్లోని పోషకాల నిర్మాణాన్ని బట్టి, వాటిలోని చక్కెరలను బట్టి ఆ ఆహారాలను అలా పిలుస్తుంటారు. ఆ ఫోడ్ మ్యాప్ డైట్ చార్ట్ ప్రకారం...

తీసుకోవాల్సిన ఆహారాలు...

అన్నం, ఓట్స్, గ్లూటెన్ ఫ్రీ బ్రెడ్; అరటి, నేరేడు, ద్రాక్ష, కివీ, నిమ్మ, బత్తాయి, నారింజ, బొప్పాయి, పైనాపిల్, స్ట్రాబెర్రీ; క్యారట్, దోస, అల్లం, మిరియాలు, లెట్యూస్, ఆలూ, పాలకూర, టొమాటో వంటివి. ప్రొటీన్లలో చికెన్, ఫిష్, టోఫూ, నట్స్‌లో పల్లీలు, వాల్‌నట్స్.

తీసుకోకూడనివి ...

పాస్తా, కేక్స్, బిస్కెట్లు, పండ్లలో పియర్స్, ప్రూన్, పీచెస్, చెర్రీస్ వంటివి, ఆకుకూరలలో బ్రాకలీ, కాలీఫ్లవర్, ఉల్లి, వెల్లుల్లి, బీట్‌రూట్, పప్పులలో బీన్స్, సోయాబీన్స్ మొదలైనవి.

పాటించాల్సినవి... ● నీళ్లు ఎక్కువగా తాగడం, క్రమబద్ధమైన వ్యాయామం, కంటినిండా నిద్ర ● లక్షణాల తీవ్రత ఎక్కువగా ఉంటే... మలబద్ధకం ఉన్నవారికి లాక్సెటివ్స్ అనే విరేచనకారి మందులూ, నీళ్లవిరేచనాలు అయ్యేవారికి యాంటీ డయేరియల్ మందులు, అవసరాన్ని బట్టి కొందరికి యాంటీ డిప్రెసెంట్స్, ఇంటెస్టినల్ స్పాజమ్స్, క్రాంప్స్ తగ్గించే మందులూ వాడాల్సి రావచ్చు.

మెడి టిప్

గ్యాస్ సమస్య తగ్గించుకోవడం ఇలా...

కడుపులో గ్యాస్‌తో పొట్ట ఉబ్బరంగా ఉంటే అది బయటకు వెళ్లేవరకు ఓ సమస్యే. ఈ గ్యాస్ సమస్య తగ్గాలంటే పాటించాల్సిన సూచనలివి...

- తక్కువ మోతాదుల్లో ఎక్కువ సార్లు తినాలి. అది కూడా బాగా నమలి తినడం.
- గాలి నోట్లోంచి కడుపులోకి చేరకుండా జాగ్రత్తగా ఆహారాన్ని నమలడం.
- కొవ్వు ఎక్కువగా ఉండేవీ, డీప్ ఫ్రైలు, వేపుళ్లు వీలైనంత తక్కువగా తీసుకోవడం.
- కాఫీ, టీ పరిమితంగా తీసుకోవడం.
- సోడాలు, కార్బొనేటెడ్ అండ్ కూల్ డ్రింక్స్‌కు దూరంగా ఉండటం.



- సరిపడనివారు పాలూ, పాల ఉత్పాదనలకు దూరంగా ఉండటం.
- పొగ, ఆల్కహాల్ అలవాట్లు పూర్తిగా మానేయడం.
- రోజూ కనీసం రెండు లీటర్ల కంటే ఎక్కువగా మంచినీళ్లు తాగాలి.
- బరువు పెరగకుండా ఉండేందుకు రోజూ వ్యాయామం చేయడం.



గాయత్రి-ట్రెసా జోరుకు సెమీస్‌లో బ్రేక్

సింగపూర్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో సంచలన విజయాలతో దూసుకెళ్తున్న పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీకి సెమీఫైనల్లో చుక్కెదురైంది. శనివారం జరిగిన మహిళల డబుల్స్ సెమీస్‌లో భారత ద్వయం 21-23, 11-21తో ప్రపంచ నాలుగో ర్యాంకు జోడీ నమి మత్సుయామ-చిహారు షిడా (జపాన్) చేతిలో పరాజయం చవిచూసింది. 47 నిమిషాల పాటు జరిగిన ఈ పోరాటంలో గాయత్రి-ట్రెసా జంట తొలి గేమ్‌లో నాలుగో సీడ్ ప్రత్యర్థులతో హోరాహోరీగా తలపడింది. ఒక దశలో 5-10తో వెనుకబడిన వీరు చక్కటి ఆటతో స్కోరును 16-16 వరకు తీసుకొచ్చారు. ఆ తర్వాత జపాన్ జోడి 20-18తో గేమ్ పాయింట్ వద్ద నిలిచినా...భారత ద్వయం సులువుగా తలవంచలేదు. చివరకు ఈ గేమ్‌లో పోరాడి ఓడింది. రెండో గేమ్‌లో మాత్రం జపాన్ జంట జోరుకు ఎదురు నిలువ లేకపోయింది. చెలరేగిన ఈ జోడి 20-6తో తిరుగులేని ఆధిక్యంలోకి దూసుకుపోయింది. గాయత్రి-ట్రెసా పట్టుదలగాఆడి మరో 5 పాయింట్లు సాధించినా...ఆ తర్వాత పరాజయం తప్పలేదు. తాజా ఫలితంతో జపనీస్ ద్వయం ఫిబ్రవరిలో ఆసియా టీమ్ చాంపియన్‌షిప్‌లో గాయత్రి-ట్రెసా జోడీ చేతిలో ఎదురైన పరాజయానికి బదులు తీర్చుకుంది.

‘విశ్వ’ వేదికపై ధనాధన్

పదిహేడేళ్ల క్రితం... ఐసీసీ తొలి టి20 ప్రపంచకప్‌ను నిర్వహించింది. ఆ మెగా ఈవెంట్‌లో విజేతగా నిలిచిన భారత్ టి20 ఫార్మాట్‌కు కొత్త దశ, దిశను చూపించింది. కానీ ఆ తర్వాత ఏడు ప్రయత్నాల్లోనూ మరో టైటిల్ సాధించడంలో విఫలమైంది. ఇప్పుడైనా మన అభిమానుల సుదీర్ఘ నిరీక్షణకు తెర పడుతుందా! మరో వైపు విధ్వంసక బ్యాటింగ్‌తో ఆట రూపు మార్చిన వెస్టిండీస్, ఇంగ్లండ్ రెండేసి ట్రోఫీలతో అగ్ర స్థానంలో నిలిచాయి. ఈ రెండు జట్లు తమకు తెలిసిన అదే విద్యతో మూడో టైటిల్‌పై కన్నేశాయి. ఆల్‌రౌండర్ల అడ్డా ఆస్ట్రేలియా, మరో మాజీ చాంపియన్ శ్రీలంక రెండో ట్రోఫీపై గురి పెట్టాయి. ఈ సారైనా తొలి టైటిల్ అందుకోవాలని న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా విశ్వప్రయత్నం చేసేందుకు సిద్ధమయ్యాయి. ఇక గత ఫైనలిస్ట్ పాకిస్తాన్ కూడా అనూహ్య ప్రదర్శనతో మరో సారి విజేతగా నిలుస్తుందా అనేది ఆసక్తికరం. ఈ ఎనిమిది అగ్రశ్రేణి జట్లకు తోడు మరో 12 టీమ్‌లు విశ్వ వేదికపై తమ ముద్ర చూపాలని పట్టుదలగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో తొమ్మిదో టి20 ప్రపంచ కప్ సంగ్రామానికి నేటితో తెర లేవనుంది.



టి20 ప్రపంచకప్‌తో భారత కెప్టెన్ రోహిత్ శర్మ

నేటి నుంచి టి20 వరల్డ్ కప్

- బరిలో 20 జట్లు
- తొలి పోరులో కెనడాతో అమెరికా ఢీ
- బుధవారం భారత్ మొదటి మ్యాచ్

న్యూయార్క్: తొలి సారి అగ్రరాజ్యం అమెరికా వేదికగా క్రికెట్ ప్రపంచకప్‌కు రంగం సిద్ధమైంది. వెస్టిండీస్‌తో కలిసి ఈ సారి అమెరికా టి20 వరల్డ్ కప్ టోర్నీకి ఆతిథ్యం ఇస్తోంది. వెస్టిండీస్‌లో 2010లోనే ఈ మెగా పోరు జరిగింది. క్రికెట్‌ను మరిన్ని దేశాలకు విస్తరింపజేయడంలో భాగంగా ఐసీసీ తొలి సారి 20 జట్లతో వరల్డ్ కప్ నిర్వహిస్తోంది. ర్యాంకింగ్, ఆతిథ్య జట్టు హోదాలో టీమ్‌లు ముందుగా అర్హత సాధించగా...క్వాలిఫయింగ్ టోర్నీల ద్వారా ఇతర జట్లు బరిలో నిలిచాయి. ఈ టోర్నీ కోసం అమెరికాలో ప్రత్యేకంగా క్రికెట్ మైదానాలను సిద్ధం చేశారు. అప్పటికి మల్టీ పర్పస్ స్టేడియాలుగా ఉన్నవాటిని బయటినుంచి తీసుకొచ్చిన ‘డ్రాప్ ఇన్’ పిచ్‌లతో క్రికెట్ మ్యాచ్‌ల వేదికలుగా మార్చారు. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్ కూడా భాగంగా ఉండటంతో ఈ వరల్డ్ కప్ ద్వారా అక్కడి అభిమానులను ఆకర్షించేందుకు ఐసీసీ ప్రయత్నిస్తోంది. తొలి పోరులో ఆతిథ్య అమెరికా జట్టు తమ చిరకాల ప్రత్యర్థి కెనడాతో తలపడనుంది.

నాలుగు గ్రూప్‌లుగా...

మొత్తం 20 జట్లను 5 జట్ల చొప్పున 4 గ్రూప్‌లుగా విభజించారు. ఆయా జట్లు తమ గ్రూప్‌లోని ఇతర నాలుగు జట్లతో తలపడతాయి. టాప్-2లో నిలిచిన రెండు టీమ్‌లు ముందంజ వేస్తాయి. ఆ దశలో ఎనిమిది టీమ్‌లతో రెండు గ్రూప్‌లుగా విడదీసి సూపర్ ఎయిట్ నిర్వహిస్తారు. ఇక్కడ మరో మూడు మ్యాచ్‌లు ఆడే అవకాశం లభిస్తుంది. ఆపై సెమీస్, ఫైనల్ జరుగుతాయి. వెస్టిండీస్‌లో ఆరు, అమెరికాలలో మూడు వేదికలలో మ్యాచ్‌లు నిర్వహిస్తారు.

భారత్ ఎంత వరకు...

తొలి వరల్డ్ కప్ విజయాన్ని మినహాయిస్తే భారత్ మరో మూడు సార్లు చెప్పుకోదగ్గ ప్రదర్శన కనబర్చింది. 2014లో ఫైనల్లో ఓడిన జట్టు...2016, 2022లలో సెమీ ఫైనల్ చేరింది. మిగిలిన నాలుగు సందర్భాల్లో లీగ్ దశకే పరిమితమైంది. ఈ సారి కూడా దాదాపుగా రెండేళ్ల క్రితం బరిలోకి దిగిన జట్టుతోనే టీమిండియా తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతోంది. రోహిత్ శర్మ కెప్టెన్సీ, రాహుల్ ద్రవిడ్ కోచ్‌గా ఈ బృందం తమ అత్యుత్తమ ఆట తీరును కనబరిస్తే మంచి ఫలితాలు రాబట్టవచ్చు. మన జట్టు స్థాయి, ఆటగాళ్ల ఫామ్‌ను చూస్తే సెమీఫైనల్ వరకు వెళ్లడం ఖాయం. మిగిలిన రెండు నాకౌట్ మ్యాచ్‌లే కీలకమైనవి.

వరల్డ్ కప్‌లో నేటి మ్యాచ్‌లు

అమెరికా X కెనడా
ఉదయం.గం.6.00 నుంచి

వెస్టిండీస్ X పపువా న్యూగినియా
రాత్రి.గం. 8.00 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం

అబ్రహామ్ లింకన్ బొమ్మతో...



ఆశ్చర్యకరమే అయినా క్రికెట్ చరిత్రలో అతి పురాతన సమరంగా అమెరికా, కెనడా మధ్య పోరుకు గుర్తింపు ఉంది. 1877లో ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య తొలి టెస్టు జరిగినా...దానికి చాలా ఏళ్ల క్రితమే 1844లో మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లో అమెరికా, కెనడా తలపడినట్లుగా రికార్డులు చెబుతున్నాయి. 180 సంవత్సరాల తర్వాత ఇప్పుడు అమెరికా, కెనడా మధ్య టి20 వరల్డ్ కప్‌లో సమరం జరగబోతోంది. ఇరు జట్లకు టి20 వరల్డ్ కప్ చరిత్రలో ఇదే తొలి మ్యాచ్ కావడం విశేషం. డాలస్‌కు ఈ మ్యాచ్ వేదికవుతోంది. స్థానికంగా క్రికెట్ అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నంలో మార్కెటింగ్ నిపుణులు కొత్త తరహా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్యాడ్‌లు, బ్యాట్‌తో ‘స్కోర్ ఫోర్’ అని రాసి ఉన్న అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహాం లింకన్ బొమ్మ ముద్రించిన టీ షర్ట్‌లను పీజే గోడ్‌హాల్స్ అనే ఔత్సాహిక వ్యాపారి, క్రికెట్ అభిమాని ఈ మ్యాచ్ వేదికపై అమ్మకానికి ఉంచాడు. 1849లో చికాగో, మిల్‌వాకీ నగరాల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌కు లింకన్ అతిథిగా హాజరయ్యారు.

‘సాధన’ సరిపోయింది

- వామప్ మ్యాచ్‌లో భారత్ విజయం
- 60 పరుగులతో బంగ్లాదేశ్ చిత్తు
- టీమిండియా సమష్టి ప్రదర్శన

న్యూయార్క్: బ్యాటింగ్‌లో రిషభ్ పంత్, హార్దిక్ పాండ్యా తమదైన శైలిలో దూకుడుగా ఆడారు...సూర్యకుమార్, రోహిత్ శర్మ కూడా కీలక పరుగులు సాధించారు. దూబే, సామ్సన్ మాత్రం ఈ అవకాశాన్ని వినియోగించుకోలేకపోయారు...బౌలింగ్‌లో కూడా ప్రధాన బౌలర్లంతా బరిలోకి దిగి ఆకట్టుకున్నారు...ఓవరాల్‌గా టి20 వరల్డ్ కప్‌లో ప్రధాన టోర్నీకి ముందు ఏకైక వామప్ మ్యాచ్‌లో భారత జట్టు మెరుగైన ప్రదర్శన కనబర్చింది. దీని ద్వారా టీమ్ తుది జట్టుపై ఒక అంచనా కూడా వచ్చింది. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లి ఆడలేదు. యశస్వికి మ్యాచ్ ఇవ్వకపోవడాన్ని బట్టి చూస్తే ప్రధాన జట్టులో అతను ఉండే అవకాశాలు దాదాపుగా లేకపోవడంతో పాటు రోహిత్, కోహ్లి ఓపెనర్లుగా బరిలోకి దిగవచ్చు. ఇక్కడ విఫలమైనా...టాపార్డర్‌లో సామ్సన్ పేరును టీమ్ మేనేజ్‌మెంట్ పరిశీలిస్తుండగా, దూబే బౌలింగ్ చేయడాన్ని బట్టి చూస్తే ఆల్‌రౌండర్‌గా జట్టుకు మంచి ప్రత్యామ్నాయం అందుబాటులో ఉన్నట్లే. మరో వైపు కొత్తగా నిర్మించిన నాసా కౌంటీ క్రికెట్ గ్రౌండ్ మాత్రం వరల్డ్ కప్ స్థాయికి తగినట్లుగా కనిపించలేదు. అవుట్‌ఫీల్డ్ బంతి పడ్డ ప్రతి చోటా దుమ్ము రేగడం చూస్తే ఈ స్టేడియంను సిద్ధం చేయడంలో ఐసీసీ తొందరపడినట్లు అనిపించింది. ఇదే వేదికపై భారత్ లీగ్ దశలో తమ తొలి మూడు మ్యాచ్‌లు ఆడనుంది. మ్యాచ్ ఫలితంతో సంతృప్తి చెందినట్లు, తాము అనుకున్న రీతిలో ప్రాక్టీస్ లభించినట్లు విజయం అనంతరం భారత కెప్టెన్ రోహిత్ శర్మ వ్యాఖ్యానించాడు.

శనివారం జరిగిన వామప్ పోరులో భారత్ 62 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. రిషభ్ పంత్ (32 బంతుల్లో 53 రిటైర్డ్ అవుట్; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), హార్దిక్ పాండ్యా (23 బంతుల్లో 40 నాటౌట్; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు. సూర్యకుమార్ యాదవ్ (18 బంతుల్లో 31; 4 ఫోర్లు) రాణించగా, రోహిత్ శర్మ (19 బంతుల్లో 23; 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించగా... శివమ్ దూబే (14), సంజు సామ్సన్ (1) విఫలమయ్యారు. అనంతరం బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 122 పరుగులు చేసింది. మహ్మదుల్లా (28 బంతుల్లో 40 రిటైర్డ్ అవుట్; 4 ఫోర్లు, 1 సిక్స్), షకీబ్ అల్ హసన్ (34 బంతుల్లో 28; 2 ఫోర్లు) మినహా అంతా విఫలమయ్యారు. భారత బౌలర్లలో అర్‌ష్‌దీప్ సింగ్, శివమ్ దూబే చెరో 2 వికెట్లు పడగొట్టగా...అక్షర్ పటేల్, బుమ్రా, సిరాజ్, హార్దిక్ పాండ్యా ఒక్కో వికెట్ పడగొట్టారు.



పంత్

ప్రిక్వార్టర్స్ చేరిన రిబాకినా

- జ్వెరెవ్, అల్‌కరాజ్ కూడా...
- ఫ్రెంచ్ ఓపెన్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో కజకిస్తాన్ స్టార్ రిబాకినా, రెండో సీడ్ సబలెంక అలవోక విజయాలతో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగుపెట్టారు. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ మూడోరౌండ్లో నాలుగో సీడ్ రిబాకినా (కజకిస్తాన్) 6-4, 6-2తో వరుస సెట్లలో ఎలైస్ మెర్టెన్స్ (బెల్జియం)ను చిత్తు చేయగా, రెండో సీడ్ సబలెంక (రష్యా) 7-5, 6-1తో బడొసా (స్పెయిన్)పై నెగ్గింది. ఆస్ట్రేలియా ఓపెన్ రన్నరప్, ఏడోసీడ్ క్విన్‌వెన్ జెంగ్‌కు రష్యా ప్లేయర్ ఎలీనా అవనెసియాన్ షాకిచ్చింది. మూడో రౌండ్లో అన్‌సీడెడ్ ఎలీనా 3-6, 6-3, 7-6 (10/6)తో చైనా స్టార్‌ను ఇంటిదారి పట్టించింది. మరో మ్యాచ్‌లో వింబుల్డన్ చాంపియన్ మార్కెటా వొంద్రొసొవా (చెక్ రిపబ్లిక్) 6-1, 6-3తో క్లో పాక్వెట్ (ఫ్రాన్స్)పై గెలిచి ప్రిక్వార్టర్స్ చేరింది. పురుషుల సింగిల్స్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్, అల్‌కరాజ్ ముందంజ వేశారు. మూడోరౌండ్లో నిరుటి సెమీఫైనలిస్ట్, నాలుగో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) 3-6, 6-4, 6-2, 4-6, 7-6 (10/3)తో టాలన్ గ్రీక్‌స్పూర్ (నెదర్లాండ్స్)పై శ్రమించి నెగ్గాడు. స్పెయిన్ స్టార్, మూడో సీడ్‌కార్లోస్ అల్‌కరాజ్ 6-4, 7-6 (7/5), 6-3తో 27వ సీడ్ సెబాస్టియన్ కోర్డా (అమెరికా)పై గెలుపొందగా, సిట్సిపాస్ (గ్రీస్) 6-3, 6-3, 6-1తో జాంగ్ జిజెన్ (చైనా)ను ఓడించాడు. ఆస్ట్రేలియా ఓపెన్ రన్నరప్, ఐదో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) 7-6 (7/4), 7-5, 1-6, 6-4తో థామస్ మచక్ (చెక్ రిపబ్లిక్)పై చెమటోడ్చి విజయం సాధించాడు.

శ్రీరామ్ బాలాజీ ముందంజ

భారత ఆటగాడు శ్రీరామ్ బాలాజీ ఫ్రెంచ్ ఓపెన్‌లో వరుస విజయాలతో దూసుకెళ్తున్నాడు. పురుషుల డబుల్స్‌లో మిగెల్ వరేలా (మెక్సికో)తో జోడీకట్టిన బాలాజీ మూడో రౌండ్లోకి ప్రవేశించాడు. రెండో రౌండ్లో భారత్-మెక్సికన్ ద్వయం 6-4, 3-6, 6-2తో డాన్ ఆడెడ్-థియో అరిబేజ్ (ఫ్రాన్స్) జంటపై గెలిచింది.



రిబాకినా

సినిమా



నాగ్ అశ్విన్, ప్రియాంక, అశ్వినీదత్, స్వప్న



‘దిల్’ రాజు, అనిల్ రావిపూడి



రవిశంకర్, నవీన్, సుకుమార్



బుచ్చిబాబు



సునీల్, రామ్మోహన్ రావు, శేఖర్ కమ్ముల

లెక్క కుదిరింది

కెప్టెన్ ఆఫ్ ది షిప్ (డైరెక్టర్)కి, షిప్ ఓనర్ (ప్రొడ్యూసర్)కి మధ్య మంచి రిలేషన్ ఉండాలి. షిప్ (సినిమా)ని జాగ్రత్తగా హ్యాండిల్ చేసి, యజమాని నష్టపోకుండా కెప్టెన్ చూసుకుంటే.. ఇక అతనికి, యజమానికీ మధ్య మంచి అవగాహన కుదురుతుంది. మళ్లీ మళ్లీ కలిసి ప్రయాణం చేయాలనుకుంటారు. అలా లెక్కలు కుదిరి కొన్ని కాంబినేషన్లు రిపీట్ అవుతున్నాయి. ఇలా ఓ దర్శకుడికి-నిర్మాతకి మధ్య స్నేహం కుదరడం, మళ్లీ కలిసి సినిమాలు చేయాలనుకోవడం ఓ ఆరోగ్యకరమైన వాతావరణం అని చెప్పాలి. రిపీట్ అవుతున్న ఆ దర్శక-నిర్మాతల కాంబినేషన్ గురించి తెలుసుకుందాం.

మూడోసారి ‘దిల్’ కలిసింది

కుటుంబ నేపథ్యంలో సినిమాలు తీసి విజయాలు అందుకునే నిర్మాతగా ‘దిల్’ రాజుకి పేరుంది. ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వుకునేలా సినిమా తెరకెక్కించగల దర్శకుడు అనిల్ రావిపూడి. వీరిద్దరి కాంబినేషన్‌లో సుప్రీమ్ (2016), ‘రాజా ది గ్రేట్’ (2017), ‘ఎఫ్ 2’ (2019), ‘సరిలేరు నీకెవ్వరు’ (2020), ‘ఎఫ్ 3’ (2022) వంటి హిట్ సినిమాలు వచ్చాయి. తాజాగా అనిల్-‘దిల్’ రాజు కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనుంది. ఇందులో వెంకటేశ్ హీరో. హిట్ చిత్రాలు ‘ఎఫ్ 2’, ‘ఎఫ్ 3’ తర్వాత వెంకటేశ్-అనిల్ రావిపూడి-‘దిల్’ రాజు కాంబినేషన్‌లో రూపొందనున్న మూడో చిత్రమిది. ఈ సినిమాకి ‘సంక్రాంతికి వస్తున్నాం’ టైటిల్ అనుకుంటున్నారట.

గురు-శిష్యులతో మైత్రీ

డైరెక్టర్ సుకుమార్-మైత్రీ మూవీ మేకర్స్ నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్‌ల కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం ‘రంగస్థలం’ (2018). రామ్‌చరణ్, సమంత జోడీగా నటించిన ఈ మూవీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. సుకుమార్-మైత్రీ కాంబినేషన్‌లో రూపొందిన రెండో చిత్రం ‘పుష్ప: ది రైజ్’ (2021). అల్లు అర్జున్, రష్మికా మందన్న జోడీగా నటించిన ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో వసూళ్ల వర్షం కురిపించింది. ఈ సినిమాకి సీక్వెల్‌గా సుకుమార్-నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ కాంబినేషన్‌లో ‘పుష్ప 2: ది రూల్’ తెరకెక్కుతోంది. ఈ చిత్రంలోనూ అల్లు అర్జున్, రష్మికానే జోడీగా నటిస్తున్నారు. ఆగస్టు 15న ఈ సినిమా రిలీజ్ కానుంది.

- సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సనాని దర్శకునిగా పరిచయం చేస్తూ వైష్ణవ్ తేజ్, కృతీ శెట్టి జంటగా మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ‘ఉప్పెన’ (2021) బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. తన రెండో చిత్రాన్ని కూడా మైత్రీలోనే చేస్తున్నారు బుచ్చిబాబు. రామ్‌చరణ్ హీరోగా నవీన్, రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్.



టీజీ విశ్వప్రసాద్, కార్తీక్



శ్రీకాంత్ చెరుకూరి, శ్రీకాంత్ ఓదెల

శేఖర్‌తో మరో సినిమా

ప్రేమకథలే కాదు.. కుటుంబ కథలనూ తనదైన శైలిలో తెరకెక్కించి ప్రేక్షకులను ఆకట్టుకునే దర్శకుడు శేఖర్ కమ్ముల. ఆయన ప్రస్తుతం ధనుష్, నాగార్జున హీరోలుగా ‘కుబేర’ సినిమా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని నారాయణ్ దాస్ కె. నారంగ్ ఆశీస్సులతో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ (ఏషియన్ గ్రూప్), అమిగోస్ క్రియేషన్స్‌పై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. కాగా శేఖర్, సునీల్ నారంగ్, రామ్మోహన్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న రెండో చిత్రం ఇది. ఈ కాంబినేషన్‌లో నాగచైతన్య, సాయి పల్లవి జంటగా వచ్చిన ‘లవ్ స్టోరీ’ (2021) సూపర్ హిట్టయింది.

హోమ్ బేనర్‌లో నాగ్ అశ్విన్

ఇంట్లోనే ఒక పెద్ద బేనర్ ఉంటే బయట బేనర్ల అవసరం అంతగా ఉండదు. డైరెక్టర్ నాగ్ అశ్విన్‌కి రెండు హోమ్ బేనర్లు వైజయంతీ మూవీస్, స్వప్న సినిమాస్ ఉన్నాయి. అశ్వినీదత్ రెండో కుమార్తె ప్రియాంక, నాగ్ అశ్విన్ పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. వైజయంతీ మూవీస్‌పై అశ్వినీదత్, స్వప్న సినిమాస్‌పై ఆయన కుమార్తెలు ప్రియాంక, స్వప్న సినిమాలు నిర్మిస్తున్నారు. ఈ బేనర్లలో ‘ఎవడే సుబ్రమణ్యం’ (2015), ‘మహానటి’ (2018) సినిమాలకు దర్శకత్వం వహించారు నాగ్ అశ్విన్. ప్రస్తుతం ఆయన దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ నిర్మించిన చిత్రం ‘కల్కి 2898 ఏడీ’. ప్రభాస్ హీరోగా సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఈ నెల 27న రిలీజ్ కానుంది.



నాగవంశీ, వెంకీ



ప్రశాంత్ వర్మ, నిరంజన్ రెడ్డి

సార్‌తో ఆరంభమై లక్కీతో మళ్లీ...

డైరెక్టర్ వెంకీ అట్లూరి, నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం ‘సార్’ (తమిళంలో వాత్తి). ధనుష్, సంయుక్తా మీనన్ జంటగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో గత ఏడాది విడుదలై ఘనవిజయం సాధించింది. ఈ దర్శక-నిర్మాతల కాంబినేషన్‌లో తాజాగా ‘లక్కీ భాస్కర్’ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్, మీనాక్షీ చౌదరి జంటగా నటిస్తున్నారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ సినిమా సెప్టెంబరు 27న రిలీజ్ కానుంది.

హీరో కూడా రిపీట్

శ్రీకాంత్ ఓదెల దర్శకునిగా పరిచయమైన చిత్రం ‘దసరా’ (2023). తొలి చిత్రంతోనే నానీని దర్శకత్వం వహించే చక్కని అవకాశం అందుకుని సద్వినియోగం చేసుకున్నారు. నాని, కీర్తీ సురేష్ జోడీగా శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. కాగా ‘దసరా’ కాంబినేషన్‌లోనే మరో సినిమా రానుంది. నాని కెరీర్‌లో ఇది 33వ చిత్రం. ఈ చిత్రాన్ని శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి నిర్మిస్తారు.

రెండోసారి రెండు భాగాలతో...

‘ఈగల్’ చిత్రం తర్వాత డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని-పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కాంబినేషన్‌లో ‘మిరాయ్’ సినిమా రూపొందుతోంది. రవితేజ, అనుపమా పరమేశ్వరన్, కావ్యా థాపర్ హీరో, హీరోయిన్లుగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ‘ఈగల్’ ఈ ఏడాది విడుదలైంది. ప్రస్తుతం కార్తీక్-విశ్వప్రసాద్ కాంబినేషన్‌లో ‘మిరాయ్’ చిత్రం రూపొందుతోంది. తేజ సజ్జా, రితికా నాయక్ జంటగా నటిస్తున్న ‘మిరాయ్’లో మంచు మనోజ్ కీలక పాత్ర చేస్తున్నారు. రెండు భాగాలుగా రానున్న ఈ సినిమా తొలి భాగం 2025 ఏప్రిల్ 18న రిలీజ్ కానుంది. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 2డీ, 3డీ వెర్షన్లలోనూ రిలీజ్ కానుంది.

ఈసారి ‘జై హనుమాన్’తో...

సంక్రాంతి అంటే స్టార్ హీరోల చిత్రాల పోటీ ఉంటుంది. అయితే ఈ ఏడాది సంక్రాంతికి స్టార్ హీరోల సినిమాలతో పోటీ పడి, ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలై బ్లాక్ బస్టర్ అయిన చిత్రం ‘హనుమాన్’. తేజ సజ్జా హీరోగా ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించారు. చైతన్య సమర్పణలో ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో హిట్ అయింది. ఇక ‘హనుమాన్’కి సీక్వెల్‌గా ప్రశాంత్ వర్మ-చైతన్య-నిరంజన్ రెడ్డి కాంబినేషన్‌లో ‘జై హనుమాన్’ రూపొందుతోంది. 2025లో ఈ చిత్రం విడుదల కానుంది.

వీరే కాదు.. మరికొందరు దర్శక-నిర్మాతల కాంబినేషన్స్ కూడా రిపీట్ అవుతున్నాయి.

బ్లాక్ బస్టర్ గ్యారెంటీ - హీరో శర్వానంద్

‘‘‘మనమే’ ఫ్యామిలీ అంతా కలసి ఎంజాయ్ చేసే సినిమా. ఈ చిత్రాన్ని తల్లితండ్రులకు అంకితం ఇస్తున్నాం. ఈసారి బ్లాక్ బస్టర్ గ్యారెంటీ’’ అన్నారు హీరో శర్వానంద్. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో శర్వానంద్, కృతీ శెట్టి జంటగా నటించిన చిత్రం ‘మనమే’. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ని హీరో రామ్‌చరణ్ లాంచ్ చేశారు. అనంతరం జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో శ్రీరామ్ ఆదిత్య మాట్లాడుతూ– ‘‘నా కెరీర్‌లో ఈ సినిమా ఓ మ్యాజిక్.. ఆ మ్యాజిక్‌ని ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు’’ అన్నారు. ‘‘‘మనమే’ మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్’’ అన్నారు చిత్ర సహనిర్మాత వివేక్ కూచిభొట్ల. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కృతీ ప్రసాద్, అసోసియేట్ ప్రొడ్యూసర్ ఏడిద రాజా మాట్లాడారు.



కృతీ శెట్టి, శర్వానంద్

హైదరాబాద్‌లో స్వయంభూ

నిఖిల్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియన్ చిత్రం ‘స్వయంభూ’. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సంయుక్త, నభా నటేష్ హీరోయిన్లు. ‘ఠాగూర్’ మధు సమర్పణలో భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. కాగా శనివారం (జూన్ 1) నిఖిల్ పుట్టినరోజు సందర్భంగా ‘స్వయంభూ’ మూవీ నుంచి స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ‘‘ఈ చిత్రంలో లెజెండరీ వారియర్ క్యారెక్టర్‌లో కనిపించనున్నారు నిఖిల్. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో వేసిన సెట్‌లో జరుగుతోంది. ‘బాహుబలి, ఆర్ఆర్ఆర్’ వంటి భారీ చిత్రాలకు పని చేసిన సినిమాటోగ్రాఫర్ కేకే సెంథిల్ కుమార్ ‘స్వయంభూ’లో తన మ్యాజిక్ చూపించనున్నారు’’ అని యూనిట్ పేర్కొంది.



నిఖిల్

డూప్ లేకుండా కాజల్ ఫైట్ చేశారు - సుమన్ చిక్కాల

‘‘‘సత్యభామ’ కథలో ఎమోషన్, యాక్షన్ రెండూ ఉన్నాయి. భావోద్వేగాలను పండించడంలో కాజల్ అగర్వాల్‌కి మంచి పేరుంది. ఆమె యాక్షన్ చేస్తే కొత్తగా ఉంటుందనిపించింది. ఎమోషన్, యాక్షన్ ఆమె చక్కగా చేశారు. ఈ రెండింటికీ ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు’’ అన్నారు డైరెక్టర్ సుమన్ చిక్కాల. కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం ‘సత్యభామ’. డైరెక్టర్ శశికిరణ్ తిక్క సమర్పణలో బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సుమన్ చిక్కాల మాట్లాడుతూ– ‘‘శశికిరణ్ తిక్క వద్ద స్క్రిప్ట్ సైడ్ వర్క్ చేశాను. నాపై నమ్మకంతో దర్శకత్వం బాధ్యత అప్పగించాడు తను. ‘సత్యభామ’ పూర్తిగా ఫిక్షన్ కథ. ఒక కేసు విషయంలో బాధితురాలికి న్యాయం చేసే పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కాజల్ పాత్రకి ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు. డూప్ లేకుండా యాక్షన్ సీక్వెన్సులు చేశారామె. ఆంధ్రప్రదేశ్‌లోని దిశ యాప్, తెలంగాణలో షీ సేఫ్ యాప్ గురించి మా మూవీలో చూపించాం. ఎవరైనా ఈ యాప్స్ గురించి తెలుసుకుని ఆపదలో వాడితే వారికి మా సినిమా ద్వారా ఒక సందేశం చేరినట్లే’’ అన్నారు.



గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



SC మాల & మాదిగ/కట్నం ప్రసక్తి లేదు/ M.Tech / IT / C.Govt. కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్ / 85000/-PM/5'8"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. సంప్ర : 9676995093 [HA-14363]

క్రిస్టియన్ మాల/ 33/ 5'8"/ B.Tech/ C.Govt. మేనేజర్/రైల్వే/95000/-PM/ వెల్ సెటిల్డ్ వరుడికి వధువు కావలెను. Ph: 8790016395 [HA-14363]

క్రిస్టియన్ మాదిగ/30/5'8"/M.Tech, IIT/Govt.ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫీసర్ / 90,000/-PM/వెల్ సెటిల్డ్ వరుడికి వధువు కావలెను. Ph: 8790016395 [HA-14363]

SC మాల/ఏకైక కుమారుడు/ B.Tech/ C.Govt.Jr.ఇంజినీర్/పవర్ గ్రిడ్/1 లక్ష. PM / 5'8"ఎత్తు/30 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. Ph: 8897389698 [HA-14363]

36 సం॥ల బిజినెస్ చేస్తున్న వరుడుకి రెండవ/విడో పిల్లలు ఉన్న వారు అయినా సంప్రదించండి. ఔరి, కుల ప్రసక్తి లేదు. ఫోన్ : 9652012478, 7396730091 [HA-97478]

క్రిస్టియన్ మాదిగ/కట్నం ప్రసక్తి లేదు/ M.Tech/Govt.MRO/80,000/-PM/5'10" ఎత్తు / 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6305007091 [HA-14360]

SC హిందూ మాల/కట్నం ప్రసక్తి లేదు/ B.Tech, MBA/C.Govt.PO/SBI/1.50 Lakhs PM/5'10" ఎత్తు / 29 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9908222406 [HA-14360]

క్రిస్టియన్ మాల/కట్నం ప్రసక్తి లేదు/28/ 5'8"/B.Tech/ C.Govt. రిసెర్చ్ ఆఫీసర్ / DRDO/1 Lakh PM అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-14360]

SC మాల/కట్నంప్రసక్తి లేదు/B.Tech/ C. Govt.బ్యాంక్ మేనేజర్/SBI/80,000/-PM /5'10"ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-14360]

సున్ని ముస్లిం/ 45/(Ph.D) Handsome Well Settled వరునికి వధువు కావలెను. కాల్ డైరెక్ట్ 6309014355 [HA-3714]

రెడ్డి, 41Yrs/5'.10"/M.Sc, Ph.D/ Fair/ 80,000 P.M/ PVT. Job గల వరుడికి వధువు కావలెను. సంప్రదించండి సెల్: 9133857101. [T-1235480]

డైరెక్ట్ కాంటాక్ట్: ఆర్యవైశ్య, 46Yrs/5'.5"/ బిజినెస్,జాబ్, 30Cr. స్థిరాస్తి గల ఏకైక అబ్బాయికి అందమైన అమ్మాయి కావలెను. (నో బ్రోకర్స్). 9182161015, 7680872085. [T-2545]

రాజులు, SBI లో జాబ్, సొంత ఇల్లు, 48 సం. 2 వ పెళ్లి వెల్ సెటిల్ వరుడుకి కుల ప్రసక్తి లేని సాంప్రదాయం గల వధువు కావలెను. ✆ 96520 16569 [B-755734]

★

కోమట్ల అమ్మాయి కావలెను. కోమట్ల అబ్బాయి 36 M.Sc., ప్రైవేట్ లెక్చరర్, 32 వేలు, ఆస్తి 80 లక్షలు. వీరయ్య MIG-9 హౌసింగ్‌బోర్డు, మును గోడ్ రోడ్, నల్లగొండ. సంప్ర॥ 9121325068 [Y-798333]

★★

నగరాలు (పాత్రులు) BC (D), 35Y, 5'9", ఎరుపు, బ్యాంక్ మేనేజర్, 60 వేలు జీతం వస్తున్న వరునకు కుల పట్టింపు లేని సంప్రదాయమైన వధువు కావలెను. విజయవాడ. 8124455005 (వాట్సప్) [B-1239325]

కాపు, 1st మ్యారేజి, 42Y, 5'9", MA, Fair, అందమైన వెల్‌సెటిల్డ్ వరునకు OC లేక BC వధువు కావలెను. డైరెక్ట్ వాట్సాప్ ✆ 91335 00456, విజయవాడ. [B-1264400]

క్రైస్తవ మాల 33y, 5.9", MD, GM Govt డాక్టర్ వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ గల వరుడుకు MBBS or డైవర్స్ డాక్టర్స్ వధువు కావలెను. నోడౌరి ✆ 94419 81671, 88866 61156, (డైరెక్ట్) [O-737320]

వరుడు కావలెను



కుల, ఆస్తి పట్టింపు లేదు/ జాబ్/ వ్యాపారం/ ఫ్లాట్స్/5L/PM/వెల్ సెటిల్డ్/5 కోట్ల ప్రాపర్టీ గల అందమైన సాంప్రదాయ వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. ఇల్లరికం OK. ముఖాముఖి కల్పించి త్వరగా కుదర్చబడును. 7207606129 [H-778800]

రెడ్డి/విడో/2nd మ్యారేజ్ / కుల, ఆస్తి పట్టింపు లేదు/వయస్సు: 35, తెలుపు/సొంత వ్యాపారము అందమయిన ఒంటరి వధువుకి వరుడు కావలెను. 1st/2nd (ఇల్లరికము OK) Ph: 8143011223 [HA-14363]

రెడ్డి/30yrs/ఫెయిర్/కుల పట్టింపు లేదు/ Govt. ఎంప్లాయ్/45K (PM)/వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ/5 సొంత ఇల్లులు & బిజినెస్ కలిగిన వధువుకి వరుడు కావలెను (1st, 2nd మ్యారేజ్ & ఇల్లరికం OK) సంప్ర : 9640133485 [H-778800]

కాపు/36yrs/కుల పట్టింపు లేదు/ఫెయిర్/ Govt. ఎంప్లాయ్/2 లక్షలు(PM)/వెల్ సెటిల్డ్ & 4 సొంత ఇల్లులు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (1st, 2nd మ్యారేజ్ & ఇల్లరికం OK) సంప్ర : 8374802603 [H-778800]

కుల, ఆస్తి పట్టింపు లేదు/విడో/State Endowment ఆఫీసర్/1 L PM/ సొంత విల్లా/ 25 ఎ॥ Lands /కోట్ల ఆస్తి గల అందమైన వెల్ సెటిల్ వధువుకు వరుడు కావలెను. Ph: 9849632087 [H-796070]

రెండో పెళ్ళి/విడో / 52y / Fair / వైజాగ్/ College Job/వెల్ సెటిల్/పిల్లలు లేని ఏ బాదర బందీలేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 8519803423 [H-796070]

BC/ 60y / 5'3" / Govt.Staff Nurse/ 1 L PM / సొంత ఇల్లు కలిగిన వధువుకు వరుడు కావలెను. కుల పట్టింపు లేదు. Ph: 8367233524 [H-7 96070]

రెడ్డి/ 29 / 5'2"/ MBBS MD పీడియాట్రిక్స్ వధువుకు MBBS రెడ్డి వరుడు కావలెను. సంప్ర : "శుభమస్తు" DSNR, Hyd. S. రాములు గౌడ్. Ph: 8790690309 [H-796070]

రెడ్డి/విడో/60/5'5"/V.Fair/Govt.(H.M) రిటైర్డ్/సొంత ఇల్లు & రెంట్స్/28 ఎకరాల పండ్లతోటలు/బిజినెస్‌లు ఏ బాదరబందీలేని సాంప్రదాయక వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. Ph: 7093717220 [H-800497]

వైశ్య/62/విడో / 5'4"/ Govt.Rtd/50,000/-PM/సొంత ఇల్లు/ఆంధ్రాలో మామిడి తోటలు/పిల్లలు లేని వధువుకి వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. 8309025102 [H-800497]

పద్మశాలి/విడో / 53y/డిగ్రీ/ప్రైవేట్ జాబ్ / సొంత ఇల్లు/8 ఎకరాల ల్యాండ్ గల వధువుకి కుల, ఆస్తి పట్టింపు లేని వరుడు కావలెను. Ph: 9705499686 [H-800497]

SC మాల హిందూ/B.Tech/25y/ 5'4"/ సాఫ్ట్‌వేర్ కాంగ్నిజెంట్ (Hyd)/60K per month/ చాలా అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9705960270 [H-800497]

కమ్మ/40yrs/5'5"/ఫెయిర్/కుల పట్టింపు లేదు/ M.Com/Govt.ఎంప్లాయ్/75K (PM), వెల్ సెటిల్డ్ & సొంత ఇల్లు & అగ్రికల్చర్ ల్యాండ్స్ కలిగిన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) సంప్ర: 9133672661 [H-778800]

రెడ్డి/విడో/55Y/Ongoleలో సొంత ఫ్లాట్లు/Hydలో సొంత బిజినెస్, రెంట్స్/మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. (అర్జెంట్) (ఇల్లరికం OK) (నో బ్రోకర్స్) 7799083500, 7386660643 [H-778800]

కాపు/34/Govt.Emp/40,000/-PM/Partial Blind తల్లిదండ్రులు లేరు, కన్వర్టెడ్ క్రిస్టియన్, no caste bar, క్రిస్టియన్ వరుడు కావలెను. 9059035448, 9290746424 [HA-14363]

రెడ్డి/విడో/కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/Age: 30, Qly: డిగ్రీ/Own Business & Land కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. 1st (or) 2nd (ఇల్లరికము OK) Ph: 9908279018 [HA-14363]

వయసు: 35 yrs/ఎత్తు 5'5" గవర్నమెంట్ జాబ్, 1.5 Laks జీతం కలిగిన అందమైన అమ్మాయికి వరుడు కావలెను. కుల పట్టింపు లేదు. పిల్లలున్నా OK. Ph: 8019954482 [HA-14363]

SC మాదిగ/B.Tech/Govt.Bank Asst. మేనేజర్/ 70,000/-PM / 5'5"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6304407230 [HA-14363]

క్రిస్టియన్ మాదిగ / 27 / 5'4"/ B.Tech / SWE / TCS / 80,000/-PM వధువుకు వరుడు కావలెను. Ph: 8790016935 [HA-14363]

క్రిస్టియన్ మాల/ఏకైక కుమార్తె/BDS/ C.Govt.డాక్టర్/రైల్వేస్/50,000/-PM/5'5" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-14360]

యాదవ/ M.Tech/Govt.Asst. ఇంజనీర్ /జెన్‌కో / 80,000/-PM / 5'4"ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-14360]

హిందూ మాదిగ/50 లక్షల ఆస్తి/B.Tech / Govt. Asst. మేనేజర్/ ట్రాన్స్‌కో / 60,000/-PM/ 5'4"ఎత్తు / 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. 6305007091 [HA-14360]

రజక/B.Tech / C.Govt. ట్యాక్స్ ఆఫీసర్ /ఇన్‌కమ్ ట్యాక్స్ Dept/60,000/-PM/5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-14360]

మాల/25/5'4"/B.Tech/C.Govt. Asst. మేనేజర్ / కెనరా బ్యాంక్ / 50,000/-PM / అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 6309258463 [HA-14360]

కుల పట్టింపు లేదు/22y & 24y& 25y& 27y& 28y & 30y& 32y& 34y& 35y& 37y& 38y& 40y& 41y& 43y& 44y& 46y& 48y& 50y& 52y& 53y& 55y& 57y& 58y& 59y& మా సేవా (Since: 1998) Ph/WA: 9291503949 [HA-14360]

Andhra Sunni Muslim Parents Settled at Hyderabad invite alliance for their only Daughter 30 years. M.Tech 5'4" beautiful, Property holder, Widow with 4 years daughther. Groom Should be educated, employed in Hyderabad, below 36 years. Shall Whats App Photo and biodata to 7337047741 [H-778915]

★★

క్రిస్టియన్/మాల / 1991 / MDS / కోట్పై గా ఆస్తి / స్వంత క్లినిక్ / త్వరలో Govt. జాబ్ పొందే అందమైన వధువుకు వెల్ సెటిల్డ్ SWE/ తగిన Govt. ఎంప్లాయ్ / డాక్టర్ వరుడు కావలెను. డైరెక్ట్ ✆ 94416 12898 B-1264394]

వేదికలు



సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర: 8555980066 [H-796070]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులాల Govt/ SWE/ NRI/ డాక్టర్స్ / బిజినెస్/ గెజిటెడ్/PVT/ విడో/డైవర్సీలకు అత్యంత సంతృప్తినిచ్చే సర్వీస్. Ph: 9866775306 [H-14341]

రజక వివాహవేదిక: (Estd-1994) డాక్టర్స్, ఇంజినీర్స్, Govt Jobs ABROAD సంబంధాలకై సంప్ర॥ కోట్లశ్రీనివాస్ Ph: 8106303155, 9391265304 [H-800497]

ప్రభాకర్ రెడ్డి మ్యాట్రిమోని ద్వారా రెడ్డి వధూవరుల పరిచయ వేదిక 2/6/2024న సెంట్రల్ బ్యాంక్ కాలనీ కమిటీ హాల్, సెంట్రల్ బ్యాంక్ కాలనీ, L.B. నగర్, Hyd నందు కలదు. ఫోన్ : 9391198332, 9059430595 [HA-3875]

Brahmin, Padmashali పెళ్లి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14361]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 9000487865 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14361]

Kamma, Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14361]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 9000487865 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14361]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14361]

ఫాస్ట్ సెటిల్‌మెంట్-ప్రత్యేక శ్రద్ధతో. అన్ని కులాలు, అన్ని ప్రాంతాలు, సాఫ్ట్‌వేర్స్, డాక్టర్స్, అబ్రాడ్ , VIP వారికి పెళ్లి సంబంధాలు చూడబడును. పూర్ణ మ్యాట్రిమోని, తిరుపతి, 7093722724. [T-2950]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్నికులాల SWE, Govt., Doctors, MNC Matches, Late &2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp). [HA-841]

మాదిగ వివాహ పరిచయ వేదిక, ఆదివారం (16-6-24) 10AM-6PM * మంచిర్యాల ఫీ: 1 వెయ్యి Ph: 9347046175 నిర్వహణ : స్వప్న వివాహ వేదిక [H-800496]

★★

Vasavi Aryavysya Brides can get best matches of Aryavysya Bridegrooms (dowry no need) with monthly salary or income Rs 1 Lakh to Rs 10 Lakhs with properties. Vasavi Talambralu 8667325268 [HA-9425]

మళ్లీ సీఎంగా వైఎస్ జగనే

మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



తిరుమల: రాష్ట్రంలో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే బాధ్యతలు స్వీకరిస్తారని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. మరో ఐదేళ్ల పాటు సీఎంగా వైఎస్ జగన్ కొనసాగుతారని తెలిపారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

ధనంజయరెడ్డికి ఆత్మీయ సన్మానం



ధనంజయరెడ్డి దంపతులకు సన్మానపత్రం అందజేస్తున్న స్నేహితులు

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ పదవీ విరమణ చేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి కాల్వ ధనంజయ రెడ్డిని ఎస్వీ యూనివర్సిటీలో ఆయన సహచర విద్యార్థులు, స్నేహితులు శనివారం రాత్రి తాడేపల్లిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ధనంజయరెడ్డి వివిధ హోదాల్లో బాధ్యతలను ఎటువంటి గర్వం, స్వార్థం లేకుండా నిర్వర్తించారని ప్రశంసించారు. పేద ప్రజలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చేవారని, అవినీతికి తావులేకుండా సమర్థంగా బాధ్యతలు నిర్వర్తించారని తెలిపారు. విజయవంతంగా సర్వీసు పూర్తి చేసుకున్న ధనంజయరెడ్డితోపాటు ఆయన భార్య డాక్టర్ అపర్ణలకు ఆత్మీయ సన్మానం చేయడం సంతోషంగా ఉందన్నారు.

7న ఈదుమూడిలో మాదిగల జనజాతర

ఒంగోలు: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పురిటిగడ్డ ఈదుమూడిలో ఈ నెల 7న మాదిగల జనజాతర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ తెలిపారు. ఒంగోలులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 30 ఏళ్లుగా మాదిగలను వర్గీకరణ పేరుతో మోసం చేస్తున్న నాయకుడిని మాదిగ సమాజం ఇకపై నమ్మకుండా, ఆయన చేసిన మోసాలను, వర్గీకరణ ముసుగులో మాదిగ జాతిని తాకట్టుపెడుతున్న తీరును ఇంకా విస్తృత స్థాయిలో తీసుకెళ్లాలని నిర్ణయించినట్టు తెలిపారు. మాదిగలు చేస్తున్న వర్గీకరణ పోరాటానికి కలం ద్వారా, గళం ద్వారా, ఆట ద్వారా, మాట ద్వారా జాతికి అండగా ఉన్న వర్గాలను ఆ వేదికపై గౌరవించి సత్కరిస్తామన్నారు.

కల్తీ విత్తన విక్రేతలపై ఉక్కుపాదం

రంగంలోకి ప్రత్యేక నిఘా బృందాలు

- జిల్లా కేంద్రాల్లో సీడ్ మానిటరింగ్ విభాగాలు
- కమిషనరేట్‌లో సీడ్ రెగ్యులేషన్ సెల్
- ఇప్పటికే ముగ్గురు డీలర్లపై 6ఏ కేసులు
- రూ. 7.77 లక్షల విలువైన పత్తి, మిరప విత్తనాలు జప్తు
- రూ.2.13 కోట్ల విలువైన విత్తన విక్రయాలు నిలుపుదల
- ఆర్బీకేల ద్వారా నాన్ సబ్సిడీ బీటీ పత్తి, మిరప విత్తనాలు



సాక్షి, అమరావతి: రైతులు కల్తీల బారిన పడి నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కల్తీ విత్తనాలు అమ్మేవారిపై ఉక్కుపాదం మోపుతోంది. తయారీ, పంపిణీ, సరఫరాపై ప్రత్యేక బృందాలతో నిఘా ఉంచడంతోపాటు గ్రామస్థాయిలో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకేల) ద్వారా నాన్‌సబ్సిడీ విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

జిల్లా అధికారులకు విస్తృత అధికారాలు

ఖరీఫ్ సీజన్‌కు 3 నెలల ముందే పత్తి, మిరప ఇతర విత్తనాలను సాగు విస్తీర్ణానికి తగినట్టుగా సరఫరా చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కంపెనీలను సిద్ధం చేసింది. ముఖ్యంగా పత్తి విత్తనం 29 లక్షల ప్యాకెట్లు అవసరం కాగా, ప్రస్తుతం 30 లక్షల ప్యాకెట్లు అందుబాటులో ఉంచింది. ఇలా ఇతర విత్తనాలనూ సిద్ధం చేసింది. గతంలో మార్కెట్‌లోకి వచ్చిన తర్వాత నమూనాలు సేకరించి, నిషేధిత హెచ్‌టీ విత్తనాలను గుర్తిస్తే సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకునే వారు. ప్రస్తుతం విత్తన తయారీ నుంచే నిఘాను కట్టుదిట్టం చేశారు. ప్రాసెసింగ్ ప్లాంట్లపై నిరంతర నిఘా ఉంచారు. డీలర్ల నుండి విత్తన నమూనాలతో పాటు ప్యాకింగ్, ధ్రువీకరణ, లేబులింగ్ వంటి వివిధ దశల్లో విత్తన నమూనాలను సేకరించి పరీక్షలు చేస్తున్నారు. ముఖ్యంగా నిషేధిత హెచ్‌టీ విత్తన విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. నకిలీ విత్తనాల నిరోధానికి జిల్లా వ్యవసాయాధికారులకు విస్తృత అధికారాలు ఇచ్చారు. వీరి పర్యవేక్షణలో సీడ్ ఇన్‌స్పెక్టర్లతో కూడిన క్షేత్ర స్థాయి ప్రత్యేక నిఘా బృందాల ద్వారా ప్రాసెసింగ్ యూనిట్లు, స్టోరేజీ పాయింట్లు, డీలర్లు, రిటైల్ షాపులు, డెలివరీ యూనిట్లలో నిరంతరం తనిఖీలు చేస్తున్నారు. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో 'సీడ్ మానిటరింగ్ సెల్' ఏర్పాటు చేశారు. వ్యవసాయ శాఖ కమిషనరేట్ కార్యాలయంలో 'సీడ్ రెగ్యులేషన్ సెల్' (ఫోన్ నెం 8331056032), రైతు సమీకృత సమాచార కేంద్రం (టోల్ ఫ్రీ నెం. 155251)కు ఫోన్ చేస్తే వెంటనే చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేశారు. ఇప్పటివరకు ముగ్గురు డీలర్లపై 6ఏ కేసులు నమోదు చేశారు 7.77 లక్షల విలువైన పత్తి, మిరప విత్తనాలను జప్తు చేశారు. రూ.2.13 కోట్ల విలువైన 435 క్వింటాళ్ల పత్తి, మిరప, కూరగాయల విత్తనాల అమ్మకాలను నిలిపివేశారు.

కల్తీ విత్తనాల విక్రేతలపై ఫిర్యాదుకు ఈ నంబర్లకు ఫోన్ చేస్తే చాలు..

సీడ్ రెగ్యులేషన్ సెల్- 8331056032

రైతు సమీకృత సమాచార కేంద్రం - 155251 (టోల్ ఫ్రీ నంబర్)

ఆర్బీకేల ద్వారా నాన్ సబ్సిడీ విత్తనాలు

సర్టిఫై చేసిన నాణ్యమైన పత్తి, మిరప, ఇతర నాన్ సబ్సిడీ విత్తనాలను జూన్ రెండో వారం నుంచి ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోంది. ఇందు కోసం ఆయా కంపెనీలతో ఏపీ సీడ్స్ అవగాహన ఒప్పందం చేసుకోనుంది. ఈ విత్తనాల నాణ్యతను నాలుగు దశల్లో పరీక్షిస్తారు. శుద్ధి చేసిన విత్తనాన్ని ప్యాకింగ్ చేసి రైతులకు పంపిణీ చేసే ముందు ఆర్బీకేల్లో పరీక్షిస్తారు. ఆర్బీకే ఇన్‌చార్జితో పాటు గ్రామంలోని కొంతమంది రైతులతో కలిసి గ్రామ స్థాయిలో మరోసారి నాణ్యతను పరీక్షిస్తారు.

కల్తీ విత్తనాలపై నిఘా పెంచాం



గతంలో 2, 3 పత్తి విత్తన రకాలకు మాత్రమే డిమాండ్ ఉండగా, ప్రస్తుతం అనేక కంపెనీలు నిబంధనల మేరకు నాణ్యమైన విత్తనాలను మార్కెట్‌లోకి తెస్తున్నాయి. సర్టిఫై చేసిన పత్తి విత్తనాలను ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు సంబంధిత వ్యాపారుల లైసెన్సులను రద్దు చేసేలా ఆదేశాలిచ్చాం. తీవ్రతనుబట్టి క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తాం.

– చేవూరు హరికిరణ్, స్పెషల్ కమిషనర్, వ్యవసాయ శాఖ

ఆర్బీకేల ద్వారా అవగాహన



నాణ్యమైన, సర్టిఫై చేసిన విత్తనాల ఎంపికపై రైతులకు ఆర్బీకేల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. కల్తీ విత్తన విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా సర్టిఫై చేసిన నాణ్యమైన నాన్ సబ్సిడీ విత్తనాలను ఆర్బీకేల్లో అందుబాటులోకి తెస్తున్నాం.

– ఎం.శివప్రసాద్, ఎండీ, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ

బాబు పర్యటనపై ఎందుకంత గోప్యత?

- చంద్రబాబు, లోకేశ్ కలిసి రహస్యంగా ఎక్కడికెళ్లారు, ఎందుకెళ్లారు?
- దోచుకున్న డబ్బుని దాచుకోవడానికి వెళ్లారా?
- విదేశాల్లో పెట్టుబడులు పెట్టడానికి వెళ్లారా?
- బాధ్యత కలిగిన ప్రతిపక్ష నాయకుడిగా ప్రజలకు చెప్పాలి
- ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం
- పార్టీ శ్రేణులంతా సీఎం జగన్ ప్రమాణ స్వీకారానికి హాజరవ్వాలి
- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్



సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు విదేశీ పర్యటనను గోప్యంగా ఉంచాల్సిన అవసరం ఏముందని, ఆయన ఎందుకంత భయపడుతున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ప్రశ్నించారు. ఎన్నిసార్లు అడిగినా చంద్రబాబు విదేశీ పర్యటనపై ఎందుకు సమాధానం చెప్పలేకపోతున్నారని నిలదీశారు. ఆయన శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. చంద్రబాబు విదేశీ పర్యటన మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారిందన్నారు. హైదరాబాద్ నుండి దుబాయ్ వెళ్లారని మొదట అన్నారని, అక్కడ్నుంచి ఎక్కకు వెళ్లారని ప్రశ్నించారు. వైద్యం కోసం అమెరికా వెళ్లాడని ఎల్లో మీడియా రాసిందని, అయితే, చంద్రబాబు అమెరికా రాలేదని ఆయన అనుంగ శిష్యుడు కోమటి జయరామే చెప్పారన్నారు. బాబు పది రోజుల ఈ రహస్య పర్యటన వెనుక కారణం ఏమిటని నిలదీశారు. చంద్రబాబు, లోకేశ్ కలిసి ఇంత రహస్యంగా ఎక్కడికెళ్లారు, ఎందుకు వెళ్లారు అని ప్రశ్నించారు. దోచుకున్న డబ్బుని దాచుకోవడానికి వెళ్లారా? విదేశాల్లో పెట్టుబడులు పెట్టడానికి వెళ్లారా? బాధ్యత కలిగిన ప్రతిపక్ష నాయకుడిగా ఎక్కడికి, ఎందుకోసం వెళ్ళాడో చంద్రబాబు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎక్కడి నుంచీ వచ్చాడో అదైనా చెప్పాలి కదా అని అన్నారు. ఏ దేశం వెళ్లినా ఫొటో దిగి పంపించే చంద్రబాబు.. ఈసారి ఎందుకు ఫొటోలు కూడా పంపలేదని అన్నారు. తమ నాయకుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లండన్ వెళ్లారని, ఆయన పర్యటన గురించి టైమ్‌తో సహా చెప్పామని తెలిపారు. చంద్రబాబు పర్యటనపై ఎందుకంత గోప్యత అని అన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు పర్యటన వివరాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రతిపక్ష నాయకుడు కాబట్టి ఆయన పర్యటన గురించి ప్రజలకు అవసరమని స్పష్టంచేశారు.

4న చంద్రబాబుకు మూర్ఛ వస్తుంది

ఈ నెల 4వ తేదీన ఎన్నికల ఫలితాలు చూసిన తర్వాత చంద్రబాబుకు మూర్ఛ వస్తుందని మంత్రి చెప్పారు. ఆరోజున కూటమి కుదేలవుతుందన్నారు. పనికిమాలిన సర్వే సంస్థలను అడ్డం పెట్టుకొని ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని, పార్టీ శ్రేణులంతా పండుగ వాతావరణంలో సంబరాలు జరుపుకోవాలని చెప్పారు. సీఎం జగన్ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి హాజరవ్వాలని పిలుపునిచ్చారు.

ఏబీవీ టీడీపీ తొత్తు అని తేలిపోయింది

వివాదాస్పద ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు రిటైర్మెంట్లో చిత్ర విచిత్రమైన విన్యాసాలు చేశారని మంత్రి అన్నారు. అవినీతి పరుడైన ఆయన్ని టీడీపీ నేతలు అక్కున చేర్చుకున్నారని, దేవినేని ఉమా సహా అందరూ వెళ్లి అవినీతిపరుడిని సత్కరించారని, దీంతో ఏబీ వెంకటేశ్వర్లు టీడీపీ తొత్తు అని తేలిపోయిందని చెప్పారు. నిఘా పరికరాల కొనుగోళ్లలో హోం శాఖ ఏబీవీపై విచారణకు అనుమతి ఇచ్చింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఏబీవీ విశ్వరూపం శుక్రవారం స్పష్టంగా కనిపించిందన్నారు.

పేదల ఇళ్లకు పెద్దపీట

- 17,005 లేఔట్లలో వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం
- తొలి దశలో 15.60 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తి
- గ్రామీణ పేదల గృహ నిర్మాణాలకు బ్యాంకులు విరివిగా రుణాలివ్వాలి
- 2024–25లో ఇళ్ల నిర్మాణాలకు రూ.20,901 కోట్లు రుణ ఆవశ్యకత

రాష్ట్ర ఫోకస్ పత్రంలో నాబార్డు వెల్లడి / 30.20 లక్షల ఇళ్ల పట్టాలను ఉచితంగా ఇచ్చిన ప్రభుత్వం



సాక్షి, అమరావతి: పేదల ఇళ్ల నిర్మాణాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు 2024–25 రాష్ట్ర ఫోకస్ పత్రంలో నాబార్డు తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో లబ్ధిదారులకు ఒకటిన్నర సెంట్ల చొప్పున 30.20 లక్షల ఇళ్ల స్థలాల పట్టాలను ఉచితంగా పంపిణీ చేయడంతోపాటు మహిళల పేరిట ఇచ్చిన స్థలాల్లో గృహ నిర్మాణాలను కూడా చేపట్టిందని నాబార్డు ప్రముఖంగా ప్రస్తావించింది. గ్రామీణ పేదల ఇళ్ల నిర్మాణాలకు బ్యాంకులు విరివిగా రుణాలు ఇవ్వాలని సూచించింది. 17,005 లేఔట్లలో వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని, మూడు దశల్లో మొత్తం నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుందని పేర్కొంది. ఇప్పటికే తొలి దశలో 15.60 లక్షల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసిందని తెలిపింది. పేదల ఇళ్ల లబ్ధిదారుల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన మెటీరియల్‌ను తక్కువ ధరకే సమకూర్చడంతోపాటు కాలనీల్లో రోడ్లు, నీటి సరఫరా లాంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తోందని నాబార్డు పేర్కొంది. 2024–25లో ఇళ్ల నిర్మాణాలకు రూ.20,901 కోట్లు రుణ ఆవశ్యకత ఉందని జిల్లాల వారీగా రాష్ట్ర ఫోకస్ పత్రంలో నాబార్డు తెలిపింది.

2024-25లో గృహ నిర్మాణాలకు రుణ ఆవశ్యకత ఇలా..

జిల్లా	రుణం రూ.కోట్లలో
శ్రీసత్యసాయి	597.69
అనంతపురం	861.40
నెల్లూరు	720.06
శ్రీకాకుళం	937.09
ప్రకాశం	523.45
పల్నాడు	625.32
బాపట్ల	914.76
గుంటూరు	965.75
అల్లూరి సీతారామరాజు	17.72
అనకాపల్లి	43.32
విశాఖపట్నం	1716.80
కృష్ణా	2129.75
ఎన్టీఆర్	1695.40
కర్నూలు	1830.85
నంద్యాల	708.62
చిత్తూరు	501.60
తిరుపతి	718.00
పశ్చిమ గోదావరి	819.90
ఏలూరు	473.04
తూర్పు గోదావరి	942.55
డా.బీఆర్.అంబేడ్కర్ కోనసీమ	48.28
కాకినాడ	699.75
అన్నమయ్య	564.90
వైఎస్సార్ కడప	727.90
పార్వతీపురం మన్యం	245.71
విజయనగరం	502.03

క్లుప్తంగా...

పవర్‌లిఫ్టింగ్‌లో చంద్రకళకు 'స్ట్రాంగ్ ఉమన్' టైటిల్



పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిన చంద్రకళ, ఇతర క్రీడాకారులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఏపీ ఎక్సైజ్ కానిస్టేబుల్ ఎస్.చంద్రకళ బంగారు పతకంతో పాటు 'సీనియర్ స్టేట్ స్ట్రాంగ్ ఉమన్' టైటిల్‌ను కైవసం చేసుకున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గంటా వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. 3 రోజుల పాటు మంగళగిరిలో జరిగిన పోటీల్లో సీనియర్ మహిళల విభాగంలో చంద్రకళ స్క్వాట్, బెంచ్ ప్రెస్, డెడ్‌లిఫ్ట్ విభాగాల్లో 512 కిలోల బరువులు ఎత్తి విజేతగా నిలిచారన్నారు. ఎస్.మోనా 52 కిలోల విభాగంలో మొత్తం 235 కిలోల బరువులెత్తి వెండిపతకాన్ని సాధించారు. వీరితో పాటు ఎం.రోజర్ బిన్నీ సబ్ జూనియర్ 105కిలోల విభాగంలో బెంచ్‌ప్రెస్‌లో వెండి పతకం, పురుషుల సీనియర్ 105కిలోల విభాగంలో బి.సందీప్ బెంచ్‌ప్రెస్‌లో 165కేజీల బరువులెత్తి బంగారు పతకం సాధించారు. క్రీడాకారులను ఎన్టీఆర్ జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి వి.మల్లేశ్వరరావు అభినందించారు.

రెండు జాతీయ కమిటీల చైర్మన్‌గా జైళ్లశాఖ ఐజీ 'ఇండ్ల'



ఆరిలోవ (విశాఖ జిల్లా): దేశంలో కారాగారాల ఆధునికీకరణ, పటిష్టమైన సంస్కరణల అమలు, అభివృద్ధి, జైలు ఉద్యోగులకు శిక్షణ తదితరాల కోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ప్రత్యేక కమిటీలు నియమించింది. దీన్లో వివిధ రాష్ట్రాల్లో జైళ్ల, పోలీస్ శాఖతో పాటు సంబంధిత విభాగాలకు చెందిన కొందరిని ఎంపిక చేసి కమిటీల్లో నియమించింది. వారిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు రెండు కమిటీలకు చైర్మన్‌గా నియమితులయ్యారు. విశాఖ కేంద్ర కారాగారంలో ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు శుక్ర, శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బ్యూరో ఆఫ్ ప్రిజన్స్ అండ్ పోలీస్ రీకన్‌స్ట్రక్షన్ డెవలప్‌మెంట్ (బీపీఆర్‌డీ) ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వాటిలో నేషనల్ ప్రిజన్ ట్రైనింగ్ పాలసీ (ఎన్‌పీటీపీ) కమిటీకి తనను చైర్మన్‌గా నియమించినట్లు తెలిపారు. ఈ కమిటీ దేశంలో జైలు ఉద్యోగులకు ఎలాంటి శిక్షణ ఇవ్వాలి, వారు మానసిక ఒత్తిడిని జయించే విధంగా ఏ విధమైన శిక్షణ అవసరం, ఎలాంటి వాతావరణంలో జైళ్లు నిర్వహిస్తున్నారు తదితర వాటిపై దేశవ్యాప్తంగా నివేదిక సిద్ధం చేసి కేంద్ర హోం శాఖకు సమర్పించాలని వివరించారు. దీంతో పాటు జైళ్ల పటిష్టత కోసం 'స్టాండర్డ్ ఆఫ్ మోడరన్ జైల్స్' పేరుతో బీపీఆర్‌డీ మూడు కమిటీలు (ఫంక్షనల్, గ్రీనరీ, టెక్నికల్) ఏర్పాటు చేసిందన్నారు. వాటిలో ఫంక్షనల్ కమిటీకి తనను చైర్మన్‌గా నియమించారని శ్రీనివాసరావు తెలిపారు. దేశవ్యాప్తంగా అన్నిరకాల జైళ్లలో ఈ–ములాఖత్ అందుబాటులోకి వచ్చిందని, రాష్ట్రంలో కూడా ఇటీవల ఈ విధానాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇప్పటి వరకు తొమ్మిది జైళ్లల్లో ఈ–ములాఖత్ జరగ్గా, మరో ఐదు జైళ్లలో త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన తెలిపారు.

ఏపీ జీఎస్టీ వసూళ్లలో 15 శాతం వృద్ధి

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో మే నెలకు సంబంధించిన జీఎస్టీ వసూళ్ల వివరాలను కేంద్ర ఆర్థిక శాఖ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. దేశవ్యాప్తంగా జీఎస్టీ వసూళ్లు మే నెలలో రూ.1.73 లక్షల కోట్లుగా నమోదయ్యాయని పేర్కొంది. ఏపీకి సంబంధించి గతేడాది మే నెలతో పోలిస్తే జీఎస్టీ వసూళ్లు ఈసారి 15 శాతం అధికంగా రూ.3,890 కోట్లుగా నమోదయ్యాయని తెలిపింది. తెలంగాణలో కూడా 11 శాతం అధికంగా రూ.4,986 కోట్లు వచ్చాయని వెల్లడించింది.

రూ.61 లక్షల విలువైన బంగారం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బంగారంతో పోలీసులు

సంతమాగులూరు (అద్దంకి): బాపట్ల జిల్లాలో ఎటువంటి బిల్లులు లేకుండా తీసుకెళ్తున్న బంగారాన్ని పోలీసులు శనివారం పట్టుకున్నారు. సీఐ నరసింహారావు కథనం ప్రకారం... సంతమాగులూరు మండలంలోని పుట్టవారిపాలెం అడ్డరోడ్డులో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ వాహనంలో రూ.61,16,492 విలువైన 840 గ్రాముల బంగారాన్ని గుర్తించారు. దీనికి సంబంధించిన బిల్లులు చూపకపోవడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ సురేశ్ పాల్గొన్నారు.

కర్నూలు నుంచి 'ఏపీఈఆర్‌సీ' కార్యకలాపాలు

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ప్రధాన కార్యాలయం ఇప్పటికే ప్రారంభం

- తాజాగా హైదరాబాద్ నుంచి సిబ్బంది ఫైళ్లు, సామగ్రి తరలింపు పూర్తి
- ఏపీఈఆర్‌సీ కొత్త భవనం నుంచి కార్యకలాపాలు
- నేటితో హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గడువు ముగియడంతో ఈఆర్‌సీ తరలింపు



ఏపీఈఆర్‌సీ నూతన కార్యాలయ భవనం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ప్రధాన కార్యాలయం కార్యకలాపాలు శనివారం నుంచి కర్నూలులో ప్రారంభమయ్యాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు హైదరాబాద్ పదేళ్ల రాజధానిగా ఉంటుందనే గడువు ఆదివారంతో ముగుస్తుండడంతో ఒకరోజు ముందుగానే ఏపీఈఆర్‌సీ తన కార్యకలాపాలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించింది. ఈఆర్సీ భవనంతోపాటు ఓ అతిథి గృహాన్ని నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండెకరాల స్థలం కేటాయించడంతో పాటు రూ.23 కోట్ల నిధులు అందించింది. ఈ నిధులతో 15 వేల చదరపు అడుగుల భవన నిర్మాణం జరిగింది. మరో 5 వేల చదరపు అడుగుల్లో గెస్ట్‌హౌస్ నిర్మిస్తున్నారు. నిర్మాణం పూర్తయిన భవనాన్ని ఈనెల 23న ప్రారంభించారు. శనివారం నుంచి అందులో అధికారికంగా కార్యకలాపాలు మొదలుపెట్టారు.

పాతికేళ్ల క్రితం పుట్టిన 'మండలి'


1999 మార్చిలో హైదరాబాద్ కేంద్రంగా ఏపీఈఆర్‌సీ ఏర్పడింది. రాష్ట్ర విభజన తరువాత అమరావతి ప్రాంతానికి తరలిస్తూ 2014 ఆగస్టులో ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే, మండలి మాత్రం ఇన్నాళ్లూ హైదరాబాద్ కేంద్రంగానే పనిచేస్తూ వచ్చింది. ఏపీఈఆర్‌సీ ప్రధాన కార్యాలయం కర్నూలులో ఉండాలని రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ గతేడాది ఆగస్టు 25న నోటిఫికేషన్ విడుదల చేశారు. అనంతరం.. అక్కడ భవన నిర్మాణం మొదలైంది. ఏపీఈఆర్‌సీకి ఒక చైర్మన్‌తో పాటు ఇద్దరు సభ్యులు ఉంటారు. వీరి తరువాత ఒక డైరెక్టర్ హోదాలో కమిషన్ సెక్రటరీ, ఆ తరువాత జాయింట్ డైరెక్టర్, ఐదుగురు డిప్యూటీ డైరెక్టర్లు, ఒక లీగల్ కన్సల్టెంట్, ఒక ఐటీ కన్సల్టెంట్, కార్యాలయ సిబ్బంది ఉంటారు. వీరంతా తమ ఆధీనంలోని ఫైళ్లను తరలించేందుకు సిద్ధంచేసి భద్రపరచాలని ఈ ఏడాది ఏప్రిల్‌లో కమిషన్ ఆదేశించింది. అలాగే, ఉద్యోగులు తమ నివాసాన్ని కర్నూలుకు మార్చుకోవాలని, వసతి ఏర్పాట్లుచేసుకోవాలని సూచించింది. అందుకు స్థానికంగా ముగ్గురు డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇంజనీర్ స్థాయి అధికారుల సహాయ సహకారాలను తీసుకోవాల్సిందిగా సూచించింది. అన్ని పనులు పూర్తవడంతో సిబ్బందితో పాటు ఫైళ్లు, సామగ్రి కర్నూలుకు తరలివెళ్లాయి.

ఏపీఈఆర్‌సీ ఏం చేస్తుందంటే..

విద్యుత్ చట్టంలోని సెక్షన్–86 ద్వారా కమిషన్‌కు పలు విధులను నిర్దేశించారు. అవి ఏమిటంటే..

- విద్యుత్ ప్రసారం, పంపిణీ, రిటైల్ సరఫరా కార్యకలాపాలు, నిర్వహణను మెరుగుపరిచి, విద్యుత్ చార్జీలను నిర్ణయించడం మండలి లక్ష్యం.
- ఇంట్రా–స్టేట్ ట్రాన్స్‌మిషన్‌లో ఓపెన్ యాక్సెస్‌ను సులభతరం చేయడం, ఇంట్రా–స్టేట్ ట్రేడింగ్, పవర్ మార్కెట్ అభివృద్ధిని ప్రోత్సహించడం, విద్యుత్ అంతర్రాష్ట్ర ప్రసారం, పంపిణీ రిటైల్ సరఫరాలో పోటీ మార్కెట్ల అభివృద్ధికి అవసరమైన సాంకేతిక, సంస్థాగత మార్పులను తీసుకురావడం వంటివి చేయాలి.
- రాష్ట్రంలో పంపిణీ, సరఫరా కోసం విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, విద్యుత్ కొనుగోలు, సేకరణ ప్రక్రియను నియంత్రిస్తుంది.
- రాష్ట్రంలో కార్యకలాపాలకు సంబంధించి ట్రాన్స్‌మిషన్ లైసెన్సులు, డిస్ట్రిబ్యూషన్ లైసెన్సులు, విద్యుత్ వ్యాపారులుగా వ్యవహరించాలనుకునే వారికి లైసెన్స్‌లను జారీచేస్తుంది.
- పునరుత్పాదక శక్తిని ప్రోత్సహించేందుకు మొత్తం విద్యుత్ వినియోగంలో దాని శాతాన్ని నిర్ణయిస్తుంది.
- డిస్కంలు, ఉత్పాదక సంస్థల మధ్యనున్న వివాదాలపై విచారణ జరిపి తీర్పుల ద్వారా పరిష్కరిస్తుంది.
- వినియోగదారుల ప్రయోజనాలను పెంపొందించడంపై ప్రభుత్వానికి సలహాలివ్వడం వంటివి కమిషన్ చేస్తుంది.
- అలాగే, కోస్తా, ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలకు అందుబాటులో ఉండేలా విశాఖపట్నంలో ఇప్పటికే ఏపీఈఆర్‌సీ క్యాంపు కార్యాలయం గతేడాది ఆగస్టు 18న ప్రారంభమైంది.

భిన్న సంస్కృతుల 'ప్రశాంతి' నిలయం





చీరకట్టులో విదేశీ మహిళలు (ఫైల్)

- నిత్యం ఇక్కడ సందడి వాతావరణం
- ఇతర రాష్ట్రాల అవతరణ దినోత్సవాల నిర్వహణ
- విదేశాల నుంచి వస్తున్న బాబా భక్తులు

సాక్షి, పుట్టపర్తి: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి భిన్న సంస్కృతులకు నిలయంగా మారింది. ఇతర రాష్ట్రాలు, పలు దేశాల నుంచి భగవాన్ శ్రీసత్యసాయి బాబా భక్తులు వస్తుండటంతో దశాబ్దాల కాలంగా ఇతర రాష్ట్రాల పండుగలు ప్రశాంతి నిలయంలో నిర్వహించడం ఆనవాయితీగా మారింది. కుల, మతాలకు అతీతంగా అన్ని పండుగలు చేస్తుంటారు. ఏటా గుజరాత్, కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాల అవతరణ దినోత్సవాలు, ఆయా రాష్ట్రాల ప్రధాన పండుగలు నిర్వహిస్తున్నారు. ప్రతి నెలా ఏదో ఒక రాష్ట్రం నుంచి భక్తులు పర్తియాత్రగా పుట్టపర్తి వస్తున్నారు. అక్కడి సంస్కృతీ సంప్రదాయాలను పుట్టపర్తిలో ప్రదర్శిస్తున్నారు. పుట్టపర్తి వంటకాలు, వస్త్రధారణకు విదేశీయులు సైతం ముగ్ధులు కావడం విశేషం. ఇతర రాష్ట్రాల, దేశాల భక్తులు సైతం స్థానికులతో సులువుగా కలసిపోతున్నారు. ఫలితంగా దేశ, విదేశీ భాషలను స్థానికులు సులువుగా మాట్లాడగలుగుతున్నారు. చదువు రాని వారు సైతం ఆ భాషలను నేర్చుకుంటున్నారు. విదేశాల నుంచి వచ్చే భక్తులు అక్కడి సంప్రదాయం వదిలి.. తెలుగు డ్రెస్ కోడ్‌ను ఇష్టపడుతున్నారు. మహిళలు చీరకట్టులో, పురుషులు పంచెకట్టులో కనిపిస్తున్నారు. సుమారు 150 దేశాల నుంచి భక్తులు పుట్టపర్తికి వస్తుంటారు. వీరిలో చాలామంది భారతీయ జీవనశైలికి అలవాటు పడుతున్నారు. మన దేశ సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు.

మనకు గర్వకారణం



మేము తమిళనాడు నుంచి వచ్చి ఇక్కడ వ్యాపారం చేస్తున్నాం. దశాబ్దాల కాలం నుంచి విదేశీయులను చూస్తున్నాం. మన సంప్రదాయాలను వారు ఆచరిస్తుండటం గర్వకారణంగా చెప్పుకోవచ్చు. పాశ్చాత్య దేశస్తులు మన దుస్తులను ఇష్టపడుతున్నారు. ఇక్కడి వంటకాలు అందరినీ ఆకర్షిస్తాయి.

– బాల దండపాణి, పుట్టపర్తి

సంప్రదాయాల కేంద్రం



పలు దేశాల నుంచి భక్తి భావంతో పుట్టపర్తికి వస్తుంటారు. ఇక్కడి ప్రజల సహకారం బాగుంటుంది. మన సంస్కృతీ సంప్రదాయాలను విదేశీయులు పాటిస్తారు. దేశ, విదేశ భేదాలు లేకుండా పరస్పర సహకారంతో మెలుగుతుంటారు. ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిన పుట్టపర్తి.. సంప్రదాయాలకూ కేంద్రంగా ఉందని చెప్పొచ్చు.

– ఆర్‌జే రత్నాకర్‌రాజు, మేనేజింగ్ ట్రస్టీ, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు

కెరీర్ ఎడ్యుకేషన్ 'స్టేట్ రిసోర్స్‌పర్సన్'లుగా ఉపాధ్యాయులు

సాక్షి, అమరావతి: యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్, రోటరీ, ఇండియన్ కెరీర్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో పాఠశాలల్లో కెరీర్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు 'స్టేట్ రిసోర్స్‌పర్సన్'లను నియమించనున్నట్టు సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం శిక్షణ పొందేందుకు ఆసక్తిగల ఉపాధ్యాయులు ఈ నెల 3వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తమ వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన ఉపాధ్యాయులకు విజయవాడలో రెండు రోజులు శిక్షణ ఉంటుందన్నారు. విజయనగరం, విశాఖపట్నం, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని అన్ని తరగతుల నుంచి ఇద్దరు చొప్పున 50 మందిని ఎంపిక చేసి శిక్షణ ఇస్తామని వివరించారు. వారు జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చి దిశానిర్దేశం చేస్తారన్నారు. యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్, రోటరీ, ఇండియన్ కెరీర్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ గుర్తింపు పొందేందుకు ఇదో మంచి అవకాశమని, మెల్‌బోర్న్, రోటరీ నేషన్ బిల్డర్ అవార్డులకు, అధ్యయన పర్యటనకు అవకాశం దక్కించుకోవచ్చని తెలిపారు.

బ్యాంకుల నిండా పింఛనుదారులే

- ఈ నెలలో 65.30 లక్షల మందికి రూ.1,939.35 కోట్లు
- అందులో 47.74 లక్షల మందికి డీబీటీ రూపంలో బ్యాంకు ఖాతాల్లో జమ
- మిగిలిన 17.56 లక్షల మందికి ఇంటివద్ద పంపిణీ



సత్తెనపల్లిలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌కు చెందిన సీఎస్‌పీ పాయింట్ వద్ద పింఛన్ లబ్ధిదారులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో శనివారం పలుచోట్ల పింఛను డబ్బులు తీసుకునేందుకు వచ్చిన అవ్వాతాతలతో బ్యాంకులు కిక్కిరిసిపోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా 65,30,838 మంది అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగ, వివిధ రకాల చేతివృత్తిదారులతో పాటు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఈ నెలలో పింఛన్ల పంపిణీ కోసం ప్రభుత్వం రూ.1,939.35 కోట్లు విడుదల విషయం చేసిన విషయం తెలిసిందే. మొత్తంలో లబ్ధిదారుల్లో 47,74,733 మందికి ప్రభుత్వం డీబీటీ రూపంలో శనివారం ఉదయమే వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ చేసింది. డబ్బు బ్యాంకుల్లో జమ అయినట్లు శనివారం సాయంత్రానికి 44,54,243 (93.29 శాతం) లక్షల మంది మొబైల్ నంబర్లకు సమాచారం కూడా చేరినట్టు అధికారులు తెలిపారు.

శనివారమే 14.33 లక్షల మందికి ఇంటివద్దే అందిన పింఛను

డీబీటీ రూపంలో బ్యాంకులో జమచేసినవారు పోను మిగిలిన 80 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధితో మంచానికే పరిమితమై ఉండే 17,56,105 మంది లబ్ధిదారులకు ఒకటోతేదీ నుంచి ఐదోతేదీ మధ్య గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ద్వారా వారి ఇంటివద్దే పింఛను డబ్బులు పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. వీరిలో 14,33,709 మందికి శనివారమే వారి ఇళ్లవద్ద పింఛను డబ్బు పంపిణీ చేశారు. ఇంటివద్ద పింఛన్ల పంపిణీ 81.64 శాతం పూర్తయిందని, మిగిలిన వారికోసం మరో నాలుగు రోజులు ఈ ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

జగనన్న విద్యాకానుక రెడీ

- 38 లక్షల కిట్లు సిద్ధంచేసిన పాఠశాల విద్యాశాఖ
- మండల కేంద్రాలకు బ్యాగులు, పుస్తకాలు, యూనిఫారాలు చేరవేత
- 3.12 కోట్ల మొదటి సెమిస్టర్ పుస్తకాలు సైతం పంపిణీకి సిద్ధం
- ఈ నెల 12న పాఠశాల తెరిచిన మొదటిరోజే పంపిణీకి ఏర్పాట్లు



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కింద ఏటా అందిస్తున్న ఉచిత పుస్తకాలు, యూనిఫారం, బూట్లతో కూడిన కిట్ల పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంచేసింది. ఈ నెల 12న పాఠశాలలు తెరిచిన మొదటిరోజే వాటిని అందించేందుకు సామగ్రిని మండల స్టాక్ పాయింట్లకు చేరవేసింది. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు మొదటి సెమిస్టర్‌లో బోధించే 3.12కోట్ల పాఠ్యపుస్తకాలు మండల స్టాక్ పాయింట్లకు ఇప్పటికే చేరవేశారు. యూనిఫారం సరఫరా శనివారం నుంచి మొదలైంది. వస్తువులను ఒక్కొక్కటిగా స్టాక్ పాయింట్లకు చేర్చిన అనంతరం అక్కడ తరగతుల వారీగా కిట్లను రెడీ చేస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో దాదాపు 43 లక్షల మంది విద్యార్థులకు కిట్లను పంపిణీ చేయగా మిగిలిన 2 లక్షల కిట్లకు అదనంగా ఈ విద్యా సంవత్సరానికి 36లక్షల కిట్లను అధికారులు సిద్ధంచేస్తున్నారు. విద్యార్థుల సంఖ్య పెరుగుదలకు అనుగుణంగా వస్తువులను అందించేలా సరఫరాదారులకు ఆదేశాలు జారీచేశారు. అన్ని సబ్జెక్టుల పాఠ్యపుస్తకాలు, టోఫెల్ వర్క్‌బుక్, ఫ్యూచర్ స్కిల్స్ సబ్జెక్ట్ పుస్తకంతోపాటు మూడు జతల యూనిఫాం క్లాత్, స్కూల్ బ్యాగ్, బెల్ట్, ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు.. అదేవిధంగా 1–5 తరగతుల విద్యార్థులకు వర్క్‌బుక్స్, పిక్టోరియల్ డిక్షనరీ, 6–10 తరగతుల విద్యార్థులకు నోట్‌బుక్స్, అందించనున్నారు. ఇప్పటివరకు విద్యాకానుక కిట్‌లో అందించే తొమ్మిది వస్తువుల్లో బూట్లు మినహా మిగిలిన బ్యాగులు, బెల్టులు, సాక్సులు, పాఠ్య, నోటుపుస్తకాలు, వర్క్‌బుక్స్, డిక్షనరీ వంటి 8 రకాల వస్తువులు 90 శాతం మండల కేంద్రాలకు చేరాయి. ఒకట్రెండు రోజుల్లో బూట్ల సరఫరా చేపట్టనున్నారు.

పాఠశాలలకు 3.12 కోట్ల పాఠ్య పుస్తకాలు..

ఈ విద్యా సంవత్సరంలో 1–10 తరగతుల విద్యార్థులకు మొత్తం 4.20 కోట్ల పాఠ్యపుస్తకాలు అవసరం కాగా.. మొదటి సెమిస్టర్‌కు అవసరమైన 3.12 కోట్ల పుస్తకాలను స్టాక్ పాయింట్లకు పంపించారు. 3–10 తరగతుల వరకు పాఠ్యపుస్తక ముఖచిత్రాలు మార్చారు. ఈనెల 8వ తేదీ నాటికే అన్ని స్కూళ్లలోను విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కిట్లను సిద్ధంచేయాలని పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ఆదేశాలు జారీచేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచి 10వ తరగతి కూడా ఇంగ్లిష్ మీడియంలోకి మారడంతో అందుకు తగ్గట్టుగా పుస్తకాల ముద్రణ చేపట్టింది. రాష్ట్రంలో 1,000 ప్రభుత్వ పాఠశాలలు సీబీఎస్‌ఈలోకి మారిన సంగతి తెలిసిందే. ఈ విధానంలోనే స్టేట్ సిలబస్ పుస్తకాలను అందించనున్నారు. పదో తరగతి సాంఘిక శాస్త్రాన్ని సీబీఎస్‌ఈ తరహాలో జాగ్రఫీ, ఎకనామిక్స్, చరిత్ర, డెమోక్రటిక్ పాలిటిక్స్ రూపంలో ఎన్సీఈఆర్టీ సిలబస్‌ను ముద్రించింది. ఫిజికల్ సైన్స్ పుస్తకాలను పూర్తి ఆర్ట్ పేపర్‌పై ముద్రించారు. ఈ తరహా ముద్రణ చేపట్టడం ఇదే తొలిసారి కావడం విశేషం.

ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్స్‌గా ఇంజినీరింగ్ విద్యార్థులు

ఈ విద్యా సంవత్సరం నుంచి 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఫ్యూచర్ స్కిల్స్ కోర్సును అందుబాటులోకి తెచ్చింది. వీరి బోధనకు ఇంజినీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులను ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్స్‌గానూ నియమించింది. ఫ్యూచర్ స్కిల్స్ సిలబస్‌ను అనుసరించి మొత్తం 4.30 లక్షల పుస్తకాలు ముద్రించి పంపిణీకి సిద్ధంచేసింది.

కౌండిన్య.. గజరాజ్యం

కౌండిన్య అడవిలో పెరిగిన ఏనుగుల సంతతి.. దక్షిణ భారతదేశంలో ఒకేసారి ఏనుగుల గణన

ఎటుచూసినా ఆకాశాన్నంటే పచ్చదనం.. జలజలపారే సెలయేళ్లు.. అడుగడుగునా నీటిగుంటలు.. జీవాలకు సమృద్ధిగా ఆహారం.. ఇది కౌండిన్య. 353 చదరపు కిలోమీటర్లలో విస్తరించిన దట్టమైన అడవి. అపారమైన జంతుసంపదకు ఆవాస కేంద్రం. చిత్తూరు జిల్లాలో తమిళనాడు సరిహద్దు సమీపంలోని కుప్పం మల్లప్పకొండ దగ్గర నుంచి పలమనేరులో కర్ణాటక సరిహద్దుల వరకు ఉన్న ఈ కౌండిన్య అటవీ ప్రాంతం గజరాజుల సామ్రాజ్యం.



చిత్తూరు జిల్లా మంగళంపేట పరిధిలోని అటవీ ప్రాంతంలో ఉన్న నీటి మడుగులో ఏనుగు గుంపు



మంగళంపేట పరిధిలో అడవిలో సంచరిస్తున్న జంట ఏనుగులు

సాక్షి, చిత్తూరు: కౌండిన్య అటవీప్రాంతం వివిధ రకాల జంతుసంపదకు నిలయం. ఈ అడవిలో చిరుతపులి, తోడేలు, నక్క, అడవి రేసుకుక్క, దేవాంగపిల్లి, నక్షత్ర తాబేలు, అడవిపిల్లి, ఎలుగుబంటి, హైనా, జింక, దుప్పి, తోడేలు, ఎద్దు, కుందేళ్లు ఎక్కువగా ఉన్నాయి. పక్షి జాతుల్లో కోకిల, రామచిలుక, నెమలి, పావురాలు, పిచ్చుకలు, కొంగలు ఉన్నాయి. సర్పాల్లో కొండచిలువ, కట్లపాము, నల్లత్రాచు, రక్తపింజరిలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. అటవీశాఖ లెక్కల ప్రకారం ఏనుగుల సంఖ్య ఎక్కువ. దట్టమైన ఈ అడవిలో ఏనుగుల సంతతి ఏటేటా వృద్ధిచెందుతోంది. గుంపులుగుంపులుగా అడవిలో సంచరించే ఇవి అడపాదడపా గ్రామాల్లోను స్వైరవిహారం చేస్తున్నాయి.

మూడురోజులు ఏనుగుల గణన

ఏటా మాదిరే ఈ సంవత్సరం మే నెలలో కూడా దక్షిణ భారతదేశంలో ఏనుగులను లెక్కించారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ఒకేసారి మూడురోజులు ఈ గణన నిర్వహించారు. మన రాష్ట్రంలో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, అనంతపురం, పార్వతీపురం, విజయనగరం జిల్లాల్లో ఏనుగుల్ని లెక్కించారు. జిల్లా అటవీప్రాంతంలోని 66 బీట్లలో ఏనుగుల్ని అటవీ సిబ్బంది లెక్కపెట్టారు. తొలిరోజు 15 కిలోమీటర్ల పరిధిలో జిగ్‌జాగ్ విధానంలో లెక్కించారు. రెండోరోజు కూడా అదే పద్ధతి కొనసాగించారు. చివరిరోజున నీటికుంటలు, చెరువుల వద్ద ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిఘా వేసి ఏనుగుల్ని లెక్కపెట్టారు. అడుగుజాడలు, మలమూత్ర విసర్జన, చెట్లను తోసివేయడం, సమూహం, పరిణామం ఆధారంగా వాటిసంఖ్యను లెక్కించారు. కనిపించిన ఏనుగుల ఫొటోలు తీసి, లింగనిర్ధారణ చేసి వివరాలు నమోదు చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 200 వరకు ఏనుగులు ఉంటాయని ప్రాథమికంగా అంచనా వేశారు. అందులో కౌండిన్య అటవీప్రాంతంలోనే 100 నుంచి 110 వరకు ఉంటాయని అంచనా. జిల్లాలో చిత్తూరు ఈస్ట్, వెస్ట్, పలమనేరు, కుప్పం, పుంగనూరు ప్రాంతాల్లో సర్వే జరుగుతోంది. గత సంవత్సరం కంటే 10 నుంచి 20 వరకు ఏనుగులు పెరిగి ఉంటాయని భావిస్తున్నారు. కౌండిన్యలో 15 వరకు పిల్ల ఏనుగులు ఉన్నట్లు గుర్తించారు. పిల్ల ఏనుగులు ఉన్నాయంటే వాటి సంతతి బాగా పెరుగుతోందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. అధికారులు ఈ లెక్కల వివరాలను కేంద్ర అటవీశాఖకు నివేదిస్తారు. కేంద్ర అటవీశాఖ ఏనుగుల సంఖ్యను ప్రకటిస్తుంది.

ఏనుగుల సంచారం ఎక్కువ



ఏటా ఏనుగుల సంఖ్యపై సర్వే చేస్తున్నాం. ఈ ఏడాది టెక్నికల్‌గా సర్వే నిర్వహించాం. ఫ్లగ్ మార్క్స్ ఆధారంగా బ్లాగ్ సర్వే చేశాం. వివరాలను సిబ్బంది ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. తుది నివేదికను కేంద్ర అటవీశాఖకు అందజేశాం. కుప్పం, పలమనేరు, పుంగనూరు ప్రాంతాల్లో ఏనుగుల సంచారం ఎక్కువగా ఉంది.

– చైతన్యకుమార్‌రెడ్డి, డీఎఫ్‌వో

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

గురుకులాల్లోనే ఉపాధ్యాయులు బస చేయాలి


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: జిల్లాలోని గురుకుల, మొరార్జీ దేశాయి పాఠశాలల్లో విధు లు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు అక్కడే నివాసం ఉండాలని కర్ణాటక రక్షణ వేదిక డిమాండ్ చేసిం ది. శనివారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి అధ్యక్షుడు ఖలీ ల్‌పాషా మాట్లాడారు. 2023–24వ విద్యా సం వత్సరంలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించేవారు విద్యార్థులతో పాటు ఉండ కుండా ఇతర చోట్ల నివాసం ఉన్నారన్నారు. గురుకులంలోనే ఉపాధ్యాయులు నివాసం ఉం డేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికా ధికారికి వినతిపత్రం సమర్పించారు.

పైఅంతస్తు నుంచి పడి సెక్యూరిటీ గార్డు మృతి


బసయ్య(ఫైల్)

రాయచూరు రూరల్: విధులు నిర్వహిస్తూ నిద్రమత్తులో అక్కమహాదేవి కళాశాల పైనుంచి పడి సెక్యూరిటీ గార్డు దుర్మరణం చెందిన ఘటన శుక్రవారం రాత్రి జిల్లాలోని సింధనూరులో జరిగింది. మృతుడిని కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న బసయ్య(45)గా పోలీ సులు గుర్తించారు. అర్ధరాత్రి కాలకృత్యాలు తీర్చుకోడానికి మేల్కొన్న బసయ్య నిద్రలో పైఅంతస్తు నుంచి కిందకు దిగుతుండగా కాంపౌండ్ గోడ లేకపోవడంతో అదుపు తప్పి కింద పడి మరణించాడు. శనివారం పోలీసులు మృతదేహాన్ని స్వాధీనపరచుకుని శవ పరీక్ష కోసం ఆస్పత్రికి తరలించారు.

ఎమ్మెల్సీ రేసులో ఆ ఇద్దరు

రాయచూరు రూరల్: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో మంత్రి ఎన్ ఎస్ బోసురాజు విధాన పరిషత్ సభ్యుడి పదవీ కాలం జూన్ 17వ తేదీతో ముగియ నుండడంతో ఖాళీ కానున్న స్థానాలకు జూన్ 13న జరిగే విధాన పరిషత్ ఎన్నికల్లో బోసురాజ్‌ను విధాన పరిషత్ సభ్యుడిగా మరోసారి ఎన్నుకోవడానికి రంగం సిద్ధ మైనట్లు తెలిసింది. కార్యాధ్యక్షుడు వసంత్ కుమార్ కూడా జిల్లా నుంచి ఎమ్మెల్సీ పద వికి ఎంపికవుతున్నట్లు సమాచారం. ఏఐసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎస్ బోసురా జుకు 2023లో అమాత్య పదవిని కేటాయిం చిన సంగతి విదితమే.

చిన్నారులకు అక్షరాభ్యాసం


అక్షరాభ్యాసం చేయిస్తున్న అధికారి

రాయచూరు రూరల్: జిల్లాలో బుధవారం నుంచి పూర్తి స్థాయిలో పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. 2024–25వ విద్యా సంవత్సరానికి సంబంధించి దేవదుర్గ తాలూకాలో విద్యాశాఖాధికారి సుఖదేవ్ విశేషంగా ప్రారంభించారు. దేవదుర్గ తాలూకాలో గ్రామీణ ప్రాంతాల నుంచి బండి కట్టి పిల్లలు బడికి తరలిరావాలంటూ ఎద్దులబండిపై ప్రచారం చేశారు. పాఠశాల విద్యార్థులతో పొలం పనులు వదిలి పాఠశాలకు రావాలని అట్టలు చేత బూని ప్రచారం చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారికి అందాల్సిన పుస్తకాలు, యూనిఫాం, ఇతర సౌకర్యాలు ఒనగూర్చారు. నీలగల్ ఆదర్శ పాఠశాలలో ఒకటో తరగతిలో చేరిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు.

దౌర్జన్యంగా భూముల కబ్జా


మాట్లాడుతున్న మోహన్

రాయచూరు రూరల్: బళ్లారిలోని బండి హట్టిలో సర్వే నంబర్– 715లో 44 మంది రైతులకు ప్రభుత్వం పంపిణీ చేసిన 135 ఎకరాల భూములను దౌర్జన్యంగా ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్ని కల్లో పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి నారా ప్రతాపరెడ్డి ఆక్రమించారని బాధితుడు మోహన్ ఆరోపించారు. శనివారం పాత్రికే యుల భవనంలో ఆయన విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. 2005లో మొత్తం భూములను కొనుగోలు చేసినట్లు నకిలీ రికార్డులు తయారు చేసుకొన్నారన్నారు. కృ ష్ణశాస్త్రి పేరు మీద ఉన్న భూములను తన పేరు మీద చేసుకొని పేదలు, దళిత, కురుబ రైతులపై అక్రమంగా కేసులు బనాయించడం, బెదిరించడం వంటివి చేస్తున్నారన్నారు. ఇలాంటి వ్యక్తి పట్టభ ద్రుల సమస్యలపై పరిషత్ కార్యకలాపాల్లో ప్రసంగిస్తారా? అని ప్రశ్నించారు.

భక్తిశ్రద్ధలతో హనుమ జయంతి

- ఆలయాల్లో ప్రత్యేక హోమ పూజలు
- స్వామివార్లకు విశేష అలంకరణలు


అభయ వరదాంజనేయ స్వామికి అలంకరణ


అభయాంజనేయ స్వామి ఆలయంలో పవమాన హోమ పూజలు


మిల్లర్‌పేట్ ఆంజనేయ స్వామికి వెండి పూలతో అలంకరణ


కురిహట్టి ఆంజనేయ స్వామి విశేష అలంకరణ

బళ్లారిఅర్బన్: హనుమాన్ జయంతి వేడుకల సంద ర్భంగా నగరంలోని వివిధ శ్రీరామ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణ పూజలను నిర్వహిం చారు. శనివారం నగరంలోని అనంతపురం రోడ్డు లో వెలసిన అభయ వరదాంజనేయ స్వామి దేవస్థానంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, స్వామి వారికి విశేష అలంకరణ, మహామంగళారతి, భక్తులకు అన్న దానం, హనుమాన్ వ్రత పూజలతో పాటు ఆలయ వార్షికోత్సవ వేడుకలను కూడా కలిపి జరుపుకున్నట్లు దేవస్థాన అర్చకులు ధనుంజయ తెలిపారు. బాలాంజ నేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక అలంకరణ పూజలు, హనుమాన్ జన్మదిన పూజలను బాలానంద స్వామి నేతృత్వంలో నిర్వహించారు. మిల్లర్‌పేట్ ఆంజ నేయ స్వామి ఆలయంలో వెండి ఆభరణాల పూలతో అలంకరణ, హనుమాన్ జన్మదిన పూజలను నిర్వహిం చారు. ఎస్ఆర్‌పీ కాలనీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో, హనుమాన్ నగర్ ఆంజనేయ స్వామి ఆలయంలో, కోట ఆంజనేయ స్వామి ఆలయంలో, పటేల్‌నగర్ వెంకటేశ్వర స్వామి ఆల యంలో వెలసిన ఆంజనేయ స్వామికి అలంకరణ పూజలు, కాకర్లతోట ఆంజనేయ స్వామి ఆలయంలో, హవంబావి కోదండ రామ ఆలయంలో, వివిధ శ్రీరామ, ఆంజనేయ స్వామి ఆలయాల్లో జయంతి పూజలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

పట్టభద్రుల గోడు పట్టని సర్కార్


మాట్లాడుతున్న అమర్‌నాథ్ పాటిల్

రాయచూరు రూరల్: ఈశాన్య పట్టభద్రుల ఎమ్మె ల్సీ నియోజకవర్గంలో పట్టభద్రుల సమస్యలపై సర్కార్‌లో స్పందన లేదని, దీనికి తోడు ఆరేళ్ల పాటు కాంగ్రెస్ అభ్యర్థి కనిపించకుండా పోయారని బీజేపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్సీ అమర్‌నాథ్ పాటిల్ ఆరోపించారు. శనివారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2018లో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి పట్టభ ద్రుల సమస్యలపై పరిషత్ కార్యకలాపాల్లో ప్రసం గించిన సందర్భాలు లేవన్నారు. గతంలో గెలిచిన తాను ఈ ప్రాంత సమస్యలపై విధాన పరిషత్‌లో గళమెత్తానన్నారు. రాజ్యాంగంలోని ఆర్టి కల్–371(జె) అమలు చేయకుండా దానిని రద్దు చేయాలని మంత్రి హెచ్.కే.పాటిల్ ప్రభుత్వానికి లేఖ రాయడం తగదన్నారు. నంజుండప్ప నివేదిక ఆధారంగా వైజ్యనాథ్ పాటిల్ కృషితో అమలైన రాజ్యాంగంలోని ఆర్టికల్–371(జె) ద్వారా విద్య, ఉద్యోగ రంగాల్లో కళ్యాణ కర్ణాటక ప్రాంత పట్టభ ద్రులకు మేలు జరుగుతుందన్నారు.

ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు


మాట్లాడుతున్న జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్

రాయచూరు రూరల్: రాయచూరు లోక్‌సభ స్థానానికి ఈ నెల 4న చేపట్టే కౌంటింగ్ కోసం ఏర్పాట్లకు సర్వం సిద్ధం చేశామని జిల్లాధికారి చంద్రశే ఖర్ నాయక్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో మాట్లాడారు. రాయచూరు, యాదగిరి జిల్లాల్లోని ఎనిమిది నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపునకు 159 మంది సూపర్‌వైజర్లు, 159 మంది సహాయకులు, 168 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. రాయచూరు, రాయచూరు గ్రామీణ, మాన్వి, లింగ సూగూరు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును ఎస్ఆర్ పీఎస్ కళాశాలలో, దేవదుర్గ, యాదగిరి, సురపుర, శహాపుర నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును ఎల్‌వీడీ కళాశాలలో చేపడతారన్నారు.

రేపటి పరిషత్ ఓటింగ్‌కు సర్వం సిద్ధం

జిల్లాలో ఈ నెల 3న జరగనున్న కళ్యాణ కర్ణాటక పట్టభద్రుల నియోజకవర్గం ఈశాన్య ఎమ్మెల్సీ ఎన్ని కల ఓటింగ్‌కు ఏర్పాట్లను సర్వం సిద్ధం చేశామని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. శుక్ర వారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 20,317 మంది ఓటర్లున్నారన్నారు. 30 పోలింగ్ కేం ద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో అదనపు జిల్లాధికారి అశోక్, అదనపు ఎస్పీ శివకుమార్‌లున్నారు.

మంత్రికి మద్దతుగా భారీ ర్యాలీ


వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు, ఎమ్మెల్యే

సాక్షి,బళ్లారి: వాల్మీకి అభివృద్ధి మండలిలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని, కోట్లాది రూపాయల నిధులు పక్కదారి పట్టాయని, దీని వెనుక మంత్రి నాగేంద్ర ప్రమేయం ఉందని ఆరో పిస్తూ బీజేపీ నాయకులు ఆయన్ను రాజీనామా చేయాలని ఒత్తిడి చేసిన నేపథ్యంలో శనివారం బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి ఆధ్వర్యం లో మంత్రి నాగేంద్రకు మద్దతుగా నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా నగరంలోని కనక దుర్గమ్మ ఆలయం వద్ద నాగేంద్ర అభిమా నులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరి ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించి 101 టెంకాయలు కొట్టారు. అనంతరం కనక దుర్గమ్మ ఆలయం వద్ద నుంచి రాయల్ సర్కిల్ వరకు వేలాది మంది కాం గ్రెస్ కార్యకర్తలు మౌన ప్రదర్శన చేశారు. వాల్మీకి మండలిలో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాల ఆరోపణలకు నాగేంద్రకు సంబంధం లేదన్నారు. బుడా అధ్యక్షుడు జే.ఎస్.ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు ముండ్రిగి నాగరాజు, మేయర్ శ్వేత, ఉపమేయర్ జానకమ్మ, కార్పొరేటర్ వివేక్, బోయపాటి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

విమ్స్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ మంజునాథ్



బళ్లారి రూరల్ : విమ్స్ వైద్యక శాలల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ మంజునాథ్ శనివారం బాధ్య తలు స్వీకరించారు. ప్రిన్సి పాల్‌గా గతంలో ఉన్న డాక్టర్ కృష్ణస్వామి శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఆ స్థానంలో ప్రిన్సిపాల్‌గా డాక్టర్ మంజునాథ్‌ను ప్రభుత్వం నియమించింది. డాక్టర్ మంజునాథ్ విమ్స్ ఆసుపత్రిలోని ఈఎన్‌టీ విభాగం లో సీనియర్ వైద్యుడుగా, హెచ్ఓడీగా విధులు నిర్వ హిస్తున్నారు. మూడేళ్ల క్రితం విమ్స్ డైరెక్టర్ పోస్టుకు తీవ్రంగా కృషి చేశారు. అప్పట్లో తనకున్న రాజకీయ పలుకుబడిని ఉపయోగించారు. అయితే రాజకీయ పరిణామాల వల్ల ప్రభుత్వం విమ్స్ డైరెక్టర్‌గా డాక్టర్ గంగాధరగౌడను నియమించింది. ఇప్పుడు విమ్స్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను తీసుకొన్నారు.

జుడీషియల్ కస్టడీకి గిరీష్

హుబ్లీ: నగరంలోని వీరాపుర వీధి నివాసి అంజలి అం బిగేర హత్య కేసు నిందితుడు గిరీష్ సావంత్ పోలీస్ కస్టడీ ముగిసిన నేపథ్యంలో సీఐడీ బృందం అతడిని శుక్రవారం జుడీషియల్ కస్టడీకి అప్పగించింది. నింది తుడిని మే 23న కోర్టులో హాజరు పరిచి సమగ్ర విచారణ కోసం సీఐడీ ఎస్పీ వెంకటేశ్ నేతృత్వంలోని దర్యాప్తు బృందం 8 రోజుల పాటు తమ కస్టడీలోకి తీసుకుంది. ఈ మేరకు నిందితుడిని సుదీర్ఘంగా విచా రించిన సీఐడీ బృందం స్థానిక అదనపు సెషన్స్ జేఎం ఎఫ్‌సీ కోర్టులో హాజరు పరిచి జుడీషియల్ కస్టడీకి అప్పగించింది. హత్య అనంతరం తప్పించుకొని పరారైన నిందితుడిని మే 17న దావణగెరెలో అరెస్ట్ చేశారు. పోలీసులకు చిక్కిన వేళ నిందితుడి ముఖం, తలకు తీవ్రంగా గాయాలైన నేపథ్యంలో కిమ్స్ ఆస్ప త్రిలో చేర్పించారు. కోలుకున్న తర్వాత వైద్యాధికా రులు ఫిట్‌నెస్ నివేదిక ఇవ్వడంతో మే 22న నింది తుడిని సీఐడీ బృందం అదుపులోకి తీసుకుంది. అక్కడి బెండిగేరి స్టేషన్‌లో ఆ రోజంతా విచారణ జరిపి వాంగ్మూలం తీసుకొని మరుసటి రోజు న్యాయా లయానికి అప్పగించారు.

ఇద్దరు గొర్రెల వ్యాపారుల దుర్మరణం


ప్రమాదంలో నుజ్జయిన గూడ్స్ వాహనం


లారీని వెనుక నుంచి ఢీకొన్న గూడ్స్ వాహనం

- లారీని ఢీకొన్న గూడ్స్ వ్యాన్

సాక్షి, బళ్లారి: ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి గొర్రెలను తరలిస్తున్న గూడ్స్ వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే గొర్రెల యజమానులు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. చిత్రదుర్గం జిల్లా చెళ్లకెరె తాలూకా శివలింగప్ప (65), హులికుంటె గ్రామానికి చెందిన రమేష్ (55) మృతులు. శనివారం తెల్లవారుజామున హులికుంటె గ్రామం నుంచి హిరి యూరుకు గొర్రెలను గూడ్స్ వ్యాన్‌లో తరలిస్తున్నారు. డ్రైవర్ ముందు వెళుతున్న లారీని ఢీకొట్టడంతో అది బోల్తా పడింది. ప్రమాదంలో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న గొర్రెల వ్యాపారులు మృతి చెందారని స్థానికులు తెలిపారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు తగిలాయి. అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు.

నన్ను గెలిపిస్తే సమస్యలపై స్పందిస్తా


మాట్లాడుతున్న నారా ప్రతాప్‌రెడ్డి

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకలోని ఈశాన్య పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి జూన్ 3న జర గనున్న ఎన్నికల్లో తనను ఈ ప్రాంతం నుంచి ఎమ్మె ల్సీగా గెలిపిస్తే సమస్యలపై స్పందిస్తానని స్వతంత్ర అభ్య ర్థి నారా ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. 2018లో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ పాటిల్, ఓడిన బీజేపీ అభ్యర్థి అమర్‌నాథ్ పాటిల్ ఆరేళ్ల పాటు ఎక్కడు న్నారని ప్రశ్నించారు. ఆరేళ్ల పాటు కానరాని బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులకు ఓటు వేయరాదన్నారు. పట్టభద్రుల సమస్యలపై విధాన పరిషత్ కార్యకలా పాల్లో ఏనాడూ ప్రసంగించ లేదన్నారు. బీజేపీ అభ్యర్థి ఇంతవరకు ప్రతిపక్ష నేతగా విఫలమయ్యారని ఆరో పించారు. బండిహట్టి భూముల విషయంపై కోర్టులో కేసు నడుస్తోందన్నారు. గతంలో ఎన్నికల సమయం లో ఈ విషయంపై దుష్ప్రచారం చేశారన్నారు.

పాలు పౌష్టికాహారం


పాల ప్యాకెట్లను ప్రదర్శిస్తున్న ప్రముఖులు

బళ్లారిఅర్బన్: నగరంలోని మహిళా శిశు సంక్షేమ శాఖ ఆవరణలోని పాఠశాలలో జూన్ 1న ప్రపంచ క్షీర దినోత్సవాన్ని నిర్వహించారు. కేఎంఎఫ్ ఇన్‌చార్జి మేనేజర్ వెంకటేశ్ గౌడ మాట్లాడుతూ ప్రపంచ పాల దినోత్సవం ప్రతి ఏటా జూన్ 1న జరుపుకోవడానికి 2001 ఐక్యరాజ్య సమితి, వ్యవసాయ సంస్థ జాగతిక ఆహారంగా పాల ప్రాముఖ్యతను గుర్తించేందుకు, పాడి పరిశ్రమ వృద్ధికి ప్రారంభించినట్లుగా తెలిపారు. వీటిపై తగినంత అవగాహనకు, సహాయ సహకారా లకు ఈ ఉత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం ఏమిటంటే మానవుడి జీవితంలో పాలు అత్యంత అవసరం, ప్రాముఖ్య తను ఇవ్వడం, పాలు, పాల ఉత్పత్తుల చైతన్యం కలి ్పించడం, పాలలో ఉన్న క్యాల్షియం, ప్రొటీన్, విట మిన్ బీ2, పోషకాంశాలపై ప్రజలకు జాగృతం కల్పిం చడం అన్నారు. బళ్లారి డైరీ ఇన్‌చార్జి మేనేజర్ టీ.మల్లి కార్జున మాట్లాడుతూ నందిని పాలు, పాల ఉత్పత్తుల ప్రాముఖ్యత సమతుల్యత ఆహారంలోని పోషకాం శాలు, ఆరోగ్యం వాటి గురించి వివరించారు. కార్య క్రమంలో గోడౌన్ మేనేజన్ డాక్టర్ మహేష్ లక్కన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో రైతుల నుంచి పాల ఉత్పత్తుల సహకార సంఘం ద్వారా నాణ్యమైన పాలను సేకరించి బీఎంసీ కేంద్రాల్లో సంస్కరించి సమాఖ్యకు సరఫరా చేస్తున్నామని వివరిస్తూ పాల దినోత్సవం గురించి ప్రాముఖ్యత విశేషాలను తెలి పారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా స్త్రీ శిశు సం క్షేమ శాఖ డీడీ నీరజ, రాయచూరు, బళ్లారి, కొప్పళ, విజయనగర జిల్లా సహకార పాల సమాఖ్య ప్రము ఖులు వెంకటేష్ గౌడ, మహేష్ లక్కన, మల్లికార్జున, ఇందుకళ, లోహిత్‌కుమార్, మంజునాథ, స్త్రీ శిశు సం క్షేమ శాఖ సువర్ణలత, పార్వతమ్మ, పూజా పాల్గొ న్నారు. చివరిగా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థు లతో పాటు ప్రముఖులకు నందిని గుడ్ లైఫ్ టెట్రా ప్యాక్ పాలను పంపిణీ చేశారు.

మంత్రిని బర్తరఫ్ చేయాలని నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

హొసపేటె: వాల్మీకి అభివృద్ధి మండలిలో కోట్లాది రూపాయల సొమ్మును దోచుకున్న మంత్రి బి.నా గేంద్రను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసి సుప్రీం కోర్టు న్యాయమూర్తిని నియమించి విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ నగర బీజేపీ యువ మోర్చా అధ్వర్యంలో శనివారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆందోళన చేపట్టారు. యువమోర్చా అధ్యక్షుడు కొట్రేష్ మాట్లాడుతూ మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలిలో మంత్రి కోట్లాది రూపాయల సొమ్మును కొల్లగొట్టడంతో ఓ అమాయక అధికారి ఆత్మహత్య చేసుకున్నారన్నారు. మంత్రి రూ.187 కోట్లను బదిలీ చేసి ప్రజలను, ప్రభుత్వాన్ని మోసం చేశారు. ప్రభుత్వ వెంటనే ఆయనను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్ జోరు

- పొలాలు, పశుపక్షాదులపై కూడా పందెం కాసిన వైనం

హుబ్లీ: చోటా ముంబైగా వాసికెక్కిన హుబ్లీతో పాటు జిల్లాలో ఈ నెల 4న వెలువడే పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్ రాయుళ్ల ఉత్సాహం కట్టలు తెం చుకుంది. ఫలితంగా బెట్టింగ్‌లో తమ పశుప క్షాదులతో పాటు పొలాలను కూడా పణంగా పెడుతు న్నారు. ఫలితాల కౌంట్‌డౌన్ షురూ కావడంతో ఎవ రికి లాభం, ఎవరికి నష్టం అన్న విశ్లేషణలు జోరుగా సాగుతున్నాయి. అంతేగాక మధ్యవర్తులు, ఆయా అభ్యర్థులు పార్టీల తరఫున తమదైన రీతిలో అంచ నాలు వేసుకొని గెలుపు ఓటములపై పందేలు కాస్తు న్నారు. ముఖ్యంగా ధార్వాడ లోక్‌సభ స్థానం మాదం టే మాదేనని బీజేపీ, కాంగ్రెస్‌లు ధీమా వ్యక్తం చేస్తు న్నాయి. దీంతో ఆయా పార్టీల మద్దతుదారులు నగదు, వాహనాలు, పశువులు, గొర్రెలు, విందులు, విహార యాత్రలు, అంతేగాకుండా ఏడాది పాటు తన పొలాన్ని ఉచితంగా దున్నుకోమని కూడా పందెంరా యుళ్లు పందెంగా పెట్టినట్లు తెలుస్తోంది. మెజార్టీ సం ఖ్యపై కూడా బెట్టింగ్ కాస్తున్నారు.

రకరకాలుగా బెట్టింగ్‌లు

మంగళవారం నాటికల్లా ఈ బెట్టింగ్‌రాయుళ్ల బెడద మరింత తీవ్రం కానుందని తెలుస్తుంది. కేవలం ధార్వాడ మాత్రమే కాకుండా దేశంలో ఏ పార్టీ అధి కారంలోకి వస్తుందన్న దానిపై కూడా బెట్టింగ్ సాగు తుంది. మరో సారి కూడా బీజేపీ, ఎన్‌డీఏ కొందరు రెండింతలు డబ్బులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. కాంగ్రెస్ ఈ సారి 140 స్థానాలను దక్కించుకుంటుం ది. బీజేపీకి స్పష్టమైన మెజార్టీ రాదు. ఇండియా మైత్రి కూటమి అధికారం చేపట్టనుంది. కర్ణాటకలో హస్తం, కమలంతో పాటు జేడీఎస్‌కు ఇన్నేసి సీట్లు వస్తాయని హాసన్‌లో ప్రజ్వల్ రేవణ్ణ గెలుస్తారా, ఓడతారా? అన్న దానిపై కూడా బెట్టింగ్ కాస్తున్నారు. కాగా శాస్త్రం ప్రకారం ఎవరు గెలుస్తారని పలువురు జ్యోతిష్యం అడిగి తెలుసుకుంటున్నారు.

పాఠశాలల్లో అధికారుల తనిఖీ


పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు

హొసపేటె: పాఠశాల విద్యాశాఖ కలబుర్గి డివిజనల్ డిప్యూటీ కమిషనర్ ఎస్.ఆకాష్, విజయనగర జెడ్పీ సీఈఓ బి.సదాశివ ప్రభు సంయుక్తంగా విజయనగర జిల్లాలోని వివిధ పాఠశాలలను శనివారం సందర్శిం చారు. తొలుత నగరంలోని టీబీ డ్యాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అమరావతి ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశా లలను సందర్శించారు. మెయిన్ పరీక్షలో ఫెయిలైన పిల్లలకు జరుగుతున్న రెమిడియల్ టీచింగ్ క్లాసులను పరిశీలించారు. అనంతరం చిత్తవాడ్గిలోని వినోబా భావే ప్రభుత్వ ఉన్నత పాఠశాలను, 2024–25 సంవత్సరం లో అక్షర ఆవిష్కార్ యోజన కింద ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించనున్న ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను సందర్శించారు. ద్విభాషా పాఠ శాలలు, ఎన్ఎస్‌క్యూఎఫ్ పాఠశాలల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వివిధ పాఠశాలల ముఖాముఖి సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు పెంపుపై తగిన మార్గనిర్దేశనం చేశారు. అనం తరం జెడ్పీ హాలులో విజయనగర, బళ్లారి జిల్లాల అమలు అధికారుల సమావేశం నిర్వహించారు. కార్యక్ర మంలో పాఠశాల విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ యువరాజ నాయక్, డైట్ డిప్యూటీ డైరెక్టర్ హనుమక్క, బళ్లారి, విజయనగర జిల్లాల అన్ని క్షేత్ర విద్యాశాఖా ధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఓటు వేయాలి

హొసపేటె: కర్ణాటక ఈశాన్య గ్రాడ్యుయేట్ నియోజక వర్గానికి జూన్ 3న జరిగే ఎన్నికల్లో పట్టభద్ర ఓటర్లు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాలని జిల్లా రిటర్నింగ్ అధికారి ఎంఎస్ దివాకర్ తెలిపారు. కర్ణాటక విధాన పరిషత్ ఈశాన్య గ్రాడ్యుయేట్ నియో జకవర్గం ఎన్నికలు–2024 నేపథ్యంలో శనివారం జిల్లా పరిపాలన భవన్‌లోని ఆడిటోరియంలో జరిగిన జిల్లా స్థాయి స్వీప్ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. విజయనగర జిల్లాలోని పట్టభద్ర ఓట ర్లందరూ ఈ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలన్నారు. స్వీప్ యాక్టివిటీస్, ప్రోగ్రామ్స్ ప్రాముఖ్యత తెలు సుకుని ఓటింగ్ వేసి ఓటింగ్ శాతాన్ని పెంచాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జూన్ 3న జరిగే ఎన్నికల్లో పట్టభద్రుల ఓటర్లందరూ తప్పనిసరిగా పాల్గొని నైతికంగా ఓటు వేయాలని కోరారు. జిల్లా స్వీప్ కమిటీ అధ్యక్షులు, జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు మాట్లాడుతూ ఓటింగ్ ప్రక్రియలో ఎన్నికల సంఘం సూచించిన అంశాలను పాటించాలన్నారు. ఓటింగ్ కోసం పోలింగ్ స్టేషన్‌లో అందించిన పర్పుల్ కలర్ పెన్ను తప్పనిసరిగా వినియోగించాలి. క్రమ సంఖ్య– 1 నుంచి 19 వరకు ప్రాధాన్యత ఓటింగ్ అనుమ తిస్తారని ఓటింగ్‌లో ఒకే నెంబర్‌ని ఇద్దరు అభ్యర్థులకు ఇస్తే, 1వ నెంబర్‌ను ప్రాధాన్యతగా ఉపయోగించాల న్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యాశాఖ ఉపసం చాలకులు యువరాజ నాయక, క్షేత్ర విద్యాశాఖాధికా రులు, బీఆర్‌పీ, సీఆర్‌పీ అధికారులు పాల్గొన్నారు.

బంగారు ఆభరణాల చోరీ

హుబ్లీ: బెంగళూరు నుంచి గుజరాత్‌లోని వడోద రకు రైల్లో ప్రయాణిస్తున్న మహిళ బ్యాగ్‌లో బం గారు ఆభరణాలతో పాటు నగదుతో సహా మొత్తం రూ.1.83 లక్షల విలువ చేసే వస్తువులు చోరీకి గురైన ఘటన శనివారం వెలుగు చూసింది. గుజ రాత్ మిజల్ వాడి షిప్ అఫ్రిన్‌కు చెందిన బ్యాగ్‌లోని బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. రైల్లో ఆమె పడుకొని ఉన్న సమయంలో బ్యాగ్‌లోని వస్తు వులు చోరీకి గురైనట్లు ఆమె హుబ్లీ రైల్వే పోలీసు లకు ఫిర్యాదు చేశారు.

అవినీతిపై విచారణ చేపట్టాలని రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న బీజేపీ నేతలు


స్తంభించిన వాహన రాకపోకలు

రాయచూరు రూరల్: మహర్షి వాల్మీకి అభివృద్ధి మం డలిలో జరిగిన రూ.187 కోట్ల అవినీతిపై విచారణ జర పాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ డిమాండ్ చేశారు. ఆయన శనివారం అంబే డ్కర్ సర్కిల్‌లో రాస్తారోకో చేపట్టి మాట్లాడారు. నాడు ప్రతిపక్షంలో కూర్చొని మాట్లాడిన నేతలు నేడు మౌనం వహించారని ఆరోపించారు. సూపరింటెండెం ట్ చంద్రకాంత్ మరణ వాంగ్మూలంలో పేర్కొన్న విధంగా షెడ్యూల్డ్ తెగల శాఖా మంత్రి నాగేంద్రను మంత్రివర్గం నుంచి తొలగించాలని ఒత్తిడి చేశారు. ఆందోళనలో మాజీ ఎమ్మెల్సీ శంకరప్ప, పాటిల్, నాగ రాజ్, రవీంద్ర, చంద్రశేఖర్, వాణి, శశిరాజ్‌లున్నారు.

పొగాకు సేవనం ఆరోగ్యానికి హానికరం


మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సదాశివప్రభు


జ్యోతి వెలిగిస్తున్న మనోహర్ పత్తార్

హొసపేటె: పొగాకు సేవనం ఆరోగ్యానికి హానికరంగా మారిందని జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు అన్నారు. ఆయన శనివారం నగరంలోని బ్రహ్మకుమారి యూనివర్సిటీ కాంపౌండ్‌లో ప్రపంచ పొగాకు రహిత దినోత్సవంలో భాగంగా నిర్వహించిన అవగాహన జాతాను అదనపు సీని యర్ సివిల్ జడ్జి, తాలూకా లీగల్ సర్వీసెస్ అథా రిటీ చైర్మన్ బీఎస్ రమేష్‌బాబు, జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ అధికారితో కలిసి పచ్చజెండా ఊపి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశాన్ని పొగాకు రహిత దేశంగా మార్చడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం అన్నారు. పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఐక్యరాజ్య సమితి పొగాకుతో సంభవించే దుష్ప్రభావాల గురించి ఏటా ప్రజ లకు అవగాహన కల్పించడానికి కార్యక్రమాలను చేపడుతోందన్నారు. వైద్యులు జగదీశ్, కమ లమ్మ, రాధిక, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వాడకం ప్రాణాంతకం

రాయచూరు రూరల్: పొగాకు వాడకం ప్రాణాం తకం అని మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ మనో హర్ పత్తార్ పేర్కొన్నారు. ఆయన శనివారం బ్రహ్మ కుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ప్రపంచ పొగాకు దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. సిగరెట్, గుట్కా, పొగాకుతో కూడిన వస్తువులకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ పొగాకు నిషేధం గురించి అవగా హన పెంచుకోవాలన్నారు. దేశంలో 40 లక్షల కుటుంబాలు వీటి వల్ల అనారోగ్యం పాలవుతు న్నట్లు నివేదికలో తేలిందన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సం చాలకురాలు స్మిత, శారద, కిరణ్ కుమార్, శివప్ప, రాకేష్, కుమార్, రాజేంద్ర, మల్లికార్జున, దేవేంద్రమ్మ, సంధ్య, అన్నపూర్ణలున్నారు.